ఈనాడు

విజయవాడ 20-2-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 191

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు

విజయవాడ 20-2-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 191

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



దిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా సహా పలు దేశాధినేతలతో ప్రధాని మోదీ

- టెక్నాలజీపై మనిషి నియంత్రణ అవసరం
- నైతికత, విలువల వన్నెలద్దుదాం
- ఏఐకి ప్రజలు ముడి సరకు కాకూడదు
- డేటా సార్వభౌమత్వాన్ని కాపాడదాం
- ఏఐ సమిట్ దేశాధినేతల ప్లీనరీలో ప్రధాని మోదీ

AI IMPACT SUMMIT भारत 2026 INDIA

కృత్రిమ మేధకు 'మానవ్' శక్తి



దిల్లీ

కృత్రిమ మేధలో (ఏఐ) అనైతిక వ్యవహారశైలికి అంతం లేదని, డేటా సార్వభౌమత్వాన్ని కాపాడటానికి, రక్షణ చర్యలు పారదర్శకంగా ఉండటానికి దానికి నైతిక బలమిద్దామని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆకాంక్షిత భారత్‌లో అంతర్జాతీయ ఏఐ ప్రయాణం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. 'భారత్ బుద్ధుడి నేల. సరిగా అర్థం చేసుకోవడం ద్వారానే సరైన చర్యలు చేపట్టవచ్చని ఆయన చెప్పేవారు. అందుకే అందరూ కలిసి ఏఐ సరైన ముద్ర వేసేలా రోడ్డు మ్యాప్‌ను సృష్టించాల్సిన అవసరముంది. మనం సరైన ఉద్దేశంతో.. సరైన సమయంలో.. నిర్ణయాలు తీసుకున్నప్పుడే సరైన ఫలితం కనిపిస్తుంది' అని మోదీ స్పష్టం చేశారు. ఇండియా ఇంపాక్ట్ సమిట్‌ను గురువారం దిల్లీలోని భారత మండపంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ సక్రమ వినియోగానికి 'మానవ్' విజన్‌ను ఆవిష్కరించారు. అనంతరం దేశాధినేతల ప్లీనరీలో ప్రసంగించారు. వేగంగా ఎదుగుతున్న ఏఐ టెక్నాలజీని ప్రజలే కేంద్రంగా ఉపయోగించుకునే వ్యవస్థలను తయారు చేయాలని, సార్వభౌమత్వం, సమ్మిళితత్వాలను గౌరవిస్తూ ఉపయోగించుకోవాలని అభిప్రాయపడ్డారు. ఏఐ నైతికతలో కంపెనీలకు గణనీయ బాధ్యత ఉందని పేర్కొన్నారు. కొన్ని దేశాలు ఏఐని రహస్యంగా భావిస్తున్నాయని, కానీ దానిని అందరితో పంచుకుని ప్రపంచం మంచి కోసం ఉపయోగించాలని భారత్ భావిస్తోందని తెలిపారు. (మిగతా 10లో)

'మానవ్'కు అర్థం ఇదీ..

తాను ప్రతిపాదించిన మానవ్‌కు (ఎంఏఎన్ఏవీ) ప్రధాని మోదీ అర్థం చెప్పారు.

ఎం	నైతికత, విలువల వ్యవస్థ (మోరల్ అండ్ ఎథికల్ సిస్టమ్స్)
ఏ	జవాబుదారీ పాలన (ఎకౌంటబుల్ గవర్నెన్స్)
ఎన్	జాతీయ సార్వభౌమత్వం (నేషనల్ సావర్నిటీ)
ఏ	అందుబాటు, సమ్మిళితం (యాక్సెసబుల్, ఇంక్లూజివ్)
వీ	చెల్లుబాటు, చట్టబద్ధత (వ్యాలీడ్, లెజిటిమేట్)

విశాఖ గ్లోబల్ ఏఐ హబ్ అవుతుందని

ఆనాడు ఊహించలేదు



ఆ నగరం మీదుగా రైల్లో ఐఐటీ ఖరగ్‌పూర్‌కు వెళ్లేవాణ్ని

గ్లోబల్ ఏఐ సమిట్‌లో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్

10లో

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్‌కు నేడు చంద్రబాబు 2లో

ఎన్నాళ్లీ ఉచిత పంపకాలు?

అన్నీ ఫ్రీగా ఇస్తుంటే ప్రజలెందుకు పనిచేయాలి?

- రాష్ట్రాలు రెవెన్యూలోటులో ఉంటూ ఎలా అమలు చేస్తున్నాయి?
- డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది?
- రోడ్లు, ఆసుపత్రుల్లాంటి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత లేదా?
- రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సీజే జస్టిస్ సూర్యకాంత్ సూటి ప్రశ్న



ఈనాడు - దిల్లీ

'ఉదయం నుంచి అవసరమైనవన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే ప్రజలు ఎందుకు పనిచేయాలి? అన్నీ ఉచితంగా వస్తుంటే వాళ్ల పనిచేయడం ఎక్కడి నుంచి నేర్చుకుంటారు? ఎన్నాళ్లీ ఉచిత పథకాల అమలు? ఇదేనా మనం చేసే జాతి నిర్మాణం? రాష్ట్ర ప్రభుత్వాలన్నీ దాదాపుగా రెవెన్యూలోటులోనే ఉన్నా ఈ పథకాల అమలుకు డబ్బు ఎక్కడి నుంచి తెస్తున్నాయి? నెలవారీ ఆదాయంతో ఉద్యోగుల జీతాలు, ఉచిత పథకాల అమలు అన్న రెండు పనులు తప్పితే మూడో పని చేసే స్థితిలో ప్రభుత్వాలు లేవు. ప్రభుత్వ బాధ్యత ఇంతవరకేనా? ఉద్యోగావకాశాలు కల్పించి ఆత్మగౌరవంతో బతికే పరిస్థితి కల్పించడం కాదా' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్.. రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఎలక్ట్రిసిటీ ఎమెండ్‌మెంట్ రూల్స్-2024 లోని రూల్ 23ను సవాలు చేస్తూ తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ దాఖలుచేసిన కేసు విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. 100 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇచ్చేందుకు తమిళనాడు ప్రభుత్వానికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు.

సంక్షేమ పథకాల భారాన్ని ప్రభుత్వాలు స్వీకరించడం అన్నది ప్రజాప్రయోజనమా? విద్యుత్తు బిల్లులు చెల్లించే శక్తి ఉన్నవారికి, లేనివారికీ మధ్య తేడాను ఎలా గుర్తిస్తున్నారు? సంక్షేమ రాజ్యంగా అణగారిన వర్గాలు, అవసరమైన వారికి సాయంచేయడాన్ని ఎవరైనా అంగీకరించాల్సిందే. దాన్ని సమాజం కూడా స్వాగతించాలి. కానీ కొందరు వ్యక్తులు అన్నీ ఉండి కూడా తమకున్న పలుకుబడితో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, (మిగతా 10లో)

ఉగాదికి జాబ్ క్యాలెండర్

యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గ్రౌండింగ్ అయిన పరిశ్రమల నుంచి ఈ ఏడాది 2 లక్షల మందికి ఉద్యోగాలు

వివిధ అంశాలపై సమీక్ష సందర్భంగా విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్

లోపలి పేజీల్లో

హెరిటేజ్ వ్యతిరేక కథనాలు తక్షణం తొలగించండి

సాక్షి మీడియా, సామాజిక మాధ్యమాలకు దిల్లీ హైకోర్టు ఆదేశం

రూ.100 కోట్ల పరువు నష్టం దావాలో మధ్యంతర ఉత్తర్వులు

ప్రతివాదులకు నోటీసులు జారీ



కూటమి తెచ్చిన కుటుంబ బడ్జెట్

ఎక్కడా తగ్గకుండా సంక్షేమం అమలు

మేం వచ్చాక 33% ఆదాయం పెంచాం

బడ్జెట్‌పై చర్చలో మంత్రి పయ్యావుల కేశవ్

తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని.. వైకాపా పచ్చి అబద్ధాలు

మంత్రులు అచ్చెన్న, సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర ధ్వజం

చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియని బొత్స

మండలిలో విరుచుకుపడిన మంత్రి అచ్చెన్నాయుడు

11లో

మన జెండాలు వేరైనా..

నిబద్ధత ఒక్కటే

- నౌకాదళాల మధ్య సహకారం తప్పనిసరి
- విపత్తులను ఎదుర్కోవడం ఏ ఒక్కరితోనో సాధ్యంకాదు
- రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



వివిధ దేశాల నావికాదళ అధికారులను పరిచయం చేసుకుంటున్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఈనాడు, విశాఖపట్నం: భాగస్వామ్య దేశాలకు చెందిన నౌకాదళాల మధ్య పరస్పర సామర్థ్యాల పెంపు, స్నేహపూర్వక వాతావరణం మరింత పెంపొందించుకోవడానికి మిలన్-2026 ప్రయత్నిస్తుందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. 'వాతావరణ మార్పులు ప్రకృతి విపత్తులను తీవ్రతరం చేస్తున్నాయి. ఫలితంగా మానవతాదృక్పథంతో సహాయ కార్యక్రమాలు తరచూ చేపట్టాల్సి వస్తోంది. ఎంత సామర్థ్యం ఉన్నా ఏ ఒక్క నౌకాదళం కూడా ఒంటరిగా ఈ సవాళ్లను ఎదుర్కోలేదు. నౌకాదళాల మధ్య సహకారం ఎప్పటికీ తప్పనిసరి. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా నావిగేషన్.. స్వేచ్ఛ ఆధారంగా సమానమైన సముద్ర అవకాశాలు ఉండాలన్నది భారత్ అభిప్రాయం' అని మంత్రి పేర్కొన్నారు. విశాఖ తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయంలోని సముద్రిక ఆడిటోరియంలో గురువారం 'మిలన్-2026'ను ప్రారంభించిన ఆయన పలు దేశాల నౌకాదళాధికారులు, ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు.

'భారత్ నిజమైన విశ్వమిత్రగా, విశ్వసనీయ ప్రపంచ స్నేహితుడిగా సముద్ర జలాల్లో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుంది. ఈ ఏడాది 74 దేశాల భాగస్వామ్యంతో సాగిన మిలన్ ఇప్పటి వరకు జరిగిన అతిపెద్ద, అత్యంత సమగ్రమైన కార్యక్రమంగా చెప్పుకోవచ్చు. ఇది భారత్‌పై నమ్మకం, బాధ్యతాయుతమైన సముద్ర భాగస్వామిగా ప్రపంచ సముద్ర సమాజం ఉంచిన విశ్వాసానికి ప్రతిబింబం. మిలన్ వంటి వేదికలు వృత్తిపరమైన నైపుణ్యాన్ని ఒక చోట చేర్చి, పరస్పర విశ్వాసాన్ని కలిగిస్తాయి. మన నౌకలు కలిసి ప్రయాణిస్తే, సైనికులు కలిసి (మిగతా 3లో)

సముద్రాలు స్నేహ, శాంతి బంధాలకు వారధులుగా నిలవాలి

రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

మిలన్, సిటీ పరేడ్‌లకు ముఖ్యఅతిథిగా హాజరు 3లో

అవుతారా.. శ్రీవారి వైద్యసేవకులు



స్విమ్స్ ఆసుపత్రి



రోగికి కంటి పరీక్ష చేస్తున్న డా.వెంకటాచలం

- చికిత్స, బోధన, పరిశోధన రంగాల్లో నిష్ణాతులకు తితిదే ఆహ్వానం
- నెలలో సగటున వారం రోజులపాటు ఆసుపత్రుల్లో సేవలు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: తితిదే ఆసుపత్రుల్లో శ్రీవారి వైద్య సేవకుల ద్వారా మెరుగైన సేవల వ్యవస్థీకరణకు తితిదే శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు కొందరు వైద్యులు సేవాభావంతో ముందుకొచ్చి బర్డ్, స్విమ్స్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందించేవారు. ఇకపై దేశ, విదేశాల నుంచి నిష్ణాతులైన వైద్యులతోపాటు నర్సులు, టెక్నీషియన్ల సేవలను ఆహ్వానిస్తున్నారు. రోగులకు అధునాతన శస్త్రచికిత్సలు, బోధన, పరిశోధనలపై అధ్యయనం నిమిత్తం వారికి రెడ్‌కార్పెట్ పరుస్తున్నారు. ఇందుకు వారితోపాటు కుటుంబసభ్యులకు శ్రీవారి ప్రొటోకాల్ దర్శనం, వసతి, రవాణా తదితర సదుపాయాలు సమకూర్చనున్నారు.

దరఖాస్తు ఇలా..

శ్రీవారి వైద్యసేవకులుగా నమోదు చేసుకునేందుకు తితిదే వెబ్‌సైట్‌లో వీలు కల్పించింది. త్వరలో యాప్‌ను అందుబాటులోకి తెస్తోంది. ఆయా విభాగాల్లో అనుభవం, గుర్తింపు, సాధించిన అవార్డుల గురించి వివరాలు, బోధనా అనుభవాలు వెల్లడించాలి. టెక్నీషియన్లు, నర్సులు ఎలాంటి సేవలు అందించగలరనే విషయాలు తెలపాలి. నెలలో సగటున వారం రోజులు సేవలకు సమయం కేటాయించాలి. శ్రీవారి వైద్యసేవకు స్విమ్స్‌లో ఇద్దరు ఉద్యోగులతో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేశారు. సందేహాలు ఇతర వివరాలకు ఫోన్ నంబరు 91542 16307, srivarivaidyasevasvims@gmail.comలో సంప్రదించాలి. (మిగతా 10లో)

ఇదీ సంగతి!



ఉపద్రవాలను ముందే పసిగట్టే నేర్పు ఈ మూగజీవాల సొంతం సార్!!

చంద్రబాబు నిత్య మోసగాడు



- ఎన్నికల మ్యానిఫెస్టో ఆయనకో చిత్తు కాగితం
- బడ్జెట్‌లో అన్నీ తప్పుడు లెక్కలు
- చంద్రబాబు, పవన్, లోకేశ్‌లు గాల్లోనే ఉంటున్నారు
- క్రికెట్ మ్యాచ్ ఇక్కడ టీవీలో చూడలేరా?
- మాజీ ముఖ్యమంత్రి జగన్

ఈనాడు, అమరావతి: చంద్రబాబు నిత్య మోసగాడు, వంచకుడు.. అని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టో అంటే చిత్తు కాగితమని ఈ రెండేళ్లలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లతో చంద్రబాబు నిరూపించారని ఆరోపించారు. ప్రతి నెలా పింఛన్ల పంపిణీ పేరుతో బహిరంగసభ పెడుతున్నారు, ఒక్కో సభకు 25 వేల చొప్పున పింఛన్ల కోత పెడుతున్నారని ధ్వజమెత్తారు. గురువారం ఆయన తన క్యాంపు (మిగతా 10లో)

జగన్ ఒరిజినల్ నేరస్థుడు



- తన నేరాల్ని కప్పిపుచ్చుకునేందుకే ఇతరులపై బురద
- కల్తీ నెయ్యి పాపం నుంచి దృష్టి మరల్చేందుకే హెరిటేజ్‌పై దుష్ప్రచారం
- సొంత ఖర్చులతో క్రికెట్ చూడ్డానికి వెళితే మీకేం నొప్పి?
- హోం మంత్రి అనిత ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నేరాలు చేయటం అలవాటుగా మారిన వ్యక్తి అని హోం మంత్రి అనిత ధ్వజమెత్తారు. ఆయనది ఒరిజనల్‌గా క్రిమినల్ మనస్తత్వమని, ఎప్పుడూ నేరపూరితంగానే ఆలోచిస్తారని మండిపడ్డారు. చేసిన నేరాల్ని కప్పిపుచ్చుకోవటానికి ఇతరులపై బురదచల్లటం జగన్ నైజమని ఆరోపించారు. ఈ క్రమంలోనే తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన మహాపాపం నుంచి ప్రజల (మిగతా 10లో)

పోలీసులపై రాంబాబు చిందులు



మంగళగిరి గ్రామీణ సీఐ ఏవీ బ్రహ్మంకు వేలు చూపెట్టి, హెచ్చరిస్తున్న అంబటి రాంబాబు

- అంతు చూస్తానంటూ ఎస్సైకి హెచ్చరికలు
- రాజమహేంద్రవరం, గుంటూరులో వాహనాలతో హైడ్రామా

రాజమహేంద్రవరం, గుంటూరు(కలెక్టరేట్), ఏఎన్‌యూ, పెదకాకాని, న్యూస్‌టుడే: మాజీమంత్రి అంబటి రాంబాబు మరోమారు రెచ్చిపోయారు. విధుల్లో ఉన్న పోలీసుల పట్ల అంబటి, ఆయన అనుచరులు వీరంగం వేశారు. అధికారంలో ఉండగా సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాలకు పింఛనుదారుల నుంచి డబ్బులు వసూలుచేసి, లాటరీ టికెట్లు అంటగట్టిన కేసులో రాంబాబుకు బెయిల్ మంజూరైన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం జైలు నుంచి బుధవారం విడుదలైన ఆయన.. రాత్రి నగరంలోని జక్కంపూడి గణేశ్ ఇంట్లో బస చేశారు. గురువారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి గుంటూరులోని నివాసానికి కార్లు, బైకులతో ర్యాలీగా బయలుదేరేందుకు యత్నించారు. సెక్షన్-30 అమల్లో ఉన్నందున ర్యాలీలు చేపట్టవద్దని, నాలుగైదు కార్లలోనే వెళ్లిపోవాలని పోలీసులు రాంబాబుకు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆయన ఆగ్రహంతో ఊగిపోయారు. అలాగైతే పాదయాత్ర చేస్తానంటూ మంకుపట్టు పట్టారు. అనంతరం పోలీసుల ఎదుట నాలుగైదు కార్లతో బయలుదేరి, తర్వాత 20 కార్లతో (మిగతా 10లో)



భక్తజనం మధ్య సోమస్కందమూర్తి, జ్ఞానప్రసూనాంబిక గిరిప్రదక్షిణోత్సవం

భక్తజన సమ్మోహనం గిరిప్రదక్షిణం

శివనామస్మరణతో మార్మోగిన కైలాసగిరులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కైలాసగిరి ప్రదక్షిణోత్సవం ఆద్యంతం వైభవంగా సాగింది. ఈ క్షేత్ర సంప్రదాయం ప్రకారం.. బ్రహ్మోత్సవాలకు దేవతలను ఆహ్వానించేటప్పుడు, వీడ్కోలు పలికేటప్పుడు సోమస్కందమూర్తి, జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తులతో గిరిప్రదక్షిణలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్వామివారి కల్యాణం తర్వాత రోజు దేవతలకు వీడ్కోలు పలికేందుకు మరోసారి గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు ముక్కంటి ఆలయం నుంచి బయలుదేరిన ఉత్సవమూర్తులు 24 కి.మీ. ప్రదక్షిణోత్సవాన్ని పూర్తి చేసుకొని సాయంత్రం 6 గంటలకు పట్టణానికి చేరుకున్నారు. దీంతో శివనామస్మరణతో కైలాసగిరులన్నీ మార్మోగాయి.

వీఐపీలకు వేదాశీర్వచనం టికెట్ల కుదింపు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో ప్రముఖులకు అందించే వేదాశీర్వచనం టికెట్ల కోటాను తితిదే ఉన్నతాధికారులు కుదించారు. వీఐపీ బ్రేక్ దర్శనం పొందే ప్రముఖులకు దర్శనంతో పాటు వేదాశీర్వచనం టికెట్లను అదనపు ఈవో కార్యాలయంలో విచక్షణ కోటా కింద జారీ చేస్తారు. ప్రముఖులు శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వారికి వేదాశీర్వచనం అందిస్తుంటారు. అధికారులు వారికి శేషవస్త్రం కప్పి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేస్తారు. కొంతకాలంగా సిఫార్సులపై వేదాశీర్వచనం టికెట్ల జారీ పెరగడంతో శ్రీవారి ఆలయంలో తరచూ హడావుడి నెలకొంటోంది. ఇది శ్రీవారి దర్శనానికి వచ్చే ఇతర భక్తులకు ఇబ్బందికరంగా ఉండటాన్ని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రముఖులు స్వయంగా వస్తే మాత్రమే వేదాశీర్వచనం టికెట్లు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. సిఫార్సులపై వేదాశీర్వచనం టికెట్ల జారీని పూర్తిగా నియంత్రించాలని నిర్ణయించారు. దీంతోపాటు నాణ్యమైన శేషవస్త్రాలు వినియోగించేలా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా టెండర్లను పూర్తిచేసిన అధికారులు త్వరలోనే నూతన శేషవస్త్రాలు భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. గతంలో శేషవస్త్రాల నాణ్యతా లోపాలపై తితిదే పాలకమండలి విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే.

రెండు గొడ్డళ్లు, రెండు బరిసెలు, దోపిడీ మైండ్‌తో ఉన్న వ్యక్తి దుస్తులు ధరిస్తే అతనే జగన్ అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

ఉగాదికి జాబ్ క్యాలెండర్

• సమీక్షలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: రాబోయే ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇందులో రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ కూడా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆత్మహత్యలు, మానసిక ఒత్తిడి నివారణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కోచింగ్ సెంటర్ల నియంత్రణ రూపకల్పనపై ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ఉండవల్లి నివాసంలో గురువారం అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుకు ముందుకొచ్చిన విదేశీ యూనివర్సిటీలకు ప్రోత్సాహకాలు, విధివిధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "రాష్ట్రానికి పెద్దఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్న నేపథ్యంలో ఉపాధి కల్పనపై అధికార యంత్రాంగం దృష్టిసారించాలి. రాష్ట్రంలో గ్రౌండ్ అయిన పరిశ్రమల్లో ఈ ఏడాది 2 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దానికి అనుగుణంగా అధికారులు రోడ్‌మ్యాప్ రూపొందించాలి. రిలయన్స్ సీబీజీ, జూపిటర్, లారెన్స్ ఫార్మా, హెటెరో డ్రగ్స్‌తో పాటు రాష్ట్రంలో కొత్తగా వస్తున్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ చేపట్టండి. ఇందుకు అవసరమైన కరికులం రూపకల్పనలో ఆయా రంగాల్లో పేరుగాంచిన పరిశ్రమల సలహాలను తీసుకోవాలి. ఇప్పటికే కొన్ని సంస్థలు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను నెలకొల్పాయి. అదే తరహాలో ఐటీఐలకు అనుబంధంగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయాలి. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మూడు నెలలకోసారి నిర్వహిస్తున్న జాబ్‌మేళాల ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తున్నాయి. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలి" అని సూచించారు.



ఉపాధి కల్పనపై సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్

త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభం

త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ... 'దీనికి ఇప్పటికే మాడ్యూల్స్ సిద్ధమయ్యాయి. 25 రంగాల డేటా ఇంటిగ్రేషన్ పూర్తయింది, వాటిలో 1,14,899 ఉద్యోగాలు ఉన్నాయి. ఇందులో 3,100 విదేశీ ఉద్యోగాలు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన 16 మంది రిక్రూటర్స్ కూడా సిద్ధంగా ఉన్నారు. ఇందులో ట్రయల్ బేసిస్‌లో ఇప్పటికే 20 వేల మందికి పైగా విద్యార్థులు, 60 వేల మంది జాబ్ సీకర్స్‌కు ఏఐ ఆధారిత ఇంటర్వ్యూలు నిర్వహించాం' అని అధికారులు తెలిపారు.

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్‌కు నేడు చంద్రబాబు

• రాష్ట్రాన్ని సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో వరుస భేటీలు
• ఏఐ ట్యూటర్ ఏర్పాటుకు ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం

ఈనాడు, అమరావతి: దిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026'లో ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం పాల్గొంటారు. రాష్ట్రాన్ని సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో అక్కడ పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఉదయం 9.30 గంటలకు 'ఏఐ యాక్సిలరేటర్, ప్యూయలింగ్ ఇండియాస్ ఎకనమిక్ గ్రోత్' అనే అంశంపై జరిగే సెషన్‌లో ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కేంద్ర మంత్రి జితిన్‌ప్రసాద్, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. అనంతరం ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ అంశాలపై రాష్ట్రంలోని పది లక్షల మంది యువతకు నైపుణ్యం కల్పించేలా ఐబీఎంతో, క్వాంటమ్-ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటుకు యూనిసిస్ సంస్థతో ఒప్పందం చేసుకుంటారు. క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్‌విడియాతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకోనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ ఏర్పాటుకు ఐఐటీ-మద్రాస్‌తో మరో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపైనా ప్రకటన చేయనున్నారు. క్వాంటెలా ఇంక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ శ్రీధర్ గాంధీతో సీఎం సమావేశమవుతారు. మధ్యాహ్నం 12 గంటలకు 'ఏఐ ద్వారా పోటీతత్వం' అనే అంశంపై వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. ఇందులో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, వరల్డ్ ఎకనమిక్ ఫోరం సీఈఓ బోర్జ్ బ్రెండేతో కలిసి సీఎం చర్చిస్తారు.

యూకే ప్రతినిధి బృందంతో సమావేశం

యూకే ప్రతినిధి బృందంతో మధ్యాహ్నం 1.30 గంటలకు చంద్రబాబు భేటీ అవుతారు. బ్రిటన్ ఏఐ, ఆన్‌లైన్ సేఫ్టీ విభాగం మంత్రి కనిష్క నారాయణ్, వాతావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్టర్ కౌన్సెలర్ శలీ టేలర్, భారత్‌లో యూకే హై కమిషనర్ లిండికెమరాన్‌లతో పలు అంశాలపై ఆయన చర్చిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆరామ్‌కో ఇండియా ఎండీ అబ్దుల్ రెహమాన్ అయితు క్రైర్, అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలేలతో చంద్రబాబు వేర్వేరుగా సమావేశం కానున్నారు. అనంతరం దిల్లీ నుంచి అమరావతి బయలుదేరతారు.

26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

• 'జెన్‌జీ'ని పార్టీకి దగ్గర చేయాలి
• మంత్రి నాదెండ్ల మనోహర్

ఈనాడు, అమరావతి: జనసేన ఐదోవిడత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 'జెన్‌జీ సెక్షన్‌గా ఆలోచిస్తోంది. వారి ఆలోచనలు పార్టీకి ఉపయోగపడతాయి. అలాంటివారిని పార్టీకి దగ్గర చేయాలి. యువనాయకత్వాన్ని పెంపొందించాలి' అని సూచించారు. గురువారం పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వనమోదును ఆయన ప్రారంభించారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'జనసేన భావజాలానికి అనుగుణంగా ఉండే ప్రతి ఉద్యమికి పార్టీ సభ్యత్వం అందించే బాధ్యతను తీసుకోవాలి. పార్టీ, కార్యకర్తలకు సాంకేతిక ప్రధాన వారధులు. ప్రతి నియోజకవర్గం నుంచి 75-100 మంది సాంకేతికతను పార్టీ కార్యాలయానికి పంపాలి. ఉద్యమిగా సభ్యత్వం తీసుకునేవారు రూ.400 చెల్లించాలి. వీరికి ప్రమాద బీమా ప్రయోజనం అందుతుంది. స్థానిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల దృష్ట్యా వీరమహిళలను అందిపుచ్చుకుని సభ్యత్వనమోదులో మహిళల్ని పార్టీకి దగ్గర చేయాలి' అని సూచించారు. పార్టీ ఏటా నిర్వహించే సభ్యత్వ నమోదు కార్యక్రమం పండగలాంటిది. దీన్ని బాధ్యతగా తీసుకుని క్రియాశీల సభ్యత్వాన్ని అందిద్దాం. సాధారణ పేర్లు, విరాళాన్ని 22వ తేదీలోగా అందించాలి' అని పార్టీ అధ్యక్షుల రాజకీయ కార్యదర్శి ఎమ్మెల్సీ హరిప్రసాద్ పేర్కొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీ కోటా ఖరారుకు

రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్

• డెడికేటెడ్ కమిషన్‌గా నియామకం
• నివేదిక అందించేందుకు 45 రోజుల గడువు

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు కీలక అడుగు పడింది. డెడికేటెడ్ కమిషన్ నియమిస్తూ కూటమి ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా(ఏకసభ్య కమిషన్) ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఎస్సీ వర్గీకరణలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా నిర్దేశిత సమయంలో పకడ్బందీగా పూర్తి చేసిన రాజీవ్ రంజన్ మిశ్రానే బీసీల కోటా ఖరారుకూ డెడికేటెడ్ కమిషన్‌గా నియమించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపింది.

★ ఈ కమిషన్ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల సిఫార్సుకు బీసీల వెనకబాటుతనాన్ని అధ్యయనం చేయనుంది.

★ రాజ్యాంగ నిబంధనల మేరకు, ఇప్పటికే ఉన్న సుప్రీంకోర్టు తీర్పులను అనుసరించి ప్రతి స్థానిక సంస్థ వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ శాతాన్ని సిఫార్సు చేయనుంది.

★ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి అధ్యయనానికి 45 రోజులు గడువు ఇచ్చింది. ఆలోపు సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది.

★ బీసీ సంక్షేమశాఖ అదనపు సంచాలకులు చంద్రశేఖరరాజు ఈ కమిషన్‌కు సహాయ కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

★ అనుభవాధారిత డేటా విశ్లేషణకు, కమిషన్ సమర్థవంతమైన నిర్వహణకు అవసరమైతే నిపుణులు, విద్యావేత్తలు, పరిశోధకుల అభిప్రాయాలను తీసుకోవచ్చు.

★ క్షేత్రస్థాయిలోనూ అధ్యయన పర్యటనలు చేయొచ్చు ★ గుర్తింపు పొందిన పరిశోధనా సంస్థ సహకారాన్ని కూడా తీసుకోవచ్చు



బ్లాక్ కాఫీ ఉత్తమం

పాలు, పంచదార కలపని బ్లాక్ కాఫీ ఉత్తమం. ఎందుకంటే ఇందులో క్యాలరీలు, ప్రొటీన్ శూన్యం. తద్వారా శరీరానికి అదనపు క్యాలరీలు అందకుండా నివారించొచ్చు. కాఫీలోని కెఫీన్ మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. వాస్తవానికి పాలు శరీరంలో కొవ్వు కరిగి శక్తిగా మారే ప్రక్రియను తాత్కాలికంగా నిలిపేస్తాయి. బ్లాక్‌కాఫీతో ఈ అనర్థం ఎదురుకాదు.

– మన్సఫా బేపరీ, మహిళల ఆరోగ్య సలహాదారు

అమరావతిలో కొత్తగా ఏడు సంస్థలకు స్థలాలు

• మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో కొత్తగా ఏడు సంస్థలకు స్థలాల కేటాయింపు ప్రతిపాదనలకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. 11 సంస్థలకు గతంలో కేటాయించిన స్థలాల్లో స్వల్ప మార్పులు చేసింది. ఒక ప్రతిపాదనను పెండింగ్‌లో పెట్టింది. ఉపసంఘం సభ్యులు పి.నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, గుమ్మిడి సంధ్యారాణి గురువారం సచివాలయంలో సమావేశమై... 22 ప్రతిపాదనలపై చర్చించారు. భారత వాతావరణ శాఖకు ఎకరం, ఈపీటీఆర్ఐకి 0.74 ఎకరాలు, కరూర్ వైశ్యా బ్యాంక్‌కి 0.4 ఎకరాలు, నాబార్డ్‌కి ఎకరం, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కి అర ఎకరం, రెయిన్‌బో పిల్లల ఆస్పత్రికి రెండెకరాల చొప్పున కేటాయించారు. వివిధ బ్యాంకుల ఉద్యోగులకు నివాస భవనాల నిర్మాణానికి భూకేటాయింపు ప్రతిపాదనకూ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఉపసంఘం నిర్ణయాల్ని మంత్రులు నారాయణ, కేశవ్ విలేకర్లకు వెల్లడించారు. 'అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో స్థలాలు తీసుకుని వివిధ కారణాలతో నిర్మాణాలు చేయని సంస్థలు ఇప్పుడు చురుగ్గా ముందుకొస్తున్నాయి'' అని కేశవ్ తెలిపారు.

చిన్నారిని చంపిన వాడి మృతదేహం మాకొద్దు

• నిందితుడి సోదరి

మదనపల్లె నేరవార్తలు, పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లాలో సంచలనం సృష్టించిన ఏడేళ్ల చిన్నారి 'హత్యా'చారం కేసులో నిందితుడు కులవర్ధన్ మృతదేహాన్ని తీసుకునేందుకు కుటుంబసభ్యులు నిరాకరించారు. చిన్నారిని పొట్టన పెట్టుకున్నవాడి మృతదేహం తమకు వద్దని అతడి సోదరి చెప్పడంతో పురపాలక అధికారులకు పోలీసులు అప్పగించారు. ఈ నెల 17న మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో నిందితుడు తలారి కులవర్ధన్ చిన్నారిపై పాశవికంగా అత్యాచారం చేసి, హతమార్చి మృతదేహాన్ని నీటిడ్రమ్ములో ఉంచాడు. మర్నాడు నిందితుడు చెరువులో మృతదేహంగా తేలడంతో వీఆర్వోలు సుష్మిత, వెంకటరమణ ముదివేడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి అతడి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు కులవర్ధన్‌గా నిర్ధారించడంతో అతడి చెల్లి, బావకు తెలిపారు. పోస్టుమార్టం అయిన తర్వాత మృతదేహం తీసుకెళ్లేందుకు ఆమె నిరాకరించారు. చిన్నారిపై అత్యాచారం చేసి, చంపిన నిందితుడి మృతదేహం తమకు వద్దని వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి అందుబాటులో లేకపోవడంతో మదనపల్లె పురపాలక పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించారు. వారు మృతదేహాన్ని చెత్తబండిలో గురువారం రాత్రి కంపోస్టు యార్డుకు తీసుకొచ్చారు. కమిషనర్ ప్రమీల ఆదేశాలతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.



మృతదేహాన్ని స్వాధీనం చేసుకుంటున్న పురపాలక సిబ్బంది

గ్రహం అనుగ్రహం

20-2-2026 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం
తదియ: మ. 3-33 తదుపరి చవితి
ఉత్తరాభాద్ర: రా 9-13 తదుపరి రేవతి
వర్జ్యం: ఉ. 7-11 నుంచి 8-44 వరకు
అమృత ఘడియలు: సా. 4-32 నుంచి 6-06 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-46 నుంచి 9-33 వరకు
తిరిగి మ. 12-37 నుంచి 1-22 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6.29; సూర్యాస్తమయం: సా.5.59

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	17.0	32.0
కడప	17.4	34.2
కరీంనగర్	18.0	31.0
విజయవాడ	19.4	31.1
విశాఖపట్నం	19.6	31.8
శ్రీకాకుళం	20.0	30.0
హైదరాబాద్	20.0	30.5
తిరుపతి	20.0	32.4
తాడేపల్లిగూడెం	20.0	34.0
రాజమహేంద్రవరం	20.0	36.5
అనంతపురం	20.2	34.7
కర్నూలు	20.2	35.0
గుంటూరు	21.0	33.0
నరసాపురం	21.0	35.0
ఒంగోలు	21.6	32.3
నెల్లూరు	22.0	32.8

ఉప్పాడ మత్స్యకారుల అభ్యున్నతికి ప్రణాళిక సిద్ధం

• పిఠాపురం పర్యటనలో ప్రకటిస్తా
• ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడి



ఈనాడు, అమరావతి: 'ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా అన్ని శాఖల సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించాం. త్వరలో పిఠాపురం పర్యటనలో ఈ ప్రణాళికను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. నిర్దిష్ట లక్ష్యంతో రూపొందించిన ఈ ప్రణాళిక ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతుందని ఆశిస్తున్నా' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'గత ఏడాది అక్టోబరు 9న కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకారులతో సమావేశమయ్యాం. వారు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకూ పరిష్కార మార్గాలు అన్వేషించాం. తీర కాలుష్య నివారణ, కోత నివారణ, మత్స్య సంపద వృద్ధి, అధునాతన పద్ధతుల్లో వేట, మార్కెటింగ్ సదుపాయాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ వంటి అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలో పొందుపరిచాం' అని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఆ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు వ్యవసాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

ఆర్అండ్‌బీలో కొత్తగా హిందూపురం డివిజన్ ఏర్పాటు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రోడ్లు, భవనాలశాఖ పరిధిలో శ్రీసత్యసాయి జిల్లాలో కొత్తగా హిందూపురం డివిజన్‌ను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ధర్మవరం డివిజన్.. ధర్మవరం, కదిరి, పెనుకొండ, మడకశిర సబ్‌డివిజన్లతో 2,486.08 కి.మీ.మేర ఉంది. ఇకపై ధర్మవరం డివిజన్‌లోకి ధర్మవరం, కదిరి సబ్ డివిజన్లు మాత్రమే వస్తాయి. కొత్తగా ఏర్పాటు చేసిన హిందూపురం డివిజన్‌లోకి పెనుకొండ, మడకశిర సబ్‌డివిజన్లు కలిపి 1,336.22 కి.మీ. వస్తాయి. మరోవైపు అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం డివిజన్‌ను తొలగించి, అనంతపురం డివిజన్‌కు జతచేశారు. దీంతో కళ్యాణదుర్గం డివిజన్ ఈఈ పోస్టు, అక్కడి 24 మంది సిబ్బంది పోస్టులను కొత్తగా ఏర్పాటైన హిందూపురం డివిజన్‌కు మార్చారు.



రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఆహ్వానం పలుకుతున్న నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ త్రిపాఠి. చిత్రంలో సంజయ్ భల్లా

మన జెండాలు వేరైనా.. నిబద్ధత ఒక్కటే

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణ పొందితే, అధికారులు కలిసి చర్చిస్తే భౌగోళిక, రాజకీయ పరిమితులు దాటి ఒక అవగాహన ఏర్పడుతుంది. అంతర్జాతీయ జలాల వివాదాలను పరిష్కరించడానికి ఐక్యరాజ్యసమితి ఒక బలమైన సముద్రాల చట్టాన్ని తీసుకొచ్చింది. సముద్ర ఉగ్రవాదం, అక్రమ చేపల వేట, అక్రమ రవాణా, సైబర్ నేరాల ముప్పును సమైక్యంగా ఎదుర్కోవాలి' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి మాట్లాడుతూ ప్రపంచ నౌకాదళ నిపుణులు ఒకే లక్ష్యంతో రావడం సముద్ర భద్రతకు బలాన్నిస్తుందన్నారు. తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా పాల్గొన్నారు.

ఆసియా సభ్య దేశాల నౌకాదళాధిపతులతో రక్షణ మంత్రి సమావేశం

భారత్ రక్షణ రంగంలో అభివృద్ధి చేసిన సాంకేతిక సామర్థ్యాలను భాగస్వామ్య దేశాలు అందిపుచ్చుకోవాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. మిలన్ వేడుకల్లో భాగంగా తొమ్మిది ఆసియా సభ్య దేశాల నౌకాదళాధిపతులు, ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హిందూ, పసిఫిక్ సముద్రాల్లో వ్యూహాత్మక రక్షణ అంశాలపై ఇందులో చర్చించారు.





సాగర తీరంలో నమూనా బాంబులను జార విడుస్తున్న తీరును తిలకిస్తున్న జనం ★ సాగరంపై హెలికాప్టర్లకు వేలాడుతూ నౌకాదళ సిబ్బంది చేస్తున్న సాహసాన్ని తిలకిస్తున్న ప్రజలు

సముద్రాలు స్నేహ, శాంతి బంధాలకు వారధులుగా నిలవాలి

- రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్-న్యూస్‌టుడే: 'సముద్రాలు వాణిజ్య, స్నేహ, శాంతి బంధాలకు వారధులుగా నిలవాలి. ఇతర దేశాల నౌకాదళాలతో సత్సంబంధాలు కలిగి ఉండటమే అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ, మిలన్-2026 వంటి కార్యక్రమాల లక్ష్యం. రక్షణ దళాలకు, ప్రజలకు మధ్య ఉన్న బంధాన్ని ఈ అంతర్జాతీయ ఉత్సవం మరోసారి రుజువు చేసింది. ప్రజల సాక్షిగా జరిగిన నౌకాదళ విన్యాసాలు భారత శక్తిసామర్థ్యాలకు అద్దం పట్టాయి' అని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. విశాఖ సాగర తీరంలో గురువారం జరిగిన మిలన్-2026, అంతర్జాతీయ సిటీ పరేడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'మన దళాలతోపాటు, విదేశీ దళాలు, బ్యాండ్లు భారత భూమిపై గర్వంగా నడవడం స్నేహం, విశ్వాసం, పరస్పర గౌరవానికి సూచిక' అని గవర్నర్ పేర్కొన్నారు. 'సముద్ర భద్రత కోసం సోదర దేశాలతో కలిసి పనిచేస్తున్నాం. అన్ని నేవీలను సమైక్యంగా ఉంచేందుకు, పనిచేసేందుకు మిలన్ తోడ్పడుతుంది. మారిటైం నేషన్‌గా భారత్ బాధ్యతను, నేవీపై ఉంచిన నమ్మకాన్ని ఈ కార్యక్రమాలు మరింత పెంచుతున్నాయి' అని భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి పేర్కొన్నారు.

✦ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు నౌక బొమ్మను జ్ఞాపికగా నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి, ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా అందించారు. ✦ ఆర్‌కే బీచ్ రోడ్డు, తీరంలో నిర్వహించిన సాహస విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



నమూనా ఆయిల్ రిగ్ పేల్చినప్పుడు రేగిన జ్వాల



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, వేదికపై భారత నౌకాదళ ఉన్నతాధికారులు



బాణసంచా వెలుగుల్లో నౌకలు

వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఉదయ్‌కుమార్‌రెడ్డికి రక్షణా?

యురేనియం కర్మాగారం అధికారులను ప్రశ్నించిన నర్రెడ్డి సునీత



నిందితుడు ఉదయ్ కుమార్ రెడ్డి

ఈనాడు, కడప- న్యూస్‌టుడే, వేముల: మాజీ ఎంపీ వివేకా హత్య కేసులో సీబీఐ ఛార్జిషీట్‌లో ఏ6గా ఉండి 16 నెలల పాటు జైల్లో ఉన్న ఉదయ్‌కుమార్‌రెడ్డిని ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించలేదని డాక్టర్ నర్రెడ్డి సునీత (వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె) ప్రశ్నించారు. వైఎస్సార్ జిల్లా వేముల మండలం తుమ్మలపల్లి వద్ద యురేనియం కర్మాగారం అధికారులను ఆమె గురువారం కలిశారు. ఉదయ్‌కుమార్‌రెడ్డి బెయిలుపై విడుదలైన తర్వాత అతన్ని సస్పెండ్ చేయడానికి 11 నెలలు జాప్యం చేయడంపై తీవ్రంగా మండిపడ్డారు. నిందితుడు అరెస్ట్ అయిన నాటి నుంచి (2023 ఏప్రిల్ 14 నుంచి) విధులకు హాజరు కాలేదని, 16 నెలలకు పైగా విధులకు రాకున్నా ఆ కాలంలో జీతం చెల్లించడంతోపాటు.. చర్యలు తీసుకోకుండా అధికార దుర్వినియోగానికి ఎందుకు పాల్పడ్డారని ఆమె ప్రశ్నించారు. దీని వెనుకున్న శక్తులేమిటంటూ గతంలోనే యూసీఐఎల్‌కు రాసిన లేఖను సునీత ఈ సందర్భంగా ప్రస్తావించారు. హత్య జరిగిన రోజున కడప ఎంపీతో కలిసి ఉదయ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు సీబీఐ ఛార్జిషీట్‌లో ప్రస్తావించిందని, యూసీఐఎల్ నియమావళి ప్రకారం ఉద్యోగులు రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. వివేకా కేసు విచారణ పూర్తి అయ్యే వరకు అతనికి జీతభత్యాలు చెల్లించరాదని, ఉద్యోగ అవకాశం ఇవ్వరాదని సునీత కోరారు. ఉదయ్‌కుమార్‌రెడ్డిపై శాఖాపరమైన విచారణను చేపట్టాలని, సస్పెన్షన్ ఆలస్యానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వీటిపై తనకు 15 రోజుల్లో లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆది నుంచీ వివాదాస్పదం: హత్య కేసు నిందితుడు ఉదయ్ కుమార్‌రెడ్డి యురేనియం కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) కంపెనీలో మెకానికల్ విభాగంలో ఫోర్‌మెన్‌గా పని చేసేవారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డికి ప్రధాన అనుచరుడు. వివేకా హత్య కేసులో సాక్ష్యాలను నాశనం చేయడంలో, మృతదేహం వద్ద ఆధారాలను చెరిపివేయడంలో కీలక పాత్ర పోషించారని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. కేసులో ఏ6గా ఉన్న నిందితుణ్ని సీబీఐ అరెస్టు చేయగా 16 నెలలకు పైగా జైల్లో ఉండి 2024 ఆగస్టులో బెయిల్‌పై విడుదలయ్యారు. ఎంపీ అవినాష్ రెడ్డి సిఫార్సు మేరకు కర్మాగారంలో ఉదయ్‌కి ఉద్యోగం ఇచ్చినట్లు సమాచారం.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం నియమించినట్లు పేర్కొన్నారు. డెడికేటెడ్ కమిషన్ నియామకం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.



ఐఎన్ఎస్ విక్రాంత్



నౌక ఫ్లైట్ డెక్‌పై రన్ వే

భారత బాహుబలి... ఐఎన్ఎస్ విక్రాంత్!

- ఐఎఫ్ఆర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విమాన వాహక నౌక

ఈనాడు, విశాఖపట్నం: అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ)కు భారత బాహుబలిగా పేరుగాంచిన విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ విశాఖ తీరానికి వచ్చింది. దీని విశిష్టతను నౌకాదళ అధికారులు మీడియాకు వివరించారు. లోపల విమానాలు భద్రపరిచే డెక్‌లు, ఆయుధ సంపత్తి, యుద్ధసమయంలో ఎంత క్రియాశీలకంగా వ్యవహరిస్తుంది, మిసైల్స్‌తో శత్రువులపై ఎలా దాడికి దిగుతుందో విశదీకరించారు. 'మూడేళ్ల క్రితం నౌకాదళంలో చేరిన ఈ నౌకను సాగర జలాల్లో వ్యూహాత్మక ప్రాంతాల్లో మోహరిస్తారు. యుద్ధ విమానాలు, హెలికాప్టర్లతో పగలూ, రాత్రి విన్యాసాలు చేయడం దీని ప్రత్యేకత. గంటకు 28 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఒకేసారి యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను మోసుకెళ్లే సామర్థ్యం దీని సొంతం. చేతక్ హెలికాప్టర్లతో విన్యాసాలు చేయాల్సి వస్తే యుద్ధవిమానాల సంఖ్య తగ్గిస్తారు. విమానాలతో చేయాల్సి వస్తే హెలికాప్టర్ల సంఖ్య తగ్గుతుంది. రన్‌వేపై పది మిగ్ విమానాలను ఒకేసారి నిలపొచ్చు. అత్యంత వేగంగా వచ్చే జెట్ విమానాలు రన్ వేపై నిర్ణీత స్థానంలో నిలిచే వ్యవస్థ దీనిపై ఉంది. మిగ్ 29కే, లైట్ ఎయిర్‌క్రాఫ్ట్స్, చేతక్, ధ్రువ్, కమోవ్, సీకింగ్ హెలికాప్టర్లు దీనిపై విన్యాసాలు సాగిస్తాయి. నౌక కింది నుంచి ఫ్లైట్ ల్యాండింగ్ అయ్యేవరకు పది డెక్‌లు ఉండగా, ఆ పైన 8 ఉంటాయి. దీని రన్‌వే రెండు చిన్నస్వామి క్రికెట్ స్టేడియాలను కలిపినంత విస్తీర్ణంలో ఉంటుంది. 2022లో ఈ నౌక కమిషన్ కాగా.. అంతకుముందు 2020లో ప్రాథమిక పరీక్షలు జరిపారు. 2021లో మొదటి ప్రయోగాత్మక పరీక్షలు చేశాక అధికారికంగా నౌకాదళానికి అంకితం చేశారు' అని పేర్కొన్నారు.



నౌక లోపలి డెక్‌లో మిసైల్స్‌తో మిగ్ విమానం

ఔరా.. ఐఎన్ఎస్ విక్రాంత్!

- ✦ నౌక: ఐఎన్ఎస్ విక్రాంత్
- ✦ నిర్మాణ సంస్థ: కొచ్చిన్ షిప్‌యార్డు
- ✦ నిర్మాణ వ్యయం: రూ.23వేల కోట్లు
- ✦ పొడవు: 262.5 మీటర్లు ✦ ఎత్తు: 59 మీటర్లు
- ✦ లోతు: 25.6 మీటర్లు ✦ డెక్‌లు: 18
- ✦ కంపార్టుమెంట్లు: 2,278 ✦ లోపలున్న నిచ్చెనలు: 684
- ✦ గంటకు ప్రయాణించే దూరం: 60 కిలోమీటర్లు
- ✦ ఒకసారి ఇంధనం నింపితే వెళ్లే దూరం: 7,500 నాటికల్ మైళ్లు
- ✦ పరిమిత టేకాఫ్ దూరం: 144 మీటర్లు
- ✦ లాంగ్ టేకాఫ్ దూరం: 203.7 మీటర్లు
- ✦ ల్యాండింగ్ రన్ వే: 191 మీటర్లు ✦ సిబ్బంది: 1,700
- ✦ రోజుకు అవసరమైన పాలు: 500 లీటర్లు
- ✦ గంటకు యంత్రాలతో చేసే చపాతీలు: 2500
- ✦ శస్త్రచికిత్స గదులు: 2 ✦ సీటీ, అల్ట్రాసౌండ్ స్కానర్లు: 2
- ✦ డిజిటల్ ఎక్స్‌రే: 1 ✦ డెంటల్ ఆసుపత్రి: 1
- ✦ ఐసీయూ: 1 ✦ వార్డులు: 4

వినుకొండలో స్వల్పంగా భూప్రకంపనలు

రిక్టర్ స్కేలుపై 3.5గా నమోదు

వినుకొండ, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా వినుకొండ పరిసర ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజామున 2.33 గంటలకు భూమి స్వల్పంగా కంపించింది. దీంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఎటువంటి నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.5గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) 'ఎక్స్'లో పేర్కొంది. సుమారు 20 కి.మీ. పరిధిలో స్వల్ప ప్రకంపనలు వచ్చినట్లు వెల్లడించింది. వినుకొండ పట్టణం, ఎ.కొత్తపాలెం, నడిగడ్డ, దొండపాడు, భారతాపురం గ్రామాల్లో తెల్లవారుజామున కొన్ని సెకన్ల పాటు పెద్ద శబ్దాలు వినిపించాయి. భూప్రకంపనలు వాస్తవమేనని, దీని వల్ల ఎక్కడా ఎటువంటి నష్టం లేదని తహసీల్దారు సురేష్ ధ్రువీకరించారు.



శారీరక శ్రమలేకపోవడమంటే..

శారీరక శ్రమ లేకపోవడమంటే కేవలం బద్ధకం మాత్రమే కాదు అదొక అనారోగ్య హేతువు. గంటలపాటు శరీరం కదలకుండా ఉంటే.. జీవక్రియల రేటు నెమ్మదిస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీ తగ్గుతుంది. కండరాలు బలహీనమవుతాయి. ఊబకాయానికి దారితీస్తుంది. టైప్-2 డయాబెటిస్, హృదయ సంబంధ వ్యాధులు, ఎముకల బలహీనత, నిరాశ, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. వ్యాయామం అనేది శరీర నిర్వహణకు ఉపకరించే కనీస అవసరం.

– శ్రద్ధే కటియార్, వైద్యుడు



కూల్చివేతకు ముందు ఉన్న స్మారక చిహ్నం



స్మారక స్తూపం కూల్చివేత ఇలా..

మావోయిస్టుల స్మారక చిహ్నాల కూల్చివేత

ఎటపాక 212, కుంట 217 బెటాలియన్ల సంయుక్త ఆపరేషన్

ఎటపాక, న్యూస్‌టుడే: సీఆర్‌పీఎఫ్ 212, 217 బెటాలియన్ల సంయుక్త ఆధ్వర్యంలో మావోయిస్టుల స్మారక చిహ్నాల కూల్చివేత ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కుంటా సెక్టార్‌లోని సెనాంపెంటా గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్ సీఆర్‌పీఎఫ్ సెక్టార్ డీజీ షాలిన్, కుంటా డీఐజీ (ఆపరేషన్స్) రాజేష్ పాండే మార్గనిర్దేశంలో ఎటపాక, కుంటా 212, 217 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ల కమాండెంట్లు దీపక్ కుమార్ శ్రీవాత్సవ, విజయ్‌శంకర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కిష్టారం పోలీస్‌స్టేషన్ పార్టీ, ఉమ్మడి దళాల సంయుక్త ఆపరేషన్‌లో సెనాంపెంటాలో 2010లో నిర్మించిన సీనియర్ మావోయిస్టు కేడర్ భామూన్ స్మారకచిహ్నాన్ని పొక్లెయిన్‌తో కూల్చివేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సీఆర్‌పీఎఫ్ బలగాలు అటవీ ప్రాంతాల్లో చేపడుతున్న ఆపరేషన్‌లో భాగంగా తీవ్రవాద చిహ్నాలను గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమాండెంట్లు తెలిపారు.

వచ్చే నెల 3న చంద్ర గ్రహణం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: వచ్చే నెల 3న చంద్ర గ్రహణం నేపథ్యంలో శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఆలయాన్ని మూసివేయనున్నట్లు దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారిణి ఆర్.రమణమ్మ గురువారం తెలిపారు. గ్రహణం రోజు తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి సేవలు చేసి, 4.30 నుంచి 5.30 గంటల వరకు భక్తులకు స్వామి, అమ్మవార్ల అలంకార దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆలయ ద్వారాలు మూసేస్తామన్నారు. రాత్రి 7.30 గంటలకు ద్వారాలు తెరిచి సంప్రోక్షణ చేసి.. 9 గంటల నుంచి రాత్రి 10.30 వరకు భక్తులకు స్వామి వారి అలంకార దర్శనం కల్పించనున్నట్లు వివరించారు.

ఈనాడు

ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులు

రక్తపరీక్ష కేంద్రం నిర్వాహకుడు వైద్యుడిగా అవతారమెత్తాడు. జ్వర పీడితుడైన నాలుగేళ్ల బాబుకు తెలిసీతెలియని చికిత్స చేసి, చివరికి ఆ పిల్లాడి ప్రాణాన్ని పొట్టనపెట్టుకున్నాడు. ఏపీలోని సింగరాయకొండలో కొన్నాళ్ల క్రితం చోటుచేసుకున్న దారుణమిది. పదో తరగతి కూడా చదవనివారు క్లినిక్‌లు తెరిచి కాసులు దండుకుంటున్న ఉదంతాలు చిత్తూరు జిల్లాలో బయటపడ్డాయి. సూర్యాపేటలో నకిలీ డాక్టర్ల మూలంగా నిరుడు నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు మహిళల జీవితాలు కడతేరిపోయాయి. పొట్టకోస్తే అక్షరం ముక్క రాకపోయినా ఒంటిమీద తెల్లకోటు, మెడలో స్టెతస్కోపు వేసుకుని యమరాజ వైద్యం చేస్తున్న ప్రబుద్ధుల ఆగడాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తరచూ వెలుగుచూస్తున్నాయి. చాలాచోట్ల అనేక ఆసుపత్రులు అసలు అనుమతులేమీ లేకుండానే వెలుస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోనే అలాంటివి 250 ఉంటాయని కథనాలు వెలువడుతున్నాయి. అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు చేస్తున్నా దొంగ దవాఖానాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుండటం దేనికి నిదర్శనం? చట్టాల అమలుకు సంబంధించి యంత్రాంగంలో సమన్వయ రాహిత్యం, సరైన శిక్షలు కొరవడటం వంటివి మోసగాళ్లకు ఆయాచిత వరాలై జనారోగ్యాన్ని కాటేస్తున్నాయి!

ఇటీవల ఏడాదిన్నర వ్యవధిలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆరొందల మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదుచేసింది. కానీ, ఎంబీబీఎస్ పట్టా లేకుండానే అల్లోపతి వైద్యం చేస్తున్నవారు రాష్ట్రంలో 60వేల మంది వరకు ఉంటారని అంచనా! ఇక్కడేకాదు- మాయదారి చికిత్సలతో జనం దగ్గర డబ్బులు దోచేస్తూ, కొత్త జబ్బులు అంటగడుతున్న స్వార్థపరులు దేశవ్యాప్తంగానూ భారీగా పోగుపడ్డారు. ఆసేతుహిమాచలం పది లక్షల మంది నకిలీ డాక్టర్లు ఉన్నారని ఐఎంఏ గతంలోనే హెచ్చరించింది. ఇండియాలో అల్లోపతి వైద్యులుగా చలామణీ అవుతున్నవారిలో 57శాతానికి తగిన అర్హతలేమీ లేవని, ఇంకా చెప్పాలంటే 31శాతం మంది బడి చదువులతో సరిపెట్టేసిన బాపతు మనుషులేనంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశోధనాత్మక సమాచారాన్ని వెల్లడించింది. అధిక మోతాదులో యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్లు ఇస్తున్న దొంగ వైద్యుల కారణంగా రోగుల ఆరోగ్యం ఇంకా దెబ్బతింటోంది. చికిత్స వికటించి అవయవాలు తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. బాధితుల శరీరాలను ఇష్టారీతిన కోసిపారేస్తూ, వారి బతుకులను ఆపరేషన్ బల్లకు బలిస్తున్న దుర్మార్గులకూ దేశంలో లోటులేదు. నిరుడు హరియాణాలో కార్డియాలజిస్టునంటూ దాదాపు 70 మందికి శస్త్రచికిత్సలు చేసిన ఓ మాయగాడు పలువురి ప్రాణాలు తీశాడు. దేశవ్యాప్తంగా చికిత్స సమయాల్లో సంభవిస్తున్న మరణాల్లో సుమారు 19శాతానికి నకిలీ డాక్టర్లే కారణమని లోగడ అధ్యయనాల్లో బయటపడింది. ఇలాంటి వాళ్లను వెంటనే గుర్తించి కటకటాల్లోకి పంపడంలో వ్యవస్థాగత వైఫల్యం ఏళ్ల తరబడి అలాగే నిక్షేపంగా కొనసాగుతోంది!

'స్వాతంత్ర్యం సాధించి ఏడు దశాబ్దాలు దాటిపోయింది. అర్హతలు లేనివారు వైద్యులు కావడం మాత్రం ఆగట్లేదు. కోట్లాది మంది సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతూ వారు యావత్ సమాజానికీ పెనుముప్పుగా పరిణమిస్తున్నారు' అంటూ సుప్రీంకోర్టు ఎప్పుడో ఆందోళన వెలిబుచ్చింది. ఆ ప్రమాదాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వాలు సమర్థంగా వ్యవహరించాలని అభిలషించింది. ప్రజాశ్రేయస్సు పట్ల నాయకుల్లో ఏమాత్రం నిబద్ధత ఉన్నా- నకిలీ డాక్టర్ల బెడదను తప్పించేందుకు వారు తక్షణం కర్తవ్యదీక్ష బూనాలి! ప్రైవేట్ ఆసుపత్రులను క్రమం తప్పకుండా తనిఖీ చేయిస్తూ, కాసులయావలో నిబంధనలను కాలరాసేవారిపై కఠిన చర్యలకు ఉపక్రమించాలి!



సక్సెస్ అంటే ఎంత పెద్ద హోదా సాధించామూ ఎంత సంపాదించామూ అన్నది కాదు. చేపట్టిన రంగంలో మన వంతుగా ఎలాంటి గుర్తులను వదిలి వెళ్తున్నామన్నదే మనం సాధించిన విజయాన్ని నిర్వచిస్తుంది.


– ఉషా థోరట్, ఆర్థికవేత్త

పరమాత్మను మెప్పించాలి

భగవంతుడు ప్రేమతో, ఆర్తితో, వినయంతో, ఆవేదనతో, సంతోషంతో... ఎలా పిలిచినా పలుకుతాడు. కరుణిస్తాడు. రక్షిస్తాడు. అహల్య, శబరి, గుహుడు తదితరుల విన్నపాలను రామావతారంలో విన్నాడు. మద్ది వృక్షాలై పొమ్మని నారదుడి శాపం పొందిన కుబేరుడి కుమారులు నలకూబరుడు, మణిగ్రీవులను కృష్ణావతారంలో తన పాదస్పర్శతో శాపవిముక్తుల్ని చేశాడు.

తపస్సు చేసే భక్తులకు వరాలిచ్చే విషయంలో శివుడు, బ్రహ్మ పోటీ పడతారని పురాణాలు చెబుతున్నాయి. బ్రహ్మ కనీసం కొన్ని షరతులు పెట్టి వరాలను అనుగ్రహిస్తాడు. బోళాశంకరుడు భక్తులు అడిగిందే తడవుగా వరాలిచ్చేస్తాడు. భస్మాసురుడి ఉదంతం తెలిసిందే కదా. కానీ కొన్ని సందర్భాల్లో ఈశ్వరుడు కూడా భక్తులను పరీక్షిస్తాడు. తపస్సు చేసిన జగజ్జననికే సులువుగా దొరకలేదాయన!

ఇంద్రుడి సూచన మేరకు భారత యుద్ధానికి ముందు అర్జునుడు శివుడి అనుగ్రహం పొందడానికి తీవ్రమైన తపస్సు చేస్తాడు. అందుకు మెచ్చినప్పటికీ పరమేశ్వరుడు పార్థుణ్ని పరీక్షించాలనుకున్నాడు. కిరాతుడి రూపంలో అక్కడికి వచ్చాడు. వస్తూనే ఒక మాయ వరాహాన్ని సృష్టించాడు. ఆ వరాహం అర్జునుడి తపస్సుకు భంగం కలిగించింది. కిరీటి కోపంగా దానిపై బాణం వేశాడు. అదే సమయానికి కిరాతుడు కూడా బాణం వదిలాడు. ఒకేసారి రెండు పక్కలనుంచి బాణాలు తగిలి వరాహం చనిపోయింది. నా బాణంతో చనిపోయిందంటే కాదు నా బాణంతో.. అంటూ ఇద్దరూ గొడవపడ్డారు. మాటల యుద్ధం కాస్తా చేతల్లోకి వెళ్లింది. సవ్యసాచికి సమ ఉజ్జీగా తేలాడు కిరాతుడు. బాణానికి బాణంతో సమాధానం చెప్పాడు. కర్ణుడు తప్ప విలువిద్యలో తనకి సమానమైన వారెవరూ లేరని అంతకాలం అనుకుంటున్నాడు అర్జునుడు. దాంతో ఇప్పుడు తనకు దీటుగా యుద్ధం చేస్తున్నది ఎవరో అతడికి అర్థం కాలేదు. సహనం కోల్పోయిన పాండవ మధ్యముడు తన గాండీవంతో కిరాతుడి శిరస్సుపై మోదాడు. అప్పుడు పశుపతి విజయుడి యుద్ధ కౌశల్యానికి, ధైర్యానికి మెచ్చి తన నిజరూపంలో ప్రత్యక్షమయ్యాడు. అర్జునుడు నివ్వెరపోయి, పరమేశ్వరుడితో యుద్ధం చేసినందుకు, ఆయన శిరస్సుపై మోదినందుకు పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. చేసిన పొరపాటుకు పర్యవసానం ఏమవుతుందోనని భయకంపితుడయ్యాడు. పినాకపాణికి సాష్టాంగ ప్రణామాలు చేశాడు. తెలియక చేసిన అపరాధాలను మన్నించమని వేడుకున్నాడు. సర్వేశ్వరుడు అర్జునుణ్ని లేవదీసి, ప్రేమగా పలకరించి, అతడు కోరుకున్న పాశుపతాస్త్రాన్ని ప్రసాదించాడు. ఫల్గుణుడు కృతజ్ఞతతో నమస్కరిస్తుండగానే కాలుడు అంతర్ధానమయ్యాడు. కోపంగా మాట్లాడినా, ఆయనపైనే యుద్ధం చేసినా, భగవంతుణ్ని మెప్పించగలిగితే తప్పక అనుగ్రహిస్తాడని చెప్పే ఉదంతమిది.



అంతర్యామి

శత్రువుగానైనా నిరంతరం హరినామస్మరణ చేయడం వల్ల హిరణ్యకశిపుడికి తన ద్వారా మృత్యువును, తద్వారా ముక్తిని ప్రసాదించిన దయాళువు శ్రీహరి. మనం అనుక్షణం భగవంతుడి నామస్మరణ, ఆయనకు ఇష్టమైన పనులు చేస్తూంటే ఆయనే సదా మనల్ని రక్షిస్తాడు.

– ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

డ్రైవర్లకు అధికాదాయం...

ప్రయాణికులకూ ప్రయోజనం!

ఫోన్‌లో యాప్ ద్వారా ట్యాక్సీ సేవలను పొందే సౌకర్యం వచ్చాక నగరాల్లో ప్రయాణాలు కాస్త సులభతరమయ్యాయి. అయితే, ఇందులోనూ రద్దీ వేళల్లో ప్రత్యేక బాదుడు, సేవల రద్దు, అధిక ఛార్జీలు వంటి ఇక్కట్లున్నాయి. కమీషన్ల విషయంలో డ్రైవర్ల ఫిర్యాదులు కోకొల్లలు. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం నడుంకట్టింది. డ్రైవర్లు, ప్రయాణికుల మధ్య న్యాయమైన వ్యవస్థ ఏర్పాటుకు 'భారత్ ట్యాక్సీ' పేరిట కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది.

'భారత్ ట్యాక్సీ' అనేది సహకార నమూనా కింద చేపట్టిన ప్రయాణ వ్యవస్థ. ఇది దేశంలో మొట్టమొదటి సహకార ట్యాక్సీ సేవ. డ్రైవర్లకు యాజమాన్య హోదాను, గౌరవాన్ని కల్పిస్తూ, మెరుగైన ఆదాయాన్ని సమకూరుస్తుంది. ప్రయాణికులకు పారదర్శక సేవలను అందిస్తుంది. ఈ ప్లాట్‌ఫామ్‌ను సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. దీన్ని బహుళ రాష్ట్రాల సహకార సంఘాల (ఎంఎస్‌సీఎస్) చట్టం కింద నమోదు చేశారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖ తోడ్పాటునిస్తోంది. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో



భాగంగా పనిచేస్తున్న నేషనల్ ఈ-గవర్నెన్స్ డివిజన్‌తో, ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌తో అనుసంధానమైంది. అమూల్, ఇఫ్కో, నాఫెడ్, నాబార్డ్ వంటి ప్రఖ్యాత సహకార సంస్థలు మద్దతు అందిస్తున్నాయి.

ఉపాధి అవకాశాల సృష్టి

ప్రైవేట్ ట్యాక్సీ సేవలందించే యాప్‌లు డ్రైవర్ల నుంచి 20-30శాతందాకా కమీషన్ తీసుకుంటాయి. ఇంధన వ్యయం, వాహన నిర్వహణ ఖర్చులు, కమీషన్లు పోగా డ్రైవర్లకు తక్కువ ఆదాయమే మిగులుతోంది. సంపాదన అరకొరగా ఉండటంతో చాలామంది డ్రైవర్లు ఒత్తిడికి లోనవుతున్నారు. మరోవైపు, ప్రయాణికులకూ కష్టాలు తప్పడంలేదు. వర్షం, పండుగలు తదితర రద్దీ వేళల్లో ఛార్జీలు అకస్మాత్తుగా పెరగడం వారిని ఇబ్బంది పెడుతోంది. ఇలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరించడానికే 'భారత్ ట్యాక్సీ'ని తీసుకొచ్చారు. దీంతో డ్రైవర్లకు మెరుగైన ఆదాయం, ప్రయాణికులకు స్థిరమైన, పారదర్శక ఛార్జీలను చెల్లించే వెసులుబాటు దక్కుతుంది. 'భారత్ ట్యాక్సీ'లో చేరిన డ్రైవర్లు సహకార సంఘంలో సభ్యులు కావచ్చు. వారు కమీషన్లకు బదులుగా కొద్దిపాటి సభ్యత్వ లేదా చందా రుసుము చెల్లిస్తారు. ప్రతిగా, తమ రైడ్ సంపాదనలో వందశాతాన్నీ తామే పొందుతారు. సహకార సంస్థలో వాటాను దక్కించుకుంటారు. సేవలకు సంబంధించిన నిర్ణయాల్లోనూ పాల్గొనవచ్చు. భవిష్యత్తులో లాభాల్లో భాగస్వామ్యాన్ని, డివిడెండ్‌లనూ పొందవచ్చు. ఈ వ్యవస్థ డ్రైవర్లకు గౌరవం, ఆర్థిక భద్రతతో పాటు, యాజమాన్య గౌరవాన్నీ కల్పిస్తుంది.

'భారత్ ట్యాక్సీ' 2025 నవంబరులో దిల్లీలో ప్రయోగాత్మకంగా ప్రారంభమైంది. తక్కువ సమయంలోనే 50వేలకంటే ఎక్కువ మంది డ్రైవర్లు ఈ ప్లాట్‌ఫామ్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ సేవలను ప్రధాన నగరాల్లో విస్తరించిన తరవాత చిన్న పట్టణాలకూ చేర్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది దేశమంతటా ఉద్యోగ అవకాశాలను సృష్టించడమే కాకుండా, ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరచనుంది. 'భారత్ ట్యాక్సీ' డైనమిక్ సర్జ్ ధరలపై ఆధారపడే ప్రైవేట్ ప్లాట్‌ఫామ్‌ల మాదిరిగా కాకుండా- నియంత్రిత, పారదర్శక ధరల విధానాన్ని అనుసరిస్తుంది. ఈ వేదిక ద్విచక్ర వాహనాలు, ఆటోలు మొదలు సాధారణ ట్యాక్సీలదాకా వివిధ రకాల వాహనాలను అందుబాటులోకి తెస్తుంది. విభిన్న రకాల ప్రయాణికుల అవసరాలను తీరుస్తుంది. రియల్-టైమ్ వెహికల్ ట్రాకింగ్, బహుభాషా సేవలు, సురక్షిత ప్రయాణం, నిరంతర పర్యవేక్షణ వంటి వాటితో కూడిన మొబైల్ అప్లికేషన్‌తో వినియోగదారులకు స్నేహపూర్వక యాప్‌గా పనిచేయనుంది. డ్రైవర్లు, ప్రయాణికులకు రక్షణ కల్పించేందుకు స్థానిక అధికారుల సహకారం, సాంకేతిక పరిజ్ఞానం అండగా ఉంటాయి. మెరుగైన సేవల కోసం ప్రభుత్వ డిజిటల్ వ్యవస్థలతో అనుసంధానానికి అనుగుణంగా 'భారత్ ట్యాక్సీ'ని రూపొందించారు. క్రమబద్ధీకరించిన కార్యకలాపాల కోసం ఇది డిజిలాకర్, ఉమంగ్, ఏపీఐసేతు వంటి ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకుంటుంది.

ఇందులో డ్రైవర్ల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చారు. 'భారత్ ట్యాక్సీ'లో పనిచేయడం వల్ల వారు అధిక ఆదాయం పొందవచ్చు. దానివల్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 'భారత్ ట్యాక్సీ' వ్యవస్థాపకతనూ ప్రోత్సహించనుంది. ప్రైవేట్ వ్యాపారవేత్తలు ఆధిపత్యం చెలాయించే మార్కెట్లో, సహకార ఆపరేటర్ల రాకతో పోటీ పెరిగి, ధరలు తగ్గి, సేవల్లో నాణ్యత మెరుగుపడే వీలుంది. తద్వారా ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుంది. సహకార వ్యవస్థను డిజిటల్ యుగానికి అనుగుణంగా ఎలా మార్చుకోవచ్చనేందుకు ఈ నమూనా ఉదాహరణగా నిలుస్తుంది. సహకార విలువలను ప్రోత్సహిస్తుంది. అయితే, ఇందులోనూ కొన్ని సవాళ్లు లేకపోలేదు. ఈ రంగంలో బాగా స్థిరపడిన ప్రైవేట్ కంపెనీలతో పోటీ పడాల్సి ఉంటుంది. వేగంగా విస్తరిస్తూనే సేవల్లో నాణ్యతను కాపాడుకోవాలి. దేశవ్యాప్తంగా ప్రయాణికుల విశ్వాసాన్ని పొందాలి. సాంకేతికతను సమర్థంగా వాడుకుంటూ మెరుగైన నిర్వహణను కొనసాగించాల్సి ఉంటుంది.

సమూల మార్పులు

ఇరవై ప్రధాన నగరాలకు విస్తరించాలని, లక్షమందికి పైగా డ్రైవర్లను చేర్చుకోవాలని 'భారత్ ట్యాక్సీ' లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని మెట్రో స్టేషన్ల వంటి ప్రజా రవాణా వ్యవస్థలతో అనుసంధానించాలని ప్రణాళికలున్నాయి. దీర్ఘకాలంలో ప్రైవేట్ ట్యాక్సీ యాప్‌లకు బలమైన ప్రత్యామ్నాయంగా మారాలని, ప్రజలకు విశ్వసనీయమైన, అనుకూలమైన సంస్థగా దీన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. యాప్ ఆధారిత ప్రయాణ సేవలు అందించే విషయంలో ఈ వ్యవస్థ సరికొత్త, న్యాయమైన విధానానికి నాంది పలుకుతుంది. డ్రైవర్లకు ప్రాధాన్యం కల్పించడం, ప్రయాణికులకు హేతుబద్ధ ధరలకే సేవలు అందించడం ద్వారా ట్యాక్సీ పరిశ్రమకు సమతుల్యతను కల్పిస్తుంది. సహకార విధానం, ప్రభుత్వ మద్దతు, ప్రజల నుంచి సానుకూల ప్రతిస్పందన వంటివి 'భారత్ ట్యాక్సీ'కి బలమైన సామర్థ్యాన్ని సమకూరుస్తున్నాయి. ఈ విధానం పూర్తిస్థాయిలో విజయం సాధిస్తే, దేశంలో ట్యాక్సీ సేవల రూపురేఖలే మారిపోతాయి.



డాక్టర్ ఎస్.శ్యామ్‌కుమార్
డిప్యూటీ డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్

అమ్మానాన్నల కంటిపాపలుగా ఉండాల్సిన పిల్లలు వీధిబాలలుగా ఎందుకు మారతారు? రోడ్డున పడ్డ వారి బతుకులు ఎలా ఉంటాయి? స్వానుభవంతో ఈ పరిస్థితిని తెలుసుకున్నారు కాబట్టే అలాంటి వారెందరికో కొత్త జీవితం ఇవ్వగలిగారు మణిహార. నలభై ఏళ్ల క్రితం ఆయన ప్రారంభించిన ఓ సంస్థ ఇప్పటికీ వందలాది అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మాథ్యూ నార్మన్‌ది ఇంగ్లాండ్‌లోని మాంచెస్టర్. అమ్మానాన్నా ఉన్నత విద్యావంతులు. సాఫీగా సాగుతున్న జీవితం. కానీ ఎందుకో ఆ అబ్బాయికి చదువంటే ఇష్టం ఉండేది కాదు. ఏం చేయాలో తెలియక ఇంట్లోంచి వచ్చేశాడు. ఎక్కడెక్కడో తిరిగాడు. ఏవేవో పనులు చేశాడు. సంఘవిద్రో-

ఎక్కడో పుట్టి ఇక్కడికొచ్చి...



హుల చేతికి చిక్కి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డాడు. అంతకు ముందు ఒకసారి తండ్రి ఇండియా వచ్చిన సంగతి గుర్తొచ్చి తానూ ఇక్కడికి వచ్చాడు. ముంబయి చేరుకుని కొన్నాళ్లు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు వేశాడు. హరేకృష్ణ ఉద్యమంలో చేరి పలు దేశాల్లో పర్యటించాడు. ఆధ్యాత్మిక బాట ఆ యువకుణ్ని మాదకద్రవ్యాల వ్యసనాన్ని వదిలించుకునేలా చేసింది. భారత్‌లో స్థిరపడాలనుకున్న నార్మన్ ముంబయిలో ఎక్కడ చూసినా వీధిబాలలు కనిపించడంతో వాళ్లలో తనను తాను చూసుకున్నాడు. ఒక ట్రస్టు పెట్టి పుణెలో అనాథలకు వసతి, భోజనం ఏర్పాటుచేశాడు. చదివించే బాధ్యత తీసుకున్నాడు. భక్తి అనే భారతీయ యువతిని వివాహం చేసుకున్నాడు.

భారతీయ పౌరసత్వం తీసుకుని నార్మన్ తన పేరును మణిహారగా మార్చుకున్నాడు. నాటి విజయవాడ మేయర్ ఆహ్వానంతో పుణె నుంచి బెజవాడ వచ్చి తన సేవా కార్యక్రమాల్ని ఇక్కడికీ విస్తరించాడు. రోడ్లమీద భిక్షాటన చేస్తూ, చెత్త ఏరుకుంటూ దారుణమైన జీవితాలను గడుపుతున్న పసివారిని చూసి నార్మన్ గుండె కరిగిపోయింది. ఎవరూ పట్టించుకోకపోతే వారంతా సంఘవిద్రోహ శక్తుల చేతిలో పడి సమాజానికి భారంగా మారతారని భావించాడు. నగర శివార్లలో ఒక ఆశ్రమం ఏర్పాటుచేసి అనాథ పిల్లలకు వసతి, భోజన సౌకర్యం కల్పించాడు. పిల్లల్ని బలవంతం చేయకుండా వాళ్ల ఇష్టం వచ్చినప్పుడు వచ్చి వెళ్లే స్వేచ్ఛనిచ్చారు. క్రమంగా పిల్లలు అక్కడి భద్రమైన జీవితానికి అలవాటు పడ్డారు. అప్పుడు వారికి వృత్తి విద్యల్లో శిక్షణ ఇప్పించడం మొదలెట్టారు మణిహార. కొందరు చదువు కొనసాగించారు. అలా ఇప్పటికీ కొన్ని వేలమంది పిల్లలు ఏదో ఒక పనిలో నిపుణులై బయటికి వెళ్లి తమ కాళ్లమీద తాము నిలబడుతున్నారు. మణిహార ప్రారంభించిన శ్రీకృష్ణచైతన్య విద్యావిహార్ చిల్డ్రన్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెస్క్యూస్టేషన్, బాలుర కోసం 'ప్రేమవిహార్', బాలికల కోసం 'ఆమోదిని' కేంద్రాలు పనిచేస్తున్నాయి.

స్థానికంగా దాతల, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటుతో పాటు యూకే, మలేసియా లాంటి చోట్ల నుంచి కూడా ఈ ట్రస్టు కార్యక్రమాలకు ఆర్థికసాయం అందుతోంది. అనారోగ్యం బారినపడి నార్మన్ మణిహార కన్నుమూసినా ఆయన ప్రారంభించిన సేవ మార్గం పలువురు సహృదయుల అండతో కొనసాగుతూనే ఉంది.

– రెడ్లం రామవరప్రసాద్

పోక్సో కేసుల్లో శిక్షలేవీ?

గడిచిన అయిదేళ్లలో ఇండియాలో 'లైంగిక నేరాల నుంచి చిన్నపిల్లల రక్షణ చట్టం(పోక్సో)' కింద నమోదవుతున్న కేసులు 43శాతం పెరిగాయి. వాటిలో శిక్షలు మాత్రం అరకొరగానే పడుతున్నాయి. ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం 2023 చివరి నాటికి 2.62 లక్షల పోక్సో కేసులు కోర్టుల్లో అపరిష్కృతంగా మిగిలాయి. మరోవైపు 2024లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో 19శాతం పోక్సో కేసుల్లోనే శిక్షలు పడ్డాయి. జాతీయ సగటుతో పోలిస్తే ఏపీలో 5శాతం, తెలంగాణలో 7శాతం కేసుల్లోనే శిక్షలు ఖరారయ్యాయి. ఆయా సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా పోక్సో కేసుల్లో శిక్షల రేటు (శాతాల్లో)...



■	2019	34.9
■	2020	39.6
■	2021	32.2
■	2022	31.7
■	2023	29

(ఆధారం: సీ-ల్యాబ్ ఫర్ చిల్డ్రన్ నివేదిక)

చైనా సైనిక సత్తాపై అనుమానాలు



తైవాన్ మీద చైనా 2027లో దండెత్తబోతోందని పాశ్చాత్య దేశాలు ఆందోళన చెందుతున్నాయి. మరోవైపు, చైనా సైన్యానికి దిగ్విజయంగా దాడి జరిపే సత్తా ఉందా అనే సందేహమూ వ్యక్తమవుతోంది. డ్రాగన్ సైన్యంలో ఇటీవల సంభవిస్తున్న పరిణామాలే దీనికి కారణం.

చైనా దగ్గర వందలాది అణు క్షిపణులు ఉన్న సంగతి తెలిసిందే. వేల కిలోమీటర్ల దూరం పయనించి శత్రువుపై దాడి చేయాల్సిన ఈ క్షిపణులు యుద్ధమే వస్తే తుస్సుమంటాయని అమెరికా గూఢచారి సంస్థలు 2024లోనే వెల్లడించాయి. ఆ క్షిపణులలో రాకెట్ ఇంధనాన్ని కాకుండా నీళ్లను నింపడమే దీనికి కారణమని తెలిపాయి. దీన్ని చైనా అధికార వర్గాలు ఖండించాయి. ముందు నుంచే రాకెట్లలో ఇంధనం నింపి ఉంచితే, తుప్పు పట్టవచ్చు, కరిగిపోవచ్చు కాబట్టి ఇంధన ట్యాంకులను ఖాళీగా ఉంచుతారని కథనాలు వెలువడ్డాయి. షింజియాంగ్ రాష్ట్రంలో వందలాది చైనా అణ్వస్త్రాలను నిలిపి ఉంచిన సైలోల (నిట్టనిలువు కాంక్రీటు గోతులు) పైకప్పులు లోపభూయిష్ఠ నిర్మాణం వల్ల యుద్ధ సమయంలో తెరుచుకోకుండా జామ్ అయిపోతాయనే వార్తలూ వచ్చాయి. ఏదిఏమైనా 2023, 2024 సంవత్సరాల్లో చైనా రాకెట్ ఫోర్స్ దళాధిపతుల్లో అత్యధికులతోపాటు ఇద్దరు రక్షణ మంత్రులనూ అవినీతి ఆరోపణలపై బర్తరఫ్ చేయడం చూస్తే పరిస్థితి సజావుగా లేదని భావించక తప్పదు.

కొరవడిన పోరాట అనుభవం

జిన్‌పింగ్ చైనా అధినాయకుడిగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి 50శాతం ఉన్నత సైన్యాధికారులను తొలగించారు. 'తీవ్ర క్రమశిక్షణా నియమాల ఉల్లంఘనకు' (అంటే అవినీతికి) పాల్పడ్డారంటూ ఈ ఏడాది జనవరిలో ఇద్దరు అత్యున్నత స్థాయి సైన్యాధికారులను పదవుల నుంచి తప్పించి దర్యాప్తు ప్రారంభించారు. వారు- ఝాంగ్ యూషియా, లియు ఝెన్లీ. వీరిలో యూషియా చైనాలో శక్తిమంతమైన కేంద్ర మిలిటరీ కమిషన్ ఉపాధ్యక్షుడు. చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కూడా. చైనాలో త్రివిధ సాయుధ దళాలు, రాకెట్ దళంతో పాటు పోలీసు, పారామిలిటరీ బలగాలు కూడా కేంద్ర మిలిటరీ కమిషన్ అదుపాజ్ఞల్లోనే ఉంటాయి. ఆ కమిషన్‌కు అధ్యక్షుడైన జిన్‌పింగ్ దేశాధ్యక్ష పదవినీ, కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిని కూడా నిర్వహిస్తారు. జిన్‌పింగ్‌కు ఉన్న మూడు పదవుల్లో కేంద్ర మిలిటరీ కమిషన్ అధ్యక్ష పదవే సర్వోన్నతం, సర్వశక్తిమంతం కూడా. తుపాకీ గొట్టం నుంచి అధికారం వస్తుందనే మావో సూక్తిని అనుసరించి, చైనా రాజ్యాంగం తుపాకీని చేపట్టేవారికే సర్వంసహాధిపత్యాన్ని కట్టబెడుతోంది. అలాంటి కేంద్ర మిలిటరీ కమిషన్ నాయకత్వ త్రయంలో ఒకరైన యూషియా ప్రస్తుతం ఉద్వాసనకు గురవడంతో, కమిషన్‌లో జిన్‌పింగ్‌తోపాటు, జనరల్ ఝాంగ్ షెంగ్మిన్ మాత్రమే మిగిలారు. షెంగ్మిన్‌కు పోరాట అనుభవం లేదు. తాజాగా ఉద్వాసనకు గురైన యూషియా ఒక్కరే కేంద్ర మిలిటరీ కమిషన్‌లో పోరాట అనుభవం ఉన్న వ్యక్తి. వియత్నాంతో సరిహద్దు యుద్ధంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సాధారణ సైనికుడి నుంచి అత్యున్నత మిలిటరీ కమిషన్ ఉపాధ్యక్షుడిగా ఎదిగిన యూషియా చైనా అణ్వస్త్ర రహస్యాలను అమెరికాకు చేరవేశారనే ఆరోపణలు వచ్చాయి. ఆయుధ సేకరణలో, పదోన్నతులలో అవినీతికి పాల్పడ్డారనే అభియోగాలను ఎదుర్కొంటున్నారు. అమెరికా సైన్యంతో మాటామంతీ నెరపే ఏకైక ఉన్నతస్థాయి సైన్యాధికారి కావడం కూడా యూషియా వాషింగ్టన్‌కు అణు రహస్యాలు చేరవేస్తున్నారనే ఆరోపణలు రేగడానికి కారణమైంది. అయితే, చైనా సైన్యంలో యూషియాకు సానుభూతి రాకుండా చేయడానికే ఆయనకు అమెరికా గూఢచారిగా ముద్ర వేస్తున్నారనే వాదన సైతం ఉంది. ఇప్పుడు ఆయనను తొలగించడం కేంద్ర మిలిటరీ కమిషన్‌ను బలహీనం చేసింది. రేపు తైవాన్‌పై యుద్ధానికి దిగితే అమెరికా, జపాన్ తదితర దేశాల నుంచి ఎదురు దాడులను తట్టుకునే అనుభవజ్ఞుడు లేకపోవడం చైనాకు పెద్ద లోటుగా మారుతుంది.

అదుపు సాధించడానికేనా...

దేశాధినేత జిన్‌పింగ్, యూషియాల కుటుంబాలు ఒకే రాష్ట్రం నుంచి వచ్చాయి. ఇద్దరి తండ్రులు కమ్యూనిస్టు పార్టీలో కలిసి పనిచేశారు. పార్టీ ప్రమాణాలకు విరుద్ధంగా 2022లో జిన్‌పింగ్ మూడోసారి దేశాధ్యక్ష పదవిని చేపట్టినప్పుడు వ్యతిరేకత ఎదురైనా యూషియా ఆయనకు గట్టిమద్దతు ఇచ్చారు. కానీ, తరవాత పార్టీలో, సైన్యంలో జిన్‌పింగ్ పెద్దయెత్తున అవినీతి ప్రక్షాళన చేపట్టినప్పుడు తనకూ ఎసరు వస్తుందని యూషియా ఆందోళన చెంది ఉండవచ్చు. యూషియా సర్వాధినేత జిన్‌పింగ్‌ను ధిక్కరిస్తున్నారనీ, కేంద్ర మిలిటరీ కమిషన్‌లో గ్రూపులు కడుతున్నారనే వార్తలు వచ్చాయి. తనకు ఎదురుచెప్పే స్థాయి ఉన్న వారిని సాగనంపి, సైన్యంపై పూర్తి అదుపు సాధించడానికే జిన్‌పింగ్ సమూల ప్రక్షాళన చేపట్టారనే సూత్రీకరణ వినిపిస్తోంది. జిన్‌పింగ్ మొదట సొంత సైన్యంపై పూర్తి పట్టు సాధించి, ఆ తరవాత పాశ్చాత్య దేశాలతో కయ్యానికి కాలు దువ్వుతారా అన్నది కీలక ప్రశ్న!

– కైజర్ అడపా

గొప్పల కోసం...

భీమరాజు అనే జమీందారు ఎప్పుడూ ఒంటి నిండా బంగారం వేసుకుని తిరుగుతుండేవాడు. ఎక్కడికి వెళ్లినా బంగారం మనిషి వచ్చాడంటూ జనాలు వింతగా చూసేవారు. అదంతా గమనించిన భార్య సుమిత్ర.. 'మీ దగ్గర తరగనంత ఆస్తి ఉందని, ఇలా ఆభరణాలతో చూపించుకోవడం బాలేదు. అది మీకు.. మన కుటుంబానికి మంచిది కాదు' అని చెబుతూ ఉండేది. కానీ అతను అస్సలు వినేవాడు కాదు. పైగా.. 'జనాల్లో గొప్ప పేరు తెచ్చుకోవాలి. అందుకు నాకు ఎలాంటి నైపుణ్యాలూ లేవు. డబ్బుంది కాబట్టి ఇలా ప్రదర్శిస్తున్నాను' అనేవాడు. ఇలా ఉండగా ఒకరోజు సుమిత్ర.. 'ఈమధ్య కుమారయ్య అనే పేరు ఎక్కువగా వినిపిస్తోంది. మన ఊరికి దగ్గర్లోనే ఉంటాడట. అతను ఏం చేస్తుంటాడో ఒకసారి వెళ్లి చూసొద్దామా!' అంది. అది విని అసూయపడిన భీమరాజు.. 'సరే వెళ్దాం పద' అన్నాడు. ఇద్దరూ బయలుదేరి ఆ ఊరికి వెళ్లారు. అతనొక ఆశ్రమంలో ఉన్నాడు. అక్కడ చాలామంది జనం కూర్చుని భోజనం చేస్తున్నారు. సుమిత్ర, భీమరాజులను చూసిన కుమారయ్య.. 'రండి.. చాలా ఎండలో వచ్చినట్లున్నారు. మంచి నీళ్లు తీసుకోండి. భోజనం చేశాక వెళ్లండి' అని ఆదరంగా పిలిచి కూర్చోబెట్టాడు. వాళ్లు తినేసి బయటకు వెళ్తుంటే అక్కడి సహాయకులు.. 'మీరు ఎప్పుడు ఈ దారంట వచ్చినాసరే భోజనం చేసి వెళ్లండయ్యా! ఆకలితో ఉన్నవాళ్లందరికీ ఈ బాబు అన్నం పెడుతున్నాడు. ఎంత ఆస్తి ఉన్నా ఇలాంటి ధర్మబుద్ధి ఎంతమందికి ఉంటుంది?' అన్నారు. ఇంటికి వెళ్లాక.. 'చూశారా! కుమారయ్యలానే మీకూ బోలెడు డబ్బుంది. మీరేమో అందరూ గొప్పగా చెప్పుకోవాలని రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అతనేమో చేసే పనులతోనే పేరు సంపాదించుకున్నాడు. ఎప్పుడైనా సరే మనం గొప్పల కోసం ప్రయత్నించకూడదు. మన పనులే ఆ పేరు తెచ్చిపెడతాయి' అంది సుమిత్ర. అప్పుడు భీమరాజుకు వాస్తవం తెలిసొచ్చింది. అప్పటి నుంచి బంగారం ధరించడం మానేసి.. పేదల కోసం ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాడు.



హాయ్! బుజ్జీ!!

– కె.కె.రఘునందన

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ప్రారంభమయ్యే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

మేక	పులి	తుపాకి
గుడ్డు	బహుమతి	గొడుగు
గడ్డి	టోపి	ఆట

మాదకద్రవ్యాలు.. బెట్టింగ్స్.. రుణయాప్‌ల జోలికి వెళ్లొద్దు బ్రో..

'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నేడు

కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోవడంతో అనేకమంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతోంది. బాగా చదువుకునే విద్యార్థులు సైతం మత్తును అలవాటు చేసి.. వారి జీవితాలతో మాదకద్రవ్యాల విక్రేతలు చెలగాటం ఆడుతున్నారు. ఒకసారి మత్తుకు అలవాటుపడితే.. దానిలోనుంచి బయటపడలేనంతగా యువత బానిసలుగా మారిపోతున్నారు. మరోవైపు బెట్టింగ్ మురికి చేతుల్లోనూ విద్యార్థులు పావులుగా మారుతున్నారు. మాదకద్రవ్యాలు, బెట్టింగ్ కోసం.. రుణ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో విద్యార్థులతో పాటు వారి కుటుంబాలు సైతం తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంటున్నారు. తిరిగి కోలుకోలేనంతగా కుటుంబాలు చితికిపోతున్నాయి. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, బెట్టింగ్, రుణ యాప్‌లలో విద్యార్థులు ఎలా చిక్కుకుంటున్నారన్న దానిపై అవగాహన కల్పించేందుకు 'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో' ప్రత్యేక సదస్సు జరగనుంది. ఆయా రంగాల్లోని నిపుణులు హాజరై విద్యార్థులకు వాస్తవ పరిస్థితిపై అవగాహన కల్పిస్తారు. - ఈనాడు, అమరావతి

వేదిక: కృష్ణవేణి డిగ్రీ కళాశాల, తాతినేనినగర్, 100 అడుగుల రోడ్డు, తాడిగడప | 20.02.26 (శుక్రవారం) | ఉదయం 10.30 గంటలకు

అధునాతన సాంకేతికతతో భవనాల అభివృద్ధి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: అధునాతన సాంకేతికతతో అన్నప్రసాదం, లడ్డు పోటు భవనాలు అభివృద్ధి చేయాలని ఈవో శీనానాయక్ ఇంజినీర్లను ఆదేశించారు. మల్లికార్జున మహా మండపంలో గురువారం నిర్వహించిన ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో ఈవో మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం బృందంతో కలిసి అన్నదాన భవనం, లడ్డు ప్రసాదం పోటు భవనాన్ని పరిశీలించిన తర్వాత ఆధునిక సాంకేతికతతో కూడిన వంటగది, అత్యాధునిక బాయిలర్ పరికరాల ఏర్పాటు చేయాలని సూచించారు. తితిదే బూందీ పోటు, అన్నదానం బాయిలర్లకు విజయవంతంగా పరికరాలను ఏర్పాటు చేసిన టెక్నాలజిక్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఇప్పటికే నివేదికను సమర్పించారన్నారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈ రవీంద్ర, ప్రతినిధులు రఘునాథన్, డిజైన్ మేనేజర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

శివాజీ శౌర్యం స్ఫూర్తిదాయకం


ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్, పక్కన ఎమ్మెల్యే బొండా ఉమా, శివస్వామి తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: శివాజీ మహారాజ్ శౌర్యం, ధైర్యం, పరిపాలన దక్షత.. నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ ట్రస్టు కన్వీనర్ నాగలింగం శివాజీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక శారద కళాశాల సమీపంలోని శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. గెరిల్లా యుద్ధంలో శత్రువును ఎదుర్కొని స్వరాజ్యాన్ని స్థాపించిన మహానేతగా చరిత్రలో నిలిచారని కొనియాడారు. ఆయన విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ లక్ష్య సాధనకు శివాజీ మహారాజ్ ఆశయాలు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఉమా మాట్లాడుతూ.. శివాజీ పరిపాలన సమసమాజ నిర్మాణానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి, విజయక్షేత్ర సూపర్‌బజార్ కమిటీ చైర్మన్ వెలగా సురేష్, భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బొడ్డు నాగలక్ష్మి, కోనేరు దుర్గాప్రసాద్, లోకనాథశర్మ, శంకర నారాయణ, దుర్గాప్రసాద్‌రాజు, హనుమంతరావు, సురేష్, లాకా వెంగళ రావు యాదవ్ పాల్గొన్నారు.

వృథా వ్యథ.. కథ ఇనుము!

తుక్కుగా మారుతున్న ఉక్కు నిల్వలు | **వైకాపా పాలన వైఫల్యానికి నిదర్శనం**

ఈ ఇనుమును.. 2021-22 వైకాపా పాలనలో కొని.. పెనుగంచిప్రోలు మండల హౌసింగ్ కార్యాలయం ఆవరణలో ఇలా పడేశారు. తుప్పు పట్టి, చుట్టూ ముళ్లపొదలు ఏర్పడి క్రమంగా మట్టిలో కలిసిపోతోంది.



ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, నందిగామ

"వైకాపా పాలనలో చేపట్టిన జగనన్న కాలనీల్లో ఆది నుంచి అక్రమాలే రాజ్యమేలాయి. మెరక పనులు మొదలు.. ఇంటి నిర్మాణం వరకు నాయకులు, అధికారులు అడ్డగోలుగా దోచేశారు. అవసరానికి మించి ఇనుము కొని సొమ్ము చేసుకోవడంతో ఆ ఇనుము ఉమ్మడి జిల్లాలో ఎందుకూ కొరగాకుండా పోతోంది."

లబ్ధిదారుల ప్రమేయం లేకనే...

✪ ఉమ్మడి కృష్ణాలో వైకాపా పాలనలో ప్రభుత్వమే నిర్మించి ఇచ్చే (ఆప్షన్-3) గృహ యూనిట్లు 31,000 వరకు మంజూరయ్యాయి. వీటి నిర్మాణంపై అసలు లబ్ధిదారులకు సమాచారం లేకుండానే స్టీల్, ఇతర మెటీరియల్ అవసరానికి మించి మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి కొనేశారు. ✪ భారీగా కమీషన్ తీసుకుని ఆయా కంపెనీలకు ఇంటి నిర్మాణం చేపట్టక ముందే మొత్తం బిల్లు చెల్లించేశారు. తీరా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మొత్తమ్మీద 6 వేలు కూడా పూర్తవలేదు. దీంతో అడ్డగోలుగా తెచ్చిన ఇనుము, ఇతర మెటీరియల్ మిగిలిపోయాయి.

50-100 టన్నులు

✪ జగ్గయ్యపేట, నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల... ఇలా ప్రతి మండలంలోనూ 50-100 టన్నుల వరకు ఇనుము వృథాగా ఉంది. చాలాచోట్ల బయటపడేయగా ఏళ్లుగా ఎండ, వానలకు తుప్పు పట్టిపోతోంది. ✪ ఉమ్మడి జిల్లాలో రూ.15 కోట్ల విలువైన ఇనుము వృథాగా ఉంది. ఇళ్లు కడుతున్న గుత్తేదారులకు చాలాకాలంగా బిల్లులు ఇవ్వక పనులు నిలిచిపోయాయి. ✪ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా హౌసింగ్ పీడీలు వెంకట్రావ్, రజనీకుమారిలు మాట్లాడుతూ.. చాలా ప్రాంతాల్లో ఇనుము తుప్పు పట్టకుండా భద్రపరిచాం.. లబ్ధిదారులు వస్తే వారికి ఇస్తాం.. లేదంటే ప్రభుత్వ నిర్ణయం ప్రకారం చేస్తామన్నారు.

ఒక్కో టన్నుకు రూ.వేలల్లో దోపిడీ

✪ ఉమ్మడి జిల్లాలో 3 వేల టన్నుల మేర ఇనుము నిరుపయోగంగా మిగిలింది. ఆయా మండల కేంద్రాల్లో కొన్నిచోట్ల గిడ్డంగుల్లో పెట్టగా మరికొన్నిచోట్ల ఆరుబయటే వదిలేశారు. ఏళ్లు గడిచిపోవడం.. గృహ నిర్మాణం పడకేయడంతో ఉక్కు తుప్పు పట్టి తుక్కులా మారిపోతోంది. ✪ 2021-22లోనే టన్ను ఇనుము రూ.67-74 వేలకు కొన్నట్లు చూపించగా ఇప్పటికీ బహిరంగ మార్కెట్‌లో టన్ను రూ.60 వేలకు కూడా చేరకపోవడం గమనార్హం.

సరిహద్దులూ..చూపలేరా?

గ్రౌండింగ్‌కు మట్టి దొరకక మల్లవల్లిలో అగచాట్లు

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్


మల్లవల్లి పారిశ్రామికవాడలో నిర్మాణంలో ఉన్న చిన్న యూనిట్లు

❛ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మల్లవల్లిలో 347 మంది పారిశ్రామికవేత్తలు యూనిట్లు ఏర్పాటు చేసేందుకు 2025 మార్చిలో లాటరీ విధానంలో ప్లాట్లను కేటాయించారు. ఆరు నెలల్లో గ్రౌండింగ్ పూర్తిచేసి, రెండేళ్లలో పరిశ్రమలను నెలకొల్పాలి. ఏడాది కావస్తున్నా సగం మందైనా గ్రౌండింగ్ పూర్తిచేయలేదు. ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియకుంది. జాగా కేటాయించినంత వేగంగా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారు.❜

❛ ప్రత్యేకంగా అధికారులతో కూడిన ఓ బృందాన్ని పర్యవేక్షణకు కేటాయించినా.. అనుకున్న లక్ష్యానికి చేరుకోలేక చతికిలపడ్డారు. సర్వే చేసి.. ఎవరి స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో సరిహద్దు రాళ్లు పాతే ప్రక్రియ తీవ్ర జాప్యమైంది. మరోవైపు గ్రౌండింగ్‌కు అవసరమైన మట్టి కొరత వేధిస్తున్నా.. పట్టించుకునే వారే లేరని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు.❜

మల్లవల్లిలో 2, 3 నెలల కిందట నుంచి.. ఎవరి స్థలాలు ఎవరివో సర్వే ఆరంభించి.. సగం చేపట్టాక.. మిగతావి చేయకుండా వదిలేశారు. దీంతో కేటాయించిన వారిలో కొందరే.. గ్రౌండింగ్ చేశారు. మిగతా వాళ్లు.. అందరికీ కేటాయించాక చూద్దామనే ధోరణిలో ఉన్నారు. కారణం.. తీవ్ర మట్టి కొరత. పారిశ్రామికవాడలో 500 చదరపు మీటర్ల నుంచి 1, 2 ఎకరాల వరకూ ఒక్కొక్కరికి ప్లాట్లను కేటాయించారు. వీరిలో అర ఎకరా లోపు స్థలాలు కేటాయించిన 40-50 చిన్న యూనిట్లు గ్రౌండింగ్ పూర్తిచేసి.. నిర్మాణంలో ఉన్నాయి. వీరితోపాటు మరి కొందరు కూడా గ్రౌండింగ్‌కు సిద్ధంగానే ఉన్నా.. మట్టి దొరకడం కష్టంగా మారి చేతులెత్తేశారు.

అక్రమంగా తరలిస్తున్నా..

మల్లవల్లి సమీప ప్రాంతాల్లో విచ్చలవిడిగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. వీరి దగ్గరే టిప్పర్‌కు రూ.8-10 వేలకు కొనడం భారమైంది. గతంలో రూ.5 వేలకు దొరికేది.. ఇప్పుడు రెట్టింపు వెచ్చించాల్సిందే. ఇదే మంటే.. అధికారిక తవ్వకాలకు గన్నవరం పరిధిలో అనుమతులు లేకపోవడంతో.. ఎక్కడెక్కడి నుంచో తెస్తున్నారు. వాళ్లు చెప్పిన ధరకు కొనాల్సిందే అని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు.

ఎవరికీ పట్టదంతే..

సమస్యను ప్రజాప్రతినిధులు, కృష్ణా జిల్లా కలెక్టర్ సహా అధికారులు అందరికీ చెప్పినా.. పరిష్కారం దొరకలేదు. రెండెకరాల స్థలాన్ని గ్రౌండింగ్ చేయాలంటే.. రూ.30-35 లక్షలు పెట్టాల్సి రావడంతో.. ఇప్పుడు తొందరేముందని ఎక్కువ మంది వేచిచూస్తున్నారు. ప్రభుత్వం ఎకరం రూ.16.50 లక్షలకు కేటాయిస్తే.. మట్టి కోసం అంతకంటే ఎక్కువ కావాల్సివస్తోందని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు.

పోలవరం.. తప్పేలా లేదు కలవరం


సూరంపల్లిలో దెబ్బతిన్న పోలవరం కాలువగట్టు


సిమెంటు రక్షణ లైనింగ్ దెబ్బతిందిలా.

కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి దగ్గర పోలవరం కాలువ పరిస్థితి ఇది. కాలువ వెంబడి ఉన్న మట్టికట్ట కోసుకుపోవడమే కాక.. సైడ్ వాల్ సైతం దెబ్బతిని సిమెంట్ లైనింగ్ ముక్కలై ఇలా తయారైంది. ప్రస్తుతం కాలువ వెంబడి రహదారిని చాలామంది చెత్తతో డంపింగ్ యార్డులా మారుస్తున్నారు. రాబోయేది వేసవి కాలం కావడంతో ఇప్పుడే దీనికి మరమ్మతులు చేయించి తక్షణమే బాగుచేయించాల్సిన అవసరం ఉంది. గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం కాలువ వెంట మట్టిని దోచుకుపోవడం, నిర్మాణాలపై నిర్లక్ష్యం కారణంగా చాలా ప్రాంతాల్లో కాలువ దెబ్బతింది. పట్టిసీమ నుంచి కృష్ణానదికి గోదావరి జలాలను తీసుకువచ్చే ప్రధాన కాలువ కావడంతో వర్షాకాలం రాకుండానే దీనికి మరమ్మతులు చేయించి పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. - ఈనాడు, అమరావతి

పురాతన భవనం.. ఆదమరిస్తే ప్రమాదం

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పాతబస్తీలో పురాతన భవనాలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. వందేళ్ల క్రితం గానుగ సున్నంతో కట్టిన భవనాలు సైతం ఉన్నాయి. వాటిని గోదాములుగా ఉపయోగిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే వీధుల్లో ఇవి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇరుకు వీధుల్లో జీర్ణావస్థకు చేరిన భవనాలను తొలగించాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనుల నిమిత్తం పాతబస్తీకి వచ్చే ప్రజలు, వ్యాపారాల కోసం నిత్యం ఈ ప్రాంతాల్లో తిరిగే వినియోగదారులు భయాందోళనలు చెందుతున్నారు. ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.
– న్యూస్‌టుడే, విద్యాధరపురం(విజయవాడ)


పాతబస్తీ శివాలయం వీధిలో ప్రమాదకర స్థితిలో గోదాము

కొత్తగా సిగ్నల్స్.. సజావుగా రాకపోకలు

రూ.6 కోట్ల వ్యయంతో 36 చోట్ల ఏర్పాటు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

విజయవాడ నగరం, శివారు ప్రాంతాల్లో చాలా చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగా పని చేయడం లేదు. కొన్ని చోట్ల అసలు సిగ్నల్స్ లేవు. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సజావుగా సాగేలా కొత్తగా సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ అధికారులు నిర్ణయించారు. ✪ ప్రస్తుతం నగర పరిధిలో 27 చోట్ల సిగ్నల్స్ ఉన్నాయి. ఇప్పుడు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో 36 చోట్ల కొత్తగా ఏర్పాటు చేసేందుకు అధికారులు రూ.6 కోట్లు ఖర్చు చేస్తున్నారు. తొలి విడత 7 చోట్ల పనులు చేపట్టారు. మరో 29 చోట్ల నెలాఖరులోపు పనులు ప్రారంభించే అవకాశం ఉంది.


భవానీపురం చర్చి సెంటర్ వద్ద ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ సిగ్నల్స్

ఎక్కడెక్కడంటే... ✪ తొలుత భవానీపురం జోజినగర్ చర్చి సెంటర్, చిట్టినగర్ సెంటర్, స్వాతి జంక్షన్, గవర్నర్‌పేట ఆర్టీసీ వైజంక్షన్, బందరు లాకులు, రాఘవయ్య పార్కు, దాబా కొట్ల జంక్షన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ✪ **రెండో విడతలో** గవర్నర్‌పేట - ప్రకాశం విగ్రహం జంక్షన్, ప్రకాశం బ్యారేజీ, వీజీ చౌక్, వైవీ రావు ఎస్టేట్ జంక్షన్, కృష్ణలంక స్క్యూబ్రిడ్జి, జ్యోతి మహాల్ జంక్షన్, రామవరప్పాడు జంక్షన్, పటమట - ఆటోనగర్ గేటు, సూర్యారావుపేట పుష్ప హోటల్ సెంటర్, ఆర్టీయే జంక్షన్, అయోధ్యనగర్ ఆర్బీ, వైపుల రోడ్డు జంక్షన్, గద్దబొమ్మ సెంటర్, వినాయకుడి గుడి, కనక దుర్గమ్మ వారధి, బిగ్ బజార్, కృష్ణలంక - బస్టాండ్ అవుట్ గేట్, సీతమ్మ వారి పాదాలు, ఎనికేపాడు వంద అడుగుల రోడ్డు, పటమట హైస్కూలు రోడ్డు, పటమట ఎన్టీఆర్ సర్కిల్, పటమట ఈ- సేవ కేంద్రం, పెనమలూరు - కామయ్య తోపు, పెనమలూరు, పోరంకి, అలంకార్, తాడిగడప 100 అడుగుల రోడ్డు కూడళ్లు, గాంధీ బొమ్మ, కంకిపాడు సెంటర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు. నగరపాలక సంస్థ ఎస్ఈ (ప్రాజెక్ట్స్) సత్యకుమారి మాట్లాడుతూ.. నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

కవచ్‌తో రైలు ప్రమాదాలకు చెక్..

త్వరలో విజయవాడ డివిజన్‌లో ఏర్పాటు

రైలు ప్రమాదాల నివారణకు కవచ్‌తో చెక్ పడనుంది. భారతీయ రైల్వే దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ ద్వారా రైలు ప్రమాదాలు జరగకుండా అరికట్టవచ్చు. ఈ నూతన వ్యవస్థ సహాయంతో రైళ్లు ఒకదానికొకటి ఢీకొనకుండా, సిగ్నల్స్ జంప్ చేయకుండా, వేగ పరిమితులను సైతం నియంత్రిస్తుంది. ప్రమాదాలను నివారించడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ సాంకేతికత రేడియో కమ్యూనికేషన్స్ ఉపయోగించి రైలు స్థానాన్ని, వేగాన్ని పర్యవేక్షిస్తుంది.

✪ **ప్రమాదాన్ని పసిగట్టి సడెన్ బ్రేక్..** ప్రమాదం ముంచుకొస్తే ఆటోమేటిక్ బ్రేకులు వేస్తుంది. ఈ సమయంలో ఎలాంటి కుదుపు లేకుండా రైలును సురక్షితంగా బయట పడేలా చేయడం కవచ్ ముఖ్య ఉద్దేశం. ఇటీవల దేశంలో జరుగుతున్న వరుస రైలు ప్రమాదాల నేపథ్యంలో కవచ్ వ్యవస్థ ప్రాధాన్యత పెరిగింది, దేశవ్యాప్తంగా దీనిని విస్తరించడానికి రైల్వే శాఖ ప్రయత్నిస్తోంది.

✪ విజయవాడ డివిజన్‌లో ప్రయోగాత్మకంగా ఈ కవచ్ వ్యవస్థను ప్రవేశ పెట్టేందుకు అధికారులు యోచిస్తున్నారు. ఈ నూతన అత్యాధునిక వ్యవస్థ అందుబాటులోకి వస్తే రైలు ప్రమాదాలు గణనీయంగా తగ్గించవచ్చు. - రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే

ఏ బస్సూ.. ఆగదు బాసు..!

రూ.కోటి వెచ్చించినా అక్కరకురాని బస్టాండ్

నందిగామ గ్రామీణం, జగ్గయ్యపేట గ్రామీణం– న్యూస్‌టుడే



హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై రూ.కోటి వ్యయంతో నిర్మించిన హైవే బస్టాండ్.. ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికులకు నిరాశే మిగులుతోంది. గత వైకాపా ప్రభుత్వంలో హడావుడిగా ప్రారంభించినా సౌకర్యాలు కల్పించకుండా వదిలేశారు. ఫలితంగా విజయవాడ బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ఇక్కడ ఆపకపోవడంతో జగ్గయ్యపేట ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

వేచి ఉండాల్సిందే..: జగ్గయ్యపేట ఆటోనగర్‌కు సమీపంలో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి పక్కన హైవే బస్టాండ్‌ను నిర్మించారు. జగ్గయ్యపేట పట్టణ ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాలంటే ఇక్కడ హైవే బస్టాండ్‌కు చేరుకుని అక్కడ నుంచి ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్‌కు వెళ్లాలి. ఈ హైవే బస్టాండ్ వద్ద విజయవాడ, ఇతర డిపోల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఏ బస్సూ ఆగడంలేదు. దీంతో హైదరాబాద్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

సౌకర్యాలు కరవు.. రూ.కోటి వెచ్చించి హైవే బస్టాండ్ నిర్మించిన అధికారులు ఇక్కడ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించలేదు. బస్సులు ఆగాల్సిన ప్లాట్‌ఫాం సక్రమంగా లేదు. ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుద్దీపాలు వంటి వసతులు లేవు. ఎండా, వానకు ఇబ్బంది పడుతూనే జాతీయ రహదారి పక్కన నిలుచుని ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి.

రాజకీయ పరిస్థితులే కారణమా.. హైవే బస్టాండ్ నిరుపయోగంగా ఉండడానికి రాజకీయ పరిస్థితులే కారణమని జగ్గయ్యపేట ప్రజలు ఆరోపిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ప్రారంభించిన ఈ బస్టాండ్‌లో సౌకర్యాలు మెరుగుపరిచి బస్సులు ఆగేలా కూటమి ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వత్సవాయి ఠాణాలో తిరకాసు బాగోతం

కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన సీపీ... ✪ ఎస్సై పాత్రపై కొనసాగుతున్న విచారణ

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, నందిగామ

ఓ కేసులో నిందితులుగా పేర్లు చేర్చకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారంలో వత్సవాయి స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సస్పెండయ్యాడు. ఎస్సై ఉమామహేశ్వరరావుపై శాఖాపరమైన విచారణకు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఆదేశించారు. ఈ ఉదంతంలో ఏసీబీ ట్రాప్ నుంచి వీరు త్రుటిలో తప్పించుకున్నారు. వివరాలివీ...

పేర్లు చేర్చకుండా ఉండేందుకు..

వత్సవాయి పోలీస్‌స్టేషన్ పరిధి గోపినేనిపాలెంలో ఇటీవల ఓ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి.. కోర్టు ఆదేశాలతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. అయితే నిందితుడి సోదరుడు, అతని స్నేహితులను ఎస్సై నిత్యం స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారు. ఈ కేసు నుంచి బయటపడేందుకు ఎస్సైకి రూ.50 వేలు ఇచ్చేందుకు అంగీకరించి, సమాచారాన్ని ఏసీబీకి అందించారు. లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు అనిశా అధికారులు ప్లాన్ వేశారు. ఈ మేరకు లంచం ఇచ్చేందుకు బుధవారం.. నిందితుడి తండ్రి ఎస్సై వద్దకు వెళ్లాడు. ఇప్పుడే వస్తానని ఎస్సై బయటకు వచ్చారు. ఇదే క్రమంలో కానిస్టేబుల్ బయట ఉన్న తన బ్యాచ్‌కు చెందిన ఏసీబీ కానిస్టేబుల్‌ను గుర్తుపట్టాడు. అనుమానంతో వెంటనే ఎస్సైకి సమాచారం ఇవ్వగా.. ఎస్సై ఉమామహేశ్వరరావు స్టేషన్ నుంచి హుటాహుటిన వెళ్లిపోయారని తెలిసింది.

సీపీ రాజశేఖరబాబు సీరియస్....

లంచం డిమాండ్ చేసి.. ఏసీబీ ట్రాప్ నుంచి తప్పించుకున్న ఉదంతంపై విజయవాడ సీపీ రాజశేఖరబాబు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ చేసి, ఎస్సై ఉమామహేశ్వరరావు, కానిస్టేబుల్ కొండలరావులపై నివేదిక ఇవ్వాలని గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణను ఆదేశించారు. డీసీపీ గురువారం నందిగామ ఏసీపీ కార్యాలయానికొచ్చి సమగ్ర విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ప్రాథమికంగా కానిస్టేబుల్ పాత్ర నిర్ధారణ అయింది. ఎస్సైకి డబ్బులు ఇస్తే.. పేర్లు చేర్చరని చెప్పినట్లు తెలిసింది. దీంతో డీసీపీ సిఫార్సు మేరకు కమిషనర్ కానిస్టేబుల్ కొండలరావును సస్పెండ్ చేశారు. ఎస్సై పాత్రపై విచారణ సాగుతోంది. స్టేషన్‌లో సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు.

నా పేరు బాబు.. నేను ఆర్టీసీలో పనిచేస్తాను.. మా పిల్లలు చేసిన పనికి నన్ను, వాళ్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. జనవరి 4న ఘటన జరగ్గా.. ఆ రోజే నా చరవాణి తీసుకున్నారు. అప్పటి నుంచి ఇవ్వలేదు. మా పిల్లలు దొరికిన తర్వాత కూడా నన్ను రెండుసార్లు కొట్టారు. మా పిల్లలతోపాటు మరో ముగ్గురు ఉన్నారు.. రూ.40 వేలు సెటిల్‌మెంట్ చేసుకుని ముగ్గురిని వదిలేశారు. మేం డబ్బులు ఇవ్వడం ఆలస్యం కావడంతో నెల రోజులు తిప్పారు. కేసు లేకుండా చేయడానికి నన్ను రూ.లక్ష అడిగారు.. అంత ఇవ్వలేనంటే రూ.50 వేలకు ఒప్పందం కుదిరింది. వయసులో పెద్దవాడినీ.. ఆర్టీసీ ఉద్యోగిని అని కూడా చూడకుండా ఎస్సై కొట్టారు. ఈ పరిణామాలపై పోలీసులు అధికారులు విచారణ చేపట్టి నాకు న్యాయం చేయాలి. - నిందితుడి తండ్రి ఆవేదన

గీత దాటితే మోతే..!

ఈ-చలానా పెండింగ్‌లో ఉందా.. రవాణా శాఖ సేవలకు బ్రేక్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

విజయవాడకు చెందిన రత్నకుమార్ తన ఆటోకు కాలుష్యపత్రం తీసుకుందామని వెళ్లారు. 16 చలానాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిసింది. ఇవన్నీ సిగ్నల్ లైటు వద్ద 'స్టాప్ లైన్' దాటినవే. మొదటి చలానాకు రూ.150, మిగిలిన వాటికి ఒక్కోదానికి రూ.300లు చొప్పున రుసుము కట్టాలన్నారు. అవి కడితేనే కాలుష్య పత్రం వస్తుందని చెప్పడంతో కంగుతిన్నారు. ఈ విషయం చాలా మందికి తెలియదు. రవాణాశాఖ పరివాహన్ వెబ్‌సైట్లో మాత్రమే ఇవి కనిపిస్తున్నాయి.

ప్రత్యేక కెమెరాలు ఉన్నాయ్..

నగరంలోని కొన్ని కూడళ్లలో 2023 సంవత్సరంలో ఏఎన్‌పీఆర్ (ఆటోమెటిక్ నంబరు ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలు అమర్చారు. కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడినప్పుడు.. స్టాప్ లైన్ దాటి వెళ్లిన వాహనాల నంబరు ప్లేట్లను అవి ఫొటోలు తీస్తాయి. వీటితో ఈ-చలానాలు విధించారు. ఇలా విజయవాడలో వేలాది మందికి చలానాలు వేసేశారు. మూడు నెలల లోపు సొమ్ము చెల్లించాలి. అలా కట్టకపోతే.. ఆ వాహన నంబరును బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు. ఏ విధమైన లావాదేవీలు నిర్వహించలేరు. ఈ-చలానా పడినట్లు చరవాణులకు సంక్షిప్త సమాచారం రావడం లేదు. దీంతో చాలా మందికి.. రవాణాశాఖ ఈ-చలానాలు విధిస్తున్న విషయమే తెలియదు. కాలుష్య పత్రాలు, వాహన పన్నులు చెల్లించేందుకు వెళ్లినప్పుడో ఇవి బయట పడుతున్నాయి. అదనంగా వేలాది రూపాయలు చెల్లించాల్సి ఉండటంతో వాహన యజమానులు బెంబేలెత్తిపోతున్నారు.

రాజమహేంద్రవరం నుంచి జారీ..

చలానాలను గత ఏడాది రవాణాశాఖ పరివాహన్ సైట్లో అప్‌లోడ్ చేయడంతో.. అవి ఇప్పుడు పరివాహన్ వెబ్‌సైట్లో కనిపిస్తున్నాయి. ఇక్కడ ఆసక్తికర విషయం ఏంటంటే.. చలానాలన్నీ 'డీటీసీ, రాజమండ్రి కార్యాలయం' నుంచి వచ్చినట్లు ఉన్నాయి. ఇది అనేక సందేహాలకు తావిస్తోంది. తాము ఎప్పుడూ రాజమహేంద్రవరం వెళ్లలేదని.. చలానా ఎలా విధిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో చలానాలను పర్యవేక్షించిన అధికారి రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు. ఆయన అక్కడి నుంచి వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయడంతో ఇలా వచ్చేశాయి.

అది ఉల్లంఘనేనా?

ఏదైనా కూడలిలో రెడ్ సిగ్నల్ పడితే.. చోదకులు ఆగకుండా వెళ్లిపోతే నేరం. కానీ స్టాప్‌లైన్ వద్ద కొంచెం దాటి ఆగినా.. రవాణాశాఖ ఈ-చలానాలు వేస్తోంది. స్టాప్‌లైన్ దాటితే చలానా వేస్తామని ఎప్పుడూ చెప్పలేదని.. ఇది ఉల్లంఘన ఎలా అవుతుందని చోదకులు ప్రశ్నిస్తున్నారు.

ఇలా చూసుకోవచ్చు..

చోదకులు https://parivahan.gov.in అనే సైట్లోకి వెళ్లి ఇ-చలానా ఎంపిక చేసుకోవాలి. దానిలో వాహన నంబరు నమోదు చేస్తే.. జాబితా వస్తుంది. అక్కడే పేమెంట్ ఆప్షన్ ఉంటుంది. దానిని క్లిక్ చేసి సొమ్ము చెల్లించవచ్చు. ఆ తర్వాతే రవాణాశాఖ సేవలు పొందుతారు.

చదివింది న్యాయం.. చేసేది నేరం

మ్యూల్ ఎకౌంట్స్ కేసు సూత్రధారి రాజా తీరిది

ఈనాడు. అమరావతి

అతను చదివింది న్యాయశాస్త్రం.. చేసేది మాత్రం చట్టవిరుద్ధ లావాదేవీలు. డిజిటల్ మార్కెటింగ్ పేరుతో తిరుగుతుంటాడు. కొంత సమయం సీనియర్ లాయర్ వద్ద ప్రాక్టీస్ చేస్తుంటాడు. ఇటీవల యనమలకుదురులో వెలుగుచూసిన అద్దె ఖాతాల కేసులో సూత్రధారి సుబ్రమణి రాజా వెంకట్ భిన్న శైలి ఇది. చెన్నైతోపాటు పలు ప్రాంతాల్లో తన గ్యాంగ్‌తో మ్యూల్ ఖాతాలు తెరిపించి.. చట్టవ్యతిరేక లావాదేవీలు చేయిస్తున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు చెన్నై వెళ్లిన బెజవాడ పోలీసులకు నిరాశే ఎదురైంది. రెండు రోజులున్నా.. ఆచూకీ దొరకలేదు. అతని కుటుంబ సభ్యులకు నోటీసులిచ్చి బయలుదేరారు.


చెన్నై నగరం తిరువొత్తియూర్‌లో వెంకట్ ఉంటున్న ఇల్లు

డబ్బు సంపాదించాలనే ఆశతో.. చెన్నై నగరం తిరివొత్తియూర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్న వెంకట్‌ది పేద కుటుంబం. తండ్రి తాగుడుకు బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా ఇంటికి పరిమితమయ్యేవాడు. దీంతో వెంకట్.. త్వరగా డబ్బు సంపాదించాలన్న ఆశతో అడ్డదారి తొక్కాడు. చెన్నైలో కొందరితో కలిసి అద్దె ఖాతాల లావాదేవీలు చేయడం ప్రారంభించాడు. తనకు సమీప బంధువులైన రవికుమార్, స్టీవెన్ సాయంతో విజయవాడలో కథ నడిపించేవాడు. వీరు ఇక్కడ సైబర్ పోలీసులకు పట్టుబడటంతో.. అప్రమత్తమైన రాజా వెంకట్.. ఈ నెల 9 నుంచి అదృశ్యమయ్యాడు. నిందితుడి ఇంటికి పోలీసులు వెళ్లినా ఉపయోగం లేకపోయింది. కుటుంబ సభ్యులు... న్యాయవాదులతో కలిసి పోలీసుల వద్దకు వచ్చారు. వారం రోజుల సమయం ఇస్తే.. వెంకట్‌ను తీసుకొచ్చి అప్పగిస్తామన్నారు.

ఖాతాల వడపోత: లావాదేవీలు జరిగిన కొన్ని ఖాతాల వివరాలు బ్యాంకుల నుంచి వచ్చాయి. ఈ స్టేట్‌మెంట్లను పోలీసులు వడపోస్తున్నారు. వాటిల్లో పెద్ద మొత్తాల్లో లావాదేవీలు జరగలేదని తెలిసింది. ఓ ఖాతాలో గరిష్ఠంగా రూ.16 లక్షలు మాత్రమే జరిగినట్లు గుర్తించారు. నిందితుడు ఈ వ్యవహారాల్లో రెండో అంచెలో ఉన్నట్లు తేలింది. ఇతని వెనుక ఇంకా కొందరు ఉన్నట్లు భావిస్తున్నారు. ఇతను దొరికితేనే పూర్తి వివరాలు వచ్చే అవకాశం ఉంది.

చుక్కేసి.. వాహనం నడిపితే కొలువుకే ఎసరు

కొత్త అస్త్రం ప్రయోగించనున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం (గుంటుపల్లి), న్యూస్‌టుడే

మద్యం మత్తులో వాహనం నడుపుతూ చిక్కిన వారిపై విజయవాడ నగర ట్రాఫిక్ పోలీసులు కొత్త అస్త్రం ప్రయోగించనున్నారు. ఇంత వరకు మద్యం మత్తులో పోలీసులతో గొడవలు, జైలు శిక్షలు పడిన చోదకుల సమాచారం మాత్రమే వారు విధులు నిర్వహించే సంస్థల యజమానులకు తెలిపేవారు. ఈ క్రమంలో పోలీసులు మద్యం తాగిన చోదకులపై కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్, జరిమానాలతో సరిపెట్టేవారు. దాంతో మద్యం చోదకులకు పోలీసులంటే ఉదాసీనత ఏర్పడింది. దీన్ని వదిలించేందుకు నగర పోలీసులు నూతన ప్రయోగానికి రంగం సిద్ధం చేస్తున్నారు.


బ్రీత్ ఎనలైజర్‌తో వాహన చోదకుడిని పరీక్షిస్తున్న పోలీసు, పక్కన సీఐ చంద్రశేఖర్

పోలీసు స్టేషన్ల పరిధిలో..

ప్రమాదాల కట్టడే లక్ష్యంగా ఇటీవల 'ఎరైవ్-ఎలైవ్' కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి రోజు విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం, జి.కొండూరు పోలీసు స్టేషన్ల పరిధిలో 10- 15 ప్రాంతాల్లో తనిఖీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అతి వేగం, మద్యం మత్తు కారణంగానే అధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే మద్యం మత్తులో వాహనాలు నడిపితే కొలువులకు ఎసరు తప్పదనే సంకేతం పంపనున్నారు. ఇందులో భాగంగా విజయవాడ నగర సీపీ రాజశేఖరబాబు, ట్రాఫిక్ డీసీపీ షిరీనా బేగం ఆదేశాలతో మార్చి ఒకటో తేదీ నుంచి దీన్ని అమలు పరిచేందుకు ట్రాఫిక్ పోలీసు విభాగం ఏర్పాట్లు చేస్తోంది. తనిఖీల్లో చిక్కిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగుల వివరాలను, వారు విధులు నిర్వహిస్తున్న సంస్థల నుంచి చిరునామాలు సేకరించనున్నట్లు ట్రాఫిక్ విభాగం అధికారులు పేర్కొంటున్నారు.

అవగాహన ఉండదు

చాలా మందిలో తాము ఎంత తాగినా వాహనం నడపగలమనే ధీమా ఉంటోంది. కానీ ఆ మత్తు ప్రభావం మెదడుపై తీవ్రంగా ఉంటుందన్న అవగాహన ఉండదు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే వారి వివరాలు ఆయా సంస్థల అధిపతులకు చేరవేయాలని పోలీసు ఉన్నతాధికారులు ఆలోచన చేస్తున్నారు. దీన్ని అమలు చేస్తే ఉద్యోగం, పరువు పోతాయనే భయంతోనైనా మద్యం తాగి వాహనం నడపకుండా ఉంటారు.

- చంద్రశేఖర్, సీఐ, ఇబ్రహీంపట్నం

ఖజానా శాఖ ఉద్యోగుల పదోన్నతులకు కృషి

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రభుత్వ విభాగాలన్నింటితో అనుసంధానంగా ఉంటూ కీలకమైన సేవలందిస్తున్న ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గురువారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారులు పారదర్శక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సంఘ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేయాలని నూతన కార్యవర్గాన్ని కోరారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుమాక రాజు

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల్లో ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వై.జె.యేసుదాసు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుమాక రాజు (మంగళగిరి), సహాధ్యక్షుడిగా పి.శంకర్ (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా కె.ఉదయ్ (మంగళగిరి), కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.ఫణీంద్ర రాజు (గుంటూరు), కోశాధికారిగా ఎం.మంజునాథ్ (మంగళగిరి) ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఎం.వల్లీదేవి (విజయవాడ), ఎం.రెడ్డప్ప రెడ్డి (మంగళగిరి), కె.శ్రీనివాసరావు (విజయనగరం), వి.రఘురాములు (విజయవాడ), ఈసీ సభ్యులుగా డి.ఎన్.వి.సవిత (కర్నూలు), ఎస్.సునీత (అమరావతి), బి.నాసారెడ్డి (విజయవాడ), వి.షకీలా (గుంటూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు పెనుమాక రాజు మాట్లాడుతూ.. ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఆర్థిక శాఖ అధికారులతో చర్చలు జరుపుతామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి కె.ఉదయ్ మాట్లాడుతూ.. శాఖాపరమైన అభివృద్ధి కోసం కృషి చేస్తామని, ఏటీవోలు-ఏడీ, ఏడీ-డీడీ, డీడీ-జేడీ పదోన్నతుల విషయంలో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి 26 జిల్లాల నుంచి గెజిటెడ్ అధికారులు హాజరయ్యారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి.రమణ.. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సహాయ ఎన్నికల అధికారిగా టి.సత్యనారాయణ, పరిశీలకుడిగా సుబ్రహ్మణ్యం వ్యవహరించారు.


నూతన కార్యవర్గ సభ్యులతో విద్యాసాగర్, రమణ


ఎస్ఈ రామచంద్రరావును సత్కరిస్తున్న వీరబాబు, గోపాలకృష్ణ, డీసీ ఛైర్మన్లు

సాగర్ నీటి వాటా వచ్చేలా చూడరూ..

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నాగార్జున సాగర్ (ఎన్.ఎస్.పి.) ఎడమ కాల్వ పరిధిలోని రెండు, మూడు జోన్లలో తెలంగాణ నుంచి ఆంధ్రాకు రావాల్సిన సాగునీటి వాటా సక్రమంగా వచ్చేలా చూడాలని ఎన్.ఎస్.పి. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీసీ ఛైర్మన్లు విన్నవించారు. ఈమేరకు విజయవాడ జలవనరుల శాఖ ఆవరణలోని విడిది కార్యాలయంలో పులిచింతల ప్రాజెక్టు ఎస్.ఈ. పి.రామచంద్రరావుకు గురువారం వినతి పత్రం సమర్పించారు. నూజివీడు డివిజనులో 159, జగ్గయ్యపేట డివిజనులో 72 లస్కరు (కళాసుల) ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసేలా చూడాలని కోరారు. పెండింగ్ బిల్లులు ఇప్పించాలని, సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేసే పనులకు జీఎస్టీ కలిగి ఉండాలనే నిబంధనలను తొలగించాలని విన్నవించారు. ఇటీవల ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావును సత్కరించారు. పీసీ పరిధిలోని డీసీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

బి.ఎన్.ఆర్ గోల్డ్ డైమండ్స్‌లో వార్షికోత్సవ ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విజయవాడ ఎంజీ రోడ్డులోని బి.ఎన్.ఆర్.గోల్డ్ డైమండ్స్ మూడో వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ఇస్తున్నట్లు ఛైర్మన్ బాపిరెడ్డి నాగిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ బాపిరెడ్డి రోహిత్ చరణ్‌రెడ్డి తెలిపారు. డైమండ్ క్యారెట్ ధర రూ. 44,999 నుంచి ప్రారంభం అవుతుందని, 22, 18 క్యారెట్ల బంగారు ఆభరణాలపై మేకింగ్ ఛార్జీలు ఉండవని, పోల్కి డైమండ్స్‌పై తరుగు, మేకింగ్ ఛార్జీలు లేవన్నారు. బంగారు ఆభరణాలపై 6 నుంచి 9 శాతం మాత్రమే తరుగు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆఫర్లు మార్చి 1వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. విజయవాడలోని షోరూమ్‌తోపాటు బెంగళూరులోని జయనగర్ మార్తహళ్లి షోరూమ్‌లో ఈ ఆఫర్లు ఉంటాయని తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఆభరణాలు కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు

పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో అర్హత ప్రమాణాలున్న పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. తొలి విడత 742 కార్డులు జారీ చేసినట్టు వెల్లడించారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఇవి 2027 డిసెంబరు వరకు అమలులో ఉంటాయని చెప్పారు. సమాచార శాఖ డీఐపీఆర్వో కె.వి.రమణరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ వేమూరి ప్రసాద్, కార్మిక శాఖ ఉప కమిషనర్ జి.ధనలక్ష్మి, పాత్రికేయులు పాల్గొన్నారు.


బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యంతో కలకలం

నాలుగు పోలీసు బృందాలతో గాలింపు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం స్టేషన్ పరిధిలో ఇద్దరు బాలురు అదృశ్యం కావడం కలకలం సృష్టిస్తోంది. భవానీపురం కరూర్ వైశ్యా బ్యాంకు సమీపంలో దేవాసి కాలారామ్ నివాసం ఉంటూ.. ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డులో హార్డ్‌వేర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన కుమారుడు ఉమారామ్(14) స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. వారి బంధువుల కుమారుడు దేవాసి బెహ్రారామ్(13) కూడా అతడితో పాటు చదువుకుంటున్నాడు. ప్రతి రోజు సాయంత్రం వారిద్దరూ ట్యూషన్‌కు వెళ్లి వస్తుంటారు. ఆ విధంగానే 18వ తేదీ సాయంత్రం కూడా ట్యూషన్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరి వెళ్లారు. రాత్రి 8 గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ట్యూషన్ వద్దకు వెళ్లి విచారించారు. ట్యూషన్‌కు రాలేదని చెప్పడంతో కంగుతిన్నారు. వెంటనే బస్టాండు, రైల్వేస్టేషన్, వన్‌టౌన్ ప్రాంతంలో రాత్రి 11:30 వరకు తిరిగి విచారించారు. పిల్లల ఆచూకీ తెలియకపోవడంతో భవానీపురం పోలీసులను ఆశ్రయించారు.


ఉమారామ్ బెహ్రారామ్

రాజస్థాన్ రైలు ఎక్కి.. : పోలీసులు చిన్నారులు వెళ్లిన మార్గంలోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. బెహ్రారామ్, ఉమారామ్‌లు ట్యూషన్‌కు వెళ్లకుండా భవానీపురంలోని వీధుల్లో తిరిగినట్లు గుర్తించారు. మొదట భవానీపురంలోని ఒక ఆటోలో ఎక్కినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. పోలీసులు ఆ ఆటో డ్రైవర్‌ను గుర్తించి విచారించగా.. వారిద్దరినీ బందరు రోడ్డులోని పీవీపీ మాల్ వద్ద దింపినట్లు తెలిపారు. అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించగా మాల్‌తో పాటు సమీపంలోని పలు షోరూంలలోకి వెళ్లి బయటకు రావడాన్ని గమనించారు. అక్కడ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లి రాజస్థాన్‌కు వెళ్లే రైలు ఎక్కినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రాజస్థాన్‌లో బంధువుల ఇంట్లో వంక్షన్ ఉందని ఇంట్లో చెప్పినట్లు సమాచారం. విద్యార్థుల ఆచూకీ కనుగొనేందుకు నగర సీపీ నాలుగు బృందాలను నియమించారు. స్థానిక పోలీసులు రాజస్థాన్‌లోని బంధువులతో మాట్లాడుతూ వారి ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనంతబాబుపై వేటు వేయండి

పటమట, న్యూస్‌టుడే: దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్య కేసులో సిట్ దర్యాప్తు సంస్థ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గను ఎ2 నిందితురాలిగా చేర్చిన నేపథ్యంలో 24 గంటల్లో అనంతబాబును ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య వైకాపా అధినేత జగన్‌ను డిమాండ్ చేశారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎమ్మెల్సీ అనంతబాబును కాపాడేందుకు దర్యాప్తును తప్పు దోవ పట్టించారని, సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఆదేశాలతో సిట్ అధికారులు కేసు దర్యాప్తు చేస్తోందన్నారు. సిట్ దర్యాప్తులో అనంతబాబు భార్య పాత్ర తేలిన నేపథ్యంలో ఆయనపై పార్టీ పరంగా చర్యలు తీసుకుని దళితుల పట్ల జగన్ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.


మాట్లాడుతున్న బాలకోటయ్య, వేదికపై మామిడి సత్యం, పేరం భుజంగరావు

'కేంద్రం జీవోను ఉపసంహరించుకోవాలి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కేరళ ప్రభుత్వం వరి, గోధుమలకు అదనంగా బోనస్ చెల్లిస్తున్నా.. ఇవ్వవద్దని కేంద్రం ఇచ్చిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గత కొంత కాలం నుంచి కనీస మద్దతు ధరల కోసం కేంద్ర ప్రభుత్వంపై రైతు సంఘాలు చేస్తున్న ఆందోళనలు పట్టించుకోకుండా కేరళ రాష్ట్రం బోనస్ ఇస్తుంటే అడ్డుపడడం సరికాదన్నారు. కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. కేరళకు ఇవ్వాల్సిన రూ.1300 కోట్ల రీఎంబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన జీఎస్టీ పన్నులో 60శాతం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పాడి, పౌల్ట్రీరంగం, పశుసంవర్ధక, మత్స్యశాఖ తదితర రంగాల రైతులకు నష్టదాయకమైన భారత్, అమెరికా ఉచిత వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయవద్దని కేంద్రానికి సూచించారు. మన పంటలకు అమెరికా సుంకాలు విధించడం, వారి పంటలను ఉచితంగా కొనుగోలు చేయడం ఏపాటి ఒప్పందం అని మండిపడ్డారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ.. రైతాంగ సమస్యలపై ఈ నెల 27న ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు ఎం.యలమందరావు, తోట ఆంజనేయులు, సత్యనారాయణ, కొల్లా రాజమోహన్, ఎం.వెంకటరెడ్డి, జానకీరాములు, మరీదు ప్రసాదబాబు తదితరులు పాల్గొన్నారు.

'సీఎంఆర్ మిల్లింగ్‌కు ధాన్యం సరఫరా'

గాంధీనగర్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి.. సీఎంఆర్ మిల్లింగ్ కోసం రైస్ మిల్లర్లకు సరఫరా చేస్తుందని ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలకు పంపిణీ చేసే సీఎంఆర్ బియ్యాన్ని ఫోర్టిఫికేషన్ చేసి.. సకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించడం రైస్ మిల్లింగ్ పరిశ్రమ బాధ్యతని చెప్పారు. దీనికోసం మిల్లింగ్ ఛార్జీలు క్వింటాకు రూ.10, మిల్లింగ్‌లో వచ్చే బైప్రొడెక్ట్స్‌కు ప్రతిఫలంగా కేంద్రం ద్వారా రీఎంబర్స్‌మెంట్ జరుగుతుందన్నారు. ఈ పాలసీ అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తాయని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థను విజయవంతంగా అమలు చేయడంలో బృహత్తర బాధ్యత వహిస్తామని పేర్కొన్నారు. కొందరు మంత్రులు కమీషన్ల కోసం రైస్ మిల్లర్ల సంఘంపై ఒత్తిడి చేస్తున్నారనే దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. సంఘం సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని ఆయన చెప్పారు.

బాలికపై అకృత్యం.. పదేళ్ల జైలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఓ యువకుడికి పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ తీర్పు వెల్లడించినట్లు కొత్తపేట సీఐ చిన కొండలరావు గురువారం తెలిపారు. వించిపేట ప్రాంతంలో పెద్ది శుభాకర్ అలియాస్ సుబ్బు నివాసం ఉంటున్నాడు. అతడు చిట్టినగర్ ప్రాంతానికి చెందిన అప్పట్లో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను ప్రేమిస్తూ.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ మురళీకృష్ణ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో న్యాయమూర్తి 10 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధించారు.

రైతుబజారుల్లో కూరగాయల ధరలు

వంకాయలు-20/22, టమాటా-14, బెండ-24, పచ్చిమిర్చి-48, కాకర-32, బీర-26/28, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-30, దొండ-38, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-28, దోస-16/26, సొర-8/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-24, అల్లం-72, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-40, బీట్ రూట్-28, కీరదోస-40, బీన్స్-60/74, క్యాప్సికమ్-66, చింతకాయలు-65, నిమ్మ (డజను)-38/42, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. – న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

రైల్వే ఉద్యోగాల పేరిట మోసంపై విచారణ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: రైల్వేలో ఉద్యోగాల పేరిట పలువురిని మోసం చేసిన సంఘటనపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు. రైల్వేలో పని చేస్తున్న మచిలీపట్నానికి చెందిన కిషోర్ నకిలీ ఉద్యోగ నియామక పత్రాలతో తమను మోసం చేసి రూ.లక్షల్లో నగదు తీసుకున్నారని బాధితులు నాగపద్మ, గంగాభవానీ అతని ఇంటి వద్ద ఆందోళన చేసిన విషయం తెలిసిందే. గురువారం రైల్వే ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన అధికారులు మచిలీపట్నం వచ్చి బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వారి వద్ద ఉన్న ఆధారాలతో పాటు ఇతర బాధితుల వివరాలు సేకరించారు. వారికి ఇచ్చిన నకిలీ నియామక పత్రాలు పరిశీలించారు. మరింత విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

నకిలీ మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు – అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితులకు కోర్టు రిమాండ్ పొడిగించింది. నిందితులకు విధించిన రిమాండ్ గడువు.. గురువారంతో ముగియనుండడంతో వారిని విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. బెయిల్‌పై ఉన్న మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాము హాజరుకాలేదు. వారి తరఫున న్యాయవాది గైర్హాజరు పిటిషన్ దాఖలు చేశారు. నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి ఆరుగురు, మదనపల్లి జైలు నుంచి ఒకరు, విజయవాడ కారాగారం నుంచి ముగ్గురు వీసీ ద్వారా హాజరుపరిచారు. వీరికి వచ్చే నెల 5 వరకు న్యాయాధికారి రిమాండ్ పొడిగించారు.

❖ నిందితుడు సెంథిల్ (ఏ22) దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై ఎక్సైజ్ అధికారులు గురువారం కౌంటర్ దాఖలు చేశారు. నిందితుడి నుంచి కుట్ర గురించి లోతుగా విచారించాల్సి ఉందనీ.. ఈ దశలో బెయిల్ ఇస్తే దర్యాప్తుపై ప్రభావం పడుతుందని అందులో పేర్కొన్నారు. వాదనల నిమిత్తం కేసును 24కు వాయిదా వేశారు. సెంథిల్ కస్టడీ పిటిషన్‌పై అతని తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై విచారణ 24కు న్యాయాధికారి వాయిదా వేశారు.

బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. గురువారం ఈ పిటిషన్.. విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. కౌంటరు దాఖలుకు సిట్ సమయం కోరింది. దీంతో న్యాయాధికారి ఈనెల 21కి వాయిదా వేశారు.

'ఆంధ్రగీతి- తెలుగు భాషాజాగృతి కావ్యం' ఆవిష్కరణ నేడు

పటమట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, మండలి వెంకట కృష్ణారావు శత జయంతి మహోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బెంజ్‌సర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ప్రముఖ సాహితీవేత్త జి.వి.పూర్ణచందు రచించిన 'ఆంధ్రగీతి- తెలుగు భాషాజాగృతి కావ్యం' ఆవిష్కరిస్తారని నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు ఈ నెల 21, 22 తేదీల్లో పూర్ణచందు రూపొందించిన పంచ 'గాథలు', స్వీయ ఆంగ్లానువాదం, వర్ణచిత్రాలతో కవితా ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

కొలువులకు పలువురి ఎంపిక

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : సిద్ధార్థ మహిళా కళాశాల, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, వికాస జిల్లా ఉపాధి కల్పన, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 450 మంది యువతులు, విద్యార్థినులు హాజరయ్యారు. వారిలో 380 మంది వివిధ ప్రైవేట్ సంస్థల్లో కొలువులకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.


ఎంపికైన అభ్యర్థులతో అతిథులు

సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం అవసరం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని రాష్ట్ర ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఆథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ అన్నారు. ఈ నెల 21న మండల పరిధిలోని కృష్ణారావుపాలెం నాగసింధు స్పిన్నింగ్ మిల్లు ఆవరణలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సేంద్రియ మేళాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా ఉండడంతో వారికి సేంద్రియ వ్యవసాయం, ఎరువులు వినియోగంపై అవగాహన కల్పించడానికి ఈ మేళాను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇక్కడికి మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు, అధికారులు వస్తున్నారని తెలిపారు. పాడి పరిశ్రమ, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తిదారులను ప్రోత్సహించడానికి కృష్ణా మిల్క్ యూనియన్ ముందుకొచ్చిందని, వీరు జిల్లాలో పండిన సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను సేకరించి 'ఫుడ్ బాస్కెట్' అనే యాప్ ద్వారా విక్రయిస్తారని వెల్లడించారు. పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న దేవదత్, పక్కన కూటమి నాయకులు

తిరువూరు

• తిరువూరు • మైలవరం



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న సీతారామయ్య, లితీష్

ముగిసిన క్రికెట్ పోటీలు

మైలవరం, న్యూస్‌టుడే : తెలుగు యువత నియోజకవర్గ నాయకుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మైలవరం నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన మైలవరం జట్టుకు తెదేపా నాయకుడు జంపాల సీతారామయ్య తదితరులతో కలిసి ఆయన ట్రోఫీని అందించారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

గంపలగూడెం, న్యూస్‌టుడే : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని ముస్లింలు గురువారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ప్రత్యేక నమాజ్‌లో పాల్గొని సాయంత్రం మసీదుల్లో ఇఫ్తార్ విందును సామూహికంగా స్వీకరించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని మసీదులను విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.



ఊటుకూరు మసీదులో విందు స్వీకరిస్తున్న ముస్లింలు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? తాగునీటి కుళాయి కనెక్షన్ కోసం కొందరు కొండపల్లి ప్రధాన రహదారిని తవ్వుతున్నారు. అనంతరం దాన్ని అలాగే వదిలేస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు. - **రాఘవేంద్రరావు, కొండపల్లి** ✔ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. - **పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**

స్పందన: విస్సన్నపేటలోని ప్రధాన రహదారుల వెంట చెత్త పేరుకుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవో కేశవ హరికృష్ణ కుమార్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు. - **న్యూస్‌టుడే, విస్సన్నపేట**

సైబర్ నేరాలపై అవగాహన

కొండపల్లి, న్యూస్‌టుడే : సైబర్ నేరం జరిగిన మొదటి గంటలోనే బాధితులు స్పందించి ఫిర్యాదు చేయాల్సి ఉందని సైబర్ క్రైమ్ ఎస్సై విజయలక్ష్మి అన్నారు. కొండపల్లి బి.కాలనీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరస్థులు ముఖ్యంగా వృద్ధులను టార్గెట్ చేసుకొని వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇటువంటి మోసాలపై అవగాహన ఉంటేనే నష్టపోకుండా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పంటకు తెగుళ్లు.. కాయల్లేవు

నిరాశకు గురవుతున్న అన్నదాతలు



మైలవరం మండలం చంద్రాలలో విరగబూసిన మామిడి చెట్లు

మైలవరం, న్యూస్‌టుడే

మామిడి తోటలను ఆశిస్తున్న తెగుళ్లు రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి. అసలే పూతల ఆలస్యంతో ఆందోళనలో ఉన్న వారికి మాడిపోతున్న పూతలు భయం పుట్టిస్తున్నాయి. గత నాలుగేళ్లుగా ఆదాయం కళ్లజూడని అన్నదాతలకు ఈ ఏడాది తీవ్ర నిరాశనే మిగుల్చుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూత దశలోనే వేలాది రూపాయల పెట్టుబడులు పెడుతున్నా పిందె నిలవడం లేదని వాపోతున్నారు.

కోలుకోలేని దెబ్బతీస్తూ..

మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో సుమారు 42 వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు సాగవుతున్నాయి. దశాబ్ద కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న రైతులను కరోనా సమయం నుంచి కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో ఆశించిన దిగుబడులు రాక తీవ్ర ఇబ్బందులు పడగా, రెండేళ్లుగా మిర్చి తోటలను నాశనం చేసిన తెగుళ్లు మామిడిని కబళించడంతో పూత దశలోనే అన్నదాతల కంట కన్నీరొస్తోంది. రెండు నియోజకవర్గాల పరిధిలో రెడ్డిగూడెం మండలంలో మాత్రమే ముందస్తుగా కొన్ని తోటల్లో మామిడి కాయల దిగుబడి వచ్చింది. కొందరు రైతులు కాయలకు కవర్లు కట్టుకొని గిరాకీకి అనుగుణంగా మంచి ధరలతో లాభం పొందుతున్నారు. అయితే అటువంటి రైతులు కేవలం నాలుగైదు శాతం కూడా లేరని పలువురు అంటున్నారు.

నాలుగైదు సార్లు పిచికారీ

పూతల కోసం ఒక పర్యాయం డిసెంబరులోనే రసాయన మందులను పిచికారీ చేసిన రైతులు, పూతల ప్రారంభమైన దగ్గరి నుంచి కనీసం నాలుగు నుంచి అయిదు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎకరానికి సుమారు రూ.20 వేలకు పైగా ఖర్చు చేశారు. అయినా చాలా వరకు తోటల్లో కనీసం పూతలో పది శాతం కూడా మిగల్లేదని కర్షకులు చెబుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే పూతంతా రాలిపోయిందని వాపోతున్నారు. కోడిపేనుగా పిలుచుకునే రెండు రకాల నల్లితో తోటలు నాశనం కావడమే గాక సాయంత్రం తర్వాత రోడ్లపై నడవాలంటేనే వాటితో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

సంచులు కడితేనే..

తెగుళ్ల నుంచి తేరుకునేందుకు మైలవరం నియోజకవర్గంలోని రెడ్డికుంట, సాయన్నపాలెం, ఎదురుబీడెం తదితర గ్రామాల్లో రైతులు పండ్ల కవర్లతో మామిడి కాయలను రక్షించుకున్నారు. అటువంటి ప్రాంతాల్లో దిగుబడులు తొందరగా రావడంతో బంగినపల్లి రకం టన్ను రూ.1.70 లక్షల వరకు ధర పలికింది. దాంతో పూర్తి స్థాయిలో కవర్లు కట్టుకునేలా చర్యలు తీసుకుంటే మేలు కలుగుతోందని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. తెగుళ్ల నివారణకు సైతం అదే పరిష్కారమని చెబుతున్నారు.

హిందీ భాష ప్రాధాన్యంపై వ్యాసరచన పోటీలు



పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా మాసోత్సవం నిర్వహించారు. జాతీయ భాష హిందీ ప్రాముఖ్యతపై విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయిని ఎంఎఫ్ఎస్ఎస్.రత్న ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బాలబాలికలకు బహుమతులు అందజేశారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : భాషోత్సవాల్లో భాగంగా గురువారం చెవుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ నిర్వహించారు. ప్రముఖ హిందీ కవులు కబీర్‌దాస్, ప్రేమ్‌చంద్, తులసీదాస్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వాహనాలు సమకూర్చేలా చర్యలు



డ్రైవింగ్ శిక్షణ పొందే మహిళలతో కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే : మహిళలు తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రైజ్ ఆసరాతో ముందుకెళ్లాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. గుంటుపల్లిలోని రైజ్ సెంటర్ ఆధ్వర్యంలో ఔత్సాహిక మహిళలకు కారు డ్రైవింగ్ శిక్షణను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకొని డ్రైవింగ్‌ను పరిపూర్ణంగా నేర్చుకోవాలని చెప్పారు. అటువంటి మహిళలందరికీ ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేస్తూ వాహనాలు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాంచారయ్య, ఆర్టీవో ప్రవీణ్, రైజ్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీసీ రజనికుమారి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రంగాపురం కేజీబీవీని ఏపీసీ రజనికుమారి గురువారం సందర్శించారు. బుధవారం రాత్రి అధికారులు నిర్వహించిన తనిఖీలో అధికంగా ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న వివరాలను ఎంఈవో- 2 రమేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. ఎస్‌వో శ్యామలపై ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు రిపోర్టు చేస్తామని, అవసరమైతే క్రిమినల్ కేసు కూడా పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో- 1 శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన



కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్, కౌన్సిలర్లు

కొండపల్లి, న్యూస్‌టుడే : ఏళ్ల నుంచి ఆయుర్వేద ఆసుపత్రి కోసం ఎదురుచూస్తున్న కొండపల్లి వాసుల కల త్వరలో తీరనుందని పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. కొండపల్లి బి.కాలనీ వద్ద ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి ఆయన గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను, జనసేన నాయకుడు రామ్మోహనరావు, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని వినతి



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కౌలు రైతుల సంఘం నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఏపీ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలోని కలెక్టరేట్ వద్ద 36 గంటల దీక్ష నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా కార్యదర్శి జి.సీతారామిరెడ్డి తెలిపారు. మండలంలోని తోటమూలలో గురువారం ఆయన అధ్యక్షతన మండల కౌలు రైతుల సంఘ సమావేశం నిర్వహించారు. దీక్షలకు సంబంధించిన గోడ ప్రతులు ఆవిష్కరించారు. భూమి లేని కౌలు రైతులను గుర్తించాలని, అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కోరారు. నాయకులు ఎం.వెంకటరెడ్డి, జి.వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉద్ధృతం చేస్తాం'



జి.కొండూరులో ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక కేడీసీసీబీ ఆవరణలో మైలవరం నియోజకవర్గం పరిధిలోని 24 సహకార సంఘాల ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్ష గురువారం కొనసాగింది. సంఘ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నరసింహారావు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో నిరసన ప్రదర్శన చేపట్టారు.

తిరువూరు, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగులు తిరువూరులో నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర నాయకుడు బొల్లినేని రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏ రంగారావు ప్రభుత్వానికి సరెండర్

గంపలగూడెం, న్యూస్‌టుడే : గంపలగూడెం, ఎ.కొండూరు, తిరువూరు మండలాల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఏవీఎస్.రంగారావును ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారిణి డీఎంఎం.విజయ కుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరువూరు ఆర్డీవో కె.మాధురి చేసిన ఫిర్యాదు మేరకు ఏడీఏపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రంగారావు ఎ.కొండూరు ఏవో బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి ఏడీఏగా తిరువూరు ఏవో పి.పద్మ, ఎ.కొండూరు ఇన్‌ఛార్జి ఏవోగా మైలవరం సాంకేతిక ఏవో ఆర్.వాసుదేవ్‌ను నియమిస్తూ డీఏవో ఉత్తర్వులు జారీ చేశారు.

చెరువులో నీరు తొలగించాలి

మైలవరం: మరమ్మతుల పనుల కోసం చెరువులోని నీరు తొలగించి పనులు పూర్తి చేసుకునేందుకు అనుమతించాలని మండలంలోని గణపవరానికి చెందిన తెదేపా నాయకులు, పలువురు రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. గతేడాది వర్షాలకు చెరువు కట్ట తెగిందని, తూము మరమ్మతులకు అధికారులు అంచనాలను ఆమోదించిన నేపథ్యంలో పనులు చేయడానికి నీరు అడ్డంగా ఉందని చెప్పారు. నాయకులు బుజ్జిరెడ్డి, శ్యాంప్రసాద్, నాని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత అవసరం



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

గొల్లపూడి : విద్యుత్తు మీటర్ల రీడర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ తెలిపారు. ఏపీ విద్యుత్తు మీటర్ల రీడర్ల రాష్ట్ర కమిటీ సమావేశం గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా సంస్థనే నమ్ముకుని విద్యుత్తు మీటర్ రీడర్లు పని చేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నాయకులు వెంకటసుబ్బయ్య, బాలకాశి, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పూర్తి చేయండి

గొల్లపూడి : కుటుంబ సర్వేను సచివాలయ ఉద్యోగులు వేగంగా పూర్తి చేయాలని విజయవాడ గ్రామీణ మండలం ఎంపీడీవో విగ్గిన్స్ తెలిపారు. గొల్లపూడిలోని కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో ఆయన గురువారం సమావేశమై మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల బాధ్యుడు విద్యాధరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగించరూ..



జి.కొండూరు పోలీస్ స్టేషన్ నుంచి మునగపాడు వెళ్లే బైపాస్ రహదారి వరకు ముళ్ల పొదలు పెరిగాయి. ప్రధానంగా జి.కొండూరు శివారు గొల్లగూడెం సమీపంలోని మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

వైద్యానికి దూరం.. వెస్ట్ మాధవరం



మండల పరిధిలోని వెస్ట్ మాధవరంలో సరైన వైద్య సదుపాయం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈస్ట్, వెస్ట్ మాధవరంలో మొత్తం 2,900 మంది జనాభా ఉన్నారు. ఇక్కడున్న ప్రాథమిక ఉప కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) వీరికి వైద్యం అందించాల్సి ఉండగా ఆమె కొంత కాలంగా అందుబాటులో లేరు. దీనిపై గ్రామస్థులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వేముల స్వాతికి బుధవారం వినతి పత్రం కూడా అందించారు. **- న్యూస్‌టుడే, ఎ.కొండూరు**

నీటి ఎద్దడితో నివాసితుల గగ్గోలు



మండల పరిధి కొండపర్వలోని కొత్తకుంట చెరువు దగ్గర ఉన్న పంచాయతీ బోరు సరిగా పని చేయడం లేదు. దీనికి తోడు మంచినీరు లీకై వృథా కావడంతో సక్రమంగా నీరందక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఏళ్ల కిందట వేసిన పైపులు తుప్పుపట్టి పలుచోట్ల లీకై మురుగు చేరి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

రక్షణ గోడలు లేక.. ప్రమాదాల బాట



విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారి నుంచి అట్లప్రగడ వెళ్లే రోడ్డులో ఎదుళ్ల వాగుపై ఉన్న చప్టాకు ఇరువైపులా రక్షణ గోడలు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది నిర్మించిన నాటి నుంచి పరిస్థితి ఇలానే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ గోడలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఎ.కొండూరు**

కోతకు గురైన రోడ్డు.. అన్నదాతకు వెతలు



కుదపలో పడమర వైపునున్న పొలాలకు వెళ్లే రహదారిలో చప్టా దగ్గర రోడ్డు కోతకు గురై గొయ్యి ఏర్పడింది. నిత్యం రైతులు ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ల మీద వ్యవసాయ పనుల నిమిత్తం పంట పొలాలకు రాకపోకలు సాగిస్తారు. వాహనాలు ఎదురైనప్పుడు తప్పుకోవాలంటే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దానికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

గ్రూప్స్ విజేతలకు సన్మానం



వైష్ణవిని సత్కరిస్తున్న శ్రీనివాసరావు, సులోచన తదితరులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన గ్రూప్స్ ఫలితాల్లో విజేతలుగా నిలిచిన ముదిరాజ్ విద్యార్థులు అంగజాల వైష్ణవి, రొయ్యల సాయికుమార్‌ను రాష్ట్ర ముదిరాజ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పులి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సులోచన ఘనంగా సన్మానించారు. పట్టణంలోని వైష్ణవి నివాసంలో నిర్వహించిన సమావేశంలో పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ముదిరాజ్ విద్యార్థులకు సాయం అందిస్తామన్నారు. నియోజకవర్గ ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తొట్టి నిండితేనే.. తీరుతుంది దాహార్తి



పొలాలకు మేతకు వెళ్లే పశువుల దాహార్తిని తీర్చాల్సిన సమయం ఆసన్నమవుతోంది. వేసవిలో పశువులకు ఆసరాగా ఉండేలా గతేడాది ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించారు. ఫిబ్రవరి చివరికి చేరుకోవడంతో వాటిల్లో నీరు నింపేందుకు పంచాయతీలు సిద్ధం కావాల్సి ఉంది. మైలవరం పంచాయతీ భవానీనగర్ సమీపంలోని తొట్టెలో ఇప్పటికే ఇలా నీరు నింపారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

మరాఠా యోధుడు ఛత్రపతికి నివాళి



శివాజీ చిత్రపటం వద్ద చిన్నారులు, ఉపాధ్యాయులు

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండల పరిధి పెనుగొలనులోని ప్రాథమిక పాఠశాలలో (బీసీ) గురువారం మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు నివాళులర్పించారు.



తిరువూరు మరాఠా అసోసియేషన్ ఆధ్వర్యంలో..

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మరాఠా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి నిర్వహించారు. దాదాసాహెబ్ పవార్, రాజ్‌కుమార్ పవార్, సంతోష్ తోరత్ తదితరులు పాల్గొన్నారు.

వెండి తాపడానికి విరాళం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో సహ దేవత అంకమ్మ అమ్మవారికి వెండి తాపడం చేయించడానికి దాతలు విరాళం అందించారు. విజయవాడ కానూరుకు చెందిన లక్ష్మీ ప్రశాంత్ కుమార్, సుష్మ దంపతులు పెనుగంచిప్రోలుకు చెందిన రేగండ్ల సైదులు దంపతులు, రేగండ్ల రవికుమార్‌ల ద్వారా రూ.10,116 అందజేశారు.

21న హుండీల లెక్కింపు

జగ్గయ్యపేట గ్రామీణం: మండలంలోని ముక్త్యాలలోని భవానీ ముక్తేశ్వర స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వాహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. అధికారులు, దేవస్థాన ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్తు సమక్షంలో లెక్కిస్తున్నట్లు చెప్పారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న డీసీపీ షిరీనా బేగం

కొండపల్లి, న్యూస్‌టుడే : ప్రజా అవగాహనతోనే ప్రమాదాల నివారణ జరగాలని ట్రాఫిక్ డీసీపీ షిరీనా బేగం అన్నారు. ఎన్‌హెచ్ఏఐ(30) ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లి ప్రాంతంలోని సెంట్రల్ లైటింగ్ మరమ్మతులను ఆమె గురువారం పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం కూడలికి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో అన్ని సమయాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణరావు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ డీసీపీ షిరీనాబేగం కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున ఆమె గురువారం జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్‌కు ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. అదనపు ఎస్సై గిరిజామణి, సిబ్బంది పాల్గొన్నారు.

77 మందికి వైద్య పరీక్షలు

ఎ.కొండూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పలువురు రోగులను వైద్యుడు విశ్వనాథ్ పరీక్షించి మందులు అందజేశారు. మొత్తం 77 మందిని పరీక్షించగా వారిలో 27 మంది కిడ్నీ సంబంధిత రోగులు ఉన్నారని గుర్తించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వేముల స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం



లబ్ధిదారులకు చెక్కులు ఇస్తున్న సుబ్బారావు, రాజా, కూటమి శ్రేణులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం బాధితులకు ఆసరాగా నిలుస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు అన్నారు. స్థానిక ఆపార్టీ కార్యాలయంలో కూటమి శ్రేణులతో కలసి 11 మంది లబ్ధిదారులకు రూ.4,35,010లు విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కపులూరి రాజా, పార్టీ మండల కార్యదర్శి ఆకుల సత్యనారాయణ, పుట్రేల మారెమ్మ గుడి ఛైర్మన్ కేరళ శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దూడలు సంచరించే ప్రాంతాలను శుభ్రంగా ఉంచండి



లేగ దూడలతో పాడి రైతులు, వైద్యులు

మూలపాడు (ఇబ్రహీంపట్నం గ్రామీణం): లేగ దూడల సంరక్షణలో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ పెంపకందార్లు వాటిని సంరక్షించాలని పశు సంవర్ధక శాఖ నంది గామ సహాయ సంచాలకుడు కృష్ణమూర్తి అన్నారు. లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని మూలపాడులో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దూడలు సంచారం చేసే ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎప్పటికప్పుడు వాటికి సరైన టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాస్, మోహన్ కిషోర్, శైలుమాధురి పాల్గొన్నారు.

మండల పరిషత్ పరిపాలనాధికారి మృతికి నివాళి



కమల విష్ణు (పాత చిత్రం)

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిషత్ పరిపాలనాధికారి సీహెచ్.కమలవిష్ణు(58) మృతి చెందారు. గుండె సంబంధిత వ్యాధికి చికిత్స నిమిత్తం వారం కిందట ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరారు. గురువారం సాయంత్రం శస్త్రచికిత్సకు సిద్ధం చేస్తుండగా అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్వస్థలం అవనిగడ్డ కాగా ఉద్యోగరీత్యా గంపలగూడెం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు, తిరువూరు, విస్సన్నపేట, చాట్రాయి మండల పరిషత్ కార్యాలయాల్లో పని చేశారు. ఆయన మరణ వార్త తెలియగానే స్థానిక కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, ఎంపీటీసీలు, నాయకులు విచారం వ్యక్తం చేశారు.

అనుమానాస్పదస్థితిలో కాపాలాదారు..

కొండపల్లి, న్యూస్‌టుడే: కాపాలాదారు మృతి చెందిన సంఘటన కొండపల్లి పారిశ్రామికవాడలో జరిగింది. సేకరించిన వివరాల మేరకు.. కొండపల్లి అంబేడ్కర్ కాలనీకి చెందిన తమ్మిశెట్టి కోటేశ్వరరావు(54) గురువారం ఉదయం తన విధులకు హాజరయ్యాడు. సాయంత్రానికి పక్కకు ఒరిగి పడిపోయాడు. కంపెనీలోని ఇతర ఉద్యోగులు చూసే సరికి ఆయన అపస్మారక స్థితిలో ఉన్నారు. వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : నరసాపురం-చాట్రాయి రోడ్డు మరమ్మతులకు నోచుకోక పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కూడా చాట్రాయి వైపు నుంచి విస్సన్నపేటకు ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ వ్యక్తి గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. కొందరు రైతులు, వాహనదారులు గమనించి అతడిని ఆసుపత్రికి తరలించారు.

ఎంఈవోలుగా బాధ్యతల స్వీకరణ



రాజును సత్కరిస్తున్న రంగబాబు, మూర్తి తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : మైలవరం ఇన్‌ఛార్జి ఎంఈవో-1గా విధులు నిర్వహిస్తున్న బండి రాజు గురువారం జి.కొండూరు మండల విద్యాశాఖాధికారి- 1గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రంగబాబు, డేటా ఎంట్రీ ఆపరేటర్ పీటీఎస్ఎన్ మూర్తి, రాము, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల విద్యాశాఖాధికారి- 1 కుమ్మరి శంకరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవో- 2.పి.రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ గేమింగ్ వెబ్‌సైట్లతో రూ.13 వేల కోట్ల లావాదేవీలు

- దేశవ్యాప్తంగా వ్యవస్థీకృత సిండికేట్‌ను గుర్తించిన డీజీజీఐ
- అడ్సమ్ అడ్వైజరీ సర్వీస్ డైరెక్టర్ పంకజ్‌కుమార్ అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: దేశంలో అక్రమ గేమింగ్ వెబ్‌సైట్ల ద్వారా వ్యవస్థీకృత సిండికేట్ నడుపుతున్న ముఠాల కార్యకలాపాల్ని జీఎస్టీ ఇంటెలిజెన్స్ బహిర్గతం చేసింది. 2025వ సంవత్సరంలో దేశంలో సుమారు రూ.2 లక్షల కోట్ల మేర ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలు జరిగినట్లు అంచనాలున్న నేపథ్యంలో సుమారు రూ.13 వేల కోట్లకు పైగా అక్రమ లావాదేవీలను గుర్తించినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) హైదరాబాద్ జోనల్ విభాగం అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ సిండికేట్‌లపై దేశవ్యాప్తంగా సోదాలు చేస్తున్న క్రమంలోనే హైదరాబాద్‌కు చెందిన అడ్సమ్ అడ్వైజరీ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ పంకజ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. సిండికేట్ నిర్వహణలో ఇతనే కీలక సూత్రధారి అని గుర్తించారు. పేమెంట్ అగ్రిగేటర్, పేమెంట్ గేట్‌వే, థర్డ్‌పార్టీ టెక్నాలజీ సర్వీస్ ప్రొవైడర్ల వంటి అనుబంధ ఫిన్‌టెక్ కంపెనీల సహాయంతో అక్రమ ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లను నిర్వహించడం ద్వారా ఇంత భారీమొత్తంతో కూడిన వ్యవస్థీకృత సిండికేట్ నడుస్తోందని దర్యాప్తులో తేలింది. ఈ మోసానికి సంబంధించి రూ.100 కోట్ల విలువైన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు డీజీజీఐ వెల్లడించింది. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు సంబంధించి కస్టమర్ వెరిఫికేషన్/డిజిటల్ కేవైసీ వెరిఫికేషన్ సేవల్ని అందించే అడ్సమ్ సంస్థ కస్టమర్ల రిస్క్ ప్రొఫైలింగ్‌ను గుర్తించడంలో విఫలమైనట్లు దర్యాప్తులో తేలింది. ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా ఆర్జించిన సొమ్మును తరలించేలా యూపీఐ ఇంటిగ్రేషన్ కోసం డొల్ల కంపెనీలను సృష్టించడంలో పంకజ్‌కుమార్ సహకరించినట్లు వెల్లడైంది. సిండికేట్ ద్వారా అతడు అక్రమంగా లబ్ధి పొందినట్లు డీజీజీఐ ఆధారాలు సేకరించింది.

భారత ప్రభుత్వం
రైల్వే మంత్రిత్వ శాఖ (దక్షిణ మధ్య రైల్వే)
నోటిఫికేషన్
సికింద్రాబాద్, తేది: 14.02.2026

Rc.No.149/2024-F తేదీ:19.02.2026

S.O.788 (E) - రైల్వే చట్టం, 1989 (24 యొక్క 1989)) (ఇకపై పేర్కొన్న చట్టంగా సూచిస్తారు) లోని సెక్షన్ 20-ఎ నందలి సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం, సంతృప్తి చెందిన తర్వాత ప్రజా ప్రయోజనార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో గుంటూరు - బీబీనగర్ స్టేషన్ల మధ్య రెండవ రైల్వే లైన్ అనే ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్ అమలు, నిర్వహణ, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కోసం దిగువ షెడ్యూల్‌లో సంక్షిప్త వివరణ ఇవ్వబడిన భూమి అవసరం ఉన్నదని భావించినందున, అట్టి భూమిని భూసేకరణ చేసే ఉద్దేశాన్ని దీని ద్వారా ప్రకటిస్తున్నాము.

సదరు భూమిపై ఆసక్తి ఉన్న ఏ వ్యక్తి అయినా, అధికారిక గెజిట్‌లోని ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి ముప్పై రోజులలోగా, సదరు చట్టం లోని సెక్షన్ 20-డి లోని సబ్-సెక్షన్ (1) కింద పై తెలిపిన ప్రయోజనార్థం కోసం భూమిని స్వాధీనం చేసుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చు.

అటువంటి ప్రతి అభ్యంతరాన్ని సమర్థప్రాధికారి (భూసేకరణ) & రెవెన్యూ డివిజనల్ అధికారి, సత్తెనపల్లి వారికి వ్రాతపూర్వకంగా తెలియజేయాలి మరియు దాని కారణాలను నిర్దేశించాలి మరియు భూసేకరణ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, సత్తెనపల్లి వారు అభ్యంతరం వ్యక్తం చేసిన వ్యక్తికి వ్యక్తిగతంగా లేదా న్యాయవాదుల ద్వారా వినడానికి అవకాశం కల్పిస్తారు. అటువంటి అభ్యంతరాలన్నింటినీ విన్న తర్వాత మరియు తదుపరి విచారణ చేసిన తర్వాత, ఏదైనా సమర్థ అధికారం అవసరమని భావిస్తే, ఉత్తర్వుల ద్వారా, అభ్యంతరాలు అనుమతించవచ్చు లేదా నిరాకరించవచ్చు.

సదరు చట్టంలోని సెక్షన్ 20-డి లోని సబ్-సెక్షన్ (2) ప్రకారం సమర్థప్రాధికారి చేసిన ఉత్తర్వులే తుది నిర్ణయం అవుతుంది.

ఈ నోటిఫికేషన్ కింద కవర్ చేయబడిన భూమికి సంబంధించిన ల్యాండ్ ప్లాన్‌లు మరియు ఇతర వివరములు పైన తెలుపబడిన సంబంధిత సమర్థప్రాధికారి కార్యాలయములో అందుబాటులో ఉంటాయి మరియు ఆసక్తిగల వ్యక్తి వాటిని తనిఖీ చేయవచ్చు. భూసేకరణలో సముచిత పరిహారం పొందే హక్కు మరియు పారదర్శకత, పునరావాసం మరియు పునర్ ఉపాధికల్పన చట్టం, 2013 (చట్టం నం.30 2013) ప్రకారం పరిహారం అందించబడుతుంది.

షెడ్యూల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో గుంటూరు – బీబీనగర్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్ పరిధిలో వచ్చే సత్తెనపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలోని భూముల (నిర్మాణాలు ఉన్నా లేకున్నా) సంక్షిప్త వివరాలు.

క్రమ సంఖ్య	మండలం పేరు	గ్రామం	సర్వే నెంబరు & సబ్‌డివిజన్	విస్తీర్ణం ఎకరములలో	విస్తీర్ణం హెక్టార్లలో
1			124/B-1A	0.070	0.02833
2			123-1A1	0.240	0.09713
3			121-1A1	0.020	0.00809
4			121-1B1	0.110	0.04452
5			121-1C1	0.050	0.02023
6			120-1A	0.030	0.01214
7			119/B-2A	0.050	0.02023
8			119/B-4A2	0.260	0.10522
9			119/B-4B	0.020	0.00809
10			61/B-1A	0.09	0.03642
11			62/B-1A	0.4	0.16188
12	రాజుపాలెం	కుబాద్ పురం	63/B-1A	0.27	0.10927
13			64/B-1A	0.16	0.06475
14			64/B-1B	0.350	0.14164
15			64/B-2A	0.190	0.07689
16			65/B-1A	0.130	0.05261
17			65/B-1B	0.070	0.02833
18			65/B-2	0.070	0.02833
19			66/B-1A	0.110	0.04452
20			66/B-1B	0.040	0.01619
21			35/B-1A1	0.020	0.00809
22			36/A-2B	0.150	0.06070
23			37/A-1B	0.080	0.03238
	ఉప మొత్తం			**2.980**	**1.20599**
24			40-1A	0.93	0.37637
25			41-1A	0.11	0.04452
26			41-2A	0.23	0.09308
27			41-3A	0.36	0.14569
28			42-1A	0.17	0.06880
29			42-2A	0.37	0.14974
30			42-3A	0.35	0.14164
31			43-1A1	0.72	0.29138
32			81-1A	0.41	0.16592
33			80-1A	0.06	0.02428
34	రాజుపాలెం	చౌటపాపాయపాలెం	77-1A	0.47	0.19021
35			77-2	0.41	0.16592
36			76-1A	0.86	0.34804
37			132-1A	1.00	0.40469
38			133-1A	0.98	0.39660
39			124-1B1	0.35	0.14164
40			125-1B	0.40	0.16188
41			126-1	0.05	0.02023
42			122-2	0.04	0.01619
43			121-2	0.19	0.07689
44			85-1B	0.10	0.04047
45			87-2	0.01	0.00405
	ఉప మొత్తం			**8.57**	**3.46823**
46					
47			15/B-1A	0.02	0.00809
48					
49			48/A-3A	0.12	0.04856
50			60/A-2	0.21	0.08499
51					
52			61/B-2A	0.02	0.00809
53			73/B-1A	0.02	0.00809
54			74/B-1	0.17	0.06880
55	రాజుపాలెం	రెడ్డిగూడెం	75-1	0.04	0.01619
56			76/B-1	0.05	0.02023
57			77-1	0.09	0.03642
58			86-A	0.11	0.04452
59			100/B-1	0.03	0.01214
60					
61			104/B-1A	0.37	0.14974
62					
63					
64			105/B-1	0.04	0.01619
	ఉప మొత్తం			**1.29**	**0.52206**
65			165/B-1A1	0.010	0.00405
66			166/B-1A1	0.210	0.08499
67			167/B-1A1	0.140	0.05666
68			168/B-1A1A	0.140	0.05666
69			168/B-1B1A	0.040	0.01619
70			168/B-1C1A	0.070	0.02833
71			172/B-1A1	0.140	0.05666
72			173/B-1A1	0.110	0.04452
73			174/B-1A1A	0.410	0.16592
74			175/B-1A1	0.205	0.08296
75			176/B-1	0.010	0.00405
76			180/B-1	0.060	0.02428
77			181/B-1	0.040	0.01619
78	రాజుపాలెం	రాజుపాలెం	181/A-1B	0.130	0.05261
79			198/C-1A	0.050	0.02023
80			213-1A1A	0.26	0.10522
81			212/B-1A1	0.030	0.01214
82			211/B-1A1	0.280	0.11331
83			210/B-1A	0.080	0.03238
84			210/B-2A	0.010	0.00405
85			207/B-1A	0.060	0.02428
86			198/A-3B	0.010	0.00405
87			199/B-1A	0.400	0.16188
88			200/A-1	0.030	0.01214
89			210/A-1B	0.010	0.00405
90			198/B-2	0.005	0.00202
	ఉప మొత్తం			**2.940**	**1.18980**
91			224/A-1B	0.030	0.01214
92			224/A-2	0.100	0.04047
93			227-1B	0.250	0.10117
94	బెల్లంకొండ	బెల్లంకొండ	228-2B1	0.080	0.03238
95			228-2B3	0.070	0.02833
96			228-2C2	0.030	0.01214
97			229/1-1B3B	0.320	0.12950
	ఉప మొత్తం			**0.880**	**0.35613**
98			307/A-3C2	0.010	0.00405
99			311/A-1	0.010	0.00405
100			325-13A2	0.020	0.00809
101			322/A-1C2	0.140	0.05666
102			322/B-5B	0.070	0.02833
103			324/B-2B	0.33	0.13355
104			323-C1A	0.34	0.13759
105			330/B-2A	2.29	0.92673
106			333/B-1B	0.96	0.38850
107			438/B-1	0.03	0.01214
108			417-1A1	0.15	0.06070
109			420/B-1A	0.25	0.10117
110			421/C-1A	0.2	0.08094
111	పెదకూరపాడు	పెదకూరపాడు	413-2A	0.11	0.04452
112			411-1A	0.17	0.06880
113			410/B-1B2	1.98	0.80128
114			409/B-2A	0.42	0.16997
115			883/B-2	0.12	0.04856
116			893/B-1B1	0.01	0.00405
117			894/B-1	0.17	0.06880
118			895/B-1	0.01	0.00405
119			895/A-2	0.14	0.05666
120			896/A-3B	0.11	0.04452
121			398/A-2	0.01	0.00405
122			958/4A-2B	0.03	0.01214
123			958/4A-3B	0.20	0.08094
124			958/5A-2	0.04	0.01619
125			958/12A-1B	0.02	0.00809
	ఉప మొత్తం			**8.340**	**3.37508**
127			88/B-2	0.160	0.06475
128			93/A-1B	0.14	0.05666
129			94/A-1B	0.03	0.01214
130			95/B-2	0.03	0.01214
131			98/A-1B	0.13	0.05261
132			97/B-2	0.05	0.02023
133			111/A-1A2	0.01	0.00405
134			111/A-1A3	0.01	0.00405
135			111/A-1A4	0.08	0.03238
136			111/A-1A7	0.01	0.00405
137			111/A-2A2	0.02	0.00809
138			143/B-1	0.1	0.04047
139			137-2	0.04	0.01619
140			134/B-1	0.04	0.01619
141			36/B-2	0.02	0.00809
142	పెదకూరపాడు	లింగంగుంట్ల	35/B-1A	0.01	0.00405
143			34/B-1A2	0.01	0.00405
144			31/B-1A2	0.03	0.01214
145			37/A-1A2	0.1	0.04047
146			29/B-1A1A2	0.02	0.00809
147			29/B-1C1B	0.01	0.00405
148			28-2	0.04	0.01619
149			205/B-2	0.01	0.00405
150			208/A	0.03	0.01214
151			209/A-2	0.03	0.01214
152			212/A-2	0.06	0.02428
153			346/A	0.02	0.00809
154			348/A-1B	0.66	0.26710
155			349-1	0.24	0.09713
156			335-1A2	0.08	0.03238
157			343/B	0.08	0.03238
	ఉప మొత్తం			**2.300**	**0.93080**
158	పెదకూరపాడు	చినముక్కెన	51-1A	0.02	0.00800
	ఉప మొత్తం			**0.02**	**0.00800**
159			596/B-1	0.010	0.00405
160			595/B-1A	0.120	0.04856
161			595/B-2A	0.040	0.01619
162			595/B-3A1	0.460	0.18616
163			584-1A	0.3400	0.13760
164			585/B-1A	0.6300	0.25496
165			585/B-2A	0.050	0.02023
166			579/B-1	0.130	0.05261
167			578/B-1	0.020	0.00809
168			567/B-2A	0.060	0.02428
169			559/B-1	0.090	0.03642
170			75/B-1B	0.100	0.04047
171			76/B	0.010	0.00405
172			80-1B	0.010	0.00405
173	సత్తెనపల్లి	ధూళిపాళ్ళ	80-3B	0.050	0.02023
174			80-4B	0.060	0.02428
175			79-1	0.210	0.08499
176			77/B-1	0.050	0.02023
177			105/2B-1	0.050	0.02023
178			123/B-1A	0.330	0.13355
179			140/B-1	0.350	0.14164
180			143/B-1	0.110	0.04452
181			144/B-1	0.130	0.05261
182			145/B-1A	0.090	0.03642
183			145/B-2A	0.040	0.01619
184			145/B-3A	0.140	0.05666
185			138/B-1	0.170	0.06880
186			137/B-1	0.010	0.00405
	ఉప మొత్తం			**3.860**	**1.56212**
187	సత్తెనపల్లి	గుడిపూడి	11/A-1B	0.160	0.06475
188			2/A-2B	0.400	0.16188
	ఉప మొత్తం			**0.560**	**0.22663**
189			163/A-2	0.020	0.00809
190			152-2B	0.120	0.04856
191			162/A-1B	0.810	0.32780
192			161/A-1B	0.680	0.27519
193			165/A	0.050	0.02023
194			155/A-5B	0.380	0.15378
195			157-2	0.010	0.00405
196			158/A-2	0.010	0.00405
197			207/A-2	0.030	0.01214
198	సత్తెనపల్లి	కంకణాలపల్లి	222/A-2	0.020	0.00809
199			223/A-3B	0.010	0.00405
200			226/A-1B	0.260	0.10522
201			227/A-2A2	0.010	0.00405
202			234/A-2	0.010	0.00405
203			233-3A2	0.180	0.07285
204			250/A-2A3	0.090	0.03642
205			250/A-1A2	0.140	0.05666
206			249/A-1A2	0.350	0.14164
207			249/B-1B	0.030	0.01214
208			248/B-1B	0.320	0.12950
	ఉప మొత్తం			**3.530**	**1.42857**
209			9/A-3B2	0.0900	0.03642
210			3/A	0.0100	0.00405
211			4/A-2	0.0400	0.01619
212	సత్తెనపల్లి	అబ్బూరు	6/A-2B2	0.0550	0.02226
213			5/A-1B	0.0350	0.01416
214			13/A-4B2	0.1350	0.05463
215			14/A-2	0.0100	0.00405
	ఉప మొత్తం			**0.3750**	**0.15176**
216			32/A-2	0.05	0.02023
217			90/3A - 1B	0.055	0.02226
218			94/A-2	0.016	0.00648
219	సత్తెనపల్లి	భీమవరం	93/A -2B	0.273	0.11048
220			113/A-2	0.011	0.00445
221			108/A-2A2	0.008	0.00324
222			108/A-2B2	0.068	0.02752
	ఉప మొత్తం			**0.481**	**0.19466**
223			92-2	0.180	0.07285
224			91/A-2	0.030	0.01214
225			90/A-2	0.070	0.02833
226			96/A-2	0.010	0.00405
227			76/A-1B	0.220	0.08903
228					
229	సత్తెనపల్లి	సత్తెనపల్లి	211-1B	0.120	0.04856
230			209/A-2	0.070	0.02833
231			276-C1B	0.020	0.00809
232			274/A-1B	0.960	0.38851
233			275/A-3A2	0.540	0.21854
234			269/A-1	1.620	0.65561
235			264/A-2C2	0.190	0.07689
	ఉప మొత్తం			**4.030**	**1.63092**
	మొత్తం			**40.15600**	**16.25075**

తేది: 19-02-2026
ప్రదేశం: సత్తెనపల్లి

సం/- జి.వి.రమణాకాంత్‌రెడ్డి
కాంపిటెంట్ అథారిటీ(ఎల్.ఎ) & రెవిన్యూ డివిజనల్ అధికారి
సత్తెనపల్లి, పల్నాడు జిల్లా.

శీతాకాలంలోనూ వేసవి సెగలు!

- రాష్ట్రంలో పెరుగుతున్న వేడి, ఉక్కపోత
- మరో వేడి సంవత్సరంగా 2026

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ఫిబ్రవరిలోనే భానుడు సుర్రుమనిపిస్తున్నాడు. కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత ఎక్కువై బయటకు వెళ్లేందుకూ భయపడుతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలను శీతాకాలంగానే భారత వాతావరణ విభాగం పరిగణిస్తుంది. కానీ, అప్పుడే వేసవి తరహా వేడి, ఉక్కపోత కనిపిస్తున్నాయి. ఉత్తరభారతంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఉత్తరాది నుంచి వీచే చలిగాలులు తగ్గిపోయాయి. ఈ వేసవి మరింత వేడిగా ఉంటుందని, మరో వేడి సంవత్సరంగా 2026 నమోదవుతుందని వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

పెరుగుతున్న సగటు ఉష్ణోగ్రతలు

◆ గత శతాబ్దకాలంలో 2024 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. ఉష్ణోగ్రతల నమోదు ప్రారంభించిన 1901 తర్వాత 2025 ఎనిమిదో వేడి సంవత్సరంగా నమోదైంది. 15 వేడి సంవత్సరాల్లో పది.. గత 15 ఏళ్లలోనే నమోదయ్యాయి.

◆ 2025లో దేశవ్యాప్తంగా సగటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 1.04 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 0.92 డిగ్రీలు పెరిగాయి. ఈ ఏడాది జనవరిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సగటున 0.43, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 0.23 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి.

◆ గత దశాబ్ద కాలంలో దేశంలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీనికి వాతావరణ మార్పులే కారణమని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. మార్చి నుంచి మే వరకు తీవ్రమైన వడగాలులు వీచే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

◆ ఇటీవలి కాలంలో వేసవి త్వరగా ప్రారంభమవుతోంది. ఎక్కువ రోజులు తీవ్రమైన వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పంటలకూ నష్టం కలుగుతుంది. విద్యుత్తు డిమాండ్ పెరుగుతుంది. నగరాల్లో నీటి కొరత తీవ్రమవుతుంది.

ఈ నెలలో చలి తక్కువే

ఫిబ్రవరిలో చలి తీవ్రత తక్కువగానే ఉంది. ఎక్కడా చలిగాలులు నమోదు కాలేదు. రాష్ట్రంలోనే చలి ఎక్కువగా ఉండే అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ నెలలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6 డిగ్రీల వరకూ నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని ఐఎండీ అంచనా వేస్తోంది. రాయలసీమ జిల్లాల్లో తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశముంది. గురువారం రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలు, నరసాపురంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలుగా నమోదయ్యాయి. విశాఖపట్నం, తుని, నరసాపురం తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 3.9 డిగ్రీలు పెరిగాయి.

నేడు బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: భూమధ్య రేఖకు సమీపంలో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా శ్రీలంక వైపుగా కదులుతూ శుక్రవారం నాటికి బలహీనపడొచ్చని భారత వాతావరణ విభాగం పేర్కొంది. మరోవైపు ఆగ్నేయ బంగాళాఖాతంలో గురువారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో శుక్రవారం నాటికి అదే ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడొచ్చని ఐఎండీ తెలిపింది. వీటి ప్రభావంతో శని, ఆదివారాల్లో అండమాన్, నికోబార్ దీవులు, తమిళనాడు, కేరళలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శని, ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్రవారం పలు ప్రాంతాల్లో పొగ మంచు కురుస్తుందని తెలిపింది.





కంటైనర్ ఇళ్లపై క్రేజ్



మెట్రో నగరాలు, పట్టణాలకే పరిమితమైన కంటైనర్ ఇళ్లు ఇప్పుడు జిల్లా కేంద్రాలు, గ్రామాలకు వచ్చేశాయి. నిర్మాణ వ్యయం తక్కువగా ఉండటం, ఎక్కడికైనా తీసుకెళ్లేందుకు వీలుండటం వల్ల ప్రజలు వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. ఏలూరుకు చెందిన సాయిరాం, లక్ష్మీప్రసన్నలకు రెండేళ్ల క్రితం వివాహమైంది. ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన వీరు వర్క్ ఫ్రం హోం విధానంలో విధులు నిర్వర్తిస్తున్నారు. స్థానికంగా తాపీమేస్త్రీ కాలనీలో వారికి కొంత స్థలం ఉంది. తొలుత అక్కడ ఇల్లు నిర్మించుకుందామని నిర్ణయించుకున్నారు. కానీ, భవిష్యత్తులో వేరే చోటుకు బదిలీ అవుతుందని భావించి కంటైనర్ ఇంటికి ఆసక్తి చూపారు. విజయవాడలోని ఓ కంపెనీకి ఆర్డర్ ఇచ్చి తమకు నచ్చిన విధంగా డిజైన్ చేయించుకున్నారు. ఇందులో ఇద్దరు సౌకర్యవంతంగా ఉండేలా హాలు, పైఅంతస్తులో పడక గది, మరుగుదొడ్లున్నాయి. దీనికి అదనంగా ఇంటి చుట్టూ ప్రహరీతో పాటు వంట గది నిర్మించారు. పాలికార్బొనేట్ షీట్లతో ఇంటి ఎదుట పైకప్పు వేయించారు. గాలి, వెలుతురు ప్రసరించేలా కిటికీలు ఏర్పాటు చేశారు. మొత్తం నిర్మాణానికి రూ.10 లక్షలు వెచ్చించారు.

– ఈనాడు, ఏలూరు

2 గంటల జాప్యానికి మూల్యం.. వైకల్యం

- బస్సు బోల్తా పడి చేయి తెగిపడిన యువతి
- చేతిభాగాన్ని వదిలేసి బాధితురాలిని ఆసుపత్రికి పంపిన తెలంగాణ పోలీసులు
- దివ్యాంగురాలిగా మిగిలిన బాధితురాలు



ఎడమ చేతి మణికట్టు వరకు కోల్పోయిన స్నేహలత

ఈనాడు, కర్నూలు: తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడు దగ్గర గురువారం తెల్లవారుజామున బస్సు బోల్తాపడిన ఘటనలో తీవ్ర గాయాలపాలై ఎడమ చేయి మణికట్టు వరకు తెగిపోయిన స్నేహలత(23)ను తెలంగాణ పోలీసులు హుటాహుటిన కర్నూలు పంపారు. అయితే తెగిపడిన అరచేయి భాగాన్ని పంపడం మరిచిపోయారు. కర్నూలు వచ్చిన తరువాత వైద్యులు తెగిపడిన చేతిని రెండు గంటల్లో తెస్తే తిరిగి అతికించవచ్చని చెప్పినా పట్టించుకునేవారే కరవయ్యారు. అరచేతిని సకాలంలో తేలేకపోవడంతో ఆమె శాశ్వతంగా దివ్యాంగురాలిగా జీవించాల్సిన దుస్థితి తలెత్తింది.

కుటుంబానికి ఆమే ఆధారం

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన దేవరకొండ స్నేహలత బీఫార్మసీ పూర్తి చేసి, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. నిరుపేదలైన తల్లిదండ్రులు ఆదినారాయణ, లక్ష్మిలకు ఆర్థికంగా అండగా ఉంటున్నారు. చెల్లి అక్షితను ఇంటర్ చదివిస్తున్నారు. తల్లికి ఒంట్లో బాగోలేదని తెలియడంతో స్నేహలత బుధవారం రాత్రి హడావుడిగా అనంతపురం బయల్దేరారు. బస్సు ఇటిక్యాలపాడు వద్ద బోల్తా కొట్టడంతో ఆమె చేయి తెగి, సంఘటనా స్థలంలోనే పడిపోయింది. విరిగిపడ్డ అరచేతిని వదిలేసి పోలీసులు ఆమెను కర్నూలుకు పంపారు. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే చేయి వస్తుందని ఎవరో చెప్పడంతో ఆమె ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అరచేతిని తెచ్చుకుంటే ప్లాస్టిక్ సర్జరీ చేస్తామని వైద్యులు చెప్పడంతో బాధితురాలు తన బంధువును ఘటనాస్థలికి పంపించారు. వారు అరచేతి భాగాన్ని కర్నూలు తీసుకొచ్చేసరికి సమయం మించిపోయింది. అందులోని కణాలన్నీ అప్పటికే నిర్వీర్యమైపోవడంతో దాన్ని అతికించడానికి అవకాశం లేదని వైద్యులు తేల్చిచెప్పారు. పోలీసులు తెగిపడిన చేతిభాగాన్ని కూడా ఆసుపత్రికి పంపించి ఉంటే మరికొన్ని నెలలకైనా ఆమెకు చెయ్యి వచ్చేదని..వారి పొరపాటుతో తమ కుమార్తె శాశ్వతంగా దివ్యాంగురాలిగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆసుపత్రికి వచ్చిన ఆర్టీసీ అధికారులు తాము ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించలేమని తెగేసి చెప్పేశారు. దీంతో బాధితురాలి బంధువులు వారి వాహనం ముందు బైఠాయించి, నిరసన తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం ఖర్చు భరించే స్థోమత లేకపోవడంతో యువతి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాలకు వైఎస్సార్ పేరు తొలగింపు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలకు ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును అధికారులు తొలగించారు. వైఎస్సార్ పేరు తొలగించాలని బుధవారం తెలుగునాడు విద్యార్థి సమాఖ్య ప్రతినిధులు ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్‌కు వినతిపత్రం అందించారు. గతంలో వైకాపా పెద్దల మెప్పు పొందేందుకు అప్పటి వీసీ ఇంజినీరింగ్ కళాశాలకు వైఎస్సార్ పేరు పెట్టారని అందులో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే ఆ పేరును తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏడాదిన్నరగా దీనిపై నిర్ణయం తీసుకోలేదు. తాజాగా బుధవారం మరోసారి విన్నవించడంతో.. దీన్ని పరిశీలించిన ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ గురువారం వైఎస్సార్ పేరును తొలగిస్తూ ఆదేశాలిచ్చారు.

వసుంధర

vasundhara@eenadu.in

అబార్షన్ అయ్యాక విశ్రాంతి ఎలా?

ఇటీవలే బిడ్డ ఎదుగుదల సరిగా లేదని అయిదో నెలలో అబార్షన్ జరిగింది. చాలా నీరసంగా ఉంది. హిమోగ్లోబిన్ శాతం 8.2 ఉంది. బరువు 50 కేజీలు. తిరిగి కోలుకోవడానికి ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి? నేనో ఉద్యోగస్థురాలిని. రోజూ 2గం. ప్రయాణించాలి. ప్రస్తుతం సెలవులో ఉన్నా. ఎన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలి? ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలా? – ఓ సోదరి

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

మీకు ఇటీవలే అబార్షన్ అయ్యింది కాబట్టి, రక్తస్రావం, నొప్పి, దాని తాలూకూ అసౌకర్యం, పాలు పడటం... వీటికి తోడు మానసికంగా ఒత్తిడి వంటివి ఉంటాయి. అందుకని, శారీరకంగా కోలుకోవడానికి పూర్తిగా 2-3 వారాలైనా విశ్రాంతి తీసుకోవాలి. అదే తిరిగి గర్భం దాల్చాలి అనుకుంటే మాత్రం ఆరు నెలలైనా గ్యాప్ తీసుకుంటే మేలు. ఈ సమయంలో పాలు, గుడ్లు, చేప, కొవ్వు తక్కువగా ఉండే మాంసం, మొలకలు, ఆకుకూరలు, పనీర్ వంటివాటితోపాటు బెల్లంతో చేసిన ఆహారపదార్థాలను ఎక్కువగా తినాలి. ఇవి మీరు కోలుకోవడంలో సాయపడతాయి. అయితే ఎత్తుకు తగ్గ బరువున్నారా? దాని ప్రకారం పోషకాలు అందుతున్నాయా అన్నది గమనించుకోండి. మీకు హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంది. బేబీ ఎదుగుదల సరిగా లేకపోవడానికి ఇది కూడా కారణమై ఉండొచ్చు. రక్తహీనత ఉంది కాబట్టి, ఎలాగూ అబార్షన్ అయ్యింది కదా ఇంకెందుకు అని ఐరన్, కాల్షియం వంటి మాత్రలు పక్కన పడేయొద్దు. తీసుకోవడం కొనసాగించండి. నీరసం తగ్గి పర్లేదు అనిపించాక ఉద్యోగంపై దృష్టిపెట్టండి. ఇప్పుడు మీరు కోలుకుంటేనే ఈసారి బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేలా శరీరం సిద్ధమవుతుంది. కాబట్టి, నిర్లక్ష్యం వద్దు. అలాగే ఈసారి ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకోవడానికి మూడు నెలల ముందు నుంచే ఫోలిక్ యాసిడ్ తీసుకోవడం మొదలుపెట్టండి. రక్తం, న్యూట్రిషనల్ స్టేటస్ వంటివీ చెక్ చేయించుకుంటే మేలు. మానసికంగానూ దృఢంగా ఉండండి. అబార్షన్‌కి చాలా కారణాలు ఉంటాయి. కోలుకున్నాక కారణాలేంటో వెతకండి. తిరిగి ఆ పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలూ తీసుకోండి.

అమ్మా... కంగారు పడకు!

ఇంటర్ పరీక్షలు దగ్గరపడ్డాయి. ఫిబ్రవరి కాస్తా అయిపోయిందంటే... స్కూలు, కాలేజీలన్న తేడా లేకుండా అందరికీ ఇక ఎగ్జామ్ ఫీవరే! పిల్లల సంగతేమో కానీ... అమ్మలకు మొదలవుతుంది కంగారు! వాళ్లు ఒత్తిడికి గురవుతారు. తెలియకుండానే పిల్లలనీ కంగారు పెడుతుంటారు. ఈ సమయంలో ఇది సరైనదేనా?



అమ్మను బట్టే పిల్లలు ధైర్యంగా తయారవుతారు అంటారు. అలాంటిది పరీక్షలు దగ్గరికి వచ్చేసరికి వాళ్లే రాస్తున్నట్టు కంగారుపడతారు తల్లులు. పిల్లలనీ బెంబేలెత్తిపోయేలా చేస్తుంటారు. ఇందుకు కారణం లేకపోలేదు. పరీక్షలు ఎలా రాస్తారో... సరిగా రాయకపోతే వాళ్ల భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న భయం. చదివించడం తల్లుల బాధ్యత అనే చాలామంది భావన. అందుకే సరిగానే చదివిస్తున్నామా? పొరపాటు చేస్తున్నామా అన్న కంగారు. ఎక్కడ విఫలమవుతారో, మిగతావారితో పోలిస్తే వెనకబడతారేమో అన్న అనుమానం... ఇలా ప్రేమ, బాధ్యత, అంచనాలు అన్నీ వెరసి వాళ్ల పరీక్షల్ని భూతంలా చూస్తుంటారు. పిల్లలకీ చూపిస్తుంటారు. ఇదేమో వాళ్లకి మేలు చేయకపోగా ఇంకా ఒత్తిడికి గురిచేస్తుంది. కాబట్టి, ముందు మీరు స్థిమితపడండి.

చిరునవ్వు ముఖ్యం

ఇంటి వాతావరణాన్ని మార్చగలిగేది మీరే. కాబట్టి, ముందు మీరు గాబరా పక్కనపెట్టండి. చక్కగా నవ్వుతూ ఉండండి. ఏమాత్రం ఒత్తిడి అనిపించినా శ్వాస వ్యాయమాలు చేస్తూ ప్రశాంతంగా ఉండండి. ఇది పిల్లలపైనా సానుకూల ప్రభావం చూపుతుంది.

చెక్ చేసుకోండి

ఆరోగ్యకరమైన ఆహారం నుంచి అవసరమైన సలహాల వరకూ ఇస్తున్నారా? పిల్లలూ చక్కగా చదువుకుంటున్నారా? చాలు. అలాగే కొనసాగనీయండి. ఏమవుతోందో, పేపర్ కష్టంగా వస్తుందేమో, సరిగా రాయరేమో అన్న నెగెటివ్ ఆలోచనలు వస్తే పక్కకు తోసేయండి. 'నా పిల్లలు వాళ్ల శక్తిమేరకు కష్టపడుతున్నారు. తరవాత సంగతి అప్పుడే చూసుకుందాం' అని సమాధానం చెప్పుకోండి. ఒత్తిడి మాయం అవుతుంది.

అవే వద్దు

పిల్లల మూడ్ ఆధారపడేది మనమీదే! చిరాకు, కోపం ఇలా ఏం ఆవరిస్తున్నా ప్రశాంతంగా ఉండటానికే ప్రయత్నించండి. అరవడం, శబ్దాలు చేయడం వంటివి వద్దు. టీవీ, ఫోన్ వగైరాలను పిల్లల ముందు వాడొద్దు. వాడినా వాటి శబ్దం వాళ్ల వరకూ చేరకుండా అయినా చూడండి. ఇల్లూ ప్రశాంతంగా ఉంటుంది. పిల్లలకు ధ్యాస మళ్లదు. మీకూ, పిల్లలకీ మధ్య అనవసర టెన్షన్ కూడా ఉండదు.

బ్రేక్ తీసుకోండి

పిల్లలను లేపాలంటూ తెల్లవారుజామునే లేవడం... అన్నీ అమర్చాలంటూ పనుల్లో మునిగిపోవడం... ఇవీ ఒత్తిడిని పెంచేవే. కాబట్టి, చిన్నచిన్న బ్రేక్‌లు ప్లాన్ చేసుకోండి. ఆరుబయట నడవడం, ప్రశాంతమైనచోట టీ తాగడం, వ్యాయామాలు, ఇయర్‌ఫోన్‌లు పెట్టుకుని పాటలు వినడం, మొక్కల మధ్య గడపడం వంటివి చేయండి. పిల్లలకు ఆరోగ్యకరమైనవి పెడితే చాలదు. మీరూ సమయానికి తీసుకోండి. నిద్రవేళలు పాటించండి. అప్పుడే ఒత్తిడి దూరంగా ఉంటుంది. ఓపికా నశించదు.

ఆ మాటలొద్దు

'సరిగా చదువు. లేదంటే ఎందుకూ పనికిరావు' మనం అనేది వాళ్ల మంచికే! కానీ వాళ్లకు చేరేది మాత్రం ప్రతికూల మాటే. వాళ్లు చదువుతున్నారో లేదో పదే పదే అనుమానంతో చెక్ చేయొద్దు. దీనివల్ల వాళ్లపై మీకు నమ్మకం లేదు అనుకోవచ్చు. నిజంగానే దేనికీ పనికిరామేమో అనీ భావించొచ్చు. చదువుకోమని చెప్పండి చాలు... అదీ మృదువుగా! వీలైతే మీరూ ఓ పుస్తకం తీసుకుని వాళ్లతో కూర్చోండి. తోడుగా ఒకరున్నా చదువుకోవడం బాగుంటుంది. నిజానికి ఎంతమంది టాపర్లు కాకుండా జీవితంలో విజయం సాధించలేదు చెప్పండి. కాబట్టి, మార్కులు, ర్యాంకుల కోసం పోరొద్దు. కంగారుపడకుండా, వేళలు పాటిస్తూ చదువుకోమని ప్రోత్సహించండి. మీ నమ్మకమే వాళ్లకి బోలెడు ధైర్యం.

పరీక్షలు జీవితంలో ఓ భాగం. ఇవే జీవితం కాదు. మార్కులు ఒక్కోసారి తగ్గొచ్చేమో. ఇంకోసారి సాధించొచ్చు. అదే ఆత్మవిశ్వాసం తగ్గితే కష్టం. కాబట్టి, మీరు ధైర్యంగా, స్థిమితంగా ఉండండి. మిమ్మల్ని చూసి పిల్లలూ అలాగే ఉంటారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయగలుగుతారు. మరి దాన్ని ఈ సమయంలో మీ పిల్లలకు బహుమతిగా ఇస్తారుగా?



వాపుల్ని తగ్గించే చామంతి తేనీరు!

చామంతి పూలను తల్లో పెట్టుకోవడం, అలంకరణకు ఉపయోగించడం, పూజకు వాడటం వంటివన్నీ తెలుసు... కానీ, దీంతో టీని కూడా తయారుచేసుకోవచ్చని తెలుసా? లేదంటే తాగి చూడండి. ఎన్నెన్ని ప్రయోజనాలున్నాయో మీకే అర్థమవుతుంది. చామంతుల్లో ఎన్నో రకాలున్నాయి. కానీ, క్రిసాంతిమమ్ మోరిఫోలియం, సి. ఇండికమ్... పువ్వుల నుంచి తయారైన, కెఫీన్ లేని కషాయమే ఇది. ఈ పూలను ప్రత్యేక పద్ధతుల్లో డ్రై చేసి అమ్ముతారు. తూర్పు ఆసియాలోని పలు దేశాల్లో ఇది చాలా పాపులర్. సాధారణంగా దీన్ని వేడి తగ్గించడానికీ, రోగ నిరోధకతను పెంచడానికీ వాడతారు. ఓ గ్లాసు బాగా మరిగిన నీళ్లల్లో నాలుగైదు పువ్వులను వేసి 3-4 నిమిషాలు ఉంచితే సరి. కాస్త ముడి చక్కెర లేదా తేనె కలుపుకొని తాగితే చాలు. విటమిన్ ఎ, సి, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలన్నీ లభిస్తాయి. ఇందులో అధికంగా ఉండే ఫ్లేవనాయిడ్లు... ఆక్సిడేటివ్ స్ట్రెస్, వాపుల్ని తగ్గిస్తాయి. అంతేకాదు, ఈ టీ చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. జుట్టునీ నిగనిగలాడేలా చేయగలదట. అయితే, గర్భిణులు, పాలిచ్చే తల్లులు వైద్యుల సలహా లేనిదే తీసుకోకూడదనే విషయం మరిచిపోవద్దు.

ప్రకృతిని పలకరించాల్సిందే!

ప్రకృతిలో సమయం గడిపితే ఆరోగ్యం, మానసిక ప్రశాంతత... వంటి ప్రయోజనాలెన్నో! కానీ నగరాల్లో ఇది సాధ్యమవుతుందా? అంటే, అవుతుందనే చెబుతున్నారు ప్రకృతి ప్రేమికురాలు రామలక్ష్మి పేరి. మహిళల కోసం ప్రత్యేకంగా నేచర్ వాక్స్ నిర్వహిస్తోన్న ఆమె వసుంధరతో ఆ విషయాల్ని పంచుకున్నారిలా...



తెలుగువాళ్లమే అయినా నాన్న ఉద్యోగరీత్యా గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లలో పెరిగాను. స్థానికంగా ఉండే అడవులూ, కొండకోనల్నీ ఎక్కువగా చూస్తూ ఎన్నో రకాల మొక్కలూ, జంతువుల్నీ గమనించాను. అలా ప్రకృతిపైన ఇష్టం ఏర్పడింది. పెళ్లి తర్వాత దిల్లీలో స్థిరపడ్డాం. మావారు మహేశ్వర్‌తో కలిసి కెరియర్స్ 360 మ్యాగజీన్‌ను ప్రారంభించాను. వారాంతాల్లో బర్డ్, ట్రీ వాక్‌లకు హాజరయ్యేదాన్ని. అప్పుడే నిధి బాత్రా పరిచయం అయ్యారు. తను ఆర్కిటెక్ట్. నగరాభివృద్ధి ప్రాజెక్టుల్ని డిజైన్ చేస్తారు. 'శ్రీప్రీతి' పేరుతో ఎన్జీవోని నిర్వహిస్తున్నారు. తనకూ చిన్నప్పట్నుంచీ మొక్కలంటే ఇష్టం. ఇద్దరం కలిసి వాక్‌లు నిర్వహించాలనుకున్నాం. 'విమెన్ అండ్ వైల్డర్‌నెస్' పేరుతో 2023 నుంచి వీటిని చేపడుతున్నాం. నగర జీవితంలో ఉండే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందడం, పర్యావరణం గురించి అవగాహన కలిగించడం ఈ వాక్‌ల ప్రధాన ఉద్దేశం. బాధ్యతలతో ఇళ్లకే పరిమితమయ్యే మహిళలు ప్రకృతికి దూరం కావడం గమనించి వాళ్లకోసం ప్రత్యేకంగా వాక్‌లు నిర్వహిస్తున్నాం. అలా వచ్చిన వాళ్లు కొత్త స్నేహితుల్నీ పొందుతారు. మహిళలతోపాటు 13 ఏళ్ల లోపు పిల్లలూ ఈ నడకలో భాగం కావొచ్చు. ఏడాదికోసారి మాత్రం అన్నివర్గాలూ పాల్గొనే వాక్ నిర్వహిస్తాం. స్కూళ్ల యాజమాన్యాలు కోరితే పిల్లలకూ టీచర్లకూ వీటిని నిర్వహిస్తుంటాం. చెట్లను గుర్తించే కార్యక్రమాన్ని పిల్లలకు నిర్వహిస్తాం. బటర్‌ఫ్లై వాక్స్, బర్డ్ వాక్స్ కోసం ఆ రంగంలోని నిపుణుల్నీ తీసుకొస్తాం.

దిల్లీ ఎంతో ప్రత్యేకం...

దేశ రాజధాని దిల్లీ అంటే మార్కెట్లు, ట్రాఫిక్, చారిత్రక కట్టడాలూ, కాలుష్యం... ఇవే గుర్తొస్తాయి. కానీ ఇది పచ్చదనం ఎక్కువగా ఉండే నగరం కూడా. ఎన్నో ఉద్యానవనాలూ, సరస్సులూ, అడవులూ, కొండలూ దీని చుట్టుపక్కల ఉన్నాయి. కానీ, నగరీకరణ కారణంగా పెద్దమొత్తంలో పచ్చదనం కనుమరుగవుతోంది. అందుకే జీవవైవిధ్యంపైన స్థానికుల్లో అవగాహన పెంచుతున్నాం. అలానే, దిల్లీ ప్రాదేశికంగా చాలా ముఖ్యమైన ప్రాంతం. నగరం పరిధిలో ఆరావళి పర్వతాలు విస్తరించి ఉన్నాయి. సెంట్రల్ రిడ్జ్ రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. ఆరావళి బయోడైవర్సిటీ పార్క్-గురుగ్రామ్, సంజయ్ వన్‌లను ఎక్కువగా సందర్శిస్తాం. వీటితోపాటు తిల్‌పథ్ వ్యాలీ, మాంగర్ బనీ, ఆరావళి బయోడైవర్సిటీ పార్క్- వసంత్ విహార్‌లో కూడా వాక్‌లు చేపడతాం. ఆరావళికే ప్రత్యేకమైన ఎన్నో మొక్కలు, చెట్లు ఉన్నాయి. నగరవాసులు కొన్నిసార్లు ప్రకృతిని పూర్తిగా మర్చిపోతారు. వాళ్లు తిరిగి ప్రకృతిలో భాగమయ్యేందుకు ఈ వాక్‌లు ఉపయోగపడతాయి. ప్రతి నగరంలోనూ ఇలాంటివి చేపట్టాలి.

ఒంటరిగా వద్దు...!

బరువు పెరిగిపోతున్నామన్న భయం, అనారోగ్యాలను తగ్గించుకోవాలనే ఆలోచన... వంటివాటితో ఎన్నో సార్లు వ్యాయామం చేయాలని అనుకుంటాం. కానీ, అడుగు మాత్రం ముందుకు పడదు. ఎక్కడ మొదలుపెట్టాలో తెలియదు, బయటికి వెళ్లడం కుదరదు. మరేం చేయాలంటే...



- వ్యాయామం ఒంటరిగా కాకుండా మరికొంతమందిని తోడు చేసుకుని మొదలుపెట్టండి. అలాగని బరువులెత్తాలి అనుకోవద్దు. అందరూ కలిసి సరదాగా వీధి చివరి వరకూ వెళ్లి రండి. తిరిగి వచ్చేటప్పుడు లిఫ్ట్ వాడకుండా మెట్లెక్కండి. ఇలా రోజూ ఒకే సమయానికి చేయండి. ఓ నెల రోజుల పాటు చేస్తే... శరీరం వర్కవుట్స్‌కి వీలుగా మారుతుంది. దీనికి ఓ ఇరవై నిమిషాల కంటే ఎక్కువ సమయం పట్టదు.
- పొద్దున్నే బయటకి వెళ్లి రావడం కష్టమే... అని డీలాపడిపోకండి. ఇంకోపనీ చేయొచ్చు. నేలపై నిటారుగా సుఖాసనంలో కనీసం ఓ అరగంటైనా కూర్చోండి. మధ్యమధ్యలో ఒకటో రెండు సార్లు పైకి లేవండి. ఇలా రోజూ సాధన చేస్తే జీర్ణక్రియలు సక్రమంగా జరుగుతాయి. శరీరమూ కాస్త మీ నియంత్రణలోకి వస్తుంది.
- వ్యాయామం చేస్తాను కానీ... ఉదయమే ఎక్కడ కుదురుతుంది? అంటారు కొందరు. అవును నిజమే అందరికీ సాధ్యపడకపోవచ్చు. రోజులో ఏదో ఒక సమయాన్ని కేటాయించుకోండి. ఆ సమయంలో టీవీలో నచ్చిన పాట పెట్టుకుని, చిన్న చిన్న మూమెంట్స్‌ని ప్రయత్నించండి. కనీసం ఓ పది రోజులైనా సాధన చేస్తే మీ శరీరం ఫ్లెక్సిబుల్‌గా మారుతుంది. మీరూ వ్యాయామం చేయడానికి బద్ధకించకుండా ఉంటారు. ఇలా శరీరానికి శ్రమను అలవాటు చేయడానికి ఓ నెలైనా కేటాయించుకోండి. అప్పుడు మీ సమస్యకు అనుగుణంగా ఏ రకమైన కసరత్తులు ఎంచుకోవాలో ఆలోచించండి. కచ్చితంగా అనుకున్నది సాధిస్తారు.

సులువుగానే పోతాయి... కానీ!

పనిచేస్తున్నప్పుడో, అనుకోకుండానో ఒక్కోసారి దుస్తులపై మరకలు పడుతుంటాయి. అవి మొండిగా మారకముందే సులువుగా వదిలించేయొచ్చు. అదెలాగంటే...



హెయిర్‌స్ప్రే: దుస్తులమీద పెన్ను గీతలు పడుతుంటాయి. ఇంకూ చిమ్ముతుంది. ముఖ్యంగా లేత రంగు దుస్తుల్లో ఇవి మరీ కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. అలాంటప్పుడు వెంటనే అక్కడ కాస్త హెయిర్‌స్ప్రే చేసి టిష్యూతో అద్దండి. మరక పోయేవరకూ... ఇలా మూడు నాలుగు సార్లు చేస్తే సరిపోతుంది.

నిమ్మరసం: మరకల్ని వదిలించాలనే ఆలోచనతో వెంటనే వేణ్నీళ్లు ఉపయోగించి శుభ్రం చేయొద్దు. ఇవి వాటిని మరింత మొండిగా మారుస్తాయి. పసుపు రంగుని తొలగించడానికి నిమ్మరసం, ఉప్పుని చల్లి... అరగంట తర్వాత అక్కడ బ్రష్‌తో రుద్దాలి. ఆపై చల్లటి నీటితో ఉతకండి. ఒక్కసారిగా పోదు కానీ... మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తే ఫలితం ఉంటుంది.

ఈ రెండింటినీ కలిపి దుస్తులపై తుప్పు మరకలు పడిన చోట రాసి ఉతికినా వదిలిపోతాయి.

వైట్ వినెగర్: పట్టు చీరలు, లేత రంగు దుస్తులపై చెమట మరకలు స్పష్టంగా కనిపిస్తాయి. అలానే డియోడరెంట్ మరకలూ అంతే! మరక పడిన ప్రాంతంలో వైట్ వినెగర్ చల్లి, పైన కాస్త బేకింగ్ సోడా రాసి... ఓ పదినిమిషాలు వదిలేయాలి. తర్వాత మృదువుగా రుద్ది, కుంకుడు రసంతో ఉతకండి. వదిలిపోతాయి.

వేసవికి... కూల్‌గా!



ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి కదూ! ఒకప్పుడు ఆ ప్రభావం నుంచి తప్పించుకోవాలంటే చీర కొంగులే మార్గం. చిన్నప్పుడు అమ్మ కొంగులో దాక్కొని ఎండను దాటిన జ్ఞాపకాలూ బోలెడే. ఇప్పుడు దాన్ని స్కార్ఫ్ భర్తీ చేసింది. అందుకే వేసవి జాడ కనిపించడం ఆలస్యం అమ్మాయిలు వాటిని బయటకు తీసేస్తారు. తేలికగా, గాలి ప్రసరణకు అనుకూలంగా ఉంటాయి. దీంతో ఎండ నుంచీ రక్ష, మేనికీ హాయి. ఏదేమైనా చెప్పండి. ఒక్కసారి వేసవి దాటిందంటే వాటిని బయటకు తీసే సందర్భాలు మాత్రం అరుదే. అందుకే ఈ కాలం వచ్చేవరకూ వార్డ్‌రోబ్‌లో అవో మూల ఎదురుచూస్తూనే ఉంటాయి. స్థలాన్ని ఆక్రమిస్తూనే ఉంటాయి. చున్నీలంటే డ్రెస్సుల మీదకి వేసుకుంటూ ఉంటాం కాబట్టి, పర్లేదు. ఇవలా కాదు. తీయలేము, అలాగని పనికి రావని కాదు. అందుకే ఇతర కాలాల్లో అవలా కనిపిస్తోంటే మనకీ చిరాకే. ఈ బెంగంతా ఎందుకని టూ ఇన్ వన్‌గా ఇలా స్కార్ఫ్‌లను దుపట్టా డిజైన్లలో తీసుకొస్తున్నారు. అంటే అటు స్కార్ఫ్‌లానూ వేసుకోవచ్చు. చున్నీలానూ వినియోగించుకోవచ్చు అన్నమాట. ప్లెయిన్ దుస్తుల మీదకి ఎలాగూ సెట్ చేసుకోవడం మనకు అలవాటే. ఈసారి అలా ఏమున్నాయో వెతుక్కుంటే సరి. మోడరన్ దుస్తుల మీదకీ వీటిని వేయడం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది. కాబట్టి, సంప్రదాయ దుస్తులకే వేయాలన్న బెంగా అవసరం లేదు. బాగున్నాయి కదూ! అయినా ఇప్పుడు వీటిని కొనడం అదనపు ఖర్చే అనిపిస్తోందా? అయితే వార్డ్‌రోబ్‌లో వెతికేయండి. అడపాదడపా వేసే డ్రెస్సులవీ, దుస్తులు చినిగినా చెక్కుచెదరకుండా ఉన్న చున్నీలు చాలానే కనిపిస్తాయి. వాటినే స్టోల్‌గా తీర్చిదిద్దేయండి. కాస్త ఫ్యాషన్ టెక్నిక్‌లు తెలిస్తే చాలు. ఎన్ని రకాలుగా అయినా వేసుకోవచ్చు. కలర్ మ్యాచింగ్, పొడవు అన్న నిబంధనలు ఎలాగూ స్కార్ఫ్/ స్టోల్‌కి వర్తించవు. ఇంకేం నచ్చినట్టుగా వేసుకోవచ్చు. ఎందుకు ఆలస్యం? ప్రయత్నించేయండి మరి. ఇంతకీ మీ ఓటు కొత్తదానికా? పాత దానికా?

ఫ్యాషన్ ఫ్యాషన్





ఆ అపోహలు పోవాలనే..!

పాఠశాలలో బెంచీలు ఖాళీగా ఉంటే ఏమనుకుంటాం ఆరోజు పిల్లలు స్కూల్‌కి రాలేదేమో అనుకుంటాం. అదే నెలలో ఎక్కువ రోజులు ఇదే పరిస్థితి ఉంటే... ఆలోచనలో పడతాం కదా! ఒకసారి ఇలాంటి పరిస్థితే ఎదురైంది సృష్టి బోస్ కి. ఆమె ఓ ప్రభుత్వ బాలికల పాఠశాల్ని చూడ్డానికి వెళ్లిందట. అక్కడ సీట్లన్నీ ఖాళీగా ఉండటానికి కారణం నెలసరే అని తెలుసుకున్న ఆమె వాళ్ల కోసం 'ప్రాజెక్ట్ ఎకోశానిటేషన్' మొదలుపెట్టి శానిటరీ ప్యాడ్స్‌ని తయారుచేస్తోంది.





సృష్టి

'సమాజంలో నెలసరిపై ఉన్న అపోహల్ని తొలగించడమే నా లక్ష్య'మంటున్న సృష్టిది బెంగళూరు. 'మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో కంప్యూటర్ సైన్స్ చదువుతోంది. చిన్నప్పటి నుంచి సామాజిక సమస్యలను పరిష్కరించడం సృష్టికి అలవాటు. అందులో భాగంగానే 'దగ్గర్లోని ఒక స్కూల్‌కి వెళ్లా. ఆ రోజు విద్యార్థులు తక్కువగా ఉన్నారు. ప్రిన్సిపల్‌ని కారణం అడిగితే, నెలసరి వచ్చిన ప్రతిసారీ బాలికలు ఇలానే స్కూల్ మానేస్తారని చెప్పారు. అది విని ఆశ్చర్యపోయా. కారణం అక్కడి బాలికలకీ, మహిళలకీ దీనిపై ప్రాథమిక అవగాహన లేకపోవడం. అందుకే వాళ్లలో అవగాహన కల్పించి, ఆలోచనలో మార్పు తేవాలనుకున్నా. దానికోసమే 'ప్రాజెక్ట్ ఎకోశానిటేషన్' కార్యక్రమాన్ని ప్రారంభించా'నంటోంది సృష్టి.

ఏడు రాష్ట్రాల్లో మా ప్రాజెక్టు

'గ్రామీణ ప్రాంతాల్లో రుతుక్రమంపై అవగాహన కల్పించడం కోసం గత ఏడాది దీన్ని మొదలుపెట్టా. ప్రారంభంలో ఒక్కదాన్నే. ఇప్పుడు నాతో 11మంది విద్యార్థులు పనిచేస్తున్నారు. అమ్మానాన్నలు చదువుకున్నారు. అందువల్ల మా ఇంట్లో నెలసరి గురించి బహిరంగంగానే చర్చించుకుంటాం. గ్రామాల్లో దాన్ని తప్పుగా భావిస్తారు. అందుకే దీనిపై అవగాహన పెంచేందుకు తరగతి గదులు, కమ్యూనిటీ హాళ్లు, గ్రామ పంచాయితీలనే ఎంచుకున్నాం. ప్రస్తుతం కర్ణాటక, బిహార్, రాజస్థాన్‌తో కలిపి మరో నాలుగు వర్క్‌షాప్‌లని నిర్వహించాం. కార్యక్రమంలో పాల్గొనేవాళ్లు ప్రశ్నలు అడుగుతుంటారు. వాటితోపాటు నెలసరి శుభ్రత, శారీరక మార్పులు, పీసీఓఎస్, ప్రత్యుత్పత్తి సమస్యలు.. ఇలా అన్నింటిపై అవగాహన కల్పిస్తున్నాం. దీనిలో ఆడామగా అనే తేడా లేకుండా ఇద్దరితోనూ వర్క్‌షాపులు నిర్వహిస్తాం. ప్రస్తుతం మా శానిటరీ నాప్కిన్స్ తయారీ దశలోనే ఉంది. తుది ఉత్పత్తిని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం. వీటి తయారీకి 70శాతం జనపనార, 30శాతం కాటన్ వాడుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో వీటిని ఉచితంగా అందించాలనుకుంటున్నా. ఇప్పటివరకూ 350 మందికి పైగా అమ్మాయిల్లో స్ఫూర్తిని తెచ్చింది మా ఎకో శానిటేషన్. 'బీ విజనీర్స్ మెర్సిడెస్ బెంజ్ ఫెలోషిప్' మాకు నిధులను అందిస్తోంది' అంటోంది సృష్టి.

మీకు తెలుసా!

అప్పుడే పుట్టిన శిశువు ఒంటిపై మైనపు పూత లాంటి తెల్లని పొర కనిపిస్తుంది. దాన్నే వర్నిక్స్ కేసీయోసా అంటారు. ఇది గర్భధారణ సమయంలోనూ, శిశువు జన్మించిన కొన్ని గంటల వరకూ చిన్నారి చర్మానికి రక్షణ కల్పిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి.



బంగారం - వెండి



19న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,58,070	1,43,850	2,48,889
విజయవాడ	1,54,910	1,43,450	2,60,000
ప్రొద్దుటూరు	1,54,500	1,42,140	2,54,000
రాజమహేంద్రవరం	1,56,490	1,43,450	2,70,000
విశాఖపట్నం	1,57,260	1,44,500	2,57,000
తమిళనాడు	-----	1,45,000	2,70,000

కృత్రిమ మేధకు 'మానవ్' శక్తి

(మొదటి పేజీ తరువాయి)

ఏఐని నైతికంగా వినియోగించడానికి ఆయన 3 సూత్రాలను ప్రతిపాదించారు. అవి..

1 డేటా సార్వభౌమత్వాన్ని కాపాడటం. ప్రతి ఒక్కరూ ఏఐ శిక్షణ కోసం స్పష్టమైన డేటా ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలి.

2 ఏఐ వేదికలు రక్షణ చర్యల విషయంలో స్పష్టమైన, పారదర్శకమైన విధానాలతో ఉండాలి. ఏఐకి మానవతా విలువలు ఉండాలి.

3 టెక్నాలజీ శక్తిమంతమైనది కావొచ్చు. కానీ దాని దిశను ఎల్లప్పుడూ మనుషులే నిర్ణయిస్తారు.



ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ మంతనాలు

ఏఐకి భారత్ భయపడదు

ఏఐకి భారత్ భయపడబోదని ప్రధాని స్పష్టం చేశారు. దానిని షేర్ చేసుకోవడం, ఓపెన్ కోడ్‌ల ద్వారా ప్రపంచానికి మంచి చేసేలా ఉపయోగించుకోవచ్చని నమ్ముతున్నామని తెలిపారు.

■ ఏఐ విషయంలో సంక్షేమం, సంతోషం తమ బెంచ్‌మార్క్ అని, వీటికి భరోసా కల్పించడంలో ప్రజలు ఏఐకి డేటాగా, ముడి సరకుగా ఉండకూడదని స్పష్టం చేశారు.

■ టెక్నాలజీపై మానవ నియంత్రణ ఉండాలని ప్రధాని స్పష్టం చేశారు. ఉదాహరణకు జీపీఎస్‌నే తీసుకుంటే.. అది ఎటు వెళ్లాలో సూచిస్తుందని, తుది నిర్ణయం మాత్రం మనమే తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

■ 'ప్రస్తుతం రెండు రకాల మనుషులున్నారు. ఏఐని చూసి భయపడేవారు కొందరైతే.. దానిని అదృష్టంగా భావించేవారు మరికొందరు. భారత్ ఇందులో అదృష్టాన్ని, భవిష్యత్తునే చూస్తోంది' అని ప్రధాని స్పష్టం చేశారు.

■ పాఠశాలల సిలబస్‌ను రూపొందించినట్లే ఏఐని పిల్లలకు సురక్షితంగా ఉండేలా చూడాలని మోదీ అభిప్రాయపడ్డారు. అది కుటుంబానికి దారి చూపేలానూ ఉండాలని స్పష్టం చేశారు.

చెల్లింపుల గతిని మార్చిన యూపీఐ

దేశంలో యూపీఐ చెల్లింపుల సమర్థతను ప్రధాని మోదీ ప్రస్తావించారు. క్లిష్ట సమయాల్లోనూ ప్రజలు సులభంగా చెల్లింపులు జరిపేలా భారత్ యూపీఐ ద్వారా భరోసా కల్పించిందని తెలిపారు. తద్వారా డిజిటల్ అంతరాలను తొలగించిందని వివరించారు.

■ ఇటీవలి సంవత్సరాల్లో మేం శక్తిమంతమైన డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల వ్యవస్థను నిర్మించామని, ఎందుకంటే టెక్నాలజీని శక్తిమంతమైన పరికరంగా కాకుండా.. సేవలకు మాధ్యమంగా వినియోగించుకుంటున్నామని ప్రధాని తెలిపారు.

టెక్నాలజీ, మానవత్వం మిళితం కావాలి: మెక్రాన్

ఏఐ సమ్మిళిత అభివృద్ధి కోసం టెక్నాలజీ, మానవత్వం మిళితం కావాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ పేర్కొన్నారు. ప్రస్తుతం భౌగోళిక ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని డిజిటల్ టూల్స్‌కు మార్గదర్శకత్వం కోసం సమగ్ర విధానం కావాలని పిలుపునిచ్చారు. భారత్, ఫ్రాన్స్ కలిసి ఏఐ ఫ్రేమ్‌వర్క్ కోసం ఉమ్మడిగా పని చేస్తాయని చెప్పారు. ఏఐ సమిట్ ప్లీనరీలో మెక్రాన్ ప్రసంగించారు. 'అందరం కలిసి విభజించడంపై కాకుండా కలిపి ఉంచడంపై, ధ్వంసం చేయడంపై కాకుండా సృష్టించడంపై, తీసుకోవడంపై కాకుండా పంచుకోవడంపై దృష్టి పెట్టాలి' అని మెక్రాన్ సూచించారు. 10 ఏళ్ల కిందట ముంబయిలోని వీధి వ్యాపారులు బ్యాంకు ఖాతాలు తెరవడం సాధ్యమయ్యేది కాదని, ప్రస్తుతం వారే తమ ఫోన్ల ద్వారా చెల్లింపులను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఇది టెక్నాలజీ స్టోరీయే కాదని, నాగరికత స్టోరీ అని వివరించారు. ఏ దేశమూ సాధించలేని డిజిటల్ గుర్తింపును భారత్ సాధించిందని తెలిపారు.

గుటెరస్‌సహా పలువురి హాజరు

ఏఐ సమిట్ ప్లీనరీకి ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, ఫ్రాన్స్, బ్రెజిల్, స్విట్జర్లాండ్, శ్రీలంక, సెర్బియా, ఎస్టోనియా అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా, గయ్ పార్మెలిన్, అనుర కుమార దిసనాయకే, అలెగ్జాండర్ వుచిక్, అలార్ కరిస్, భూటాన్, మారిషస్, క్రొయేషియా, ఫిన్లాండ్ ప్రధానులు షెరింగ్ తోబ్గే, నవీన్‌చంద్ర రాంగులాం, ఆండ్రెజ్ ప్లెంకోవిక్, పెటెరి ఆర్పో, సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్లైతోపాటు అగ్రశ్రేణి కంపెనీల సీఈవోలు హాజరయ్యారు.

■ ఏఐ సమిట్‌లో ప్రధాని మోదీ ప్రసంగాన్ని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసించారు. ఏఐపై దేశ దూరదృష్టిని, బాధ్యతను ఈ ప్రసంగం ప్రతిబింబించిందని పేర్కొన్నారు.

11 భాషల్లో ప్రధాని ప్రసంగం

ప్రధాని మోదీ ప్రసంగం సందర్భంగా ఏఐలో భారత్ సాధించిన పురోగతి ఆవిష్కృతమైంది. ఆయన ప్రసంగాన్ని రియల్ టైమ్‌లో 11 భాషల్లో అనువదించడమే కాకుండా సంజ్ఞల భాషలోనూ ప్రదర్శించారు. భారత్ మండపంలోని ఆడిటోరియంలో ప్రధాని ఇంగ్లిష్‌లో మాట్లాడుతుండగా ఆ వెనుకనే ఓవైపు సంజ్ఞల భాషను చూపించారు. సంజ్ఞల భాషను రియల్ టైమ్‌లో ఏఐ టెక్నాలజీ ఉపయోగించి ప్రదర్శించారు. ప్రధాని ప్రసంగాన్ని తెలుగు, తమిళం, అస్సామీస్, బంగ్లా, ఆంగ్లం, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ భాషల్లోకి అనువదించారు. వీటికి సంబంధించిన వీడియోలను ప్రధాని సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేశారు.



ఏఐ ఇంపాక్ట్ సదస్సులో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ తదితర టెక్ దిగ్గజాలతో ప్రధాని మోదీ

చేతులు కలపని ఆ సీఈవోలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు ప్రపంచ స్థాయి టెక్ లీడర్లంతా ఒకే వేదికపై కనిపించారు. వారంతా గ్రూప్ ఫొటో కోసం పోజిచ్చిన సమయంలో ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. పక్కపక్కనే నిల్చున్న ఇద్దరు సీఈవోలు చేతులు కలిపేందుకు ఇష్టపడలేదు. వారే ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్. ఈ పరిణామంతో వారిద్దరి మధ్య ఉన్న కోల్డ్‌వార్ మరోసారి బయటపడింది.

ఇద్దరి మధ్య సైద్ధాంతికపరమైన విభేదాలున్నాయి. 2021లో ఆంత్రోపిక్ ప్రారంభించిన సమయంలో దీనికి బీజం పడింది. దీని వ్యవస్థాపకులు డారియో, డానియెల్లా అమోడెయ్. వారిద్దరూ తోబుట్టువులు. ఈ ఇద్దరూ ఓపెన్‌ఏఐలో వైస్ ప్రెసిడెంట్ల హోదాలో పని చేశారు. అప్పుడు తమ బాస్‌గా ఉన్న ఆల్ట్‌మన్ విధానాలను విమర్శిస్తూ ఆ సంస్థను వీడారు. భద్రత కంటే వ్యాపారానికే ఆయన ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ఈ అభిప్రాయ భేదాలే ఇంపాక్ట్ సదస్సు వేదికపైనా కనిపించాయి.

విశాఖ గ్లోబల్ ఏఐ హబ్ అవుతుందని ఆనాడు ఊహించలేదు

- సుందర్ పిచాయ్

ఈనాడు, దిల్లీ: తాను ఐఐటీ ఖరగ్‌పుర్‌కు చెన్నై నుంచి కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లేటప్పుడు ఆ రైలు వైజాగ్ మీదుగా వెళ్లేది. అయితే ఆ సాగర నగరం ప్రపంచ ఏఐ హబ్‌గా మారుతుందని ఆనాడు ఊహించలేదని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. ఆయన ఇక్కడి భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు, వివిధ దేశాధినేతలు, కార్పొరేట్ దిగ్గజాల సమక్షంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

నేను భారత్‌కు వచ్చినప్పుడల్లా ఇక్కడ జరుగుతున్న మార్పుల వేగాన్ని చూసి ముగ్ధుడినవుతున్నా. ఇప్పుడూ అందులో ఏం తేడా లేదు. వైజాగ్‌లో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ హబ్‌ను ఏర్పాటుచేస్తోంది. ఇది భారతీయులకు ఉద్యోగాలతో పాటు, అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఏఐని అందుబాటులోకి తెస్తుంది. అంతర్జాలంలో డేటా సెంటర్ల ఏర్పాటుతో పర్యావరణ రోజు వస్తుందని కానీ, శాన్‌ఫ్రాన్సిస్కోలో తల్లిదండ్రులను డ్రైవర్‌లెస్ కారులో తీసుకెళ్తానని అనుకోలేదు. ఆరోజు 83 ఏళ్ల నా తండ్రి కళ్లలో కనిపించిన వెలుగు ఇప్పటికీ గుర్తుంది. అలాంటి క్షణం భారతదేశ రోడ్లపైన పనిచేస్తే చాలా సంతోషిస్తాను. ఆ రోజు ఆయన వ్యక్తం చేసిన కోరికను సాకారం చేయడానికి ఇప్పుడు మేం పనిచేస్తున్నాం.

చాలా చోట్ల పెట్టుబడులు పెడుతున్నాం

వైజాగ్‌తో పాటు థాయ్‌లాండ్, మలేసియా, ఇంకా చాలాచోట్ల పెట్టుబడులు పెడుతున్నాం. ఇండియా-యూఎస్ మధ్య విస్తృతస్థాయిలో సబ్‌సీ ఫైబర్ ఆప్టిక్ కేబుల్ ఏర్పాటుచేస్తున్నాం. వర్షాకాలంలో రైతుల జీవనోపాధి కాపాడే అంశంపై పనిచేస్తున్నాం. ఇందులోభాగంగా గత వేసవిలో భారత ప్రభుత్వం ఏఐ ఆధారిత వాతావరణ హెచ్చరికలను కోట్ల మంది రైతులకు పంపింది. భాషలను సమ్మిళితం చేయడానికి యూనివర్సిటీలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తున్నాం. సాంకేతిక పరిజ్ఞానం అద్భుతమైన ప్రయోజనాలను తీసుకొస్తుంది. ఆ ప్రయోజనాలు అందరికీ దక్కేలా చూడాలి. డిజిటల్ విభజన ఏఐ విభజనగా మారకూడదు. ఆ పరిస్థితి కల్పించకూడదు. అందుకే కంప్యూట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కనెక్టివిటీ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాం. ఏఐ వర్క్‌ఫోర్స్ సామర్థ్యాలను పూర్తిగా మారుస్తుంది. కొన్ని పాత్రలను ఆటోమేట్ చేస్తుంది, మరికొన్నింటిని పూర్తిగా మారుస్తుంది, సరికొత్త ఉద్యోగ మార్గాలను సృష్టిస్తుంది. 20 ఏళ్ల క్రితం ప్రొఫెషనల్ యూట్యూబ్ కంటెంట్ క్రియేటర్ అన్న వృత్తి లేదు. ఇప్పుడు కోట్లమంది ఉన్నారు. ఇందుకు శిక్షణ చాలా ముఖ్యం. గూగుల్ ఏఐ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏఐ ఉద్యోగాలను అందుకోవడానికి అవకాశం తెస్తుంది. మనం

అతిపెద్ద మార్పు ఏఐ

మన జీవితకాలంలో కనిపించిన అతిపెద్ద మార్పు ఏఐ. హైపర్ ప్రోగ్రెస్, సరికొత్త ఆవిష్కరణల మలుపులో ఉన్నాం. ఇది అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు పెద్ద ముందడుగు వేయడానికి చేయూతనిచ్చి వారసత్వంగా వస్తున్న లోపాలను సరిదిద్దుతుంది. ఏఐ ప్రతి ఒక్కరికీ సహాయకారిగా ఉంటుంది. మనం దాన్ని ధైర్యంగా స్వీకరించి, బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. సైన్స్‌లోని కఠిన సమస్యలను ఏఐ పరిష్కరిస్తుంది. 50 ఏళ్లుగా ప్రొటీన్ నిర్మాణాలను అంచనా వేయడం పెద్ద సవాల్‌గా ఉండేది. కానీ డెమిస్ హసాబిస్, గూగుల్ డీప్‌మైండ్‌లోని ఆయన బృందం ఆ సమస్యను ఏఐ ద్వారా ఎలా పరిష్కరించగలమని ప్రశ్నించుకున్నారు. ఆ ప్రశ్నే ఆల్ఫా ఫోల్డ్ ఆవిష్కరణకు దారితీసింది. అది నోబెల్ బహుమతి తెచ్చిపెట్టడమే కాకుండా ఎప్పటిలా సాగిన పరిశోధనలను ప్రపంచం ముందు పెట్టగలిగింది. ఇప్పుడు 190 దేశాల్లో 30 లక్షల మంది పరిశోధకులు మలేరియా టీకా అభివృద్ధి కోసం, యాంటీబయాటిక్ నిరోధకాలపై పోరాడటంతో, ఇతర కార్యక్రమాల కోసం దాన్ని ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు సైన్స్ సమస్యల్ని కొత్తగా చూసే ప్రశ్నల ఏఐని అడుగుతున్నాం.

ఎంత ధైర్యంగా ఉన్నామన్నది కాదు.. ఎంత బాధ్యతాయుతంగా ఉన్నామన్నది ప్రధానం. ఇందులో ప్రభుత్వాలు, రెగ్యులేటర్ల పాత్ర చాలా విస్తృతం. ఈ ప్రయాణంలో అవసరమైన నిబంధనలు రూపొందించి ఎదురయ్యే ముప్పును పరిష్కరించేలా వాటిని అమలుచేయాలి. ఇన్నోవేటర్లు ప్రజల జీవితాలను మెరుగుపరిచేలా సేవలను అందుబాటులోకి తీసుకురావాలి.

ఎన్నాళ్లీ ఉచిత పంపకాలు?

(మొదటి పేజీ తరువాయి)



ఉచితాలు మొదట తమ జేబుకే చేరాలంటున్నారు. ఇలాంటి విధాన నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వాలు పునస్సమీక్షించాల్సిన సమయం ఆసన్నం కాలేదా? విద్యుత్ ఉత్పత్తి, సరఫరా మధ్య కొంత లాభం కూడా ఉండాలని కోర్టు చెప్పొచ్చు. ప్రజలకు విద్యుత్ అందించడానికి ఉత్పత్తి, సరఫరా కోసం విద్యుత్తు సంస్థలు ఎంత మొత్తమైతే ఖర్చుపెడుతున్నాయో కనీసం ఆ మేరకైనా చెల్లించమని అడగండి. అలాకాకుండా కొన్ని రాష్ట్రాల్లో అన్నీ ఉన్నవారికి కూడా ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. భూస్వాములకు కూడా ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు' అని సీజేఐ అన్నారు.

ఎవరు మూల్యం చెల్లించాలి

'సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తూ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం మంచిదే. కానీ దానికి ఎవరు మూల్యం చెల్లించాలి? ఈ పథకాల అమలుకోసం ప్రభుత్వానికి డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది? అదంతా పన్ను చెల్లింపుదారులదే కదా? వాళ్లు తాము చెల్లిస్తున్న పన్నుల నుంచి మంచి రోడ్లు, ఆసుపత్రులు, ఇతర సౌకర్యాలు కోరుకోరా? ప్రభుత్వాలు కొందరి నుంచి డబ్బు తీసుకొని దాన్ని మరికొందరికి ఇస్తే ఎలా? ఇది కేవలం తమిళనాడుకే పరిమితంకాలేదు. చాలా రాష్ట్రాలకు చెందిన కేసులు ఇక్కడ పెండింగ్‌లో ఉన్నాయి. చాలా చోట్ల ఎన్నికలకు ముందు అకస్మాత్తుగా కొత్త పథకాలు అమలు చేస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు, నాయకులు ఆలోచించి పునస్సమీక్షించాల్సిన సమయం ఆసన్నమైంది. పెద్దమొత్తంలో ఉచితాలు పంచుకుంటూ పోవడం ద్వారా దేశాభివృద్ధిని దెబ్బతీస్తున్నారు. ఈ విషయంలో సమతౌల్యం ఉండాలి. ప్రభుత్వాలకు దీర్ఘకాలిక ప్రణాళికలు ఉండాలి. పిల్లలకు మంచి స్కూళ్లు, టీచర్లు, స్కాలర్‌షిప్‌లు, పుస్తకాలు, యూనిఫామ్‌లు ఇవ్వండి. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మంచి ప్రభుత్వ ఆసుపత్రులు నెలకొల్పండి. అలాంటి పనులను పక్కనపెట్టి ఉచిత పంపకాలను ఎంతకాలం కొనసాగిస్తారు? సంక్షేమ పథకాలు ఎలా అమలుచేయాలన్నది ప్రభుత్వాలే నిర్ణయిస్తాయి. అందులో మేం జోక్యం చేసుకోవాలని అనుకోవడంలేదు. రాష్ట్రాలు రెవెన్యూలోటులో ఉన్నా ఇలా ఉచితాలు పంచుకుంటూపోవడంపైనే మా ఆందోళనంతా. ఏడాదిలో వసూలయ్యే ఆదాయంలో కనీసం 25 శాతాన్ని కేవలం అభివృద్ధి కోసమే ఎందుకు కేటాయించకూడదు? అలా కాకుండా ఉదయం నుంచి ఆహారం, గ్యాస్, సైకిల్, స్కూటీ ఉచితంగా ఇస్తూపోతే ఎలా? ఇప్పుడు సంక్షేమం పేరుతో ప్రజలకు నేరుగా నగదు బదిలీ చేసే స్థాయికి వచ్చాం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఎందుకు పనిచేయాలి? అన్నీ ఉచితంగా వస్తాయనుకున్నప్పుడు వాళ్లు పనిచేయడం ఎక్కడి నుంచి నేర్చుకుంటారు' అని సీజేఐ ప్రశ్నించారు. ఈ కేసులో తమిళనాడు ప్రభుత్వం సంబంధిత పత్రాలు దాఖలు చేయాలని నోటీసులు జారీ చేశారు.



అంబటి ర్యాలీతో గుంటూరులో నిలిచిన ట్రాఫిక్

పోలీసులపై రాంబాబు చిందులు

(మొదటి పేజీ తరువాయి)

ర్యాలీ కొనసాగించారు.

గుంటూరులో ట్రాఫిక్ అంతరాయాలు

రాంబాబును ఆహ్వానిస్తూ వైకాపా శ్రేణులు గుంటూరు జిల్లా కాజ టోల్‌గేట్ వద్ద ఎదురెళ్లి ఆయన వాహనాన్ని ఆపాయి. హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో మంగళగిరి గ్రామీణ ఎస్సై వెంకట్ వచ్చి.. వాహనాలను పక్కన ఆపాలని కోరారు. దీంతో అంబటి ఆగ్రహంతో ఊగిపోయారు. 'నా వాహనాలను ఆపుతావా. నీ అంతుచూస్తా'నంటూ బెదిరించారు. తనతోపాటు అనుచరుల వాహనాలన్నీ పంపాలంటూ వాదించారు. కొంతదూరం వెళ్లాక కూడా వైకాపా శ్రేణులు అంబటి వాహనాన్ని ఆపారు. అక్కడే విధుల్లో ఉన్న మంగళగిరి గ్రామీణ సీఐ ఏవీ బ్రహ్మం వచ్చి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరారు. మళ్లీ రెచ్చిపోయిన రాంబాబు.. 'ఎక్కువ మాట్లాడితే ఇక్కడే కూర్చుంటా. చేతనైంది చేసుకో' అంటూ సీఐకి వేలుచూపించి తీవ్రస్వరంతో హెచ్చరించారు. భారీ కాన్వాయ్‌తో గుంటూరు నగరంలోకి వచ్చిన రాంబాబు బస్టాండ్ సమీపంలోనూ కొద్దిసేపు ఆగారు. నగరంపాలెంలో వంగవీటి రంగా విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం సిద్ధార్థనగర్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఆ పరిసరాల్లో వైకాపా శ్రేణులు భారీగా బాణసంచా కాల్చాయి. ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు అంబటి సతీమణి ఆయనకు దిష్టితీశారు.

ఆవేశపడొద్దంటూ సీఐకి సూక్తులు

ఆటోనగర్ వద్ద రాంబాబు పెదకాకాని సీఐ నారాయణస్వామితోనూ వాగ్వాదానికి దిగారు. వైజంక్షన్ వద్ద వైకాపా శ్రేణులను నియంత్రించడానికి పోలీసులు బారికేడ్లు పెట్టగా, వైకాపా కార్యకర్తలు దూసుకొచ్చి వాటిని తొలగించారు. ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాస్.. వైకాపా నేతలతో మాట్లాడి పంపించారు. 20 నిమిషాల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అదే సమయంలో కారులోంచి దిగిన రాంబాబు.. సీఐ నారాయణస్వామితో వాగ్వాదానికి దిగారు. 'మీరు పబ్లిక్ సర్వెంట్.. ఆవేశం వద్దు బ్రదర్. పర్సనల్‌గా తీసుకోకు' అంటూ హితోక్తులు పలికారు. ర్యాలీకి అనుమతి లేదని, ట్రాఫిక్ స్తంభించిపోకుండా తన విధులు తాను నిర్వర్తిస్తున్నానని సీఐ చెప్పగా, మా ఇంటిపై దాడి చేసినప్పుడు పోలీసులు ఏమయ్యారని అంబటి ప్రశ్నించారు. 18 రోజుల తర్వాత జైలు నుంచి ఇంటికి వెళ్తుంటే ఏమిటీ నిర్బంధాలు? పది మంది వచ్చి పలకరిస్తే తప్పా? అంటూ చిటపటలాడారు.

చంద్రబాబు నిత్య మోసగాడు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో విలేకర్లతో మూడుగంటలపాటు సుదీర్ఘంగా మాట్లాడారు. 'బడ్జెట్ అంతా అబద్ధాలు, మోసాలే. అంతా తప్పుడు లెక్కలు, చంద్రబాబు భజనే కనిపిస్తున్నాయి. అప్పులపై సాక్ష్యాధారాలతో మేం ఎన్నిసార్లు చెప్పినా.. చంద్రబాబు మళ్లీ అవే అబద్ధాలు చెబుతున్నారు. తల్లికి వందనం పథకాన్ని తల్లికి వంచనగా మార్చారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఏటా రూ.4వేల కోట్ల చొప్పున ఈ మూడు బడ్జెట్లలో రూ.12 వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. రూ.6,143 కోట్లు బాకీ పెట్టారు. ఉద్యోగులకు ఈ రెండేళ్లలో పైసా జీతం పెంచలేదు. ఐఆర్, పీఆర్సీ లేదు. వారికి రూ.35 వేల కోట్ల బకాయిలున్నాయి' అని పేర్కొన్నారు. 'ఆయన (చంద్రబాబు)కు, ఆయన కుమారుడికి, ఆయనకు మద్దతిస్తున్న ఉపముఖ్యమంత్రికి ఒక్కో విమానం, ఒక్కో హెలికాప్టర్ చొప్పున ఉన్నాయి. వాళ్లంతా గాల్లోనే! ముఖ్యమంత్రి కుమారుడు ఒక రోజు ఇక్కడుంటే రెండో రోజు హైదరాబాద్ వెళుతున్నారు. రాత్రికి కొలంబో వెళ్లి క్రికెట్ మ్యాచ్ చూస్తారు, ఉదయానికి ఇక్కడికి వచ్చేస్తారు. కొలంబోలో మ్యాచ్ ఆడితే ప్రైవేటు విమానంలో వెళ్లి చూస్తారా? ఇక్కడ టీవీలో చూస్తే మ్యాచ్ కనపడదా? ఇలా చేస్తుంటే రాష్ట్రానికి ఆదాయాలు ఎలా వస్తాయి? నేను కూడా నిన్న టీవీలోనే మ్యాచ్ చూశా' అని జగన్ వ్యాఖ్యానించారు.

తెదేపా హయాంలోనే ఇందాపూర్ డెయిరీకి టెండర్లు

'ఇందాపూర్ డెయిరీ తమ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ అని హెరిటేజ్ అధికారిక వెబ్‌సైట్‌లోనే ప్రకటించారు. దీనిపై దుమారం రేగడంతో.. కో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ అని మార్చారు. 2015లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే ఇందాపూర్ కేజీ రూ.278 చొప్పున తితిదేకి నెయ్యి సరఫరా చేసింది. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చాకే ఇందాపూర్ డెయిరీకి రూ.658 చొప్పున నెయ్యి సరఫరా టెండరు దక్కింది' అని జగన్ ఆరోపించారు.

తితిదేని ఏడు కొండలుగా గుర్తించింది వైఎస్సే

'తితిదేని ఏడు కొండలుగా గుర్తించి 746, 747 జీఓలిచ్చింది వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే. తితిదే పరిధిని 350 కి.మీ.కు పెంచింది ఆయనే. అన్యమత ప్రార్థనలను తితిదేలో, మరో 19 ఆలయాల్లో జరగకుండా కట్టడి చేస్తూ జీఓలు ఇచ్చింది కూడా వైఎస్సారే. తాను అధికారంలోకి రాగానే 746, 747 జీఓలను రద్దు చేస్తానని 2009 ఎన్నికల సమయంలో చంద్రబాబు మాట్లాడలేదా?' అని జగన్ ప్రశ్నించారు.

జగన్ ఒరిజినల్ నేరస్థుడు

(మొదటి పేజీ తరువాయి)

దృష్టి మరల్చేందుకు.. 35 ఏళ్లుగా ఎలాంటి మచ్చ లేకుండా నడుస్తున్న హెరిటేజ్ సంస్థపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. జగన్ గురువారం 3 గంటలపాటు నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఏకబిగిన అబద్ధాలు చెప్పి గిన్నిస్ రికార్డు సాధించారని ఎద్దేవా చేశారు. హెరిటేజ్‌పై చేసిన అసత్య ఆరోపణలన్నింటినీ తొలగించాలంటూ దిల్లీ హైకోర్టు ఇప్పటికే ఆదేశాలిచ్చిందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో అనిత గురువారం విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యాంశాలివీ..

ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్ నెయ్యి సరఫరా పచ్చి అబద్ధం

'హెరిటేజ్ కంటే రెట్టింపు పాలు సేకరించే ఇందాపూర్ డెయిరీని హెరిటేజ్‌కు ఓ యూనిట్ అనటం జగన్ అజ్ఞానానికి నిదర్శనం. హెరిటేజ్ సంస్థ ఎప్పుడూ ఎవరికీ ట్యాంకర్లతో నెయ్యి సరఫరా చేయలేదు. కేవలం వినియోగదారులకే నేరుగా విక్రయిస్తుంది. ఇందాపూర్ డెయిరీ నుంచి చీజ్, పన్నీరు వంటివి హెరిటేజ్ కొంటుంది తప్ప ఇందాపూర్‌కు ఏమీ సరఫరా చేయదు. ఈ వాస్తవాల్ని తొక్కిపెట్టి ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్ నుంచి నెయ్యి వెళ్తోందని, దాన్ని ఆ డెయిరీ తితిదేకు సరఫరా చేస్తోందంటూ జగన్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. 2015లో కిలో నెయ్యి ధర రూ.280- రూ.300 ఉండగా దాన్ని 2026లో రూ.650కు ఎలా పెంచుతారని ప్రశ్నిస్తున్న జగన్.. భారతి సిమెంట్స్ ధర 2014-15లో ఎంత ఉండేది? ఇప్పుడెంత ఉంది? అంటూ భారతిరెడ్డిని అడగాలి. 2015లో పాలప్యాకెట్ ధర రూ.19 ఉంటే ఇప్పుడు రూ.40. పాల ధర పెరిగినప్పుడు నెయ్యి ధర పెరగదా? పాలే లేకుండా నెయ్యి తయారు చేసే టెక్నాలజీ సొంతం చేసుకున్న తాడేపల్లి ప్యాలెస్‌కు ఇవన్నీ ఎలా తెలుస్తాయి? తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసి ఈ కేసులో నిందితుల జాబితాలో ఉన్న భోలేబాబా ఓరోగానిక్ డెయిరీకి, భోలేబాబా మిల్క్ ఫుడ్ ఇండస్ట్రీస్‌కి ఎలాంటి సంబంధమూ లేదు. భోలేబాబా మిల్క్ ఫుడ్ 2004లో ఏర్పాటైంది. భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ 2020లో వైకాపా హయాంలో పెట్టారు. ఆ రెండు వేర్వేరు సంస్థలని కంపెనీ ఐడెంటిఫికేషన్ నంబర్లు, డైరెక్టర్ల వివరాలు చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. ఐదేళ్లు సీఎంగా పనిచేసిన జగన్‌కు ఆ మాత్రం తెలీదా? డొల్ల కంపెనీలు పెట్టుకుని వ్యాపారం నడిపితే తెలివి ఇలాగే ఉంటుంది.

లోకేశ్ సొంత డబ్బులతో క్రికెట్ చూడ్డానికి వెళితే మీకేం నొప్పి?

మంత్రి నారా లోకేశ్ ఆయన సొంత డబ్బులతో ఫ్లైట్ టిక్కెట్ కొనుక్కొని, క్రికెట్ మ్యాచ్ చూడటానికి వెళ్తే మీకొచ్చిన నొప్పేంటి జగన్? లోకేశ్‌కు క్రీడాస్ఫూర్తి ఉంది కాబట్టే క్రికెట్ మ్యాచ్ చూడటానికి వెళ్లారు. ప్రపంచకప్ సాధించిన మహిళా క్రికెటర్లను ఇంటికి పిలిచి సత్కరించారు. జనాలు ఆయన్ను ఆదరించారు కాబట్టే ప్రజల కోసం పనిచేస్తూ ఆదివారం మ్యాచ్ చూడటానికి వెళ్లారు. మిమ్మల్ని (జగన్) జనాలు ఓడించి ఇంట్లో కూర్చోబెట్టారు కాబట్టే ఇంట్లో కూర్చొని చూస్తున్నారు.

పెన్ను.. పర్యావరణానికి దన్ను!

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఓ ఎన్జీవో విత్తనాలతో ఉన్న కాగితపు పెన్నులను పంపిణీ చేస్తోంది. వీటిని వాడిన తర్వాత మట్టిలో పడేస్తే వాటి వెనకున్న విత్తనాలు మొలకెత్తుతాయి. దీంతో పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుంది. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ అనే సంస్థ అహ్మదాబాద్, చెన్నై, హైదరాబాద్‌లో వీటిని ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పిస్తోంది. పర్యావరణం, స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వచ్చిన వారికి వీటిని ఉచితంగా అందిస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 160 కార్యక్రమాలు నిర్వహించారు. పెన్నులోని ప్లాస్టిక్ రీఫిల్ కూడా త్వరగా మట్టిలో కలిసిపోయేలా ఉంటుందని ఎన్జీవో కోఆర్డినేటర్ ఎల్.వి.రావు తెలిపారు.



– న్యూస్‌టుడే, పలాస

అవుతారా శ్రీవారి వైద్యసేవకులు

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తులను స్విమ్స్ వీసీ డా.ఆర్వీ కుమార్, బర్డ్ సంచాలకులు డా.గుడారు జగదీష్, ఎస్వీసీహెచ్ డైరెక్టర్ డా.శ్రీనాథ్‌రెడ్డి, తితిదే ఆసుపత్రుల సీఎంఓ డా.కుసుమ కుమారితోపాటు పలు విభాగాధిపతుల కమిటీ పరిశీలిస్తుంది. వారి సేవలు సద్వినియోగం చేసుకోవచ్చని భావిస్తే.. వారితో సంప్రదించాక తేదీలు ఖరారుచేస్తారు.

భూదేవి కాంప్లెక్స్‌లో కార్యాలయం

తితిదే భూదేవి కాంప్లెక్స్‌లోని కార్యాలయాన్ని శ్రీవారి వైద్యసేవకుల కార్యకలాపాల నిమిత్తం కేటాయించనున్నారు. అక్కడి నుంచే వైద్యుల ఎంపిక, వారి సేవల వినియోగం, ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు. వేదిక్ వర్సిటీ, స్విమ్స్ ఆసుపత్రి ప్రాంగణాల్లో వసతి సదుపాయాలు, రవాణా, ప్రముఖులకు అందించే భోజనాల తరహాలో వైద్యసేవకులకూ అందజేస్తారు.

బోధన.. పరిశోధనలపై దృష్టి

వివిధదేశాల్లో మెరుగుపడుతున్న ఆధునిక వైద్యవిధానాలు, బోధనా పద్ధతులు, పరిశోధన రంగాల గురించి తితిదే ఆసుపత్రుల్లోని వైద్యులు, విద్యార్థులకు ప్రముఖ వైద్యనిపుణుల ద్వారా అవగాహన పెంచేందుకు ఈ విధానం ఉపయుక్తం కానుంది. సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు అందుబాటులోకి రానున్నాయి. ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం.. రూ.లక్షల్లో డబ్బు ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితులు తగ్గుతాయి.

ప్రముఖులతో చికిత్స

బర్డ్, స్విమ్స్ ఆసుపత్రుల్లో ఇప్పటివరకు కొందరు ప్రముఖ వైద్యుల ద్వారా సేవలు అందించారు. అమెరికా, బ్రెజిల్ వైద్యనిపుణులు స్విమ్స్ ఐసీయూను పరిశీలించి సూచనలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కంటివైద్య నిపుణులు డా.వెంకటాచలం స్విమ్స్‌లో గ్లకోమా, శుక్లాల ఆపరేషన్లు, అతిథి ఉపన్యాసం చేశారు. ఆస్ట్రేలియాకు చెందిన పార్కిన్‌సన్స్ డిసీజ్ వైద్య నిపుణులు డా.పద్మకుమార్, సీనియర్ రేడియాలజిస్టు డా.ప్రహ్లాద్‌రాజ్, అపోలో కార్డియాలజిస్ట్ డా.యోగిష్ కరోరి, కిడ్నీ వైద్యనిపుణులు డా.దక్షిణామూర్తి, మదురై ఎయిమ్స్ సీఈవో డా.హనుమంతరావు స్విమ్స్‌లో వైద్యం అందించారు. బర్డ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యసేవకుల ద్వారా ఓపెన్ హార్ట్ సర్జరీలు చేయడంతోపాటు ఒకేసారి 30 మందికి మోకీళ్ల మార్పిడి చేశారు. హైదరాబాద్, బెంగళూరుకు చెందిన వైద్యులు ప్రతి నెలా బర్డ్‌కు వచ్చి సేవలు అందిస్తున్నారు.

సేవాభావంతో ముందుకు రావాలి



వైద్య, పరిశోధక రంగాల్లో నిష్ణాతులైన వైద్యులు, సిబ్బంది సేవాభావంతో ముందుకు రావాలి. ప్రముఖుల వైద్య విధానం, బోధనలు ఇక్కడి వైద్యులకు మార్గదర్శకంగా నిలుస్తాయి. స్వామి వారి దర్శనంతోపాటు వసతులు సమకూర్చుతాం.

– డా.ఆర్వీ కుమార్, వీసీ స్విమ్స్ యూనివర్సిటీ



పెద్ద కలలు కనేందుకు భయమేల?

పెద్ద కలలు కనేందుకు భయపడొద్దు. మీ కలలే మీ విజయానికి పునాది. స్పష్టమైన దూరదృష్టితోనే లక్ష్యసాధన ప్రారంభమవుతుంది. గొప్పగా ఆలోచించినప్పుడే గొప్ప అవకాశాలను పొందగలం. ధైర్యంగా కలలు కనండి. వ్యూహాత్మకంగా ముందడుగు వేయండి. నిలకడగా పనిచేయండి.

– వివేక్ బింద్రా, వ్యాపారవేత్త

చిన్నారిపై అత్యాచారయత్నం

బాలల సంరక్షణ కేంద్రానికి నిందితుడు

విశాఖపట్నం (గాజువాక), న్యూస్‌టుడే : మూడేళ్ల చిన్నారిపై ఓ కామాంధుడు అత్యాచార యత్నానికి పాల్పడడం విశాఖలో కలకలం రేపింది. నగరంలోని 64వ వార్డు గంగవరం పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు వివరాల ప్రకారం... బుధవారం సాయంత్రం నిందితుడు(17) బాలిక ఇంటికి వెళ్లాడు. ఆమెకు బిస్కెట్లు కొనిపెడతానని నమ్మించి.. ఎవరూ లేని ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న వారు గమనించి కేకలు వేయడంతో భయపడిన నిందితుడు ఏమీ ఎరగనట్టు చిన్నారిని తీసుకెళ్లి ఆమె ఇంటి ముందు వదిలి పరారయ్యాడు. బాలిక ఏడుస్తుండటంతో కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని న్యూపోర్టు ఠాణాకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి చిన్నారిని పరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అత్యాచార యత్నానికి పాల్పడ్డట్లు తేలడంతో న్యాయమూర్తి వద్ద హాజరుపర్చి.. బాలల సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు సీఐ తెలిపారు. అతడు జులాయిగా తిరుగుతూ అప్పుడప్పుడు బాలిక తండ్రితో కలిసి పనికి వెళ్లేవాడని తెలిసింది.

■ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఈ ఘటన గురించి విశాఖ పోలీసు కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు.



కూటమి తెచ్చిన కుటుంబ బడ్జెట్

- ఎక్కడా తగ్గకుండా సంక్షేమం అమలు
- మేం వచ్చాక 33% ఆదాయం పెంచాం
- గత ప్రభుత్వంలో అదంతా తాడేపల్లి ప్యాలెస్‌కే చేరింది
- వైకాపా నెవర్ ఎగైన్, కూటమి వన్స్ ఎగైన్
- బడ్జెట్‌పై చర్చలో మంత్రి పయ్యావుల కేశవ్


సభలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: 'వైకాపా ప్రభుత్వంలో పరదా లేని పర్యటన లేదు. అరెస్టు లేని శుక్రవారం లేదు. బూతు లేని మాట లేదు. తప్పు లేని ఉపన్యాసం లేదు. అబద్ధాలు లేని రోజు లేదు. కబ్జాలేని ఊరు లేదు. బెదిరింపు లేని యాత్ర లేదు. బాధలేని మనిషి లేదు. కోపం లేని సగటుజీవి లేడు' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ గుర్తు చేశారు. 'వైకాపా నెవర్ ఎగైన్, రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి వన్స్ ఎగైన్ అనేది అందరి నినాదం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని కుటుంబాల సమాహారంగా ఫ్యామిలీ బడ్జెట్ తెచ్చామని, ఎక్కడా తగ్గకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. అసెంబ్లీలో 2026-27 బడ్జెట్‌పై చర్చకు గురువారం మంత్రి సమాధానమిచ్చారు. రాయలసీమ అంతర్జాతీయ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు ద్వారా మన ఉద్యాన ఉత్పత్తులకు ప్రపంచస్థాయి ఖ్యాతి రానుందని చెప్పారు. చంద్రబాబుతోనే సీమ అభివృద్ధి సాధ్యమన్నారు. కేశవ్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

వైకాపా పెట్టిన బకాయిలన్నీ తీరుస్తున్నాం

వైకాపా ప్రభుత్వం పల్లెలు, పట్టణాల్లో 80 లక్షల టన్నుల చెత్త వదిలేసింది. ప్రతి ప్రభుత్వ శాఖలోనూ ఇలాంటి చెత్త మరెంతో ఉంది. ఉద్యోగుల నుంచి స్కూల్ పిల్లల చిక్కీల బిల్లుల వరకు అన్నింటినీ బకాయిపెట్టి పోయింది. అవన్నీ తీరుస్తున్నాం. వైకాపా ప్రభుత్వంలో 85 కేంద్ర పథకాలు నిలిపేస్తే రూ.18,700 కోట్లతో తిరిగి ప్రారంభించాం. 12.3% వడ్డీలకు తెచ్చిన రుణాలను రీషెడ్యూల్ చేశాం. నీటిపారుదల రంగాన్ని గాడిలో పెట్టాం. గత ప్రభుత్వం అమరావతిని ఆపేసింది. పోలవరాన్ని దాదాపు కూలదోసింది. వీటన్నింటినీ సరిదిద్దడానికే సమయమంతా సరిపోతోంది. కూటమి ప్రభుత్వ పారదర్శక విధానాలతోనే మైనింగ్‌లో 33% ఆదాయం పెరిగింది. ఎక్సైజ్‌లో 24% మేర అధికంగా ఆదాయం సాధించాం. రాత్రికి రాత్రే తాగేవాళ్ల సంఖ్య పెరగలేదు. ధరలూ పెంచలేదు. అయినా ఆదాయం పెరిగిందంటే గత ఐదేళ్లు ఈ ఆదాయం తాడేపల్లి ఖజానాకు వెళ్లిపోయినట్లే కదా? రాష్ట్రంలో 67.27 లక్షల మందికి 'తల్లికి వందనం' అందిస్తున్నాం. గత ప్రభుత్వంలో కంటే 50% మందికి అదనంగా ఇస్తున్నాం. 48 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.6 వేల కోట్లు ఇప్పటికే అందించాం. స్త్రీ శక్తి పథకంతో కుటుంబానికి నెలకు రూ.3 వేల వరకు ప్రయాణ ఖర్చు తగ్గుతోంది. ఎన్టీఆర్ భరోసాతో దేశంలోనే అత్యధికంగా ఏడాదికి రూ.33 వేల కోట్లు పింఛన్లు ఇస్తున్నాం.

పులివెందులలో పనులకూ బకాయిలు పెట్టిన జగన్

జగన్ ఏదో అద్భుతాలు చేశామని చెబుతున్నారు. ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలో తాగు నీటి ప్రాజెక్టుకు రూ.19 కోట్లు, మున్సిపాల్టీలో రూ.34 కోట్లు, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి రూ.23 కోట్లు బకాయిలు పెట్టివెళ్లారు. అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సొంత నియోజకవర్గం డోన్‌లో జాబితా మరింత పెద్దది. అక్కడ జేజేఎం పనులు గొప్పగా చేయించామని చెబుతున్నారు. ఆ బిల్లులన్నీ కూటమి ప్రభుత్వం చెల్లిస్తోంది. రాయలసీమ లిఫ్ట్ 'పేరుతో జగన్ ఇప్పుడు రాజకీయం చేస్తున్నారు. చంద్రబాబు ఏదో చేసేశారని అంటున్నారు. జగన్ హయాంలో సీఎస్‌గా ఉన్న ఆదిత్యనాథ్‌దాస్ నీటిపారుదలశాఖ ఈఎన్‌సీగా పనిచేసిన వ్యక్తి.. మేం ప్రాజెక్టు కట్టడం లేదని, కేవలం డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో అఫిడవిట్ వేయలేదా? దీంతో ఎన్జీటీ ఆపేస్తే.. తూచ్ అది తాగునీటి ప్రాజెక్టు అన్నారు. అదీ పూర్తి కాలేదు. మీ హయాంలో ఆగిపోయిన ప్రాజెక్టుకు మాపై బురదజల్లుతారా? పట్టిసీమకు రూ.1,200 కోట్లు పెడితే రచ్చ రచ్చ చేశారు. ఆ ప్రాజెక్టు రూ.44 వేల కోట్ల సంపద సృష్టించింది. సీమలో జలజగడాలకూ స్వస్తిపలికింది. జగన్ సీఎం అయ్యాక రాయలసీమకు గతంలో మంజూరు చేసిన 102 నీటిపారుదల ప్రాజెక్టులను రద్దు చేశారు. వాళ్ల క్షమాపణలు చెప్పాల్సింది పోయి మమ్మల్ని చెప్పమంటారా? జగన్ హయాంలో ఒక్క ప్రాజెక్టయినా వచ్చిందా? కనీసం ఒక్క ఎంఎస్ఎంఈ ప్రాజెక్టయినా తెచ్చారా? అలాంటి మీరు కూటమి ప్రభుత్వం తెచ్చిన భూముల కేటాయింపు పాలసీని విమర్శిస్తారా? మేం తొలి సంతకం పెట్టామని మెగా డీఎస్సీకి ఎన్నో అడ్డంకులు సృష్టించారు. అంతకంటే పది రెట్లు కష్టపడి చట్టపరంగా ఇబ్బందులు రాకుండా 15 వేల మందికి ఉద్యోగాలు ఇప్పించిన విద్యా శాఖ మంత్రి లోకేశ్‌ను అభినందించాల్సిందే.

జగన్ అరాచకాల్ని ప్రతి రోజూ ప్రజలకు చెప్పాలి

జగన్ పాలనలో మనం, మన పిల్లలు ఏ రకమైన నష్టాలు చూశామో, మళ్లీ వస్తే రాబోయే తరం ఏ విధంగా నష్టపోతుందో ప్రజలందరికీ ప్రతిరోజూ వివరించి చెప్పాలి. లేకపోతే వారు మరిచిపోయే ప్రమాదముంది. ఈ తరంతోపాటు రాబోయే తరం కోసం కూడా చంద్రబాబు కష్టపడుతున్నారు. జాతీయ పత్రికలు తాజాగా 'నాయుడు గిరి' అనే కొత్త పదం సృష్టించాయి. దేశంలో అత్యధిక పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయని జాతీయ పత్రికలు విశ్లేషిస్తున్నాయి.

హార్టికల్చర్ హబ్‌లో రూ.70 వేల కోట్ల ప్రైవేట్ పెట్టుబడులు

రాయలసీమ హార్టికల్చర్ హబ్ ద్వారా నీటిపారుదల ప్రాజెక్టులు రానున్నాయి. సీమలో మొదటిసారి పొలాల్లోకి పెట్టుబడులు మొదలయ్యాయి. బయటి నుంచి వచ్చి ఇక్కడ వ్యవసాయ భూములు కొంటున్నారు. ప్రైవేట్ పెట్టుబడులే రూ.60 వేల నుంచి రూ.70 వేల కోట్లు వచ్చేలా హార్టికల్చర్ హబ్‌ను ప్రభుత్వం డిజైన్ చేసింది. గత ప్రభుత్వంలో సీమలో అన్నమయ్య ప్రాజెక్టు కూలిపోతే తిరిగి చూడలేదు. హంద్రీనీవాలో గంప మట్టి తీయలేదు. మేమొచ్చాక వంద రోజుల్లో హంద్రీనీవాను విస్తరించాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడపగలుగుతున్నామంటే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయమే కారణం. కూటమికి ప్రజలు ఓట్లేసిందునే రాష్ట్రం పడిపోకుండా నిలబడింది.

త్వరలో డీఎస్సీ



- మంత్రి నారా లోకేశ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: జాబ్ క్యాలెండర్ కింద త్వరలోనే డీఎస్సీ ప్రకటించనున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వెనకబడిన ప్రాంతమైన కర్నూలు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో విద్యా, ఉపాధి అవకాశాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. 'సమగ్ర శిక్షా అభియాన్‌'పై గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే ఈశ్వరరావు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేసే ఉద్యోగులకు.. ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడుతో పోలిస్తే ఏపీలోనే జీతాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో మూడు నెలలకోసారి జీతాలిచ్చేవారు. ఇప్పుడు ఒకటో తేదీనే ఇస్తున్నాం. జీతాల పెంపు అంశాన్ని వచ్చే సమావేశంలో కేంద్రంతో చర్చిస్తాం' అని వివరించారు. కర్నూలు ప్రాంతంలో అవసరమైన మేరకు సీజనల్ వసతి గృహాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. 'యువగళం సందర్భంగా ఆదోని, ఆలూరు, మంత్రాలయం ఎంత వెనకబడి ఉన్నాయో ప్రత్యక్షంగా చూశా. కర్నూలు ప్రాంతానికి వచ్చే పరిశ్రమలకు అదనపు ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. డీఎస్సీలోనూ కర్నూలు జిల్లాకు ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేశాం. అయినా ఉపాధ్యాయుడు, విద్యార్థుల నిష్పత్తి తక్కువగా ఉంది. ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం' అని హామీ ఇచ్చారు.

- కర్నూలులో క్లస్టర్ విశ్వవిద్యాలయానికి రూ.139 కోట్లు మంజూరయ్యాయని.. అందులో రూసా కింద రూ.55 కోట్లు ఖర్చయ్యాయని మంత్రి నారా లోకేశ్ వివరించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. క్లస్టర్ విశ్వవిద్యాలయ ఏర్పాటులో భాగంగా మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.74.5 కోట్లు అవసరమని, వచ్చే విద్యా సంవత్సరంలో వాటిని మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

పీపీపీలో రాజధాని ఇన్నర్ రింగ్‌రోడ్

- ఆరు నెలల్లోగా భూసమీకరణ: మంత్రి నారాయణ



రాజధాని అమరావతి ప్రాంతంలో ఇన్నర్ రింగ్ రోడ్‌ను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నిర్మించనున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. అవసరమైన భూముల్ని భూసమీకరణ, భూసేకరణ విధానంలో తీసుకోనున్నట్లు చెప్పారు. రాజధానిలో ట్రంక్ రోడ్ల నిర్మాణానికి వివిధ ఆర్థిక సంస్థల నుంచి రూ.40,887 కోట్లు సమకూర్చామని, 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'రెండు దశల్లో 70 మీటర్ల వెడల్పుతో 8, 4 వరుసలతో 96 కి.మీ. పొడవున ఇన్నర్ రింగ్ రోడ్డు డిజైన్ చేశాం. కేతనకొండ నుంచి నున్న వరకు 67.6 కి.మీ., రెండో దశలో నున్న నుంచి కేతనకొండ వరకు వయా కొండపల్లి అటవీ ప్రాంతంలో సాగుతుంది. మొదటి దశలో గుంటూరు జిల్లాలో 14, పల్నాడులో 3, కృష్ణాలో 6, ఎన్టీఆర్ జిల్లాలో 3 గ్రామాలు కలిపి మొత్తం 26 గ్రామాల్లో సాగుతుంది. డీపీఆర్ పూర్తయింది. ఆరు నెలల్లో భూసమీకరణ పూర్తి చేయాలని ఆదేశాలిచ్చాం. ట్రంక్ రోడ్లకు 55 పనులు చేపట్టాం. 45 పనులకు సంబంధించి రూ.18,779 కోట్లతో టెండర్లు పూర్తి చేశాం. ట్రంక్‌రోడ్లు, లేఅవుట్ రోడ్లు, భవనాలకు రూ.6,289 కోట్లు చెల్లించాం' అని వివరించారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కేటాయింపులు

- మూలధన వ్యయం పెంపు.. బడ్జెట్‌కు బలం

ఈనాడు, అమరావతి: మూలధన వ్యయానికి రూ.53 వేల కోట్లు కేటాయించడం రాష్ట్ర బడ్జెట్‌కు ఉన్న బలానికి సంకేతమని ఎన్డీయే భాగస్వామ్య పార్టీల ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కేటాయింపులున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళల సంక్షేమానికి, సాగునీటి, పారిశ్రామికరంగాల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారని వెల్లడించారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల తలరాతను మార్చే బడ్జెట్ అని, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని సంపద సృష్టి వైపు నడిపిస్తుందని పేర్కొన్నారు. ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటు వెనుక భవిష్యత్తు ఆదాయాన్ని సృష్టించే వ్యూహం ఉందన్నారు. గురువారం శాసనసభలో బడ్జెట్‌పై ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే..

వెలిగొండ పనులు వేగిరం

– అశోక్‌రెడ్డి, గిద్దలూరు

ఐదేళ్ల పాలనలో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా వైకాపా నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పారు. కూటమి ప్రభుత్వం రెండు బడ్జెట్‌లలోనూ ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు వేగిరం చేసింది. జల్ జీవన్ మిషన్ కింద ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పశ్చిమ ప్రకాశం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు రూ.1,200 కోట్లు కేటాయించారు.

పల్లె పండుగ కింద మురుగుకాల్వలు నిర్మించాలి

– షాజహాన్ బాషా, మదనపల్లె

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.18 వేల కోట్లు కేటాయించడం సంతోషం. కూటమి ప్రభుత్వం చేపట్టిన పనుల కారణంగా హంద్రీ-నీవా కాలువ ద్వారా మదనపల్లె నియోజకవర్గంలో 170 చెరువులు నింపాం. 900 అడుగుల లోతులో ఉండే భూగర్భజలాలు ఇప్పుడు 250 అడుగుల పైకి చేరాయి. పల్లె పండుగ కింద గ్రామాల్లో రోడ్లు వేస్తున్నారు. ఈ పథకం రెండో విడతలో రహదారులు వేసిన చోట మురుగుకాల్వలు కూడా నిర్మించాలి.

మహిళా ప్రగతికి రూ.91 వేల కోట్లు

– తంగిరాల సౌమ్య, నందిగామ

మహిళల ఉన్నతికి రూ.91 వేల కోట్లు కేటాయించడం అభినందనీయం. స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం పథకాలు మహిళలకు ప్రభుత్వమిస్తున్న గౌరవ కానుకలు. అమరావతికి రూ.6 వేల కోట్లు, పోలవరానికి రూ.6,105 కోట్లు కేటాయించడం.. ఆ రెండు ప్రాజెక్టులపై ప్రభుత్వ పట్టుదలకు నిదర్శనం. మంత్రి లోకేశ్ మానవ వనరుల శాఖ మంత్రిగా మానవీయ కోణంలో వ్యవహరిస్తూ, రాజకీయాల్లో హ్యూమన్ టచ్ అంటే ఏంటో నిరూపిస్తున్నారు.

'డ్వాక్రా' నిధుల దుర్వినియోగంపై నేడు శాసనసభలో చర్చ

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో డ్వాక్రా సంఘాల నిధుల దుర్వినియోగంపై శుక్రవారం శాసనసభలో చర్చ చేపట్టనున్నారు. శాఖల వారీగా బడ్జెట్ గ్రాంట్లు, డిమాండ్లపై చర్చను ప్రారంభించనున్నారు. హోం, రెవెన్యూ, ఎనర్జీ, న్యాయశాఖల డిమాండ్లపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. పుష్కరాల నేపథ్యంలో గోదావరి నదిలో కాలుష్యం, గురజాల నియోజకవర్గంలో సిమెంట్ ఫ్యాక్టరీలకు భూములు, ప్రైవేటు వాహనాల నియంత్రణ, పురావస్తు ప్రదేశాల్లో తవ్వకాలు, శ్రీకాకుళం జిల్లాలో ఖనిజ తవ్వకాలు తదితరాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రులు ప్రశ్నోత్తరాల సమయంలో సమాధానాలివ్వనున్నారు.

శాసనమండలిలో..: ప్రభుత్వ పాఠశాలల్లో చేనేత యూనిఫామ్, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్, గిరిజన యువతకు అందిస్తున్న పథకాలు, శ్రీశైలం ఆనకట్ట భద్రతా చర్యలు, జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తుల సేకరణ, పీ-4 పథకం తదితరాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల మంత్రులు సమాధానాలివ్వనున్నారు.

చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియని బొత్స

- హెరిటేజ్ ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు వైకాపా కుట్ర
- మండలిలో విరుచుకుపడిన మంత్రి అచ్చెన్నాయుడు
- వరుసగా మూడో రోజూ సభ సాగనివ్వని వైకాపా

ఈనాడు, అమరావతి: చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియని ప్రతిపక్షం ఉండటం మన దౌర్భాగ్యమని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారాన్ని అడ్డంపెట్టుకుని సొంత కంపెనీలు భారతి సిమెంట్స్, పత్రికకు రూ.కోట్లు దోచిపెట్టిందని ఆరోపించారు. 'ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్ సంస్థకు సంబంధం ఉన్నట్లు చిన్న ఆధారమైనా తీసుకురావాలని వైకాపా సభ్యులను సవాల్ చేశాం. ఆధారాలు తీసుకురాకపోగా కనీస పరిజ్ఞానం లేకుండా చీజ్ ప్యాకెట్‌ను చూపించి నెయ్యి అని మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను ఏమనాలో అర్థం కావడం లేదు. వైకాపా హయాంలో జరిగిన తిరుమల కల్తీ నెయ్యి అంశాన్ని పక్కదారి పట్టించేందుకు హెరిటేజ్ సంస్థపై అభాండాలు మోపుతున్నారు' అని అచ్చెన్నాయుడు వైకాపా సభ్యుల ఆరోపణలకు మండలిలో గట్టిగా సమాధానమిచ్చారు. గురువారం ఉదయం సభ ప్రారంభమైన వెంటనే హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ తితిదేకి నెయ్యి సరఫరా చేయడం, తిరుపతి లడ్డూ ప్రసాదం అంశంపై చర్చించేందుకు వైకాపా ఎమ్మెల్సీలు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ మోషేనురాజు తిరస్కరించారు. దీనిపై చర్చకు అనుమతించాలని వైకాపా సభ్యులు ప్లకార్డులు చేతబూని పోడియంలోకి చొచ్చుకొని వచ్చారు.



ఛైర్మన్ కుర్చీని చుట్టుముట్టి, ఈలలు ఊదుతూ సభలో గందరగోళం సృష్టించారు. ఒకసారి తిరస్కరించాక చర్చకు పట్టుబట్టడం భావ్యం కాదని ఛైర్మన్ ఎంతగా చెబుతున్నా వైకాపా సభ్యులు ఆందోళన విరమించలేదు.

ఒక్క ఆధారమూ తేలేకపోయారు

మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్‌కు సంబంధం ఉన్నట్లు ఒక్క చిన్న ఆధారం ఉన్నా పది రోజులైనా చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వైకాపా సభ్యులు ఒక్క ఆధారాన్నీ తీసుకురాలేదు. నేను సభలో మాట్లాడిన మాటలపై ప్రతిపక్ష నేత బొత్స బయటకు వెళ్లి విలేకర్లతో మాట్లాడారు. చీజ్ ప్యాకెట్ చూపిస్తూ నెయ్యి అంటూ అసత్య ప్రచారం చేశారు. దీనిపై ఆయనకు హెరిటేజ్ లీగల్ నోటీసు ఇచ్చింది' అని పేర్కొన్నారు. నిరాధార ఆరోపణలతో మూడు రోజులుగా సభ నిర్వహణకు ఆటంకం కలిగిస్తున్న వైకాపా సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఛైర్మన్‌ను కోరారు. ఏ రాష్ట్ర ప్రభుత్వంతోనూ వ్యాపార ఒప్పందం చేసుకోకూడదని హెరిటేజ్ సంస్థ నిర్ణయం తీసుకుందని అచ్చెన్నాయుడు చెప్పారు. వైకాపా హయాంలో జగన్ సంస్థలు ప్రజాధనాన్ని విచ్చలవిడిగా దోచుకున్నాయని, హెరిటేజ్ అలాంటి పని చేయదని స్పష్టం చేశారు.

ప్రభుత్వం భయపడుతోంది

– బొత్స సత్యనారాయణ, మండలిలో ప్రతిపక్ష నేత

'ఇందాపూర్ డెయిరీతో హెరిటేజ్‌కు సంబంధం ఉందంటూ మేం సభలో ప్రస్తావించడంతో ప్రభుత్వం భయపడుతోంది. ఇందాపూర్ డెయిరీ పేరుతో హెరిటేజ్ సంస్థ దోచుకుంటోంది. దేవదేవుణ్ని వీధిలోకి తీసుకొచ్చింది ముందు ఎవరు? ఇలాంటి పరిస్థితి ఎన్నడైనా రాష్ట్రంలో చూశామా? రండి సభలో చర్చిద్దాం' అంటూ బొత్స కొన్ని కాగితాలను సభలో చూపారు.



అంతా కలిసి.. 14 నిమిషాలే!

వైకాపా పదేపదే అడ్డుతగలడంతో గురువారం కేవలం 14 నిమిషాలు మాత్రమే సభ కొనసాగింది. ఉదయం 10.04 గంటలకు సభ ప్రారంభమవగానే ఛైర్మన్ మండలిలో చర్చించనున్న అంశాలు, బిల్లుల గురించి ప్రస్తావించారు. వైకాపా సభ్యులు ఇందాపూర్ డెయిరీ నెయ్యి అంశంపై చర్చకు పట్టుపట్టి ఆందోళనకు దిగడంతో 10.14 గంటలకు ఛైర్మన్ వాయిదా వేశారు. 10.57కు తిరిగి సభ ప్రారంభమైనా వైకాపా సభ్యులు అదే తీరులో వ్యవహరించడంతో 11 గంటలకు రెండోసారి వాయిదా వేశారు. మధ్యాహ్నం 12.42 గంటలకు మూడోసారి సమావేశమైనప్పుడూ అదే వాతావరణం ఉండటంతో సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు 12.43 గంటలకు ఛైర్మన్ ప్రకటించారు.


వైకాపా ఎమ్మెల్సీలను అదుపు చేయాలని ఛైర్మన్‌ను కోరుతున్న మంత్రులు, తెదేపా ఎమ్మెల్సీలు

చేనేతలు, సెలూన్లకు ఏప్రిల్ నుంచి ఉచిత విద్యుత్తు



- మంత్రి గొట్టిపాటి రవికుమార్

చేనేతలు, సెలూన్లకు ఉచిత విద్యుత్తును ఏప్రిల్ నుంచి అందించనున్నట్లు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. 'ఆక్వా చెరువులు నమోదు చేసుకున్న రైతులకు యూనిట్ రూ.1.50 చొప్పున ఇస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక 1,02,535 మందికి వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు అందించాం. పెండింగ్‌లో ఉన్న 46 వేల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు వ్యవసాయ సీజన్ మొదలయ్యేలోగా పూర్తి చేస్తాం' అని అసెంబ్లీలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'విద్యుత్తు ఛార్జీలు పెంచడం తప్పితే తగ్గించడం ఎప్పుడూ చూడలేదు. మొదటిసారిగా యూనిట్‌కు 13 పైసలు తగ్గించడం అభినందనీయం. మినీ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా మహారాష్ట్రలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ఏపీలోనూ దీన్ని ప్రోత్సహించాలి' అని కొణతాల కోరారు.

క్రైస్తవులకు జగన్ చేసిందేమీ లేదు

- మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్



క్రైస్తవుడినని చెప్పుకొనే మాజీ సీఎం జగన్.. వారికోసం చేసిందేమీ లేదని మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ విమర్శించారు. 'గతంలో తెదేపా ప్రభుత్వం గుంటూరులో క్రైస్తవ భవనానికి రెండెకరాల భూమితో పాటు రూ.20 కోట్లు కేటాయించినా.. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కడప హజ్ భవనం పనులు పూర్తి చేయలేదు. చర్చిల నిర్మాణానికి 2014-19 మధ్య రూ.95 కోట్లు మంజూరు చేయగా.. 2019-24 మధ్య జగన్ హయాంలో ఇచ్చింది రూ.4.12 కోట్లు మాత్రమే. క్రైస్తవులపై ఎవరికి అభిమానముందో ఈ లెక్కలు తెలియజేస్తున్నాయ'ని ఉదహరించారు. క్రైస్తవ ఆస్తుల అన్యాక్రాంతంపై ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు మంత్రి ఫరూక్ సమాధానమిచ్చారు. 'క్రైస్తవ ఆస్తులు ప్రభుత్వ నియంత్రణలో లేవు. నేరుగా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదు. ఎక్కడైనా అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదులు అందితే అధికారుల ద్వారా విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం' అని హామీ ఇచ్చారు.

తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని.. మండలిలో వైకాపా పచ్చి అబద్ధాలు

- లెంపలేసుకుని క్షమాపణ చెబితేనే కల్తీ నెయ్యిపై చర్చ
- మంత్రులు అచ్చెన్న, సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర ధ్వజం

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడలేదని వైకాపా ఎమ్మెల్సీలు శాసనమండలిలో పచ్చి అబద్ధాలు చెప్పారని, సభను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించారని మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. సభకు తప్పుడు సమాచారం ఇచ్చినందుకు వారు లెంపలేసుకుని, క్షమాపణ చెబితే... కల్తీ నెయ్యి వ్యవహారంపై సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వారు పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమలకు సరఫరా అయిన నెయ్యిలో కల్తీ జరిగిందని సాక్షాత్తు జగన్ బాబాయి, అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఆయన తర్వాత ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన భూమన కరుణాకరరెడ్డి అంగీకరించారని మంత్రులు గుర్తు చేశారు. కల్తీ జరిగిందని ఎన్‌డీడీబీ పేర్కొందని, సిట్ కూడా కల్తీని నిర్ధారించిందని వారు తెలిపారు. అయినా వైకాపా నాయకులు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని, కల్తీ జరగలేదని బుకాయిస్తున్నారని మండిపడ్డారు. గురువారం శాసనసభ ఆవరణలో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "వేంకటేశ్వరస్వామిని అడ్డుపెట్టుకుని డబ్బు సంపాదించేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నారని మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ నీచమైన ఆరోపణలు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కిలో రూ.330 చొప్పున నెయ్యి కొనేవారని... దాన్ని కల్తీ నెయ్యిగా ముద్రవేసి... ఇప్పుడు ఇందాపూర్ నుంచి కిలో రూ.660కి కొనేలా టెండర్లు కట్టబెట్టి లబ్ధి పొందుతున్నారని మాట్లాడారు. అసలు హెరిటేజ్‌కి, ఇందాపూర్‌కు ఏంటి సంబంధం? ఇందాపూర్ టెండర్లలో పాల్గొని నెయ్యి సరఫరా ఆర్డర్ దక్కించుకుంది" అని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎప్పుడూ ఒక్క రూపాయి కూడా లబ్ధి పొందకుండా, స్వయంకృషితో ఎదిగిన హెరిటేజ్ సంస్థను దెబ్బతీయాలన్న కుట్రతోనే దుర్మార్గమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

హుద్‌హుద్ కంటే ప్రమాదకరమైనది వైకాపా

- భాజపా శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు

ఈనాడు, అమరావతి: హుద్ హుద్ తుపాను కంటే ప్రమాదకరమైనది వైకాపా అని భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు ధ్వజమెత్తారు. 2019-24 మధ్య అధికారం చేపట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. ఇప్పుడు అసెంబ్లీకి రాకుండా ఏడాది తర్వాత రహదారులపై తిరుగుతానని చెబుతున్నారని దుయ్యబట్టారు. శాసనసభలో గురువారం బడ్జెట్‌పై ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా ఆయన మాట్లాడారు. 'రాష్ట్ర బడ్జెట్‌ను భాజపా స్వాగతిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ బడ్జెట్‌కు ఇది పునాదిగా నిలుస్తుంది. కేంద్రంలో పెద్దల్ని మెప్పించి రాష్ట్రానికి అత్యధిక నిధులను తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదే. వైకాపా నాయకులు బడ్జెట్‌ను విమర్శించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. జగన్ సభకు వచ్చి ఉంటే ఆయనకు సమాధానం చెప్పేవాళ్లం. ఆయన్ను పిలిచినా సభకు రావడం లేదు' అని వివరించారు.

గోదావరి ఏటిగట్టును పటిష్ఠ పరుస్తాం

- పాత ఎడ్లంక గ్రామ రక్షణకు చర్యలు
- జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు

ఈనాడు, అమరావతి: గోదావరి ఏటిగట్టు పటిష్ఠతకు చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. గోపాలపురం నుంచి పి.గన్నవరం వరకు 29వ కి.మీ నుంచి 48వ కి.మీ మధ్య వశిష్ఠ పాయ ఎడమ వరద గట్టును పరిశీలించి, రవాణాకు వీలుగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పి.గన్నవరం నియోజకవర్గంలో ఏటిగట్టు పటిష్ఠతకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరగా, మంత్రి సమాధానమిచ్చారు.

- కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని పాత ఎడ్లంక గ్రామం కోతకు గురికావడంపై త్రిసభ్య కమిటీతో అధ్యయనం చేయించగా.. మూడు ప్రత్యామ్నాయాలు చూపారని మంత్రి రామానాయుడు తెలిపారు. 'పాత ఎడ్లంకలోని 257 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కమిటీ సూచించింది. ఇందుకు స్థానికులు అంగీకరించలేదు. గ్రామానికి సమీపంలో ఎత్తైన ప్రాంతంలో ఇళ్లస్థలాలు ఇస్తే రక్షించవచ్చని కమిటీ రెండో సూచన చేసింది. రూ.50 కోట్లతో గోడ నిర్మాణానికి మరో ప్రతిపాదన చేశారు. ఇది సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ పరిశీలనలో ఉంది. ఆర్థిక శాఖ ఆమోదం తర్వాత చర్యలు తీసుకుంటాం' అని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి వివరించారు. వైకాపా ప్రభుత్వంలో విచ్చలవిడి ఇసుక తవ్వకాలు, కృష్ణానది ప్రవాహం గతి మారడంతో ఎడ్లంక గ్రామం కోతకు గురవుతోందని బుద్ధప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. '2023-24లో వచ్చిన వరదలకు 15 ఇళ్లు, 310 ఎకరాలు నదిలో కొట్టుకుపోయాయి. మరో 48 ఇళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కృష్ణానదిలో కలిసిపోకముందే, గ్రామాన్ని కాపాడాలి' అని కోరారు.

చేనేత వస్త్రాలు తెలుగు సంస్కృతికి ప్రతీక

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి: చేనేత వస్త్రాలు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అసెంబ్లీ ఆవరణలో ఆప్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను ఆయన గురువారం ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన మగ్గాన్ని పరిశీలించారు. తన సతీమణి కోసం రెండు చీరలను కొనుగోలు చేశారు. మంత్రులు, శాసనసభ్యులు, ఉద్యోగులు చేనేత వస్త్రాలను కొనడం ద్వారా నేతన్నలను ప్రోత్సహించాలని స్పీకర్ కోరారు. చేనేత కార్మికుల శ్రమకు గౌరవం దక్కాలంటే మనమంతా చేనేత వస్త్రాలను వినియోగించాలని పేర్కొన్నారు. చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా 120 చేనేత కార్మిక సంఘాలుంటే, వాటిలో దాదాపు 35 మన రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకే అసెంబ్లీలో ఈ స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ స్టాళ్లను తిలకిస్తూ, అక్కడున్న చీరలను పరిశీలిస్తూ...ఎవరికి ఏ చీర బాగుంటుందనేదానిపై మాట్లాడుకుంటూ, ఒక్కో చీరను ఒంటిమీద పెట్టుకుని చూసుకుంటూ మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు స్టాళ్ల వద్ద సందడి చేశారు. కొంతమంది వారికి నచ్చిన చీరలను కొనుగోలు చేశారు. పలువురు పురుష ఎమ్మెల్యేలు కూడా శాలువాలను కొనుగోలు చేశారు.


స్టాళ్లలోని వస్త్రాలను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, మంత్రులు సవిత, గుమ్మిడి సంధ్యారాణి తదితరులు

ఛాంపియన్

టీ20 ప్రపంచకప్ ధమాకా
ఫిబ్రవరి 7 - మార్చి 8

సాధారణంగా స్పిన్ అంటే మన బ్యాటర్లకు పండగే! ప్రపంచంలో స్పిన్‌ను ఎంతో సమర్థంగా ఎదుర్కొనేది భారత బ్యాటర్లే! కానీ కొన్నేళ్లుగా ఆ సామర్థ్యం తగ్గుతోంది. టెస్టుల్లో సొంత గడ్డపై ఆడుతూ విదేశీ స్పిన్నర్ల ధాటికి మన బ్యాటర్లు కుదేలవడం చూశాం. ఇప్పుడు టీ20 ప్రపంచకప్‌లోనూ స్పిన్‌ను ఆడటంలో మనవాళ్ల బలహీనత బయటపడుతోంది. గ్రూప్ దశలో బండి నడిచింది కానీ.. సూపర్-8లో ఈ బలహీనతను అధిగమించకపోతే కష్టమే.

మన బ్యాటర్లు గిరగిరా!


అభిషేక్

ఈనాడు క్రీడావిభాగం


తిలక్ వర్మ


ఇషాన్ కిషన్

టీ20 ప్రపంచకప్ లీగ్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచి సూపర్-8 చేరుకుంది భారత్. ఒక్క మ్యాచూ ఓడలేదు కాబట్టి జట్టులో సమస్యలేవీ లేవనుకుంటే పొరపాటే. సొంతగడ్డపై ఆడాల్సినంత సాధికారికంగా టీమ్‌ఇండియా ఆడలేదు. బ్యాటింగ్ వరకు చూస్తే.. దాదాపుగా ప్రతి మ్యాచ్‌లో ఏదో ఒక దశలో ఇబ్బంది పడింది. చివరికి ఇన్నింగ్స్‌లను మెరుగ్గా ముగించినప్పటికీ.. అంతకుముందు తడబాటు తప్పలేదు. స్పిన్నర్లను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్లు బాగా ఇబ్బంది పడుతున్నారు. అందులోనూ ఆఫ్‌స్పిన్నర్లు మరింతగా టీమ్ ఇండియాను దెబ్బ తీస్తున్నారు. టాప్-3లో ముగ్గురు బ్యాటర్లూ ఎడమ చేతి వాటం కావడంతో అందుకు అనుగుణంగా బౌలింగ్, ఫీల్డింగ్ వ్యూహాలు రచించుకుని ప్రత్యర్థి జట్లు రంగంలోకి దిగుతున్నాయి. లెఫ్ట్‌హ్యాండర్లు సాధారణంగా ఆఫ్ స్పిన్నర్ల బౌలింగ్‌లో కొంచెం ఇబ్బంది పడతారు. ప్రస్తుతం అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ సైతం ఇదే ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. ఫామ్‌లో ఉన్న ఇషాన్ కిషన్ కొంత ఎదురుదాడి చేయగలుగుతున్నా.. ఆఫ్ స్పిన్నర్లపై పూర్తిగా పైచేయి మాత్రం సాధించలేకపోతున్నాడు. భారత్ బలహీనతను గుర్తిస్తున్న ప్రత్యర్థి జట్లు ఆరంభంలోనే ఆఫ్‌స్పిన్నర్లను దింపి ఫలితం రాబడుతున్నాయి. పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా.. తొలి ఓవర్లో తనే బౌలింగ్ చేశాడు. ఒక్క పరుగే ఇచ్చిన అతను.. అభిషేక్ శర్మను బోల్తా కొట్టించాడు. ఆ మ్యాచ్‌లో మరో ఆఫ్‌స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్ కూడా భారత్‌ను దెబ్బ తీశాడు. 4 ఓవర్లలో 24 పరుగులే ఇచ్చి వికెట్ తీశాడు. ఎదురుదాడి చేసిన ఇషాన్‌ను మినహాయిస్తే.. పాక్ స్పిన్నర్లను ఎదుర్కోవడానికి భారత బ్యాటర్లు నానా తంటాలు పడ్డారు. ఇషాన్‌ను బౌల్డ్ చేసిన లెగ్ స్పిన్నర్ సయిమ్ అయూబ్ 4 ఓవర్లలో 25 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీయడం గమనార్హం. ఇక చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ కూడా పాక్ వ్యూహాన్నే అనుసరించింది. ఆఫ్‌స్పిన్నర్ ఆర్యన్ దత్‌కు కొత్త బంతిని అప్పగిస్తే.. అతను 19 పరుగులే ఇచ్చి ఓపెనర్లు అభిషేక్, ఇషాన్‌లను బౌల్డ్ చేశాడు. నమీబియాతో మ్యాచ్‌లో ఒక దశలో 104/1 తిరుగులేని స్థితిలో నిలిచిన భారత్.. ఆ జట్టు కెప్టెన్, ఆఫ్‌స్పిన్నర్ జెరాల్డ్ ఎరాస్మస్ (4/20) ధాటికి ఒక్కసారిగా కుదేలైంది. 124/4కు చేరుకుంది. తర్వాత పుంజుకుని భారీ స్కోరు సాధించింది. తొలి మ్యాచ్‌లో అమెరికా స్పిన్నర్లు సైతం టీమ్‌ఇండియాను ఇబ్బంది పెట్టారు. ఆ జట్టు లెగ్‌స్పిన్నర్ మోసిన్‌ఖాన్ 4-0-16-1 గణాంకాలు నమోదు చేశాడు. ఆ మ్యాచ్‌లో మొత్తంగా స్పిన్నర్ల బౌలింగ్‌లో 8 ఓవర్లలో 42 పరుగులే చేసి 3 వికెట్లు కోల్పోయింది భారత్. ఇషాన్ మూడుసార్లు స్పిన్నర్లకు వికెట్ ఇస్తే.. అభిషేక్, తిలక్ రెండేసిసార్లు వారి బౌలింగ్‌లో ఔటయ్యారు.

ముందున్నాయి మరిన్ని సవాళ్లు

గ్రూప్ దశలో భారత్ మ్యాచ్‌లన్నీ బలహీన జట్లతోనే జరిగాయి. పాకిస్థాన్ ఒక్కటే పెద్ద జట్టు, అది కూడా టీమ్‌ఇండియాతో పోలిస్తే బలహీనమే. కానీ సూపర్-8లో అలా కాదు. తన లాగే గ్రూప్ దశలో ఆధిపత్యం చలాయించి, అజేయంగా నిలిచిన దక్షిణాఫ్రికాను ఆదివారం ఢీకొనబోతోంది సూర్యకుమార్ సేన. ఆస్ట్రేలియా, శ్రీలంక జట్లకు షాకిచ్చి సంచలనం రేపిన జింబాబ్వే.. టీమ్‌ఇండియా తర్వాతి ప్రత్యర్థి. చివరగా వెస్టిండీస్‌తో మ్యాచ్ ఆడనుంది. జింబాబ్వే, విండీస్ కూడా గ్రూప్ దశను అజేయంగానే ముగించాయి. దక్షిణాఫ్రికా జట్టులో స్పెషలిస్టు స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, లిండ్‌తో పాటు పార్ట్‌టైమరైన కెప్టెన్ మార్‌క్రమ్ అందుబాటులో ఉన్నాడు. జింబాబ్వే జట్టుకు స్పిన్‌లో కెప్టెన్ రజాతో పాటు క్రీమర్, బర్ల్‌ల అండ ఉంది. విండీస్ జట్టులోనూ అకీల్ హొసేన్, గుడాకేశ్ మోటీ లాంటి ప్రమాదకర స్పిన్నర్లున్నారు. సూపర్-8 మ్యాచ్‌లు జరిగే అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా మైదానాలు మూడూ స్పిన్నర్లకు బాగా అనుకూలించేవే. అన్ని పిచ్‌లూ కొంచెం నెమ్మదిగానే ఉన్నాయి. బంతి బాగా టర్న్ అవుతుంది. కాబట్టి భారత బ్యాటర్లు మెరుగైన సన్నద్ధతతో లేకుంటే ఎదురుదెబ్బలు తప్పవు.


హర్మన్‌ప్రీత్ కౌర్ 36

రెండో టీ20 ఆసీస్‌దే

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాతో మరో మ్యాచ్ మిగిలుండగానే టీ20 సిరీస్ దక్కించుకుంటారనుకున్న భారత అమ్మాయిలు నిరాశపరిచారు. రెండో మ్యాచ్‌లో ఆసీస్ చేతిలో 19 పరుగుల తేడాతో పరాజయం పాలయ్యారు. 164 పరుగుల ఛేదనలో భారత్.. 9 వికెట్లు కోల్పోయి 144 పరుగులే చేసింది. షెఫాలి వర్మ (29), స్మృతి మంధాన (31) చెలరేగడంతో పవర్‌ప్లే ఆఖరికి భారత్ 54/0తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. వారిద్దరు నిష్క్రమించాక, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (36) నిలవడంతో భారత్ 126/3తో లక్ష్యం దిశగా సాగింది. కానీ 7 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయి ఓటమి పాలైంది. ఆష్లీ గార్డ్‌నర్ (3/22), అనాబెల్ సదర్‌లాండ్ (2/18) భారత్‌ను కట్టడి చేశారు. సోఫీ మోలనూ, కిమ్ గార్త్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. మొదట ఆస్ట్రేలియా 5 వికెట్లకు 163 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జార్జియా వోల్ (88; 57 బంతుల్లో 11×4, 1×6), బెత్ మూనీ (46) మెరిశారు. భారత బౌలర్లలో అరుంధతి రెడ్డి (2/32) రాణించింది.

● అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా హర్మన్ (356 మ్యాచ్‌లు) రికార్డు సృష్టించింది. సుజి బేట్స్ (355, న్యూజిలాండ్)ను అధిగమించింది. ఎలిస్ పెరీ (349, ఆస్ట్రేలియా), భారత్ మాజీ కెప్టెన్ మిథాలి రాజ్ (333), చార్లెట్ ఎడ్వర్డ్స్ (309, ఇంగ్లాండ్) వరుసగా 3, 4, 5 స్థానాల్లో ఉన్నారు.


శ్రేయస్ గోపాల్ 3/83

ఫైనల్లో కర్ణాటక

లఖ్‌నవూ: కర్ణాటక, ఉత్తరాఖండ్ మధ్య రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో లాంఛనం పూర్తయింది. 11 ఏళ్ల తర్వాత కర్ణాటక రంజీ ట్రోఫీ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం డ్రాగా ముగిసిన సెమీస్‌లో కర్ణాటక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా ఉత్తరాఖండ్‌పై పైచేయి సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 299/6తో అయిదో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటక 323 పరుగులకు ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (86 నాటౌట్; 103 బంతుల్లో 5×4, 5×6) అజేయంగా నిలిచాడు. అనంతరం 827 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఉత్తరాఖండ్ పోరాడి మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 6 వికెట్లకు 260 పరుగులు రాబట్టింది. అవనీష్ సుధా (66; 71 బంతుల్లో 10×4), సౌరభ్ రావత్ (53 నాటౌట్; 114 బంతుల్లో 4×4, 2×6), అభయ్ నేగి (57 నాటౌట్; 66 బంతుల్లో 5×4, 3×6) అర్ధ సెంచరీలతో రాణించారు. కర్ణాటక బౌలర్లలో శ్రేయస్ గోపాల్ (3/83), ప్రసిద్ధ్ కృష్ణ (2/17), వైశాఖ్ (1/22) సఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో సత్తాచాటిన దేవ్‌దత్ పడిక్కల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈనెల 24 నుంచి 28 వరకు జమ్మూకశ్మీర్, కర్ణాటక మధ్య రంజీ ఫైనల్ జరగనుంది.

సంక్షిప్త స్కోర్లు: కర్ణాటక తొలి ఇన్నింగ్స్: 736, రెండో ఇన్నింగ్స్: 323, **ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్:** 233, రెండో ఇన్నింగ్స్: 260/6

ఆస్ట్రేలియా, శ్రీలంక జట్లున్న గ్రూప్‌లో జింబాబ్వే జట్టు అగ్రస్థానంలో నిలుస్తుందని.. ఈ ఆఫ్రికా జట్టు ధాటికి కంగారూలు ప్రపంచకప్ నుంచి నిష్క్రమిస్తారని ఎవ్వరైనా ఊహించి ఉంటారా? అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ అజేయంగా నిలిచిన జింబాబ్వే.. గ్రూప్-బిలో టాప్ లేపింది. ఆస్ట్రేలియాపై విజయం గాలివాటం కాదని రుజువు చేస్తూ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకనూ మట్టికరిపించింది.

వారెవ్వా జింబాబ్వే

- శ్రీలంకపైనా ఘనవిజయం
- గ్రూప్-బిలో అగ్రస్థానం కైవసం


సికందర్ 45

కొలంబో

టీ20 ప్రపంచకప్‌ను పసికూనగా మొదలుపెట్టిన జింబాబ్వే.. లీగ్ దశ ముగిసేసరికి పెద్ద జట్లను మించిపోయింది. గత వారం ఆస్ట్రేలియాకు దిమ్మదిరిగే షాక్ ఇచ్చిన ఆ జట్టు.. గురువారం శ్రీలంకనూ ఓడించి సంచలనం రేపింది. సొంతగడ్డపై ఆడుతూ, బ్యాటర్లకు సవాలు విసిరే 179 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించి కూడా శ్రీలంక ఓటమిని తప్పించుకోలేకపోయింది. ఆస్ట్రేలియాపై అదరగొట్టిన ఓపెనర్ బ్రయాన్ బెనెట్ (63 నాటౌట్; 48 బంతుల్లో 8×4) మరోసారి జట్టుకు బలమైన పునాది వేయగా.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సికందర్ రజా (45; 26 బంతుల్లో 2×4, 4×6) మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టుకు విజయాన్నందించాడు. మరుమాని (34; 26 బంతుల్లో 5×4, 1×6), ర్యాన్ బర్ల్ (23; 12 బంతుల్లో 2×4, 1×6) కూడా విలువైన పరుగులు చేశారు. లంక బౌలర్లలో దుషాన్ హేమంత (2/36), దునిత్ వెల్లలాగే (1/27), శనక (1/26) రాణించారు. మొదట నిశాంక (62; 41 బంతుల్లో 8×4), పవన్ రత్నాయకే (44; 25 బంతుల్లో 3×4, 2×6) సత్తా చాటడంతో లంక 7 వికెట్లకు 178 పరుగులు చేసింది. క్రీమర్ (2/27) ఆ జట్టుకు కళ్లెం వేయగా.. ముజరబాని, ఎవాన్స్ తలో 2 వికెట్లు పడగొట్టారు.

ఎదురే లేదు..: కంగారూలకే కంగారు పుట్టించారు. పైగా సూపర్-8 బెర్తు కూడా ఖరారైంది. దీంతో ఆత్మవిశ్వాసం అత్యున్నత స్థాయిలో ఉన్న జింబాబ్వే.. పోరాడితే పోయేదేముందన్నట్లు లంకపై ఛేదనకు బలంగానే పూనుకుంది. ఆస్ట్రేలియాపై జట్టుకు అదిరే ఆరంభాన్నిచ్చిన బెనెట్, మరుమాని అదే తరహాలో మరోసారి రెచ్చిపోయారు. మరుమాని ఉన్నంతసేపూ ధనాధన్ షాట్లు ఆడి తొమ్మిదో ఓవర్లో వెనుదిరిగాడు. అప్పటికే 69 పరుగులతో జింబాబ్వేకు బలమైన పునాది పడింది. మరుమాని లాగే తర్వాత వచ్చిన బర్ల్ కూడా ధాటిగా ఆడాడు. మరో ఎండ్‌లో బెనెట్ ఇన్నింగ్స్‌కు స్థిరత్వం తెచ్చాడు. అయితే బర్ల్ ఔటయ్యాక స్కోరు వేగం తగ్గింది. 6 ఓవర్లలో 65 పరుగులు చేయాల్సి రావడంతో జింబాబ్వేకు కష్టమే అనిపించింది. కానీ హేమంత వేసిన 15వ ఓవర్లో రజా వరుసగా 6, 6, 4.. తర్వాత తీక్షణ బౌలింగ్‌లో 6, 4 బాది సాధించాల్సిన రన్‌రేట్‌ను అందుబాటులోకి తెచ్చాడు. 4 ఓవర్లలో 33 పరుగులు అవసరం కాగా.. రజా జోరు కొనసాగించడంతో సమీకరణం 2 ఓవర్లలో 13తో తేలికగా మారింది. కానీ 19వ ఓవర్లో హేమంత.. రజా, ముసికెవా (1)లను ఔట్ చేయడమే కాక 5 పరుగులే ఇవ్వడంతో ఉత్కంఠ నెలకొంది. చివరి ఓవర్ (తీక్షణ) తొలి బంతికే మున్యోంగా (8 నాటౌట్) సిక్సర్ బాదగా.. మూడో బంతికి బెనెట్ ఫోర్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు నిశాంక లంక ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేయగా.. మిడిలార్డర్లో రత్నాయకే మెరవడంతో లంక మెరుగైన స్కోరు సాధించింది. అయితే మధ్య ఓవర్లలో ఆ జట్టును క్రీమర్ సహా జింబాబ్వే స్పిన్నర్లు కట్టడి చేశారు.

శ్రీలంక ఇన్నింగ్స్: నిశాంక (సి) మున్యోంగా (బి) క్రీమర్ 62; కుశాల్ పెరీరా (సి) క్రీమర్ (బి) ముజరబాని 22; కుశాల్ మెండిస్ (స్టంప్డ్) మరుమాని (బి) బర్ల్ 14; పవన్ రత్నాయకే (సి) క్రీమర్ (బి) ఎవాన్స్ 44; కమిందు (సి) అండ్ (బి) క్రీమర్ 7; శనక (సి) ముసెకివా (బి) ముజరబాని 6; వెల్లలాగే నాటౌట్ 15; హేమంత (సి) బర్ల్ (బి) ఎవాన్స్ 0; తీక్షణ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **178;** **వికెట్ల పతనం:** 1-54, 2-100, 3-108, 4-123, 5-142, 6-164, 7-164; **బౌలింగ్:** సికందర్ రజా 4-0-36-0; ముజరబాని 4-0-38-2; మసకద్జా 3-0-23-0; ఎవాన్స్ 3-0-35-2; క్రీమర్ 4-0-27-2; బర్ల్ 2-0-16-1

జింబాబ్వే ఇన్నింగ్స్: బెనెట్ నాటౌట్ 63; మరుమాని (సి) అండ్ (బి) వెల్లలాగే 34; బర్ల్ (సి) కుశాల్ పెరీరా (బి) శనక 23; రజా (సి) శనక (బి) హేమంత 45; ముసికెవా (సి) శనక (బి) హేమంత 1; మున్యోంగా నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (19.3 ఓవర్లలో 4 వికెట్లకు) **182;** **వికెట్ల పతనం:** 1-69, 2-98, 3-167, 4-169; **బౌలింగ్:** మదుశంక 3-0-20-0; మదుశాన్ 2-0-23-0; తీక్షణ 3.3-0-47-0; శనక 3-0-26-1; హేమంత 4-0-36-2; వెల్లలాగే 4-0-27-1

ఆఖర్లో అఫ్గాన్ అదరహో


ఇబ్రహీం జద్రాన్ 95 నాటౌట్

చెన్నై: టీ20 ప్రపంచకప్‌లో బాగా ఆడినా, సూపర్-8 చేరలేకపోయిన అఫ్గానిస్థాన్.. ఘనవిజయంతో టోర్నీని ముగించింది. గురువారం గ్రూప్-డి మ్యాచ్‌లో ఆ జట్టు 82 పరుగుల తేడాతో కెనడాను చిత్తు చేసింది. మొదట 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఇబ్రహీం జద్రాన్ (95 నాటౌట్; 56 బంతుల్లో 7×4, 5×6) మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో అఫ్గాన్.. 4 వికెట్లకు 200 పరుగుల భారీ స్కోరు సాధించింది. సెదికుల్లా అటల్ (44; 32 బంతుల్లో 2×4, 2×6), రహ్మానుల్లా గుర్బాజ్ (30; 20 బంతుల్లో 5×4) కూడా రాణించారు. కెనడా బౌలర్లలో జస్కరన్ సింగ్ 3 వికెట్లు తీసినప్పటికీ, 52 పరుగులిచ్చేశాడు. అనంతరం మహ్మద్ నబి (4/7), రషీద్ ఖాన్ (2/19) విజృంభించడంతో కెనడా 8 వికెట్లకు 118 పరుగులే చేయగలిగింది. ముజీబ్ రెహ్మాన్ (1/23), అజ్మతుల్లా (1/18) కూడా ఆకట్టుకున్నారు. కెనడా జట్టులో హర్ష్ ఠాకర్ (30), సాద్‌బిన్ జాఫర్ (28) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. కెనడా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడగా.. అఫ్గాన్ (4 పాయింట్లు) గ్రూప్-డిలో రెండో స్థానంలో నిలిచింది. ఈ గ్రూప్ నుంచి దక్షిణాఫ్రికా (8) న్యూజిలాండ్ (6) సూపర్-8కు అర్హత సాధించాయి.

సంక్షిప్త స్కోర్లు... **అఫ్గానిస్థాన్:** 200/4 (ఇబ్రహీం జద్రాన్ 95 నాటౌట్, అటల్ 44, గుర్బాజ్ 30; జస్కరన్ 3/52); **కెనడా:** 118/8 (హర్ష్ ఠాకర్ 30, సాద్‌బిన్ జాఫర్ 28; నబి 4/7, రషీద్ ఖాన్ 2/19, ముజీబ్ రెహ్మాన్ 1/23, అజ్మతుల్లా 1/18)

తేనెటీగల దాడిలో అంపైర్ మృతి


మాణిక్ గుప్తా

ఉన్నావ్: క్రికెట్ మైదానంలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. మ్యాచ్ జరుగుతుండగా తేనెటీగల గుంపు ఒక్కసారిగా దాడి చేయడంతో కాన్పూర్ క్రికెట్ సంఘం (కేసీఏ) సీనియర్ అంపైర్ మాణిక్ గుప్తా (65) ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లా శుక్లాగంజ్‌లో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వైఎంసీసీ, పారామౌంట్ జట్ల మధ్య కేడీఎంఏ లీగ్ మ్యాచ్‌లో జగదీశ్‌శర్మ, మాణిక్ అంపైర్లుగా వ్యవహరించారు. మ్యాచ్ జరుగుతుండగా తేనెటీగల గుంపు మైదానంలోని అంపైర్లు, ఆటగాళ్లపై దాడి చేసింది. సుమారు 10 నిమిషాల పాటు అవి బీభత్సం సృష్టించాయి. ప్రాణాలు కాపాడుకోడానికి ఆటగాళ్లు, అధికారులు పరుగులు తీశారు. ఈ క్రమంలో మాణిక్‌తో పాటు మరో అంపైర్, పలువురు ఆటగాళ్లు తీవ్రంగా గాయపడ్డారు. అపస్మారక స్థితికి చేరుకున్న మాణిక్‌ను వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సుమారు 30 ఏళ్లుగా కేసీఏ అంపైర్ ప్యానెల్‌లో మాణిక్ సభ్యుడిగా ఉన్నారు.

అదే జోరు కొనసాగిస్తాం: సికందర్

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో ఇదే జోరు కొనసాగిస్తూ ముందుకెళ్తామని జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా పేర్కొన్నాడు. శ్రీలంకతో విజయం అనంతరం రజా మాట్లాడాడు. "అందరి గౌరవం, అభిమానం పొందడానికి మాకు ఇది గొప్ప అవకాశం. ఒక్కో మ్యాచ్‌పై దృష్టి పెట్టి ముందుకెళ్తాం. సూపర్-8లో మూడు మ్యాచ్‌ల్లో రెండింటిని గెలవగలిగితే చాలు. ఏం జరుగుతుందో ఎవరు ఊహించగలరు. అంచనాల్లేకుండా దిగి, టోర్నీలో అదరగొట్టే టీమ్‌ను అందరూ ఇష్టపడతారు. మేము ఇప్పటి వరకూ అజేయంగా నిలిచాం. ఇప్పుడు మా ఆలోచనలన్నీ సూపర్-8 మ్యాచ్‌పైనే" అన్నాడు. జింబాబ్వే సూపర్-8లో భారత్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలతో తలపడుతుంది.

టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు
ఆస్ట్రేలియా × ఒమన్
వేదిక: పల్లెకెలె, రా. 7.00

అభిషేక్.. అలా ఆడకు


గావస్కర్

అహ్మదాబాద్: టీ20 ప్రపంచకప్‌లో భారత ఓపెనర్ అభిషేక్‌శర్మ అంచనాల భారాన్ని తట్టుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడని దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ అన్నాడు. ఇన్నింగ్స్ ప్రారంభంలో అభిషేక్ లైన్‌కు అడ్డంగా ఆడకుండా ఉండాలని గావస్కర్ సూచించాడు. "అభిషేక్ అద్భుతమైన ఆటగాడు. అయితే అంచనాలు అతనిపై భారంగా కనిపిస్తున్నాయి. అమెరికాతో అతను మంచి ఇన్నింగ్స్ ఆడుంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. అలా జరగకపోవడంతో అతనిపై ఒత్తిడి కనిపిస్తోంది. భారీ షాట్లు ఆడగలిగే అభిషేక్ క్రీజులో కొద్దిసేపు గడపాలి. ఇన్నింగ్స్ మొదటి బంతికే బౌండరీ లేదా సిక్సర్ బాదాలని ప్రయత్నించకూడదు. బౌండరీలు వస్తే పర్వాలేదు. కానీ వికెట్లకు అడ్డంగా భారీ షాట్లు ఆడేందుకు తనని తాను బలవంతం చేసుకోకూడదు. సింగిల్ తీసుకుని బంతులాడి పరుగులేమీ చేయకపోయినా ఏమీకాదు. వాటిని తర్వాత భర్తీ చేసుకోవచ్చు. ఒకటి, రెండు ఓవర్లు క్రీజులో గడిపిన తర్వాత సహజ శైలిలో ఆడొచ్చు" అని గావస్కర్ పేర్కొన్నాడు.


హోప్ 75

విండీస్ అజేయంగా

కోల్‌కతా: టీ20 ప్రపంచకప్‌లో సూపర్ 8కు అర్హత సాధించిన తొలి జట్టుగా నిలిచిన వెస్టిండీస్.. గ్రూపు దశను అజేయంగా ముగించింది. గురువారం గ్రూప్-సి పోరులో విండీస్ 42 పరుగుల తేడాతో ఇటలీని ఓడించింది. నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన విండీస్ 8 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానం కైవసం చేసుకుంది. ఇంగ్లాండ్ (6), స్కాట్లాండ్ (2), ఇటలీ (2), నేపాల్ (2) వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులు సాధించింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ (4) తక్కువ స్కోరుకే వెనుదిరగగా.. ఫామ్‌లో ఉన్న హెట్‌మయర్ (1) కూడా నిరాశపరిచాడు. అయితే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ షై హోప్ (75; 46 బంతుల్లో 6×4, 4×6) వరుసగా రెండో అర్ధ శతకంతో చెలరేగాడు. ఇటలీ స్పిన్నర్లు బెన్ మనెంటి (2/37), క్రిషన్ కలుగమగె (2/25) రాణించడంతో విండీస్ భారీస్కోరుకు అడ్డుకట్ట పడింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఇటలీ తేలిపోయింది. విండీస్ బౌలర్ల దెబ్బకు 18 ఓవర్లలో 123 పరుగులకే కుప్పకూలింది. ఇటలీ జట్టులో బెన్ మానెంటి (26; 21 బంతుల్లో 2×4, 1×6) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. షమర్ జోసెఫ్ (4/30), మాథ్యూ ఫోర్డ్ (3/19), గుడకేశ్ మోతీ (2/24), అకీల్ హొసేన్ (1/25) విజృంభించి విండీస్‌కు విజయాన్ని అందించారు.

సంక్షిప్త స్కోర్లు: **వెస్టిండీస్:** 165/6 (హోప్ 75, ఛేజ్ 24, రూథర్‌ఫోర్డ్ 24 నాటౌట్, బెన్ 2/37, కలుగమగె 2/25); **ఇటలీ:** 18 ఓవర్లలో 123 ఆలౌట్ (స్మట్స్ 24, బెన్ 26, ఫోర్డ్ 3/19, మోటీ 2/24, జోసెఫ్ 4/30)

నెదర్లాండ్స్‌తో వార్మప్ మ్యాచ్‌లైనా ఆడండి

అహ్మదాబాద్: ద్వైపాక్షిక సిరీస్‌లు కుదరకపోతే.. కనీసం వార్మప్ మ్యాచ్‌లైనా నెదర్లాండ్స్‌తో ఆడాలని ఆ జట్టు ఆల్‌రౌండర్ బాస్ డెలీడ్ అన్నాడు. ఐసీసీ టోర్నీల్లో మినహా అసోసియేట్ జట్లతో పెద్ద జట్లు మ్యాచ్‌లు ఆడడం లేదు. ఈ నేపథ్యంలో డెలీడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సూపర్-8కు అర్హత సాధించని నెదర్లాండ్స్ టీమ్.. టీ20 ప్రపంచకప్‌లో భారత్‌పై చివరి లీగ్‌లో ఓటమితో టోర్నీని ముగించింది. మ్యాచ్ అనంతరం అతడు మాట్లాడాడు. "లీగ్‌లు, ఐసీసీ టోర్నమెంట్లు చాలానే ఉన్న నేపథ్యంలో పెద్ద జట్లతో సిరీస్‌లు ఏర్పాటు చేయడం కష్టమే. అయితే ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే టీమ్‌లు నెదర్లాండ్స్‌తో గానీ, స్కాట్లాండ్‌తో గానీ వార్మప్ మ్యాచ్‌లు ఆడొచ్చు. అలా చేస్తే రెండు జట్లకూ ఉపయుక్తంగా ఉంటుంది. ఇంగ్లాండ్‌తో ముక్కోణపు సిరీస్ నిర్వహిస్తే.. మేం ఆర్థికంగా పుంజుకునేందుకు దోహదపడుతుంది. పెద్ద జట్ల వద్ద చాలా డబ్బు ఉంది. వారితో ఆడాలనుకోవడానికి డబ్బు కూడా ఒక కారణమే. ప్రపంచకప్‌ల సమయంలో మాత్రమే మాపై దృష్టి ఉంటుంది. ఇప్పుడు ఆ సంస్కృతి పోతుందని ఆశిస్తున్నా. టెస్టు జట్లతో తలపడే అవకాశాల కోసమే మేం అడగగలం. అప్పుడే మా ఆట మెరుగుపడుతుంది. జూన్‌లో వచ్చే ప్రపంచకప్ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు మొదలయ్యేదాకా మాకు ఎలాంటి సిరీస్‌లు లేవు" అని డెలీడ్ అన్నాడు.

బాహుబలి టర్నిప్



ఈటీవీ భారత్: హరియాణాలోని కురుక్షేత్ర జిల్లా అమీనపుర్సర్ గ్రామానికి చెందిన రైతు సోదరులు అశ్వనీకుమార్ శర్మ, రాజీవ్‌శర్మ 8 కిలోల టర్నిప్ (తెల్ల దుంప) పండించారు. ఆకులతో కలిపి దీని బరువు దాదాపు 15 కిలోలు ఉంది. ఈ సోదరులిద్దరూ తమకున్న 30 ఎకరాల పొలంలో గత 45 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. ఇందులో కొంత భూమి కేటాయించి సేంద్రియ పద్ధతిలో పలురకాల కూరగాయలను పండిస్తున్నారు. వీరి కిచెన్ గార్డెన్‌లో 6 కిలోల ముల్లంగి, 3 కిలోల క్యాబేజీ గతంలో పండించారు. 8 కిలోల టర్నిప్‌ను చూసి ఆశ్చర్యపోయామని, సేంద్రియ వ్యవసాయాన్ని పద్ధతిగా చేస్తే మంచి దిగుబడి సాధించవచ్చని కురుక్షేత్ర ఉద్యానశాఖ అధికారి డాక్టర్ శివేంద్ర ప్రతాప్ సోలంకి తెలిపారు.

అమ్మకు చిట్టి ఇన్విజిలేటర్!



నాందేడ్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో శీతల్ (21) అనే యువతి పది రోజుల క్రితం ఇంటర్ బోర్డు (హయ్యర్ సెకండరీ సర్టిఫికెటు) పరీక్షకు హాజరైంది. ప్రసవించిన రెండు రోజుల తర్వాత ఫిబ్రవరి 10న జరిగిన ఇంగ్లిషు పరీక్ష రాసిన ఆమె.. బుధవారం రాజనీతి శాస్త్రం పరీక్ష రాసింది. శ్రీ బసవేశ్వర్ కళాశాల యాజమాన్యం ఆమె పరీక్ష రాసేందుకు ప్రత్యేకగది, శిశువు కోసం ఊయల ఏర్పాటు చేసింది. తనకు రెండేళ్ల క్రితం వివాహమైందని, భర్త పనికి వెళుతుండటంతో బిడ్డను చూసుకోడానికి ఇంట్లో ఎవరూ లేరని శీతల్ తెలిపింది.


సేంద్రియ వ్యవసాయం చేస్తున్న ధోనీ



రాంచీ: భారత మాజీ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీ సమీపంలోని సంబో గ్రామంలో ఉన్న ఫాంహౌస్‌లో ఆయన ఈ ఏడాది టమాటాలు పండిస్తున్నారు. 43 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఫాంహౌస్‌లో దాదాపు 38 ఎకరాల్లో టమాటా సహా పలు రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. టమాటా కొత్త వంగడాలను సాగుచేస్తూనే రసాయనాలు వాడకుండా అధిక దిగుబడి సాధించారు. ఆవు పేడ వంటి సేంద్రియ ఎరువులతో పండించిన వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నట్లు స్థానిక రైతులు తెలిపారు.

బ్రిటన్ రాజు సోదరుడి అరెస్టు

- ఎప్‌స్టీన్ ఫైళ్ల కేసులో ఆండ్రూను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అధికార దుర్వినియోగం ఆరోపణలు



లండన్: బ్రిటన్ రాజు ఛార్లెస్-3 సోదరుడు, మాజీ యువరాజు అయిన ఆండ్రూ మౌంట్‌బాటెన్-విండ్సర్‌ను (66) గురువారం పోలీసులు అరెస్టు చేశారు. అమెరికాలో లైంగిక నేరాలకు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సంబంధాలు పెట్టుకోవడమే కాకుండా.. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై ఆయనను అదుపులోకి తీసుకున్నారు. గతంలోనే ఆయనను అధికార హోదా నుంచి రాజు తొలగించారు. దీంతో ఆయన యువరాజు హోదాను కోల్పోయారు. అధికార నివాసాన్నీ ఖాళీ చేశారు. ఆండ్రూ అరెస్టుపై బకింగ్‌హాం ప్యాలెస్ నుంచి రాజు ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. 'అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఆండ్రూ అరెస్టు పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నాం. అయితే చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఇక సరైన అధికార యంత్రాంగం ద్వారా పూర్తిస్థాయి, పారదర్శక, సమగ్ర విచారణ కొనసాగుతుందని ఆశిస్తున్నాం' అని ఛార్లెస్-3 పేర్కొన్నారు.

ఎప్‌స్టీన్‌తో పరిచయమిలా..

గతంలో డ్యూక్ ఆఫ్ యార్క్‌గా ఉన్న ఆండ్రూ. 2001 నుంచి 2011 మధ్య బ్రిటన్ వాణిజ్య రాయబారిగా పని చేశారు. ఆ సమయంలో ప్రపంచవ్యాప్తంగా పర్యటించారు. అప్పుడే ఎప్‌స్టీన్‌తో పరిచయం ఏర్పడింది. ఆ తరువాత ఆయన ప్రభుత్వ నివేదికలను తనకు పంపినట్లు ఈ మెయిళ్లలో ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. 2019లో జైల్లోనే ఎప్‌స్టీన్ మరణించిన సంగతి తెలిసిందే. ఇటీవల అమెరికా ప్రభుత్వం ఎప్‌స్టీన్ ఫైళ్లను బయటపెట్టింది.

పుట్టినరోజు నాడే..

రాజు ఛార్లెస్-3 కి చెందిన నార్‌ఫోక్‌లోని శాండ్రింగం ప్రైవేటు ఎస్టేట్‌లో ఉండగా ఆండ్రూను పోలీసులు అరెస్టు చేశారు. అధికార హోదా కోల్పోయాక ఆయన విండ్సర్ క్యాజిల్‌లోని రాయల్ లాడ్జ్‌ను ఖాళీ చేసి ఇక్కడ ఉంటున్నారు. గురువారం ఆండ్రూ పుట్టినరోజు కావడం గమనార్హం.

ఎలిజబెత్-2 ముద్దుల కుమారుడు

బ్రిటన్ రాణిగా సుదీర్ఘ కాలం సేవలందించిన క్వీన్ ఎలిజబెత్-2 ముద్దుల కుమారుడే ఆండ్రూ. ప్రస్తుత రాజు ఛార్లెస్-3కి ఆయన చిన్న తమ్ముడు. అయితే తరచూ ఆయన వివాదాల్లో చిక్కుకుంటూ రాజ కుటుంబానికి తలనొప్పిగా మారారు. ఆధునిక బ్రిటన్ రాజ కుటుంబ చరిత్రలో అరెస్టయిన తొలి వ్యక్తిగా ఆండ్రూ నిలిచారు. 1960లో జన్మించిన ఆయన 22 ఏళ్లపాటు బ్రిటిష్ రాయల్ నేవీలో పని చేశారు.

ప్రతిభావంతులకు 'ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ'

ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో కెనడా మార్పులు

ఇంటర్నెట్ డెస్క్: వలసదారుల కట్టడికి కెనడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శాశ్వత నివాస వలసదారుల సంఖ్యను పరిమితం చేస్తూనే.. ప్రతిభావంతులకు మరింత ఎక్కువగా ప్రవేశం కల్పించేలా ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో మార్పులు చేసింది. పరిశోధకులు, వైద్యులు, పైలట్ల కోసం ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ సిస్టమ్‌లో కొత్త ప్రాధాన్య విభాగాలు ప్రవేశపెట్టింది. 'ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ' అనేది నైపుణ్య కార్మికుల ఇమ్మిగ్రేషన్ దరఖాస్తులను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వ్యవస్థ. ఈ సదుపాయంతో ప్రతిభావంతులు దాదాపు 6 నెలలు, అంతకంటే తక్కువ వ్యవధిలోనే శాశ్వత నివాసం పొందొచ్చు. ప్రస్తుతం ఈ 'ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ'లో ఫ్రెంచ్ భాష అభ్యర్థులు, ఆరోగ్యరక్షణ సిబ్బంది, నైపుణ్య వర్తకులు వంటి కేటగిరీలు ఉన్నాయి. ఇప్పుడు తాజా నిబంధనలతో రీసెర్చర్లు, పైలట్లు, డాక్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ మెకానిక్కులు, సీనియర్ మేనేజర్లు, మిలిటరీ వైద్యులు, నర్సులు వంటి కేటగిరీలను కూడా చేర్చారు.

ఎప్పటికీ ఉండే రంగాలు



స్టాక్‌మార్కెట్ మదుపుదారులు సురక్షిత పెట్టుబడులకు ఎప్పటికీ ఉండే కొన్ని రంగాలను పరిశీలించొచ్చు. వాటిలో ముఖ్యమైనవి.. ✦ ఇంధన రంగం ✦ త్వరగా అమ్ముడయ్యే వినియోగ వస్తువుల రంగం (ఎఫ్‌ఎంసీజీ) ✦ ఆరోగ్య పరిరక్షణ రంగం ✦ బంగారం ఈటీఎఫ్‌లు

– ప్రథమ్ ఖన్నా, ఇన్వెస్టర్

మళ్లీ ఇరాన్ యుద్ధ భయం!

- 4శాతం పెరిగిన చమురు ధర
- కుప్పకూలిన ప్రపంచ స్టాక్ మార్కెట్లు

దుబాయ్, వాషింగ్టన్: పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ భయాలు నెలకొన్నాయి. ఇరాన్‌పై దాడుల దిశగా అమెరికా యుద్ధ విమానాలు కదులుతున్నట్లు గురువారం వార్తలొచ్చాయి. దీంతో చమురు ధరలు పెరిగాయి. ప్రపంచ స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి.

అమెరికా గీసిన గీతను ఇరాన్ దాటుతోందని, మంగళవారం జెనీవాలో అణు చర్చల సందర్భంగా హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బుధవారం వ్యాఖ్యానించారు. చర్చలు పూర్తిగా విఫలమైతే సైనిక చర్యకు దిగే హక్కు అధ్యక్షుడు ట్రంప్ చేతిలోనే ఉంటుందని స్పష్టం చేశారు. 'కొన్ని అంశాల్లో చర్చలు సానుకూలంగానే ఉన్నాయి. మళ్లీ కలుస్తామన్నారు. కానీ ట్రంప్ గీసిన గీతలను గౌరవించేందుకు వారు సిద్ధంగా లేరు. మాకు శక్తిమంతమైన సైనిక బలగం ఉంది. దానిని ఉపయోగించడానికి ట్రంప్ సిద్ధంగానే ఉన్నారు' అని వాన్స్ స్పష్టం చేశారు.

■ చర్చలు విఫలం కావడంతో రష్యా సహకారంతో ఇరాన్ సైనిక డ్రిల్స్ నిర్వహిస్తోంది. అమెరికా మరో విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌ను ఇరాన్ సమీపానికి తరలిస్తోంది. అణు శక్తితో నడిచే యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ నౌక ఇరాన్ సమీపంలో ఉన్నట్లు శాటిలైట్ చిత్రాల్లో కనిపించింది.

■ ఇరాన్ తమతో తప్పనిసరిగా ఒప్పందం చేసుకోవాల్సిందేనని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని గురువారం ట్రంప్ హెచ్చరించారు.

■ ఇరాన్ యుద్ధ భయాల నేపథ్యంలో చమురు ధరలు బుధవారం 4శాతం పెరిగాయి.

ఫుట్‌బాల్ ఆడుతూ కుప్పకూలిన ఎంపీ

పరిస్థితి విషమించి మృతి



షిల్లాంగ్: మేఘాలయలో విషాదం చోటు చేసుకుంది. షిల్లాంగ్ ఎంపీ, వాయిస్ ఆఫ్ ది పీపుల్ పార్టీ(వీపీపీ) నేత రిక్కీ ఆండ్రూ జె. సింగ్‌కోన్(54) గురువారం ఫుట్సల్(ఫుట్‌బాల్ క్రీడలో ఓ రకం) ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడుతూ కుప్పకూలిపోయారు. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి కాన్రాడ్ కె.సంగ్మా సహా పలువురు నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

గనిలో విషవాయువు విడుదలై 37 మంది మృతి

నైజీరియాలో విషాదం

అబుజా: నైజీరియాలోని ఓ గనిలో విషవాయువు విడుదలవడంతో 37 మంది మృతిచెందారు. మరో 26 మంది ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటన ప్లాటో రాష్ట్రంలోని వాసే ప్రాంతంలో ఉన్న కంపెని జురాక్ కమ్యూనిటీలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. గనిలో అకస్మాత్తుగా లెడ్ ఆక్సైడ్‌తో పాటు సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ వంటి ప్రమాదకర వాయువులు విడుదలయ్యాయి. సరిగా గాలి ప్రసరించని ప్రాంతం కావడంతో మైనర్లు విషవాయులకు ప్రభావితమయ్యారు. మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు.

■ దక్షిణాఫ్రికాలోని కింబర్లీ నగరంలోని ఓ వజ్రాల గనిలో ఐదుగురు మైనర్లు పనిచేస్తున్న సొరంగంలోకి ప్రమాదవశాత్తు బురద నీరు వెల్లువెత్తడంతో వారు భూగర్భంలో చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం గనిలో నీరుచేరి వారు పనిచేస్తున్న ప్రాంతం మునిగిపోయింది.

గాజా పునరావాసానికి 700 కోట్ల డాలర్లు

- శాంతి మండలిలో నిర్ణయం: ట్రంప్



శాంతి మండలి రూపొందించిన తీర్మానాల ప్రతిని చూపిస్తున్న ట్రంప్

వాషింగ్టన్: గాజా పునరావాస ప్యాకేజీ కింద 700 కోట్ల డాలర్లు ఇచ్చేందుకు 'శాంతి మండలి'లోని తొమ్మిది సభ్య దేశాలు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కజకస్థాన్, ఉజ్బెకిస్థాన్, యూఏఈ, మొరాకో, బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరేబియా, అజర్‌బైజాన్, కువైట్‌లు ఈ ప్రతినబూనాయని గురువారం ఆయన వెల్లడించారు. బలగాలను ఇచ్చేందుకు ఐదు దేశాలు అంగీకరించాయని, ముందుగా రఫాలో మోహరిస్తామని చెప్పారు. ఖర్చుచేసే ప్రతి డాలరూ గాజాలో స్థిరత్వానికి పెట్టుబడి అవుతుందని, సరికొత్త..సామరస్య ప్రాంతానికి ఆశాకిరణం అవుతుందని పేర్కొన్నారు. గాజా పునర్నిర్మాణానికి 7,000 కోట్ల డాలర్లు అవసరమవుతుందని ఇదివరకే అంచనా వేశారు. శాంతి మండలికి అమెరికా వెయ్యి కోట్ల డాలర్లు ఇస్తుందని ట్రంప్ ప్రకటించినా అది దేనికోసమనేది స్పష్టంచేయలేదు. ఐరాస బలపడి, సక్రమంగా పనిచేసేటట్లు శాంతిమండలి చూస్తుందని ప్రారంభోపన్యాసంలో ఆయన చెప్పారు. ఇది ఐరాసతో కలిసి పనిచేస్తుందన్నారు. రెండోసారి అధ్యక్షుడినయ్యాక తొలి ఏడాదిలోనే భారత్-పాక్ సహా ఎనిమిది యుద్ధాలను పరిష్కరించినా వాటిలో ఒక్కదానిపైనా ఐరాసతో మాట్లాడలేదని చెప్పారు. పాక్‌కు గొప్ప ఫీల్డ్‌మార్షల్ ఉన్నారని కితాబిచ్చారు. తాను లేనప్పుడూ ఐరాస బలంగా ఉండి పనిచేసేందుకు శాంతి మండలి దోహదం చేస్తుందన్నారు. బంగ్లాదేశ్ నూతన ప్రధాని తారిఖ్ రహ్మాన్‌ను ట్రంప్ అభినందించారు. ఆ దేశంతో వాణిజ్య, రక్షణపరంగా బలమైన సంబంధాలను కోరుకుంటున్నామని చెప్పారు.

సుప్రీంకోర్టులో దస్త్రాలు మాయం..

నిజ నిర్ధారణకు సీజేఐ ఆదేశం

దిల్లీ: తమముందు విచారణలో ఉన్న కొన్ని కేసుల దస్త్రాలు మాయం అవుతుండటంపై నిజనిర్ధారణ జరపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. గోవాలో ప్రతిపాదిత పులుల అభయారణ్యంతో ముడిపడిన కేసు విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. గత ఏడాది సెప్టెంబరు 8న తాము ఇచ్చిన ఆదేశాలు.. కేసు ఫైల్లో కనిపించకపోవడాన్ని గమనించింది. ప్రొసీడింగ్స్ రికార్డులు కనపడకపోవడం సాధారణమైపోయిందని అసంతృప్తి వ్యక్తంచేసింది. కొన్ని కారణాలతో ఇది ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేసింది. దీనిపై విచారణ జరిపి నివేదికను సీజేఐకి సమర్పించాలని ఆదేశాలిచ్చింది.

కరాచీలో భారీ పేలుడు.. 16 మంది మృతి

వారిలో 9 మంది పిల్లలు

కరాచీ: పాకిస్థాన్‌లోని కరాచీలో గురువారం తెల్లవారుజామున ఓ బహుళ అంతస్తుల నివాస భవనంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 16 మంది ప్రాణాలు కోల్పోగా, 14 మంది గాయపడ్డారు. మృతుల్లో తొమ్మిది మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పేలుడుకు గ్యాస్ లీక్ కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పేలుడు ధాటికి భవనం కొంత భాగం కూలిపోయిందని, శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండొచ్చనే అనుమానంతో గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. పవిత్ర రంజాన్ మాసం మొదటిరోజున తెల్లవారుజామున ఓ ఇంట్లో భోజనం సిద్ధం చేస్తుండగా పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. కరాచీలో చాలా ఇళ్లు, అపార్ట్‌మెంట్లకు వంటపనుల కోసం సహజవాయువు సరఫరా అవుతుంది. ఇది సక్రమంగా సరఫరా కాదనే ఉద్దేశంతో చాలా మంది ఎల్పీజీపై ఆధారపడుతుంటారు.


భారత్‌పై భారీ సుంకాలు విధించేందుకు ట్రంప్ సాకులు..

అమెరికా కాంగ్రెస్ సభ్యుడి వ్యాఖ్యలు

న్యూయార్క్: భారత్‌పై భారీ స్థాయిలో సుంకాలు విధించేందుకు, రష్యా నుంచి చమురు కొంటోందంటూ ట్రంప్ సాకులు వెతుకుతున్నారని అమెరికాకు చెందిన సీనియర్ చట్టసభ సభ్యుడు బ్రాడ్ షెర్మాన్ వ్యాఖ్యానించారు. ఈ విధానాన్ని వెంటనే ఆపేయాలని సామాజిక మాధ్యమం వేదికగా ట్రంప్‌ను కోరారు. అమెరికా ప్రతినిధుల సభలోని విదేశీ వ్యవహారాల కమిటీ, ఆర్థిక సేవల కమిటీలో సీనియర్ సభ్యుడు అయిన బ్రాడ్ సుంకాల అంశంపై స్పందిస్తూ.. "హంగరీ తమ 90 శాతం చమురును రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్నా అమెరికా ఎలాంటి సుంకాలు విధించలేదు. చైనా రష్యాకు అతిపెద్ద చమురు కొనుగోలుదారు. కానీ ఆ దేశంపై వేరే కారణాలతో ట్రంప్ సుంకాలు విధించారు తప్ప, రష్యా చమురు కొనుగోలును కారణంగా చూపలేదు. మన మిత్ర దేశమైన భారత్ తన చమురులో కేవలం 21 శాతం మాత్రమే రష్యా నుంచి పొందుతున్నా.. ఆ దేశాన్ని ఒంటరిని చేశాం" అని ఆయన పేర్కొన్నారు.

మమతదీ తీవ్ర అధికార దుర్వినియోగం

- ఐ-ప్యాక్‌పై సోదాల్లో ఈడీ వాదన



దిల్లీ: బొగ్గు చోరీ కుంభకోణం కేసులో కోల్‌కతాలోని ఐ-ప్యాక్ కార్యాలయంలో, దాని డైరెక్టర్ ప్రాంగణాల్లో తాము సోదాలకు వెళ్లినప్పుడు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేరుగా జోక్యం చేసుకోవడం 'తీవ్రస్థాయి అధికార దుర్వినియోగం' అని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. కేంద్ర దర్యాప్తు సంస్థల ముసుగులో వచ్చిన సాయుధ బలగాలను అడ్డుకునేందుకే మమత, బెంగాల్ పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని ఆ రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాదనను ఖండించింది. జనవరి 8 నాటి సోదాల సమయంలో తమ అధికారులంతా గుర్తింపు పత్రాలను, అధీకృత లేఖల్ని పోలీసు అధికారులకు చూపించారని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు గురువారం ఈడీ తమ సమాధానాన్ని సమర్పించింది.

పోలీసులు కుమ్మక్కై ఆటంకం కల్పించారు

"వాస్తవాలను పరిశీలిస్తే బెంగాల్ ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఎలా దుర్వినియోగం చేసిందో అవగతం అవుతుంది. మమత వ్యక్తిగత ప్రయోజనాలను కాపాడేందుకు సీనియర్ పోలీసు అధికారులే కుమ్మక్కై ఈడీ అధికారుల విధులకు ఆటంకం కల్పించారు. ఇది సమాఖ్య సంబంధాలతో సంబంధం ఉన్న విషయమన్న వాదనను మేం తిరస్కరిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం చేసిన పనికి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. సోదాల సమయంలో మమతతో వందలమంది పోలీసులు వచ్చి, విలువైన పత్రాలను బలవంతంగా తీసుకుపోయారు. కంప్యూటర్‌ను ఎత్తుకుపోయారు. ఆమె ఆదేశాల మేరకు పోలీసులు ఐ-ప్యాక్ సంస్థ ఉద్యోగుల మొబైల్ ఫోన్లను లాక్కొనివెళ్లారు. ఈడీ అధికారి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను తీసుకుపోయి రెండు గంటల తర్వాత ఇచ్చారు" అని ఈడీ పేర్కొంది.

తల్లి నుంచి శిశువుల్ని వేరుచేయడం అత్యంత క్రూరం

దిల్లీ: కేవలం ఆరు నెలల వయసున్న పసికందుల్ని తల్లి నుంచి విడదీయడం అత్యంత క్రూరమని దేశ సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. వైవాహిక వివాదంలో భార్య నుంచి విడివడిన భర్త ఈ పని చేసినందుకు తీవ్రంగా మందలించింది. విడాకుల కేసును లఖ్‌నవూ నుంచి పంజాబ్‌కు మార్చాలని భర్త దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం గురువారం విచారించింది. 'పిల్లల సంక్షేమం చాలా ముఖ్యం. మరీ ఆరునెలల వయసున్న పిల్లల్ని తల్లినుంచి విడదీస్తారా? ఇంతకంటే క్రూరం మరొకటి ఉంటుందా?' అని ప్రశ్నించింది. ఈ నెల 26న తదుపరి విచారణకు భార్యాభర్తలిద్దరూ తమ పిల్లలతో కలిసి తమ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.


దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి జీవిత ఖైదు



యూన్ సుక్ యోల్

సియోల్: దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు జీవిత ఖైదు విధించింది. ఆయన అధికారంలో ఉన్నప్పుడు దేశంలో 'మార్షల్ లా' విధించిన కేసులో ఈ మేరకు తీర్పు గురువారం వెల్లడించింది. చట్ట విరుద్ధంగా పార్లమెంటును తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అపరిమిత అధికారాన్ని చెలాయించేందుకుగానూ మార్షల్ లాను అమలు చేసి, సైన్యం, పోలీసు బలగాలను మోహరించినందుకు యూన్‌ను దోషిగా నిర్ధారించినట్లు న్యాయమూర్తి జీ కుయ్-యోన్ తెలిపారు. జీవిత ఖైదు పడిన మొదటి దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు ఆయనే కావడం గమనార్హం. మార్షల్ లా అమలులో భాగమైన పలువురు మాజీ సైనిక, పోలీసు అధికారులకూ కోర్టు శిక్ష విధించింది. రక్షణశాఖ మాజీ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్‌కు 30 ఏళ్ల జైలు శిక్ష పడింది. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో యూన్ 'మార్షల్ లా' విధించిన విషయం తెలిసిందే.

చదువు కొనసాగిస్తానని టవరెక్కిన వివాహిత



ఈటీవీ భారత్: ప్రేమ కోసం.. పెళ్లి కోసం టవర్లెక్కిన ఉదంతాలు చూశాం. మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ జిల్లా బోర్ఖీ గ్రామంలో ఓ వివాహిత యువతి చదువు కొనసాగింపునకు కుటుంబసభ్యులు అనుమతించాలని, కాదంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ పొలాల్లోని 400 కిలోవాట్ల హైటెన్షన్ విద్యుత్తు టవరుపైకి ఎక్కింది. గ్రామస్థులు పెద్దసంఖ్యలో టవరు చుట్టూ గుమికూడారు. ఈ విషయం తెలిసి రాష్ట్ర పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకొని ఆమెతో చర్చలు జరిపారు. దాదాపు మూడు గంటల ఉత్కంఠ తర్వాత ఆమె చదువుకునేందుకు అనుమతిస్తూ భర్త కుటుంబం ఆమోదం తెలపడంతో యువతి కిందికి దిగి వచ్చింది.

దశాబ్దంలో 8వ అధ్యక్షుణ్ని ఎన్నుకున్న పెరూ



జోస్ మారియా బల్కాజార్

లిమా: పెరూ దేశ అధ్యక్షుడిగా గురువారం మాజీ న్యాయమూర్తి జోస్ మారియా బల్కాజార్(83) ఎన్నికయ్యారు. 10 ఏళ్లలో ఈయన 8వ అధ్యక్షుడు. ఇది ఇక్కడి రాజకీయ అస్థిరతను కళ్లకు కడుతోంది. అవినీతి ఆరోపణల కారణంగా తాత్కాలిక అధ్యక్షుడు జోస్ జెరీని తొలగించిన మరుసటి రోజే ఈ ఎన్నిక జరిగింది. వామపక్ష పెరూ లిబ్రె పార్టీ తరఫున పోటీ చేసిన బల్కాజార్, 130 మంది సభ్యులున్న చట్టసభలో ముగ్గురు ఇతర అభ్యర్థులను ఓడించి విజేతగా నిలిచారు. పెరూలో ఈ ఏడాది ఏప్రిల్ 12న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.

బంగ్లాలో హిందూ పోలీసు అధికారిని హత్యచేసిన నిందితుడు దిల్లీలో అరెస్టు

దిల్లీ: బంగ్లాదేశ్‌లో హిందూ పోలీసు అధికారిని హత్య చేసిన ఘటనలో నిందితుడైన బంగ్లా విద్యార్థి ఉద్యమకారుడిని దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నట్లు గురువారం అధికారులు తెలిపారు. నిందితుడు బంగ్లాదేశ్‌లోని హబీగంజ్‌కు చెందిన అహ్మద్ రజా హసన్ మెహ్దీ.. దిల్లీ నుంచి ఐరోపా దేశానికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అతడిని గుర్తించారు. 2024 ఆగస్టు 5న ఎస్సై సంతోష్ చౌధరి హత్య కేసులో అహ్మద్‌పై ఆరోపణలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. అతడిని కస్టడీలోకి తీసుకుని బంగ్లాదేశ్‌కు తిరిగి పంపించినట్లు తెలిపారు.

ఐఏఎస్‌ల దండల పెళ్లి



ఈటీవీ భారత్: వివాహాల్లో హంగులు ఆర్భాటాలకు భారీగా డబ్బులు ఖర్చుపెడుతున్న ఈరోజుల్లో ఇద్దరు ఐఏఎస్ అధికారులు నిరాడంబరంగా దండలు మార్చుకొని ఒక్కటయ్యారు. రాజస్థాన్‌లోని అలవర్ జిల్లా కలెక్టరు డాక్టర్ అర్తికా శుక్లా సమక్షంలో ఈ పెళ్లి జరిగింది. 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వధూవరులిద్దరూ శిక్షణ సమయంలోనే ప్రేమించుకున్నారు. ఉత్తరాఖండ్‌కు చెందిన వరుడు మాధవ్ భరద్వాజ్ అలవర్ జిల్లా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డీఎం)గా, యూపీకి చెందిన వధువు అదితి గుజరాత్‌లోని జామ్‌నగర్ ఎస్‌డీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇరువురి తల్లిదండ్రులు, కొంతమంది స్నేహితులు ఈ పెళ్లికి హాజరయ్యారు.

గగన్‌యాన్‌లో కీలకపరీక్ష పూర్తి

- డ్రోగ్ పారాచూట్ విజయవంతం

దిల్లీ: మానవసహిత అంతరిక్ష యాత్ర- గగన్‌యాన్‌కు సిద్ధమవుతున్న 'రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ' (డీఆర్‌డీవో) మరో కీలక మైలురాయిని అధిగమించింది. అత్యంత బలీయమైన రిబ్బన్ పారాచూట్‌లను తయారు చేయడంలో మన దేశానికి ఉన్న నైపుణ్యాన్ని చాటిచెప్పేలా బుధవారం చండీగఢ్‌లోని 'టెర్మినల్ బాలిస్టిక్స్ పరిశోధన ప్రయోగశాల' (టీబీఆర్‌ఎల్)లో ఓ పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. డ్రోగ్ పారాచూట్ ఎంత భారాన్ని తట్టుకుంటుందనే పరీక్షను పూర్తిచేయడం ముఖ్యమైన పరిణామమని పేర్కొంది. విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రం, ఇస్రో తదితర సంస్థలు దీనిలో పాలుపంచుకున్నాయని తెలిపింది. అధిక వేగ ఏరో డైనమిక్, బాలిస్టిక్ మదింపులో విస్తృతంగా వాడే 'రైల్ ట్రాక్ రాకెట్ స్లెడ్' (ఆర్‌టీఆర్‌ఎస్)ను ఈ ప్రయోగానికి వినియోగించినట్లు వివరించింది. నమూనా పరంగా పారాచూట్‌కు ఉండే అదనపు భద్రతను ఈ పరీక్ష రుజువు చేసిందని తెలిపింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై డీఆర్‌డీవో, ఇస్రోలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు. ఆత్మనిర్భర్ భారత్‌లో ఇది మరో ముందడుగుగా అభివర్ణించారు.

రాహుల్‌కూ పార్టీలో అవమానం తప్పలేదట!

- ఇక నాకు జరిగిన పరాభవానికి విలువేముంది?
- అస్సాం కాంగ్రెస్ మాజీ చీఫ్ భూపెన్ బోరా వ్యాఖ్యలు



గువాహటీ: 'పార్టీలో నాకు జరుగుతున్న అవమానాల గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో చెప్పినప్పుడు, తనకూ అలాంటి పరిస్థితులే ఉన్నాయని ఆయన అన్నారు. ఇక నాకు జరిగిన అవమానానికి విలువ ఏముంది?' అని భాజపాలో చేరబోతున్న అస్సాం కాంగ్రెస్ మాజీ చీఫ్ భూపెన్ బోరా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నుంచి రూ.50 కోట్లు తీసుకొని భాజపాలో చేరబోతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగొయ్ తనపై చేసిన ఆరోపణపై స్పందిస్తూ.. ఒకవేళ డబ్బు ఇస్తే తాను మీడియా ముందే దాన్ని తీసుకుంటానన్నారు. 'రాష్ట్రంలో ఒక స్టేడియం నిర్మించాలని మా నాన్నగారి కోరిక. దానికోసం 12 బీఘాల భూమి కూడా కేటాయించాం. అయితే నేను రెండుసార్లు ఎమ్మెల్యేగా వ్యవహరించినప్పటికీ ఆయన కోరికను తీర్చలేకపోయాను. ఆయన 2019లో మరణించారు' అని పేర్కొన్నారు. 'నాన్నగారి కోరిక నా హృదయంలోనే ఉండిపోయింది. కానీ స్టేడియం నిర్మించడానికి రూ.50 కోట్లు సరిపోవు. హిమంత నిజంగా డబ్బు ఇస్తే, దాంతో స్టేడియం పనులు ప్రారంభించేవాడిని' అని బోరా వ్యాఖ్యానించారు.

రంగు మారనున్న ఎయిర్‌ఫోర్స్ వన్

- అమెరికా అధ్యక్షుడికి కొత్త విమానాలు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ఉపయోగించే అధికారిక విమానం 'ఎయిర్‌ఫోర్స్ వన్' కొత్త రూపు సంతరించుకోబోతోంది. దీని అడుగు భాగం చిక్కటి నీలి రంగు, పై సగం పూర్తి తెలుపు రంగుపై మధ్యన ఆకర్షణీయమైన దట్టమైన ఎర్రటి పట్టీ ఉండేలా డిజైన్ చేయనున్నారు. ఈ విమానంపై అధ్యక్షుని రాజముద్రతో పాటు 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా' అని రాసి ఉంటుంది. "మనకు కావాల్సింది శక్తివంతమైన నీలి రంగు.. బేబీ బ్లూ మాత్రం కాదు. ప్రతి వస్తువుకూ కాల పరిమితి ఉంటుంది. అందుకు అనుగుణంగానే ఎయిర్‌ఫోర్స్ వన్ విమాన రంగుల్ని మార్చబోతున్నాం" అని ట్రంప్ ఇటీవల ప్రకటించారు. అమెరికా అధ్యక్షునికి నజరానా రూపంలో ఇటీవల ఖతార్ సమర్పించిన బోయింగ్ 847-8ఐ విమానానికి కూడా ఇవే రంగులు వేయనున్నారు.

ప్రస్తుతం అధ్యక్షుడు వాడుతున్న 747-200 బోయింగ్ విమానానికి కాక్‌పిట్ నుంచి అడుగు భాగం మొత్తం నీలి రంగు వేసి ఉంది. విమానం పై సగ భాగానికి తెలుపు రంగు వేశారు. త్వరలో ఈ బోయింగ్ విమానం స్థానంలో రెండు సరికొత్త బోయింగ్ 747-800 విమానాలను వాడుకలోకి తేనున్నారు. ఈ విమానాలను అధ్యక్షుడు వాడటానికి అనువుగా బోయింగ్ సంస్థ మార్పులు చేర్పులు చేస్తోంది. పాత విమానం 70.7 మీటర్లు, కొత్తవి 76.2 మీటర్ల పొడవు కలిగి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ఏడాదిలోనే భూ అయస్కాంతాల ఉత్పత్తి



ఈనాడు, దిల్లీ: వాహన, పునరుత్పాదక ఇంధన రంగం, ఎలక్ట్రానిక్స్‌కు అత్యంత కీలకంగా మారిన అరుదైన భూ అయస్కాంతాల (రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్) ఉత్పత్తి ఈ ఏడాదిలోనే మన దేశంలో ప్రారంభమవుతుందని కేంద్ర గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకవసరమైన కీలక ఖనిజాలను దేశీయంగా, విదేశాల్లో వెలికితీయడంతో పాటు ఇ-వేస్ట్ రీసైక్లింగ్ ద్వారానూ సమీకరిస్తామని.. ఇక్కడ ఫిక్కీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మంత్రి చెప్పారు. ‘కీలక ఖనిజాల కోసం అర్జెంటీనాలో లిథియం గనిని తీసుకున్నాం. కెనడా, ఫ్రాన్స్‌లతోనూ చర్చలు జరిపాం. విధానపరమైన మద్దతు ఇచ్చి ఇ-వ్యర్థాల నుంచీ సంపద సృష్టించే దిశగా అడుగులు వేస్తున్నాం. 2014కి ముందు దేశంలో 1,400 ఖనిజాన్వేషణ ప్రాజెక్టులు ఉండేవి. ఈ రోజు ఆ సంఖ్య 4,000ను మించింది. ఇందుకోసం పనిచేస్తున్న 41 ప్రైవేటు ఏజెన్సీలకు 100% ప్రోత్సాహం అందిస్తున్నాం. దేశీయంగా ఖనిజ శుద్ధి, రిఫైనరీ సామర్థ్యం పెంచడంపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. 24 సంక్లిష్ట ఖనిజాలపై దిగుమతి సుంకం మినహాయించాం. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో రేర్ ఎర్త్ కారిడార్లు అభివృద్ధి చేసేందుకు రూ.7,280 కోట్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ప్రారంభించాం’ అని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

వినియోగదారుల కమిషన్లలో ఖాళీలను భర్తీ చేయండి

- హైకోర్టులో పిల్ దాఖలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ల (ఎస్‌సీడీఆర్‌సీ, డీసీడీఆర్‌సీ)లో అధ్యక్ష, సభ్యుల పోస్టులను సకాలంలో భర్తీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. ఎస్‌సీడీఆర్‌సీ, డీసీడీఆర్‌సీలలో ఖాళీగా ఉన్న అధ్యక్ష, సభ్యుల పోస్టులను భర్తీ చేయకపోవడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది, భీమవరానికి చెందిన వాలంటరీ కన్స్యూమర్ అసిస్టెన్స్ నెట్‌వర్క్(వీసీఏఎన్) అధ్యక్షుడు బొమ్మిడి సన్నీరాజ్ హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం.. వినియోగదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, రాష్ట్ర పౌర సరఫరాలశాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీచేసింది.

హెరిటేజ్ వ్యతిరేక కథనాలు తక్షణం తొలగించండి

- సాక్షి మీడియా, సామాజిక మాధ్యమాలకు దిల్లీ హైకోర్టు ఆదేశం
- రూ.100 కోట్ల పరువు నష్టం దావాలో మధ్యంతర ఉత్తర్వులు
- ప్రతివాదులకు నోటీసులు జారీ

ఈనాడు, దిల్లీ: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్‌కు వ్యతిరేకంగా ప్రచురించిన, ప్రసారం చేసిన కథనాలను వెంటనే తొలగించాలని దిల్లీ హైకోర్టు సాక్షి మీడియా, ఇతర సామాజిక మాధ్యమాలను ఆదేశించింది. తితిదే నెయ్యి కుంభకోణంలో నిందితులుగా ఉన్న భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను తమతో వ్యాపార భాగస్వామ్యం నిర్వహిస్తున్న ధోల్‌పుర్‌లోని భోలేబాబా మిల్క్‌ఫుడ్ సంస్థను రెండూ ఒక్కటిగా కుట్రపూరితంగా ప్రచారం చేస్తూ ప్రతిష్ఠకు భంగం కల్గిస్తున్న సాక్షి మీడియా సంస్థలు, దాని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ హెరిటేజ్ సంస్థ వేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావాపై గురువారం విచారించిన జస్టిస్ మినీపుష్కరణ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. హెరిటేజ్ సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది సందీప్ సేఠీ చేసిన వాదనలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి.. సాక్షి పత్రిక, వెబ్‌సైట్, టీవీ ఛానల్, సాక్షి సామాజిక మాధ్యమ హ్యాండిల్స్‌తో పాటు హెరిటేజ్‌పై అనుచిత కథనాలు అప్‌లోడ్ చేసిన మిగతా సంస్థలన్నీ 24 గంటల్లోపు తొలగించాలని న్యాయమూర్తి ఆదేశించారు. భోలేబాబా అంశంలో హెరిటేజ్‌కు వ్యతిరేకంగా పోస్టులు, పరువునష్టం కల్గించే అంశాలు, అసత్య వార్తలు ప్రచారం చేయడంలో సాక్షి మీడియా సంస్థలతో పాటు అందరూ సంయమనం పాటించాలని నిర్దేశించారు. హెరిటేజ్ పరువుకు భంగం కల్గించేలా సాక్షిలో ఈనెల 14న ప్రచురించిన కథనాలను, ఇతర కంటెంటుకు సంబంధించిన లింక్‌లను తొలగించాలని సామాజిక మాధ్యమ సంస్థలు మెటా, ఎక్స్, గూగుల్‌ను ఆదేశించారు. ఆ లింకులను కూడా ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. వాటి చెలామణిని నియంత్రించాలని నిర్దేశించారు. ఇందులో ప్రతివాదులుగా ఉన్న జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్, దాని ఛైర్‌పర్సన్ వైఎస్ భారతీరెడ్డి, చీఫ్ ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, ఇందిరా టెలివిజన్ లిమిటెడ్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ, మెటా ప్లాట్‌ఫామ్స్, ఎక్స్, గూగుల్ సంస్థలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను జులై 9కి వాయిదావేశారు. తితిదే నెయ్యి కుంభకోణంలో నిందితుల జాబితాలో ఉన్న భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను, తమతో వ్యాపార సంబంధం ఉన్న భోలేబాబా మిల్క్‌ఫుడ్ సంస్థను ఒక్కటిగా చూపి.. తద్వారా తమ ప్రతిష్ఠకు భంగంకల్గించేలా సాక్షి కుట్రపూరితంగా వార్తలను ప్రసారం చేసినట్లు హెరిటేజ్ సంస్థ తన పరువునష్టం దావాలో పేర్కొంది. ఆ రెండు సంస్థలు వేర్వేరు అని చెప్పేందుకు అవసరమైన సాక్ష్యాధారాలన్నింటినీ జతచేసింది.

ఉత్తర్వుల్లో ఏముందంటే?

‘కోర్టు ముందు వినిపించిన వాదనలను బట్టి.. పిటిషనర్ సంస్థ ప్రాథమికంగా తనకు జరిగే నష్టం గురించి, ఒకవేళ తనకు అనుకూలంగా మధ్యంతర ఉపశమనం కల్పించకపోతే జరిగే నష్టం గురించి బలంగా చెప్పింది. ఇందులో సమతౌల్య సౌలభ్యత (బ్యాలెన్స్ ఆఫ్ కన్వీనియన్స్) పిటిషనర్‌కు అనుకూలంగా ఉన్నట్లు కోర్టు భావిస్తోంది. అందుకే ఈ ఉత్తర్వులు జారీచేస్తున్నాం’ అని న్యాయమూర్తి పేర్కొన్నారు.

తాజా, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తులే.. హెరిటేజ్ వాగ్దానం

- 25 రకాల నాణ్యతా పరీక్షలు దాటాకే బయటకి
- పాడిరైతును శక్తిమంతులుగా చేయడమూ మా బాధ్యతే
- ‘ఎక్స్’లో వీడియో విడుదల చేసిన సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి



ఈనాడు, అమరావతి: హెరిటేజ్ ఫుడ్స్‌లో తయారయ్యే ప్రతి ఉత్పత్తి 25 రకాల నాణ్యతా పరీక్షలు దాటాకే బయటకొస్తుందని, తర్వాతే వినియోగదారుల ఇంటికి చేరుతుందని సంస్థ మేనేజింగ్ ట్రస్టీ, ఎండీ నారా భువనేశ్వరి తెలిపారు. 33 ఏళ్లుగా తాజా, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తులు అందిస్తూ, పాడి రైతుకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ‘హెరిటేజ్ వాగ్దానం’ పేరుతో గురువారం ‘ఎక్స్’లో ఆమె వీడియో విడుదల చేశారు. ‘రూ.4 కోట్ల సంస్థగా ప్రయాణం ప్రారంభించి, నేడు రూ.4 వేల కోట్లకు పైగా విలువైన సంస్థగా ఎదిగాం. నాణ్యతలో రాజీ లేకపోవడమే మాపై నమ్మకానికి పునాది. 500 మందికి పైగా నిపుణులు నాణ్యతా ప్రమాణాల్ని పర్యవేక్షిస్తుంటారు. 9 రాష్ట్రాల్లో 3 లక్షల మంది రైతులను శక్తిమంతులను చేస్తున్నామ’ని భువనేశ్వరి వివరించారు. ‘పాలతో పాటు పెరుగు, నెయ్యి, పన్నీర్, ఐస్‌క్రీమ్ సహా ప్రతి ఉత్పత్తిలోనూ మా అంకితభావం కన్పిస్తుంది. పరిశుభ్రత, భద్రత, ప్రమాణాల్లో చట్టపరమైన నిబంధనల కంటే కఠిన పరీక్షలు, విధానాలు పాటిస్తాం. ఇది ఒక రోజు కృషి కాదు. నిరంతర ప్రక్రియ’గా వివరించారు.

త్రికరణ శుద్ధిగా నమ్ముతున్నాం

‘మూడున్నర దశాబ్దాలుగా రైతులతో మా భాగస్వామ్యం మూడు ముఖ్య సూత్రాలపై నిలబడింది. 1. రైతులకు సమయానికే కచ్చితమైన చెల్లింపులు. 30 ఏళ్లలో ఎప్పుడూ ఒక్క రోజు కూడా బిల్లులు ఆలస్యం చేయలేదు. 2. సంపూర్ణ పారదర్శకత. రైతుల నుంచి సేకరించిన పాల నాణ్యత పరీక్షలు, కొలతలు స్పష్టంగా ఉంటాయి. రోజూ ఎంత సంపాదిస్తున్నారో రైతుకు తెలుస్తుంది. 3. న్యాయమైన ధర చెల్లింపు. నాణ్యత, ప్రమాణాలకు తగిన గౌరవమైన ఆదాయం దక్కేలా చూస్తాం. పశు వైద్యసేవలు, పశుసంరక్షణ, మంచి దాణా, శిక్షణ, డిజిటల్ సాధనాలు, ఆర్థిక రక్షణ తదితర అంశాల్లో రైతులకు తోడుగా ఉంటాం. వారిని మరింత బలోపేతం చేసే దిశగా నిరంతరం పెట్టుబడులు పెడతాం’ అని భువనేశ్వరి తెలిపారు. ‘మా విధానాలు, నాణ్యతా ప్రమాణాలు, రైతులతో కలిసి పనిచేసే తీరు స్వయంగా చూడండి. మేం చెప్పేది నిజమని నిర్ధారించుకోండి. మిమ్మల్ని సంతోషంగా ఆహ్వానిస్తున్నాం’ అని పేర్కొన్నారు. మూడున్నర దశాబ్దాలుగా నిలబెట్టుకుంటున్న హెరిటేజ్ వాగ్దానాన్ని తర్వాతి తరాలకూ కొనసాగిస్తామని భువనేశ్వరి స్పష్టంచేశారు.

హెరిటేజ్‌పై వైకాపా ఆరోపణలు తగవు

తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, న్యూస్‌టుడే: కల్తీ నెయ్యి కేసులో పీకల్లోతు కూరుకుపోయిన వైకాపా.. హెరిటేజ్‌పై ఆరోపణలు చేయడం దుర్మార్గమని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు గురువారం ఓ ప్రకటనలో ఆక్షేపించారు. ‘హెరిటేజ్ ఎప్పుడు తితిదేకి నెయ్యి సరఫరా చేయలేదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా నెయ్యి సరఫరాలో హెరిటేజ్ పాత్ర లేదు. అబద్ధాన్ని పదే పదే చెపితే అది నిజమవుతోందనుకోవడం మీ భ్రమ. మండలిలో ప్రతిపక్ష నేతగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న బొత్స సత్యనారాయణ ఈ విషయాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుంది. హెరిటేజ్ చీజ్ ప్యాకెట్లు చూపించి నెయ్యి అని చెప్పి మీ పరువు పోగొట్టుకున్నారు. జగన్ చెప్పినట్లు ఆడకుండా మాట్లాడే ముందు విజ్ఞతతో ఆలోచించాలి. నెయ్యి ధరలపైనా వైకాపా నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ఓపెన్ టెండర్లలో పారదర్శకంగా వీటిని నిర్ణయించాం. తక్కువ ధరలకు సరకులు కొని స్వామివారికి నాణ్యతలేని నైవేద్యాలు, భక్తులకు అన్నప్రసాదాలు అందించడమేంటి? ఈ విషయంలో మేం రాజీపడే ప్రసక్తే లేదు. నెయ్యి ఒక్కటే కాదు అన్ని రకాల పదార్థాల్లోనూ ప్రమాణాలు పెంచాం’ అని అందులో స్పష్టం చేశారు.

డీఎంకే కూటమిలో చేరిన డీఎండీకే



స్టాలిన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రేమలత

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులో త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో కూటమి వ్యవహారంపై సాగదీతకు తెరదించుతూ డీఎండీకే ప్రధానకార్యదర్శి ప్రేమలత డీఎంకే కూటమిలో చేరారు. సినీ నటుడు దివంగత విజయకాంత్ 2005లో ప్రారంభించిన ‘దేశియ ముర్పోక్కు ద్రావిడ కళగం(డీఎండీకే)’ 2011లో అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుని ప్రధాన ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది. రాష్ట్రంలోని ప్రధాన పార్టీగా ఉన్న డీఎంకేకు ప్రతిపక్ష హోదానూ లేకుండా చేసి రాజకీయ సంచలనం సృష్టించింది. త్వరలో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్న తరుణంలో డీఎండీకే ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటుందన్నదానిపై ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో డీఎంకే అధ్యక్షుడైన ముఖ్యమంత్రి స్టాలిన్‌ను గురువారం ఆ పార్టీ ప్రధానకార్యాలయంలో డీఎండీకే ప్రధానకార్యదర్శి ప్రేమలత, కోశాధికారి ఎల్.కె.సుదీశ్, కార్యదర్శి పార్థసారథి, ఉప ప్రధానకార్యదర్శులు చంద్రన్, పన్నీర్‌సెల్వం కలిసి అప్పటివరకు కూటమి ఏర్పాటుపై జరుగుతున్న ప్రచారానికి తెరదించారు. ఈ సందర్భంగా విలేకరులతో ప్రేమలత మాట్లాడుతూ..రానున్న శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ డీఎంకేతో కలిసి పోటీ చేస్తుందన్నారు. ఈ కూటమి 2016లోనే ఏర్పాటు కావాల్సి ఉండగా పదేళ్ల తర్వాత అది జరిగిందన్నారు. సీట్ల సర్దుబాటు గురించి స్టాలిన్ ప్రకటిస్తారని తెలిపారు. స్టాలిన్ తన ‘ఎక్స్’లో..డీఎండీకే నేడు లౌకికవాద ప్రగతిశీల కూటమిలో చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. ద్రావిడ మోడల్ ప్రభుత్వం కొనసాగడానికి, రాష్ట్రం అన్ని విధాలుగా పురోభివృద్ధి సాధించడానికి కలిసి పయనిద్దామంటూ ఆ పార్టీకి పిలుపునిచ్చారు.

వాషింగ్టన్ డీసీ మేయర్ పదవి రేసులో తమిళ మూలాలున్న మహిళ



రినీ సంపత్

ఈనాడు, చెన్నై: తమిళ మూలాలున్న మహిళ అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ మేయర్ పదవికి పోటీపడుతున్నారు. సమాజ సేవ నేపథ్యం నుంచి వచ్చిన ఆమె కొత్త వాషింగ్టన్ నిర్మాణానికి ఎన్నికల బరిలోకి దిగినట్లు స్థానికులకు వివరిస్తున్నారు. తమిళనాడులోని తేని నగరానికి చెందిన రినీ సంపత్(31) తనకు ఏడేళ్ల ఉన్నప్పుడే తల్లిదండ్రులతో కలిసి యూఎస్ వెళ్లారు. చదువంతా అక్కడే పూర్తిచేశారు. విద్యార్థి సంఘ నాయకురాలిగా గుర్తింపు పొందారు. ప్రభుత్వ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఏజెన్సీ నిర్వాహకురాలిగానూ సేవలందించారు. ఈ సమయంలోనే ఆమె వాషింగ్టన్ నగర సమస్యలపై గళమెత్తి.. ప్రజలకు ఎంతో చేరువయ్యారు. ఆ అనుభవంతోనే నగర ఎన్నికల బరిలోకి దిగినట్లు ప్రకటించారు. నగరంలో మౌలిక వసతుల కల్పన, సత్వర ప్రజా సేవలు, వేగంగా స్పందించే కాల్‌సెంటర్లు అవసరమని గుర్తించి వాటిపై హామీలు ఇస్తున్నారు. జీవన ఖర్చు తగ్గించేలా ప్రభావవంతమైన చర్యలు చేపడతానంటున్నారు. ‘తాను రాజకీయ నాయకురాలిని కాదు. ఏ పార్టీ తన వెనుక లేదు. కొత్త వాషింగ్టన్ నిర్మాణమే లక్ష్యం’ అంటూ స్థానిక ప్రజలకు వివరిస్తున్నారు.

టీవీ సౌండ్ తగ్గించమన్నందుకు భర్తను చంపిన భార్య



షేక్ అహ్మద్

మంగళగిరి, న్యూస్‌టుడే: టీవీ సౌండ్ తగ్గించే విషయంలో భార్యాభర్తల మధ్య ఏర్పడిన వివాదంలో భర్తను భార్య కత్తితో పొడిచి చంపిన ఘటన గురువారం రాత్రి మంగళగిరిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న షేక్ అహ్మద్ (27) 8 నెలల కిందట క్రాంతి అనే యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులు టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి క్రాంతి ఇంట్లో టీవీ సౌండ్ పెంచడంతో దాన్ని తగ్గించాలని అహ్మద్ సూచించాడు. ఈ విషయమై మాటామాటా పెరగడంతో భార్యపై చేయిచేసుకున్నాడు. వివాదం ముదిరి, క్రాంతి అక్కడే ఉన్న ఉల్లిపాయలు కోసే కత్తితో భర్త అహ్మద్‌ను పొడిచింది. స్థానికులు హుటాహుటిన అతణ్ని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అహ్మద్ మృతి చెందాడు.

EENADU Vol: 52, Issue: 191 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



ఈఎల్‌ఎస్‌ఎస్

ఈ పొరపాట్లు చేయొద్దు

ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాలు ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాలు. ఇవి పాత పన్ను విధానంలోని సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలను అందించే ఏకైక మ్యూచువల్ ఫండ్ రకం. ఈ పథకాలు తమ ఆస్తులలో 80 శాతం ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సాధనాల్లో మదుపు చేస్తాయి. వీటికి మూడేళ్ల లాకిన్ వ్యవధి ఉంటుంది. ఈ సమయంలో పెట్టుబడిని వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదు.

✧ పన్ను ఆదా సాధనాల్లో ఈఎల్‌ఎస్‌ఎస్ లాకిన్ పీరియడ్ (3 ఏళ్లు) అత్యంత తక్కువగా ఉన్నప్పటికీ, దీని గురించి ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. మీరు సిప్ ద్వారా పెట్టుబడి పెడుతున్నప్పుడు, ప్రతి నెలా చెల్లించే వాయిదాకు విడివిడిగా మూడేళ్ల లాకిన్ వ్యవధి వర్తిస్తుంది. ఉదాహరణకు, మీరు జనవరిలో రూ.5,000 పెడితే, ఆ మొత్తం మూడేళ్ల తర్వాత వచ్చే జనవరి వరకూ కొనసాగాలి. అంటే, మొదటి వాయిదా వేసిన మూడేళ్లకే మొత్తం సొమ్మును వెనక్కి తీసుకోవడం కుదరదు. కాబట్టి, మీ భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా ఈఎల్‌ఎస్‌ఎస్ పెట్టుబడులను ప్లాన్ చేసుకోండి.

✧ వేర్వేరు అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల (ఏఎంసీ) నుంచి అనేక ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాలను ఎంచుకోవడం మరో పెద్ద పొరపాటు. దీనివల్ల మీ పోర్ట్‌ఫోలియో వైవిధ్యం దెబ్బతింటుంది. చాలా ఫండ్లు ఒకే రకమైన షేర్లలో పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుంది. ఇది నష్టభయాన్ని పెంచడమే కాకుండా, ఆశించిన రాబడిని తగ్గించవచ్చు. పైగా సెక్షన్ 80సీ కింద గరిష్ఠ పరిమితి రూ.1.5లక్షలు మాత్రమే. కాబట్టి, ఎక్కువ ఫండ్లలో పెట్టుబడి పెట్టినా అదనపు పన్ను ప్రయోజనం ఉండదు.

✧ ఈఎల్‌ఎస్‌ఎస్‌లో కేవలం రూ.1.5లక్షల వరకే పెట్టుబడి పెట్టాలనే అపోహ చాలామందిలో ఉంది. వాస్తవానికి ఈ పథకాల్లో పెట్టుబడి పెట్టడానికి గరిష్ఠ పరిమితి ఏదీ లేదు. కేవలం పన్ను మినహాయింపు మాత్రమే రూ.1.5 లక్షల (పాత పన్ను విధానంలో) వరకూ లభిస్తుంది.

✧ సెక్షన్ 80సీ పరిమితికి లోబడి ఈఎల్‌ఎస్‌ఎస్ ప్రయోజనాలు ఉంటాయి. మీకు ఇప్పటికే ఇతర 80సీ పెట్టుబడులు (పీపీఎఫ్, జీవిత బీమా) ఉంటే, వాటన్నింటినీ కలిపి రూ.1.5లక్షల వరకే మినహాయింపు లభిస్తుంది. కేవలం అసలు పెట్టుబడిపైనే మినహాయింపు ఉంటుంది తప్ప, వచ్చే రాబడిపై కాదు.

✧ చాలామంది మదుపరులు లాకిన్ వ్యవధి పూర్తవగానే నిధులను వెనక్కి తీసుకోవాలని భావిస్తారు. లాకిన్ వ్యవధి ముగిసినంత మాత్రాన తప్పనిసరిగా వెనక్కి తీసుకోవాలనే నియమం లేదు. మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఉపసంహరించుకుంటే, సంపద సృష్టికి అడ్డంకి ఏర్పడుతుంది.

✧ పన్ను ఆదా కోసమే కాకుండా, ఇవి ఈక్విటీ ఆధారిత పథకాలు అని గుర్తుంచుకోవాలి. డెట్ లేదా హైబ్రిడ్ ఫండ్లతో పోలిస్తే కాస్త నష్టభయం ఎక్కువగా ఉంటుంది. మార్కెట్ అస్థిరతకు ప్రభావితం అవుతాయి. నష్టభయం గురించి ఆలోచించకుండా వీటిని ఎంచుకోవద్దు.

✧ కేవలం గతంలో వచ్చిన రాబడులను చూసి, లేదా ఇతరుల సూచనలతో ఫండ్లను ఎంచుకోవడం సరికాదు. ఫండ్ ఎంచుకునేటప్పుడు ఖర్చుల నిష్పత్తి, షేర్ల కూర్పు, పెట్టుబడి వ్యూహం, ఫండ్ మేనేజర్ నైపుణ్యాన్ని విశ్లేషించాలి. గత రాబడులు భవిష్యత్తులోనూ అలాగే ఉంటాయని చెప్పలేం. ఫండ్ పనితీరును దాని ప్రామాణిక సూచీతో పోల్చి చూసి, అది మీ లక్ష్యాలకు సరిపోతుందా అనేది తెలుసుకోవాలి.

లాకిన్ నిబంధనలు, పన్ను ప్రయోజనాలు, నష్టభయం గురించి సరైన అవగాహన పెంచుకుంటేనే ఈఎల్‌ఎస్‌ఎస్‌లతో దీర్ఘకాలంలో సంపదను సృష్టించే అవకాశం ఉంటుంది.

సిరి

siri@eenadu.net

వృద్ధికి అవకాశం ఉంటే

పెట్టుబడికి కోసం వృద్ధికి అవకాశం ఉన్న కంపెనీలను ఎంచుకొని, లాభాలు ఆర్జించే వ్యూహంతో వచ్చిన పథకం.. **ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్.** ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఫ్లెక్సీ క్యాప్ విభాగానికి చెందినది కాబట్టి, ఫండ్ మేనేజర్‌కు కంపెనీల ఎంపికలో పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ అనే తేడా లేకుండా వృద్ధికి అవకాశం ఉండే షేర్లను ఎంచుకొని, మదుపు చేస్తారు. ముఖ్యంగా కంపెనీల ప్రాథమిక అంశాలను విశ్లేషించి, బాటమ్-అప్ విధానంలో స్టాక్స్‌ను ఎంచుకుంటారు. ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 23. కనీస పెట్టుబడి రూ.5,000. కనీసం 5-10 ఏళ్లపాటు పెట్టుబడిని కొనసాగించగలిగే వారికి, దీర్ఘకాలిక సంపద సృష్టికి ఇది ఉపయోగపడుతుంది. ఈక్విటీ ఫండ్ కాబట్టి, కాస్త అధిక నష్టభయం ఉంటుంది.

అత్యుత్తమ పనితీరుతో..

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్.. మిడ్ క్యాప్ విభాగంలో మొమెంటం వ్యూహంతో **ఎస్‌బీఐ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 మొమెంటమ్ 50 ఈటీఎఫ్‌**ను అందుబాటులోకి తెచ్చింది. ఇది ఒక పాసివ్ ఫండ్. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్‌లోని కంపెనీలలో గత 6-12 నెలల్లో అత్యుత్తమ పనితీరు చూపించిన టాప్ 50 షేర్లను ఎంచుకొని, మదుపు చేస్తుంది. ఫండ్ తన ఆస్తుల్లో 95-100 శాతం నిధులను ఈ 50 షేర్లలోనే పెడుతుంది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 24 వరకూ కొనసాగుతుంది. కనీస పెట్టుబడి రూ.5,000. ఇది ఈటీఎఫ్ కాబట్టి, ఎగ్జిట్ లోడ్ ఉండదు. మదుపు చేసేందుకు డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. మిడ్ క్యాప్ షేర్లలో హెచ్చుతగ్గులు సహజం. పైగా ఇది మొమెంటం ఆధారంగా పనిచేస్తుంది కాబట్టి, మార్కెట్ పడుతున్నప్పుడు నష్టభయం అధికంగా ఉంటుంది. దీన్ని తట్టుకునే వారికే ఇది అనుకూలం.

నేటి వేగవంతమైన ప్రపంచంలో కేవలం సంపాదన పెంచుకోవడం మాత్రమే ఆర్థిక విజయం అనిపించుకోదు. ఊహించని సంక్షోభాలు ఎదురైనప్పుడు, ఆర్థికంగా కుంగిపోకుండా ధైర్యంగా నిలబడటమే అసలైన ఆర్థిక స్థిరత్వం..

నాలుగు సూత్రాలతో

ఆర్థిక ధీమా

మీ ఆర్థిక స్థితిగతులు ఎంత బలంగా ఉన్నాయో అంచనా వేయడానికి, నిపుణులు నాలుగు ప్రధాన కొలమానాలను సూచిస్తున్నారు. అవేంటో చూద్దామా..

1 **ఆదాయంలో పొదుపు:** జీవితంలో ఎప్పుడు ఏ ఆపద వస్తుందో ఎవరూ ఊహించలేరు. అకస్మాత్తుగా ఉద్యోగం పోయినా లేదా అనారోగ్యం వంటి ఖర్చులు ఎదురైనా, మీ పొదుపు మిమ్మల్ని రక్షిస్తుంది. చాలామంది ఇలాంటి సమయాల్లో పదవీ విరమణ కోసం దాచుకున్న డబ్బును వాడుతుంటారు లేదా రుణాలు తీసుకుంటారు. అందుకే, నిపుణుల సూచన ప్రకారం మీ వద్ద కనీసం మూడు నుంచి ఆరు నెలల జీతానికి సమానమైన మొత్తం నగదు రూపంలో అందుబాటులో ఉండాలి. ఇది ఇల్లు లేదా వాహన మరమ్మతులు, అనారోగ్యం వంటి అత్యవసర సమయాల్లో మీకు రక్షణ కవచంలా పనిచేస్తుంది.

2 **అప్పుల పరిమితి:** బ్యాంకులు ఇచ్చే క్రెడిట్ కార్డు పరిమితులు, ముందస్తు అనుమతి పొందిన వ్యక్తిగత రుణాల ఉచ్చులో పడటం వల్ల ఆర్థిక ఆరోగ్యం దెబ్బతింటుంది. బాధ్యతారాహిత్యంగా చేసే ఈ స్వల్పకాలిక అప్పుల వల్ల మీ జీతంలో అధిక భాగం వడ్డీలు, వాయిదాలకే సరిపోతుంది. ఇది మీ జీవన ప్రమాణాలను తగ్గించడమే కాకుండా, సిబిల్ స్కోరునూ దెబ్బతీస్తుంది. ఆరోగ్యకరమైన ఆర్థిక స్థితి కోసం, మీ నెలవారీ ఆదాయంలో అప్పుల వాటా 20% నుంచి 35% మించకుండా చూసుకోవడం అత్యంత ముఖ్యం.

3 **బీమా రక్ష:** పొదుపుతో పాటు సరైన బీమా ఉన్నప్పుడే ఆర్థిక రక్షణ లభిస్తుంది. బీమా ఉండటం వల్ల మీ ఆస్తులకు, కుటుంబ భవిష్యత్తుకు భరోసా లభిస్తుంది. మన దేశంలో కేవలం 5 శాతం మందికే బీమా ఉంది, అందులోనూ చాలామంది తక్కువ కవరేజీతో ఉన్నారు. బీమా మీ వార్షిక ఆదాయానికి 10 నుంచి 15 రెట్ల వరకూ ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఉదాహరణకు: మీ వార్షిక ఆదాయం రూ.5 లక్షలు అయితే, మీకు కనీసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు బీమా రక్షణ ఉండాలి. దీనికి అదనంగా మీపై ఉన్న అప్పుల మొత్తాన్నీ కలపాలి.



4 **పదవీ విరమణ నిధి:** ఒకానొక దశలో మనం పని చేయడం ఆపేయక తప్పదు. అప్పుడూ మన జీవనశైలి మారకూడదంటే, పక్కాగా పదవీ విరమణ ప్రణాళిక ఉండాలి. పదవీ విరమణ తర్వాత మీ నెలవారీ ఖర్చుల కోసం, పదవీ విరమణకు ముందు మీకున్న ఆదాయంలో కనీసం 75 శాతం వచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. చిన్న వయసులోనే పొదుపు ప్రారంభించడం వల్ల చక్రవడ్డీ ప్రయోజనంతో భారీ నిధిని సమకూర్చుకోవచ్చు.

ఈ నాలుగు సూత్రాలను క్రమం తప్పకుండా సమీక్షించుకోవడం వల్ల ఆర్థిక క్రమశిక్షణ పెరగడమే కాకుండా, మీ భవిష్యత్తుకు బలమైన పునాది లభిస్తుంది.

సొంతంగా ఒక కారు ఉండటం ఇప్పుడు ఒక కనీస అవసరంగా మారింది. కారు కొనాలనే ఆలోచన రాగానే మొదట వచ్చే సందేహం దానికి కావాల్సిన నిధులను ఎలా సమకూర్చుకోవాలి? ఎంత పొదుపు చేయాలి? అనేది. సరైన ఆర్థిక ప్రణాళిక లేకపోతే కారు కొనుగోలు భవిష్యత్తులో భారంగా మారే అవకాశం ఉంటుంది. ఒక క్రమబద్ధమైన ప్రణాళికతో ముందడుగు వేస్తే ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా మీ ఇంటి ముందుకు కొత్త కారు వచ్చి చేరుతుంది.

కొత్త కారు కొంటున్నారా?

కారు కొనుగోలులో తొలి దశ బడ్జెట్ నిర్ణయించుకోవడం. ప్రస్తుతం మార్కెట్‌లో మధ్య శ్రేణి కారు ధర సుమారు రూ.7లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఉంది. మీ ఆదాయం, అవసరాలు, వ్యక్తిగత ఇష్టాలను బట్టి, ఈ బడ్జెట్ మారొచ్చు. ఒకసారి ధరను నిర్ణయించుకున్నాక, తర్వాతి కాలంలో ఆ బడ్జెట్‌ను పెంచకుండా ఉండటం ఉత్తమం. ఉదాహరణకు, మీరు రూ.7 లక్షల కారును కొనాలని నిర్ణయించుకున్నారనుకుందాం.

కారు లోన్ తీసుకోవడం: దీనివల్ల తక్షణమే కారును ఇంటికి తెచ్చుకోవచ్చు. ప్రస్తుతం చాలా బ్యాంకులు కారు ధరలో 80-90% వరకు రుణం ఇస్తున్నాయి. మిగిలిన 20 మొత్తాన్ని డౌన్ పేమెంట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ. 7 లక్షల కారుకు మీరు రూ.1.4 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన మొత్తాన్ని 7 ఏళ్ల కాల పరిమితితో ఈఎంఐల రూపంలో చెల్లించవచ్చు.

పొదుపు చేయడం: కొంతకాలం ఆగి, తగినంత సొమ్ము జమ అయ్యాక కారును కొనుగోలు చేయడం. దీనివల్ల వాయిదాల భారం ఉండదు.

కారు రుణం సౌకర్యవంతంగా అనిపించినప్పటికీ, ఇందులో కొన్ని ఇబ్బందులూ ఉన్నాయి. కారు అసలు ధర కంటే చాలా ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుంది. వడ్డీతో పాటు లోన్ ప్రాసెసింగ్ ఫీజులు, జీఎస్టీ వంటి అదనపు ఖర్చులు తోడవుతాయి. అంతేకాకుండా, సుమారు 7 ఏళ్ల పాటు ప్రతి నెలా ఈఎంఐ చెల్లించడం ఒక భారంగా మారుతుంది. అదే మీరు పొదుపు చేసి కొంటే, ఈ అదనపు ఖర్చులు తగ్గడమే కాకుండా ఆర్థిక ప్రశాంతత లభిస్తుంది.

● అయిదేళ్ల తర్వాత కారు కొనాలని లక్ష్యంగా పెట్టుకుంటే, అప్పటికి కారు ధర ఎంత ఉండవచ్చో అంచనా వేయడం ముఖ్యం. గత పదేళ్ల తీరును గమనిస్తే, భారతదేశంలో కార్ల ధరలు ఏటా సగటున 10% పెరుగుతున్నాయి. ఇదే కొనసాగితే, నేడు రూ.7 లక్షలు ఉన్న కారు అయిదేళ్ల తర్వాత సుమారు రూ.11.27 లక్షలకు చేరుతుంది. కాబట్టి మీ 5 ఏళ్ల పొదుపు లక్ష్యం రూ. 11.27 లక్షలుగా ఉండాలి.



ఎక్కడ పెట్టుబడి పెట్టాలి?

5 ఏళ్ల కాల పరిమతి కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు కొంత నష్టభయంతో కూడుకున్నవి. దీనికి బదులుగా హైబ్రిడ్ ఫండ్లు ఎంచుకోవడం ఉత్తమం. ఇవి ఈక్విటీ, డెట్ రెండింటిలోనూ పెట్టుబడి పెడతాయి. మార్కెట్లు లాభాల్లో ఉన్నప్పుడు ఈక్విటీ ద్వారా మంచి రాబడులు, మార్కెట్లు ఒడుదొడుకుల్లో ఉన్నప్పుడు డెట్ ఇన్వెస్ట్‌మెంట్ల ద్వారా రక్షణ లభిస్తుంది.

● మ్యూచువల్ ఫండ్లలో క్రమబద్ధమైన పెట్టుబడి విధానం ద్వారా మీ లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చు. రూ.11.27 లక్షల లక్ష్యాన్ని చేరుకోవడానికి వివిధ రాబడి శాతం ప్రకారం నెలకు ఎంత పొదుపు చేయాలంటే...

- **8% సగటు రాబడితో:** నెలకు రూ. 15,240
- **10% సగటు రాబడితో:** నెలకు రూ. 14,436
- **12% సగటు రాబడితో:** నెలకు రూ. 13,670

ఆర్థిక నిపుణుల సూచన ప్రకారం, గరిష్ఠంగా నెలకు రూ.15,240 పొదుపు చేయడం మంచిది. ఒకవేళ మీకు 8% కంటే ఎక్కువ రాబడి వస్తే, ఆ అదనపు సొమ్ముతో మీరు అనుకున్న దానికంటే మెరుగైన మోడల్ లేదా ప్రీమియం కారును కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

వ్యూహాన్ని మారుస్తూ

ఆర్థిక వ్యవస్థలోని వివిధ దశలను బట్టి, పెట్టుబడి వ్యూహాన్ని మార్చుకునే థీమాటిక్ పథకం.. **ఐటీఐ బిజినెస్ సైకిల్ ఫండ్.** ఆర్థిక వ్యవస్థ పనితీరు ఎప్పుడూ ఒకేలా ఉండదు. వృద్ధి, మాంద్యంవంటి చక్రాలు సహజం. ఆర్థిక వ్యవస్థ ఏ దశలో ఉందో గమనిస్తూ, ఆ సమయంలో రాణించే రంగాల్లోని సంస్థల షేర్లలో మదుపు చేయడం ఈ ఫండ్ ప్రధాన వ్యూహం. ఇలా ఎప్పటికప్పుడు తన పెట్టుబడి తీరును మారుస్తూ ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ బాగున్నప్పుడు బ్యాంకింగ్, ఇన్‌ఫ్రాలో.. మందగమనంలో ఫార్మా వంటి రక్షణాత్మక రంగాలను పరిగణనలోకి తీసుకుంటుంది. దీన్నే టాప్-డౌన్ అప్రోచ్ అంటారు. ఎన్ఎఫ్ఓ చివరి తేదీ ఈ నెల 27. కనీస పెట్టుబడి రూ.5,000. సాధారణ డైవర్సిఫైడ్ ఫండ్లతో పోలిస్తే, ఇందులో కాస్త నష్టభయం ఎక్కువగానే ఉంటుంది. దీర్ఘకాలిక మదుపరులు పరిశీలించవచ్చు.

కొత్త పథకం

ఏఐ సంస్థల్లో

సంప్రదాయ ఐటీ సేవలకు మించి, వేగంగా విస్తరిస్తోన్న సరికొత్త సాంకేతికతల్లో మదుపు చేసే వ్యూహంతో ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్.. కొత్తగా **ఎల్ఐసీ ఎంఎఫ్ టెక్నాలజీ ఫండ్‌**ను తీసుకొచ్చింది. సాధారణంగా ఐటీ ఫండ్లంటే సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీలకే పరిమితం అవుతాయి. ఈ ఫండ్ వైవిధ్యంగా.. భవిష్యత్తు సాంకేతికతలైన కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, డిజిటల్ కామర్స్ ప్లాట్‌ఫామ్, ఇంటర్నెట్ ఆధారిత వ్యాపారాల్లో మదుపు చేస్తుంది. కేంద్ర బడ్జెట్ 2026-27లో ప్రభుత్వం డిజిటల్ మౌలిక సదుపాయాలు, సెమీకండక్టర్ల అభివృద్ధికి పెద్దపీట వేయడం ఈ రంగానికి కలిసొచ్చే అంశమని ఫండ్ సంస్థ చెబుతోంది. టెక్నాలజీ వాల్యూ చైన్‌లో స్థిరమైన వృద్ధి, మంచి నగదు ప్రవాహం ఉన్న కంపెనీలను ఎంచుకోవడం దీని ప్రధాన వ్యూహం. ఈ ఫండ్ ఎన్ఎఫ్ఓ మార్చి 6 వరకూ అందుబాటులో ఉంటుంది. బీఎస్ఈ టెక్ టోటల్ రిటర్న్ ఇండెక్స్‌ను ప్రామాణికంగా తీసుకుంటుంది. కనీస పెట్టుబడి రూ.1,000. రోజుకు రూ.100తోనూ ఇందులో మదుపు చేయొచ్చు. సిప్ ద్వారా రూ.200లతో ప్రారంభించేందుకు వీలుంది. ఇది ఒకే రంగానికి పరిమితమయ్యే థీమాటిక్ ఫండ్ కాబట్టి, కాస్త నష్టభయం ఉంటుంది. ఏఐ, డిజిటల్ విప్లవంపై నమ్మకం ఉన్న దీర్ఘకాలిక మదుపరులకు ఇది సరిపోతుంది.

ప్రవాసులకూ.. పాలసీ ఇస్తారు

మేము ఒక స్థలం విక్రయించాం. వచ్చిన మొత్తాన్ని క్యాపిటల్ గెయిన్స్ సేవింగ్స్ ఖాతాలో వేయాల్సిందిగా చెబుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయం ఏమైనా ఉందా? - బాలా

■ మీరు స్థలం విక్రయించగా వచ్చిన మూలధన లాభాన్ని క్యాపిటల్ గెయిన్స్ సేవింగ్స్ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని వేరే ఇల్లు లేదా స్థలం కొనేంత వరకూ ఇందులో ఉంచాలి. ఈ డబ్బును ఇతర అవసరాలకూ వాడొచ్చు. కాకపోతే, వచ్చిన లాభం మొత్తంపై 12.5 శాతం వరకూ పన్ను చెల్లించాలి. మీకు అయిదారేళ్ల తర్వాత డబ్బు అవసరం ఉంటే, పన్ను చెల్లించాక మిగిలిన మొత్తాన్ని ఈక్విటీ డైవర్సిఫైడ్ ఫండ్లలో వరుసగా ఆరేడు నెలల పాటు పెట్టుబడి పెట్టండి. గత ఏడాదిన్నరగా మార్కెట్లు సరిగా రాబడినివ్వలేదు. ఇప్పుడు స్వల్పకాలంలో మార్కెట్ల పనితీరు బాగుండే అవకాశాలున్నాయి. మీ పెట్టుబడిపైన దీర్ఘకాలంలో మంచి రాబడి వచ్చే వీలుంది. స్వల్పకాలంలో నష్టభయం ఉంటుందని గమనించాలి.



మేమిద్దరమూ ఉద్యోగం చేస్తున్నాం. మాకు 6 ఏళ్ల అమ్మాయి, ఏడాది వయసున్న బాబు ఉన్నారు. వీరిద్దరి పేరుమీదా కనీసం 10-15 ఏళ్లపాటు పెట్టుబడి పెట్టాలనే ఆలోచనతో ఉన్నాం. అమ్మాయి కోసం సుకన్య సమృద్ధిలో మదుపు చేస్తున్నాం. ఇప్పుడు కొత్తగా పెట్టుబడులు ఎలా ప్రణాళిక వేసుకోవాలి? - నిత్య

■ ముందుగా మీ పిల్లల భవిష్యత్తు అవసరాలకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు మీ వార్షికాదాయానికి కనీసం 10-12 రెట్ల వరకూ ఉండేలా జీవిత బీమా తీసుకోవాలి. మీ పెట్టుబడులు ఎప్పుడూ విద్యా ద్రవ్యోల్బణాన్ని మించి అధిక రాబడినిచ్చేలా చూసుకోవాలి. ఇంకా 15 ఏళ్ల వ్యవధి ఉంది కాబట్టి, ఈక్విటీ ఆధారిత పెట్టుబడులు మీకు సరిపోతాయి. దీనికోసం డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానంలో మదుపు చేయండి. సుకన్య సమృద్ధి యోజనలో మీ పెట్టుబడి మొత్తంలో 25 శాతం వరకే మదుపు చేయండి. మొత్తాన్ని మిగతా మ్యూచువల్ ఫండ్లకు కేటాయించండి. మీరు నెలకు రూ.20 వేల చొప్పున 15 ఏళ్లపాటు 11 శాతం రాబడి అంచనాతో మదుపు చేస్తే, రూ. 82,57,286 అయ్యేందుకు అవకాశం ఉంది.

నా వయసు 43. నేను చిన్న వ్యాపారిని. టర్మ్ పాలసీ తీసుకోవాలంటే కనీసం 10 వరకూ చదివి ఉండాలని అంటున్నారు. కచ్చితమైన ఆదాయమూ లేదు. నాకు ఏదైనా బీమా పాలసీ ఇస్తారా? - లక్ష్మి

■ సాధారణంగా టర్మ్ పాలసీలను ఇచ్చేందుకు ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. కొన్ని బీమా సంస్థలు ఇతర నిబంధనలూ విధించే అవకాశం ఉంది. మీకు కచ్చితమైన ఆదాయం లేదంటున్నారు కాబట్టి, పాలసీ లభించడం కొద్దిగా కష్టమే. ప్రత్యామ్నాయంగా మీరు సరళ్ జీవన్ బీమా యోజన పాలసీని తీసుకోవచ్చు. అన్ని కంపెనీలూ ఈ పాలసీని ఇస్తాయి.

మార్గదర్శి

నేను స్విట్జర్లాండ్‌లో ఉంటున్నాను. వయసు 29. ఇంకా వివాహం కాలేదు. నేను మన దేశంలో టర్మ్ పాలసీ తీసుకునేందుకు వీలుందా? ఒకటికి మించి పాలసీలు తీసుకుంటే ఏమైనా ఇబ్బంది వస్తుందా? - ప్రశాంత్ బెండాళం

■ మీరు స్విట్జర్లాండ్‌లో ఉన్నప్పటికీ, ఇండియాలో టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవచ్చు. జీవిత బీమా పాలసీకి ఎలాంటి భౌగోళిక అడ్డంకులూ ఉండవు. ప్రపంచంలో ఏమూల ఉన్నా.. ప్రమాదంలో పాలసీదారుడికి ఏదైనా జరిగినప్పుడు బీమా సంస్థలు క్లెయిం చెల్లిస్తాయి. ఆదాయాన్ని బట్టి, ఎంత మొత్తానికి పాలసీ ఇవ్వాలన్నది బీమా సంస్థలు నిర్ణయిస్తాయి. ఒకటికి మించి పాలసీలు తీసుకున్నప్పుడు ఆ వివరాలు సంస్థకు తెలియజేయాలి. ఆరోగ్య, ఆర్థిక వివరాలూ కచ్చితంగా చెప్పాలి. మంచి క్లెయిం సెటిల్‌మెంట్ ఉన్న కంపెనీల నుంచి బీమా పాలసీ తీసుకోండి.

– తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

నేను పాత కారు కొనుగోలు చేశాను. దీనికి థర్డ్ పార్టీ బీమా పాలసీ తీసుకున్నాను. పూర్తి స్థాయి పాలసీని తీసుకోవడం అవసరమా?

■ కారుకు సంబంధించిన సాధారణ నిర్వహణ ఖర్చులను భరించడం సాధ్యమే. కానీ, అకస్మాతుగా జరిగే ప్రమాదాలు లేదా ప్రకృతి వైపరీత్యాల కారణంగా భారీగా ఖర్చయ్యే అవకాశం ఉంది. ఇలాంటి ఆర్థిక పరమైన సమస్యల నుంచి పూర్తిస్థాయి మోటార్ బీమా కాపాడుతుంది. మన దేశంలో చట్టప్రకారం థర్డ్ పార్టీ లయబిలిటీ బీమా తప్పనిసరి. ఇది కేవలం ఇతరులకు లేదా వారి ఆస్తికి జరిగిన నష్టాన్ని మాత్రమే భరిస్తుంది. సొంత కారు మరమ్మతులకు వర్తించదు. మీ కారు వయసు, ప్రస్తుత మార్కెట్ విలువ, రిస్కు తీసుకునే మీ సామర్థ్యంపై పూర్తిస్థాయి పాలసీకి మారాలా వద్దా అనేది నిర్ణయించుకోవాలి. బాగా పాత కారు లేదా తక్కువ విలువున్న కార్ల పాలసీకి చెల్లించే ప్రీమియంతో పోలిస్తే, పెద్దగా ప్రయోజనాలు ఉండకపోవచ్చు. కానీ, మీ కారుకు చెప్పుకోదగ్గ విలువ ఉంటే, ఊహించని ఖర్చుల నుంచి పూర్తి రక్షణ కోరుకుంటే, కాంప్రహెన్సివ్ బీమా తీసుకోడమే ఉత్తమం. దీంతోపాటు, రోడ్ సైడ్ అసిస్టెన్స్, ఇంజిన్ ప్రొటెక్షన్‌లాంటి రైడర్లనూ చూడొచ్చు. బీమా సంస్థను ఎంచుకునేటప్పుడు ప్రీమియం ఒక్కటే కాకుండా, విస్తృత నెట్‌వర్క్, చెల్లింపుల చరిత్రలాంటివీ చూడాలి. పాలసీ పత్రాలను జాగ్రత్తగా చదివి, వర్తించేవి, వర్తించనివి చూసుకోవాలి.

– రాకేష్ కౌల్, చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ (రిటెయిల్ బిజినెస్), బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్



చిన్న మార్పులు..

సిరికి మార్గాలు

విధానం ముఖ్యం

చాలామందికి పదవీ విరమణ నాటికి రూ.1కోటి సంపాదించాలి అనే లక్ష్యం ఉంటుంది. కానీ, ఆ గమ్యాన్ని చేర్చేది మనం అనుసరించే విధానం మాత్రమే. ఉదాహరణకు ప్రతి నెలా క్రమం తప్పకుండా చేసే పెట్టుడులు (సిప్). మీరు కేవలం ఆ పెట్టుబడి సరిగా పెడుతున్నామా అనేది చూసుకుంటే చాలు. గమ్యం దానంతట అదే చేరువవుతుంది.

1 శాతం మెరుగుదల

పెట్టుబడుల కోసం ఒకేసారి పెద్ద సాహసాలు చేయనవసరం లేదు. ప్రతిరోజూ కేవలం 1 శాతం మెరుగుపడితే, గణితశాస్త్రం ప్రకారం ఏడాదికి మీరు 37 రెట్లు మెరుగైన స్థితిలో ఉంటారు. నెలకు రూ.5,000 పొదుపు చేయలేకపోతే, కనీసం రూ.500లతోనైనా మొదలు పెట్టండి. ఆ చిన్న మొత్తమే చక్రవడ్డీ శక్తితో భారీ నిధిగా మారుతుంది.

ఓపిక పట్టండి

పెట్టుబడుల విషయంలో ఓపిక చాలా అవసరం. ఒక పండ్ల మొక్క నాటామంటే.. అది కాయలు కాసేందుకు 3-4 ఏళ్ల కాలం పడుతుంది. అంటే, అంతకుముందు కాలం అంతా వృథా అయినట్లు కాదు. అది ఫలాలను ఇచ్చేందుకు అవసరమైన శక్తిని కూడబెట్టుకుంది. పెట్టుబడులూ అంతే. ప్రారంభంలో లాభాలు తక్కువగా ఉండొచ్చు. స్థిరంగా కొనసాగితే మీ సంపద అనూహ్యంగా పెరుగుతుంది.

నియంత్రణ

చుట్టూ ఉండే ఆకర్షణలకు, అనవసర ఖర్చులకు 'వద్దు' అని చెప్పడం నేర్చుకోవాలి. మీరు ఒక అనవసర ఖర్చును 'కాదు' అన్నారంటే, మీ భవిష్యత్తు విజయానికి 'అవును' అని అర్థం. మార్కెట్ హెచ్చుతగ్గుల్లో ఉన్నప్పుడు భయంతో అమ్మేయకుండా ఉండటమే నిజమైన క్రమశిక్షణ.

మీ బ్యాంకు బ్యాలెన్స్ ఎంత ఉంది అనేది కాదు.. మీ అలవాట్లు మిమ్మల్ని ఎటు తీసుకెళ్తున్నాయన్నది ముఖ్యం. మీ చిన్న అలవాట్లే మీ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అందుకే, 'పొదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నాను' అని చెప్పడం కంటే, 'నేను ఒక క్రమశిక్షణ ఉన్న మదుపరిని' అని బలంగా నమ్మండి. ఆ గుర్తింపు మీ వ్యక్తిత్వంలో భాగమైతే.. ఆర్థిక విజయం మీ వెంటే ఉంటుంది.

ఈనాడు సినిమా


ప్రభాస్

సరైన సమయంలో ప్రకటన

కథానాయకుడు ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్నారు. ఇప్పటికే ఆయన చేస్తున్న 'ఫౌజీ' ముగింపు దశకు చేరుకోగా.. 'స్పిరిట్', 'కల్కి 2' ప్రారంభ దశలో ఉన్నాయి. ఇక దీని తర్వాత ఆయన చేయాల్సి ఉన్న సినిమాల్లో 'సలార్ 2'తో పాటు దర్శకుడు ప్రశాంత్ వర్మ ప్రాజెక్ట్ ఒకటి ఉంది. ప్రస్తుతం ఇది ఆగిపోయినట్లు ప్రచారం వినిపిస్తున్న నేపథ్యంలో ఆ చిత్ర సన్నిహిత వర్గాలు స్పందించాయి. ఆ సినిమా ప్రణాళిక ప్రకారమే ముందుకు సాగుతోందని.. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో ఉన్న సినిమాలు పూర్తి కాగానే ఇది అధికారికంగా పట్టాలెక్కుతుందని.. సరైన సమయంలోనే దానికి సంబంధించిన ప్రకటన వెలువడనుందని తెలిపాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి గతంలోనే ప్రభాస్ టెస్ట్ లుక్ కూడా పూర్తయినట్లు వార్తలు వినిపించాయి. దీంతో ఈ సినిమాని ఎప్పుడు ప్రకటించినా లుక్‌తో పాటే పూర్తి వివరాలు బయటకొచ్చే అవకాశముంది. ప్రశాంత్ వర్మ ప్రస్తుతం రిషబ్ శెట్టితో 'జై హనుమాన్'ని పట్టాలెక్కించే ప్రయత్నాల్లో ఉన్నారు. ప్రభాస్ చేతిలోని చిత్రాలు పూర్తయ్యే లోపు ఈ సినిమాని ముగించనున్నట్లు తెలుస్తోంది.

మా రాజు.. మా గర్వం


రితేశ్ దేశ్‌ముఖ్

ఛత్రపతి శివాజీ జీవితం ఆధారంగా బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న చిత్రం 'రాజా శివాజీ'. ఇందులో అభిషేక్ బచ్చన్, సంజయ్ దత్, జెనీలియా, విద్యాబాలన్ తదితరులు నటిస్తున్నారు. రెండేళ్ల క్రితమే ప్రకటించిన ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఇన్‌స్టాలో రితేశ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించింది చిత్రబృందం. "చీకటి వెలుగు కోసం తారసపడుతున్నప్పుడు.. ఓ జ్వాల పైకి లేచింది.. అలానే చరిత్ర నిలిచిపోయినప్పుడు ఒక యోధుడు దానిని తిరిగి రాయాలనుకున్నాడు.. 'మా రాజు.. మా గర్వం.. మా వారసత్వం" అనే వ్యాఖ్యల్ని జోడించింది. ఇంతకు ముందెన్నడూ చూడని సినిమాటిక్ దృశ్యంతో ఈ సినిమాని రూపొందిస్తున్నట్లు దర్శకుడు పేర్కొన్నారు. ఈ సినిమాని జియో స్టూడియోస్, ముంబయి ఫిల్మ్ కంపెనీ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

రామోజీ ఫిల్మ్‌సిటీలో వృషకర్మ


నాగ చైతన్య

కథానాయకుడు నాగచైతన్య నటిస్తున్న కొత్త చిత్రం 'వృషకర్మ'. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ఈ సినిమాని సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మీనాక్షి చౌదరి కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా నుంచి ఓ గ్లింప్స్ విడుదల చేసేందుకు చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇప్పటికే దీని సంబంధించిన పనులు మొదలవ్వగా.. మార్చి తొలివారంలో దీన్ని విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ గ్లింప్స్‌తోనే ఈ చిత్ర కథా ప్రపంచాన్ని.. దాని స్కేల్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయనున్నట్లు తెలుస్తోంది. దీనితోపాటే విడుదల తేదీపైనా స్పష్టత ఇచ్చే అవకాశముందని తెలిసింది. చైతన్య ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో అర్జున్ అనే నిధి అన్వేషకుడిగా కనిపించనున్నారు. దక్ష అనే ఆర్కియాలజిస్ట్‌గా మీనాక్షి అలరించనుంది. దీనికి అజనీశ్ లోక్‌నాథ్ సంగీతమందిస్తున్నారు.

మిస్టిక్ థ్రిల్లర్ కథలో!


కల్యాణ్ రామ్

ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని ఆవిష్కరించే కథ... అందులో అబ్బురపరిచే ఫాంటసీ అంశాలు, భక్తి కోణం, థ్రిల్లింగ్‌గా సాగే కథనం... ఇలాంటి మేళవింపుతో కూడిన మిస్టిక్ థ్రిల్లర్ సినిమాలు ఈ మధ్య ప్రేక్షకుల మనసుల్ని గెలుస్తున్నాయి. 'విరూపాక్ష' మొదలుకొని పలువురు కథానాయకులు ఈ తరహా కథలతో విజయాల్ని సొంతం చేసుకున్నారు. కల్యాణ్‌రామ్ కొత్త సినిమా కూడా మిస్టిక్ థ్రిల్లర్ కథతోనే రూపొందనున్నట్లు తెలుస్తోంది. కల్యాణ్‌రామ్ తదుపరి సినిమా ప్రముఖ రచయిత శ్రీకాంత్ విస్సా దర్శకత్వంలో రూపొందనుంది. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమాని పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధమవుతోంది. రచయితగా మంచి పేరున్న శ్రీకాంత్ విస్సా దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిదే. ఆయన విభిన్నమైన మిస్టిక్ థ్రిల్లర్ కథతో, భారీస్థాయి సినిమాని రూపొందించనున్నట్టు తెలుస్తోంది. విజువల్‌గా ప్రత్యేకమైన అనుభూతిని పంచే సినిమాల్ని ఇష్టపడుతున్న ప్రేక్షకుడి అభిరుచుల్ని దృష్టిలో ఉంచుకునే శ్రీకాంత్ విస్సా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు.

'కింగ్' అనే ట్యాగ్ బాధ్యతను గుర్తుచేస్తుంది!


షారుక్ ఖాన్

'పఠాన్', 'జవాన్', 'డంకీ' లాంటి చిత్రాలతో హిట్టు కొట్టిన బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్.. మూడేళ్ల తర్వాత మరోసారి యాక్షన్‌తో అదరగొట్టడానికి సన్నద్ధమవుతున్నారు. ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో అలరించే ఆయనను అభిమానులు 'కింగ్' అనే ట్యాగ్‌తో పిలుస్తుంటారనే విషయం తెలిసిందే. ఈ కింగ్ అనే పదం అధికారం గురించి కాదని, ఎప్పుడూ బాధ్యతను గుర్తు చేస్తుందని అన్నారు షారుక్. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న షారుక్ మాట్లాడుతూ.. "నా జీవితంలో, కెరీర్‌లో ఈ దశలో 'కింగ్' అనే ట్యాగ్.. ఒక గుర్తింపులా కాకుండా మంచి ఉద్దేశంతో బతకడానికి ఒక జ్ఞాపికలా అనిపిస్తుంది. నా రాబోయే సినిమా పేరు 'కింగ్'. అభిమానులు ప్రేమగా పిలుచుకునే పేరు కూడా అదే కావడం విశేషం. ఈ పేరుతో నాకు బలమైన సంబంధం ఉన్నప్పటికీ.. కాలక్రమేణా కథల విషయంలో నా దృక్పథం మారింది. ఇది మిమ్మల్ని నమ్మే ప్రేక్షకుల్ని మెప్పించే కథలను రూపొందించడం పట్ల బాధ్యతను గుర్తుచేస్తుంది. కాలం గడిచేకొద్దీ, నిజంగా ముఖ్యమైనది పేరు కాదని, మీ పని వెనుక ఉండే ఉద్దేశమని తెలుసుకుంటార"ని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'కింగ్' సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది.

కొత్త చిత్రానికి శ్రీకారం


దశరథ్, ఆర్యా

ఆర్యా హీరోగా పోలూరు కృష్ణ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. మురుకుంట్ల అరవింద్, విజయ భారతి నిర్మిస్తున్నారు. దశరథ్, వాసుకి, నరేన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా గురువారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దశరథ్ క్లాప్ కొట్టగా.. విజయ భారతి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు కృష్ణ మాట్లాడుతూ.. "ఇదొక మంచి యాక్షన్ థ్రిల్లర్. టౌన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. మార్చిలో చిత్రీకరణ ప్రారంభిస్తాం. జులైలో విడుదల చేస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్, ఛాయాగ్రహణం: రామ్ కె మహేశ్.

'సైయారా' దర్శకుడితో..?


రణ్‌బీర్ కపూర్

బాలీవుడ్ చిత్రపరిశ్రమలో ఎలాంటి అంచనాలు లేకుండా ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లను సాధించిన ప్రేమకథా చిత్రం 'సైయారా'. మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా మ్యూజికల్ లవ్‌స్టోరీగా యువతను విశేషంగా ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన తదుపరి చిత్రాన్ని ప్రేమకు కొంచెం మాస్‌ని మిళితం చేసి ఓ గ్యాంగ్‌స్టర్ మ్యూజికల్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో హీరో రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. "దర్శకుడు మోహిత్ సూరి చాలా కాలంగా రణ్‌బీర్‌తో కలిసి పనిచేయాలని అనుకుంటున్నారు. ఆదిత్య చోప్రా నిర్మించనున్న ఆయన తదుపరి చిత్రంలో రణ్‌బీర్ కపూర్ కథానాయకుడిగా నటించే అవకాశముంది. రణ్‌బీర్ కూడా మోహిత్‌తో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నారు. ప్రస్తుతం ఆయనతో చర్చలు చేస్తున్నారు. ఇప్పుడు చేస్తున్న చిత్రాలు పూర్తయితే కానీ, దీనిపై స్పష్టత రాద"ని హిందీ చిత్రవర్గాల సమాచారం. రణ్‌బీర్ ప్రస్తుతం సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న 'లవ్ అండ్ వార్'తోపాటు 'రామాయణ' చిత్రాలతో బిజీగా ఉన్నారు.

రెండు విధాలుగానూ అవమానాలే!


రెజీనా

హిందీ భాషపై మంచి పట్టు ఉన్నప్పటికీ బాలీవుడ్‌లో తన సినీ ప్రయాణం అనుకున్నంత సులభంగా సాగలేదంటోంది హీరోయిన్ రెజీనా. దక్షిణాదికి చెందిన ఈ తార తెలుగు సినిమాలతోపాటు పలు హిందీ, తమిళ చిత్రాలతోనూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రెజీనా హిందీ చిత్రసీమలోని కెరీర్ గురించి పలు విశేషాలను పంచుకుంది. "నేను దక్షిణ భారత నటిని. అయినప్పటికీ హిందీ చాలా బాగా మాట్లాడేదాన్ని. బాలీవుడ్ కెరీర్ ప్రారంభంలో నాకు కొన్ని సవాళ్లు ఎదురయ్యాయి. చాలామంది నన్ను మాటలతోనే కాదు.. చేతలతోనూ అవమానించిన సందర్భాలున్నాయి. అప్పుడు హిందీ భాషపై నాకున్న పట్టు నన్ను ప్రత్యేకంగా నిలబెట్టింది. కానీ, అలాంటి పరిస్థితుల్లో సినిమాలను ఎంచుకోవడం చాలా కష్టంగా ఉండేది. తక్కువ ప్రాధాన్యత ఉండే పాత్రలు వచ్చేవి. వాటిని చేయడం సులభమే. కానీ, నేను మెయిన్ స్ట్రీమ్ కమర్షియల్ చిత్రాలను చేయాలనుకోవడం లేదు. అందుకని వైవిధ్యంగా ఉండే పాత్రలనే ఎంచుకునేదాన్ని. బాలీవుడ్‌లో అప్పుడు నాకు ఎదురైన పరిస్థితులే ఎప్పటికీ అలానే ఉంటాయని నేను చెప్పను. ఎందుకంటే ఇప్పుడు చాలామంది భాషలతో సంబంధం లేకుండా అన్ని చిత్రపరిశ్రమలలోనూ నటిస్తున్నారు"అని చెప్పుకొచ్చింది. రెజీనా తదుపరి.. అగ్ర కథానాయిక నయనతార నటిస్తున్న 'మూకుతి అమ్మన్ 2' సినిమాలో కనిపించనుంది.

గద్దర్ పురస్కారాల జ్యూరీలో మార్పు

గద్దర్ సినీ పురస్కారాలు - 2025 ఎంపిక జ్యూరీ కమిటీలో కీలక మార్పు చోటు చేసుకుంది. ప్రత్యేక పురస్కారాల జ్యూరీకి ఛైర్మన్‌గా సీనియర్ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ నియమితులయ్యారు. ఆ మేరకు తెలంగాణ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మొదట ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావుని ఛైర్మన్‌గా నియమించగా, ఆయన స్థానంలోనే తమ్మారెడ్డి భరద్వాజకు బాధ్యతలు అప్పగించారు. ఉగాదికి పురస్కారాల్ని ప్రదానం చేయనున్నారు.



మహాన్ 2 సన్నాహాలు

వైవిధ్యమైన పాత్రలతో ప్రయోగాలు చేసే హీరో విక్రమ్, ఆయన కుమారుడు ధ్రువ్ విక్రమ్ కలిసి నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మహాన్'. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించారు. 2022లో ఓటీటీ వేదికగా విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. తండ్రీకొడుకుల సంఘర్షణ ప్రధానంగా కథాంశంగా రూపొందిన ఈ చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ కొనసాగింపు చిత్రం గురించి మాట్లాడుతూ.. "ఈ సీక్వెల్ కోసం నా దగ్గర ఓ ఆలోచన ఉంది. కానీ స్క్రిప్ట్ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. 2027-28 నాటికి ఇది ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయ"ని అన్నారు.

అదే ఈ సినిమా ప్రత్యేకత!


రామాంజనేయులు

"నేటి తరం ప్రేమ జీవితాల్లోని ముఖ్యమైన విషయాల్ని స్పృశించే ఓ మంచి చిత్రమే మా 'బూకీ'. తమిళంలో విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల్నీ అలరిస్తుంది" అన్నారు రామాంజనేయులు జవ్వాజి. ఆయన సర్వంత్‌రామ్ క్రియేషన్స్ పతాకంపై... నటుడు విజయ్ ఆంటోనీ సమర్పణలో నిర్మించిన చిత్రమే 'బూకీ'. అజయ్ దిషన్, ధనుషా నాయకానాయికలు. గణేశ్ చంద్ర దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత జవ్వాజి రామాంజనేయులు గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. "ప్రేమ పేరుతో నేటి తరం యువతీయువకులు ఎంత వేగంగా ఒకరికొకరు దగ్గరవుతున్నారో.. అంతే వేగంతో విడిపోతున్నారు. అందుకు కారణాలేమిటి? ఆ క్షణంలో ఎదురయ్యే బాధతో వాళ్లు తీసుకుంటున్న నిర్ణయాలు ఎలా ఉంటున్నాయనే విషయాల్ని ఆసక్తికరంగా చర్చించే సినిమా ఇది. అన్ని ప్రేమకథలు ప్రేమతోనే మొదలవుతాయి. ఈ కథ బ్రేకప్‌తో మొదలవడమే ప్రత్యేకం. 13న తమిళంలో విడుదలై మంచి ఆదరణని సొంతం చేసుకొంటోంది. నిర్మాతలుగా మేం సంతోషంగా ఉన్నాం. సురేశ్ ప్రొడక్షన్స్ నుంచి తెలుగులో 200 పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నాం".

- "విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన తొలి సినిమాని తెలుగులో నేనే విడుదల చేశా. ఆయన సంగీత దర్శకుడిగా సినిమాలు చేస్తున్నప్పటి నుంచీ నాకు పరిచయం. ఆయనతో కలిసి 'మార్గన్', 'భద్రకాళి', 'బూకీ'తోపాటు తదుపరి 'వందదేవుళ్లు' సినిమానీ చేస్తున్నా. సినిమాపై ఎంతో తపన ఉన్న ఆయనతో మా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది. నేరుగా తెలుగు సినిమాలు చేయాలని నాకూ ఉంది. అయితే నేను పలు వ్యాపారాలతో చెన్నైలో స్థిరపడిపోయా. దాంతో ఇక్కడ నేరుగా సినిమాలు చేయలేకపోతున్నా. మా వ్యాపార బాధ్యతల్ని కొత్తతరం తీసుకున్నాక, కొంచెం సమయం తీసుకుని తెలుగులో ఓ పెద్ద హీరోతో ఓ పెద్ద బడ్జెట్ సినిమా చేయాలనే ఆలోచనతోనే ఉన్నా. ప్రస్తుతానికి సత్యదేవ్‌తో ఓ సినిమాని పూర్తి చేశా. 'బిచ్చగాడు' కలయికలో రూపొందించిన 'వందదేవుళ్లు' సినిమాని మేలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అని చెప్పారు.

టాక్సిక్ తర్వాత?


హ్యూమా ఖురేషీ

గతేడాది 'దిల్లీ క్రైమ్ సీజన్ 3'లో మీనా చౌదరి పాత్రలో కనిపించి తన నటనతో ఆకట్టుకుంది బాలీవుడ్ నాయిక హ్యూమా ఖురేషీ. మరి కొద్ది రోజుల్లో 'టాక్సిక్' చిత్రంతో ఎలిజబెత్‌గా ప్రేక్షకుల్ని పలకరించనున్న ఈమె.. మరో చిత్రానికి ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. 'పాతాళ్ లోక్', 'ది ఫ్యామిలీ మ్యాన్' లాంటి వైవిధ్యమైన సిరీస్‌లతో ఆకట్టుకున్న నటుడు జైదీప్ అహ్లావత్‌తో ఓ సినిమా కోసం హ్యూమా జోడీ కట్టనుందట. దీనికి 'శుభ్ మంగళ్ జ్యాదా సావధాన్' ఫేమ్ హితేశ్ కేవల్య దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. "'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్'లో జైదీప్, హ్యూమా కలిసి కనిపించకపోయినా.. ఇప్పుడు రాబోయే డ్రామాలో వీరిద్దరి జంటను ప్రత్యేకంగా పరిచయం చేయబోతున్నారు దర్శకుడు. ఈ ఏడాది జూన్‌లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలున్నాయి. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. త్వరలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు అధికారికంగా ప్రకటించనున్నార"ని హ్యూమా సన్నిహిత వర్గాలు తెలిపాయి.

భావోద్వేగాలతో... 'నవాబ్ కేఫ్'



శివ, తేజు అశ్విని

"ప్రేక్షకులు మాకు ఇచ్చే సమయం... ఖర్చు పెట్టే డబ్బుకు వంద శాతం న్యాయం చేసేలా మా సినిమా ఉంటుంద"న్నారు శివ కందుకూరి. ఆయన కథానాయకుడిగా... ప్రమోద్ హర్ష దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'నవాబ్ కేఫ్'. తేజు అశ్విని కథానాయిక. వెంకట్.ఆర్ పప్పుడిప్పు నిర్మించారు. ఈ చిత్రం ఈ రోజు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది చిత్రబృందం. కథానాయకుడు మాట్లాడుతూ "మంచి కథతో వచ్చే చిత్రాలకు తిరుగు ఉండదు. ఈ సినిమా చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ వాళ్ల తండ్రికి ఫోన్ చేసి మాట్లాడతారు. ఇందులోని భావోద్వేగం కచ్చితంగా ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. రాజీవ్ కనకాలతో పనిచేయడంతో ఎంతో నేర్చుకున్నా. ప్రమోద్, వెంకట్, ప్రశాంత్ తదితర సాంకేతిక బృందం అద్భుతమైన పనితీరుని కనబరిచింది" అన్నారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ "ఈ సినిమా చూసే ప్రతి తండ్రి తన కుమారుణ్ని, ప్రతి తనయుడూ తన తండ్రిని గుర్తు చేసుకుంటాడు. మంచి భావోద్వేగంతో తీస్తే తప్పకుండా సినిమా విజయవంతం అవుతుంది. అలాంటి భావోద్వేగాలున్న చిత్రమిది" అన్నారు. కుటుంబమంతా కలిసి చూసే ఓ మంచి చిత్రమిదన్నారు దర్శకనిర్మాతలు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు ప్రశాంత్ ఆర్.విహారి, గీత రచయిత సురేశ్ బనిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రూ. 30కోట్ల మోసం కేసులో దర్శకుడు విక్రమ్‌భట్‌కు బెయిల్

భారీ ఆర్థిక మోసం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న హిందీ దర్శకనిర్మాత విక్రమ్ భట్, ఆయన సతీమణి శ్వేతాంబరిని రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇటీవలే శ్వేతాంబరికి బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు... గురువారం విక్రమ్ భట్‌కు కూడా బెయిల్‌ను మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యపూర్వక పరిష్కారానికి ప్రయత్నాలు చేయాలని ధర్మాసనం పేర్కొంది. ఉదయ్‌పూర్‌లోని ఇందిరా ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్ వ్యవస్థాపకుడు, డాక్టర్ అజయ్ ముర్దియా తన దివంగత భార్య జీవిత చరిత్ర ఆధారంగా ఒక బయోపిక్ తీస్తామని, ఆ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని నమ్మించి తన దగ్గర నుంచి భట్ దంపతులు రూ.30కోట్లు తీసుకున్నారని తెలిపారు. అయితే ఆ సినిమా నిర్మాణం అనుకున్న విధంగా సాగకపోవడం.. లాభాల విషయంలో స్పష్టత లేకపోవడంతో మోసపోయానని భావించిన డాక్టర్ ముర్దియా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టైటిల్ మారుస్తాం


మనోజ్ బాజ్‌పేయీ

బాలీవుడ్ కథానాయకుడు మనోజ్ బాజ్‌పేయీ ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఘూస్‌ఖోర్ పండత్'పై దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. దర్శకుడు నీరజ్ పాండే రూపొందించిన ఈ సినిమా టైటిల్‌పై వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం పేరు మారిస్తేనే విడుదలకు అనుమతిస్తామని సుప్రీం కోర్టు ఇటీవలే ఆదేశించింది. గురువారం ఈ కేసుపై మరోసారి విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టైటిల్‌ను మారుస్తామని చిత్రబృందం కోర్టుకు తెలిపింది. "ఇంకా కొత్త టైటిల్ ఖరారు కాలేదు. కానీ.. అది మునుపటి పేరులా వివాదాలకు దారితీసేలా ఉండదు" అని నీరజ్ పాండే కోర్టుకు వివరించారు.

బాలీవుడ్ దర్శకనిర్మాత ఎంఎం బేగ్ మృతి



బాలీవుడ్ దర్శకనిర్మాత ఎంఎం బేగ్(70) కన్నుమూశారు. ప్రముఖ బాలనటి బేబీ గుడ్డు (షాహిందా బేగ్) తండ్రి అయిన ఆయన.. తన ఇంట్లోనే శవమై కనిపించారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. "బేగ్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నాలుగైదు రోజులుగా ఇంటి నుంచి బయటకు రాలేదు. దీంతో ఇరుగుపొరుగు వారు అతని ఇంటి నుంచి దుర్వాసన వస్తోందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తలుపులు తెరిచి బేగ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఆయన కుమార్తెకు సమాచారం అందించారు. బేగ్ చాలా ప్రేమగల వ్యక్తి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా" అని ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. 'ఛోటీ బహు' (1994)తో సహా రెండు చిత్రాలకు దర్శకత్వం వహించారు బేగ్.

బిజినెస్

2029 కల్లా ఏడాదికి 10 హెచ్125 హెలికాప్టర్ల ఉత్పత్తి



దిల్లీ: ఏరోస్పేస్ దిగ్గజం ఎయిర్‌బస్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్)తో కలిసి కర్ణాటకలో స్థాపించిన తుది అసెంబ్లీ లైన్ నుంచి ఏడాదికి 10 హెచ్125 హెలికాప్టర్లను ఉత్పత్తి చేయాలని యోచిస్తోంది. 2029 నాటికి ఈ లక్ష్యాన్ని చేరతామని ఎయిర్‌బస్ హెలికాప్టర్ల సీఈఓ బ్రూనో ఈవెన్ వెల్లడించారు. భారత్‌లో హెలికాప్టర్ మార్కెట్ బాగుంటుందని తాము బలంగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. పౌర హెలికాప్టర్ మార్కెట్‌ను పెంచడంలో హెచ్125 హెలికాప్టర్లు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. కర్ణాటకలోని వేమగల్‌లో హెచ్125 కోసం దేశంలోనే తొలి ప్రైవేటు రంగ హెలికాప్టర్ ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్)ను టీఏఎస్ఎల్‌తో కలిసి ఎయిర్‌బస్ ఏర్పాటు చేసింది. ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఈ ప్లాంటును దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించిన సంగతి విదితమే. ప్రస్తుతం మనదేశంలో 100కు పైగా ఎయిర్‌బస్ హెలికాప్టర్లు సేవలందిస్తున్నాయి.

అనిల్ అంబానీకి ఈడీ తాజా సమన్లు

దిల్లీ: ఈ నెల 26న విచారణకు హాజరుకావాల్సిందిగా రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజా సమన్లు జారీ చేసింది. ఈ వారంలో ఆయన విచారణకు గైర్హాజరు కావడంతో, ఈడీ తాజా సమన్లు ఇచ్చిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల 10, 17 తేదీల్లో రెండు సార్లు విచారణకు అనిల్ అంబానీ భార్య టీనా అంబానీ కూడా గైర్హాజరు అయ్యారు. ఆమెకు ఈడీ తాజా సమన్లు ఇచ్చిందా, లేదా అనేది స్పష్టత లేదు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద వేర్వేరుగా వాంగ్మూలాన్ని నమోదుచేయాలని అనిల్, టీనాలను పిలిచినట్లు ఈడీ అధికారులు తెలిపారు. 2025 ఆగస్టులో అనిల్ అంబానీ ఒకసారి ఈడీ విచారణకు హాజరయ్యారు.

అనుమతి లేకుండా భారత్ విడిచివెళ్లను: ముందస్తు అనుమతి లేకుండా తాను దేశం విడిచి వెళ్లనని సుప్రీంకోర్టులో హామీ పత్రాన్ని అనిల్ అంబానీ దాఖలు చేశారు. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్‌కు సంబంధించి రూ.40,000 కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసంపై ప్రస్తుత ఏజెన్సీలు జరుపుతున్న విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఆయన తెలిపారు. తాను దేశం విడిచి పారిపోయే వ్యక్తిని కానని, దర్యాప్తు నుంచి తప్పించుకునే ఉద్దేశం తనకు లేదని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో అనిల్ అంబానీ పేర్కొన్నారు.

కోడి గుడ్డు

20న ఫారం వద్ద గుడ్డు అమ్మకం ధరలు (నెక్) (వంద గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	520
వరంగల్	522
విజయవాడ	530
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	593

విల్లా తరహాలో అపార్ట్‌మెంట్

కాసాగ్రాండ్ మాండరిన్

హైదరాబాద్: అపార్ట్‌మెంట్లలో అత్యాధునిక హంగులు జోడిస్తూ, విల్లా అనుభూతి కలిగించేలా నివాస సముదాయ నిర్మాణాన్ని మియాపూర్‌లో ప్రారంభించినట్లు కాసాగ్రాండ్ తెలిపింది. కాసాగ్రాండ్ మాండరిన్ పేరుతో నిర్మిస్తున్న ఈ కమ్యూనిటీలో 334 అత్యాధునిక 3, 4 బీహెచ్‌కే గృహాలుంటాయి. రూ.1.25 కోట్ల ప్రారంభ ధరతో వీటిని అందిస్తున్నారు. ఈవీ ఛార్జింగ్ స్టేషన్, కో-వర్కింగ్ స్పేస్‌లాంటి హంగులుంటాయి.

ఏఐపై రూ.10 లక్షల కోట్లు పెడతాం

● డేటా తరహాలోనే అందుబాటు ధరలో సేవలు ● రిలయన్స్ అధిపతి ముకేశ్ అంబానీ ప్రకటన

కృత్రిమ మేధ(ఏఐ)పై వచ్చే ఏడేళ్లలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026'లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ ప్రకటించారు. దేశవ్యాప్తంగా మొబైల్, ఇంటర్నెట్ డేటాను ఎలాగైతే అందుబాటు ధరలో తమ గ్రూప్ ఇవ్వగలిగిందో.. అదే తరహాలో ఏఐని సైతం అందుబాటు ధరలో అందించగలమని తెలిపారు. 'ప్రతి పౌరుడు, కంపెనీ, ప్రభుత్వ సేవలు ఏఐతో అనుసంధానమయ్యేలా ఈ సదస్సు ఉంది. భారత్‌ను ఇంటర్నెట్ యుగానికి జియో తీసుకొచ్చింది. ఇకపై ఇంటలిజెన్స్ యుగాన్ని సైతం జియో అనుసంధానం చేస్తుంది. డేటా తరహాలోనే ఇంటలిజెన్స్ వ్యయాలను మేం తగ్గిస్తామ'ని ముకేశ్ వివరించారు.



ఈ మూడు అంశాలపై..


'రిలయన్స్‌తో కలిసి జియో పెట్టబోయే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో మూడు పునాదులపై దృష్టి సారిస్తాం. జామ్‌నగర్‌లో గిగావాట్ స్కేల్ ఏఐ రెడీ డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తాం. 10 గిగావాట్ల హరిత ఇంధనాన్ని సిద్ధం చేస్తాం. దేశవ్యాప్తంగా టెలికాంతో కలిసిన ఎడ్జ్-కంప్యూట్ లేయర్‌ను ఆవిష్కరిస్తాం. లో-లేటెన్సీ (తక్కువ ప్రాసెస్ సమయం ఉండే) ఏఐని అందించడానికి జియో నెట్‌వర్క్‌ను వినియోగిస్తాం. తద్వారా కిరాణా స్టోర్ల నుంచి ఆసుపత్రుల వరకు, తరగతి గదుల నుంచి వ్యవసాయ క్షేత్రాల వరకు ఏఐని అందిస్తాం. భారత ఏఐ రూపాంతీకరణలో జియో అతిపెద్ద పాత్ర పోషించబోతోంది. అదే విశ్వసనీయత, నాణ్యత, పరిమాణంలో, అత్యంత అందుబాటు ధరతో ఏఐ సేవలు అందిస్తాం. డేటా తరహాలోనే ఇంటలిజెన్స్ వ్యయాలనూ భారీగా తగ్గిస్తామ'ని ఆయన వివరించారు.

ఇప్పటికే ఏఐ అప్లికేషన్లు

'22 భాషల్లో అడాప్టివ్ లెర్నింగ్ కోసం జియోశిక్షక్, వైద్య మార్గనిర్దేశానికి జియోఆరోగ్య ఏఐ; 15 కోట్ల మంది రైతులకు పంట దిగుబడి పెంపులో సహాయపడేందుకు జియోకృషి; విద్య, ఉపాధి, ప్రభుత్వ సేవలకు వాయిస్-ఫస్ట్ ఏఐ అసిస్టెంట్ జియో భారత్ ఐక్యా వంటి అప్లికేషన్లను ఇప్పటికే రిలయన్స్ గ్రూప్ తీసుకొచ్చింద'ని అంబానీ అన్నారు.

✦ అదానీ గ్రూప్ కూడా ఏఐపై రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించిన సంగతి విదితమే.

ఏఐ చిప్ తయారీలో టాటాలు



ఎన్.చంద్రశేఖరన్

పలు రంగాల కోసం ప్రత్యేకించిన ఏఐ చిప్‌ల తయారీపై దృష్టి సారించినట్లు టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ముందుగా వాహన రంగానికి తయారు చేస్తామని ఏఐ సమ్మిట్‌లో పేర్కొన్నారు. సిలికాన్ నుంచి సిస్టమ్స్ దాకా, ఏఐ రెడీ డేటా సెంటర్ల నుంచి అప్లికేషన్లు, ఏఐ ఏజెంట్ల దాకా ఏఐని టాటా గ్రూప్ అందిపుచ్చుకుంటోందన్నారు. సాఫ్ట్‌వేర్ రంగానికి ఏఐ భారీ అవకాశాల్ని తెస్తుందని వివరించారు.

✦ **ఓపెన్‌ఏఐతో భాగస్వామ్యం:** 1 గిగావాట్ ఏఐ మౌలిక వసతుల నిమిత్తం ఓపెన్‌ఏఐతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని చంద్రశేఖరన్ వెల్లడించారు. తొలి దశలో 100 మెగావాట్ల సామర్థ్యంతో దీనిని మొదలుపెడతామన్నారు. చిప్ తయారీ సంస్థ ఏఎమ్‌డీతో జట్టుకట్టామనీ గుర్తుచేశారు. పరిశ్రమల కోసం టాటా కమ్యూనికేషన్స్‌తో కలిసి ఏఐ ఆపరేటింగ్ సిస్టమ్ తెస్తామన్నారు.

ప్రపంచంలోనే ఏఐకి అత్యంత అనుకూల దేశంగా భారత్: విప్రో



రిషద్ ప్రేమ్‌జీ

ప్రపంచంలోనే ఏఐకి అత్యంత అనుకూలంగా ఉండే దేశాల్లో ఒకటిగా నిలిచే అవకాశం భారత్‌కు ఉందని విప్రో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ పేర్కొన్నారు. తరానికి ఒకసారి వచ్చే సాంకేతికతే ఏఐ. ఇది కచ్చితంగా మనం ఏం చేయాలో ఆ పనులపైనా ప్రభావం చూపుతుందన్నారు. ఇపుడు మనం ఎలా స్పందిస్తామన్న దానిపై ఆధారపడి, వచ్చే కొన్నేళ్లలో వంద కోట్ల మందికి పైగా జనాభా సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, ఆర్థిక వృద్ధి ఉంటుందన్నారు.

ఏఐతో భారత్‌లో 20-25% ఆర్థిక వృద్ధికి వీలు: ఆంత్రోపిక్ సీఈఓ




ప్రపంచం మొత్తం మీద వర్థమాన దేశాల్లో ఏఐ ప్రయోజనాలు అధికంగా కనిపించనున్నాయని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు. 'భారత్‌కున్న సాంకేతిక నైపుణ్యం, ఏఐని నేర్చుకునే తత్వం వల్ల 20-25% వృద్ధి రేటును సాధించొచ్చు. ఇది మీకు ఇపుడు అసమంజసంగా అనిపించొచ్చు కానీ, అది జరిగేందుకు అవకాశాలున్నాయ'న్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఏఐ వినియోగం వల్ల 10% ఆర్థిక వృద్ధి నమోదవవచ్చని అంచనా వేశారు.

✦ **చాట్‌జీపీటీ, జియోహాట్‌స్టార్ భాగస్వామ్యం:** చాట్‌జీపీటీ ప్లాట్‌ఫాంలో వినోద కంటెంట్ కోసం శోధించే వినియోగదార్లకు జియోహాట్‌స్టార్ స్ట్రీమింగ్ లింక్‌ను సిఫారసు చేయడం, షేర్ చేయడం జరుగుతుంది. ఆ మేరకు జియోహాట్‌స్టార్, ఓపెన్‌ఏఐ మధ్య భాగసామ్యం కుదిరింది.

✦ **ఫెడెక్స్ రూ.2,500 కోట్ల పెట్టుబడులు:** ఏఐ సామర్థ్యాలను పెంపొందించుకోవడం ఐచ్ఛికం కాదు.. అవసరమని ఫెడెక్స్ సీఈఓ రాజేశ్ సుబ్రమణియన్ పేర్కొన్నారు. నవీ ముంబయి విమానాశ్రయంలో ఆటోమేటెడ్ కార్గో హబ్ ఏర్పాటు కోసం రూ.2500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు.

ప్రజలకు ఉపయోగం లేకపోతే ఏఐపై వ్యతిరేకత రావొచ్చు



నందన్ నీలేకని

ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలకు అందకపోయినా, సమాజానికి ఉపయోగకరంగా ఉన్నాయని నిరూపించలేకపోయినా.. వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ఇన్ఫోసిస్ ఛైర్మన్ నందన్ నీలేకని హెచ్చరించారు. ముఖ్యంగా వైట్ కాలర్ ఉద్యోగుల్లో (కార్యాలయాల్లో పనిచేసేవారు) నెలకొంటున్న అసహనం, ఈ సాంకేతికత పురోగతికి అడ్డంకిగా మారే అవకాశం ఉందన్నారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్‌తో జరిగిన ముఖాముఖి చర్చలో నీలేకని మాట్లాడారు. ప్రస్తుతం ఏఐ అభివృద్ధిలో ఉత్తమ ఫలితాల కోసం పోటీ, ప్రతికూలతలకు దారితీసే పోటీ.. రెండూ జరుగుతున్నాయని తెలిపారు. అయితే ప్రతికూల అంశాలే వేగంగా ముందుకు వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐని ప్రజా ప్రయోజనాల కోసం అర్థవంతంగా వినియోగించేలా అన్ని వర్గాలు తమ ప్రయత్నాలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. డీప్ ఫేక్‌ల సృష్టి, విద్యుత్ బిల్లుల పెరుగుదల వంటి ఏఐ ఫలితాల వల్ల, ప్రజల్లో వ్యతిరేక భావనలు పెరుగుతాయని నీలేకని తెలిపారు. బ్లూకాలర్ ఉద్యోగుల (కార్మికుల) అసహనం గ్లోబలైజేషన్‌ను దెబ్బతీసిందని.. అదే విధంగా వైట్‌కాలర్ ఉద్యోగుల అసహనం ఏఐ పురోగతిని దెబ్బతీయొచ్చని, ఏఐ ప్రయోజనాలను నిరూపించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుందన్నారు. వంద కోట్ల మంది ప్రజలకు సాంకేతికతను చేరువ చేయడం భిన్నమైన ప్రక్రియని, ఆధార్, యూపీఐ వంటి అతిపెద్ద ఆర్థిక విధానాలను అమలు చేసిన అనుభవం మన దేశానికి ఉందని గుర్తు చేశారు.

ఏఐతో కొన్ని కంపెనీలకు ఇబ్బందే

ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్



ఏఐ రాకతో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ తీరు మారబోతోందని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. కొన్ని కంపెనీలకు ఇది ఇబ్బందిగా మారొచ్చు కానీ, చాలా వరకు సంస్థలు ప్రయోజనాన్ని పొందగలవని వివరించారు. చాట్‌జీపీటీ వంటి ఏఐ మోడళ్లకు శిక్షణ ఇవ్వడానికి.. కాపీరైట్ ఉన్న వార్తాంశాలు, అభిప్రాయాలను వినియోగించడాన్ని ఆయన సమర్థించారు. ఈ విషయంలో 'యూఎస్ ప్రిన్సిపల్ ఆఫ్ ఫెయిర్ యూజ్' ఆధారంగా పనిచేయనున్నట్లు తెలిపారు. ✦ ఒక దేశం లేదా ఒక కంపెనీ చేతిలో ఏఐ శక్తి కేంద్రీకృతం అవడంపై ఆందోళనలు వస్తున్న నేపథ్యంలో.. ప్రజలందరి చేతికీ ఏఐని అందించాలని అభిప్రాయపడ్డారు. అధునాతన ఏఐలో భారత నాయకత్వం అద్భుతంగా ఉందని పేర్కొన్నారు.

భారత్‌లోనే ఏఐ ప్రభావం ఎక్కువ

అడోబ్ ఛైర్మన్ నారాయణ్



రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లోనే కృత్రిమ మేధ ప్రభావం గణనీయంగా ఉండే అవకాశం ఉందని అడోబ్ ఛైర్మన్ శంతను నారాయణ్ అన్నారు. భారత దేశంలో ఉన్న 140 కోట్ల జనాభా దృష్ట్యా, డేటా, గోప్యత, భద్రత వంటి అంశాల్లో భారత్ అంతర్జాతీయ నాయకత్వ పాత్రను పోషించగలదని అభిప్రాయపడ్డారు.

✦ **విద్యార్థులకు ఉచితంగా ఏఐ టూల్స్:** మన దేశంలో ఏఐ నైపుణ్యాలను పెంపొందించడానికి, క్రియేటివ్ ఎకానమీకి మద్దతు ఇవ్వడానికి విద్యార్థులకు ఫొటోషాప్, అక్రోబాట్, ఫైర్‌ఫ్లై సహా ప్రధాన ఉత్పత్తులను ఉచితంగా ఇవ్వనున్నట్లు అడోబ్ ప్రకటించింది.

మేధో సంపత్తి ఆధారిత దేశంగా ఎదగాలి

హెచ్‌సీఎల్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్



సాంకేతిక సేవల ఆధారిత దేశం నుంచి మేధో సంపత్తి (ఐపీ) ఆధారిత దేశంగా భారత్ మారాలని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా పేర్కొన్నారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ఆమె మాట్లాడుతూ, టెక్నాలజీని వినియోగించే వారి చేతిలో భవిష్యత్తు ఉండదని.. ప్లాట్‌ఫామ్స్, మోడళ్లు, ఉత్పత్తులను నిర్మించి, సొంతం చేసుకుని, రూపకల్పన చేసే వారిదే భవిష్యత్తు అని వెల్లడించారు. ఏఐ ఆర్థిక వ్యవస్థలో.. ప్లాట్‌ఫామ్స్, మోడళ్లు, ఉత్పత్తులను నిర్మించి, వాటిపై యాజమాన్య హక్కు ఉన్నవారికే విలువ లభిస్తుంది కానీ వాటిని వినియోగించే వారికి కాదని, ఆ మార్పు కేవలం ఆర్థికపరమైనది మాత్రమే కాకుండా, ఒక పరివర్తన అని రోష్ని వివరించారు.

రూ.2 లక్షల కోట్లపైకి ప్రకటనల వ్యయాలు: డబ్ల్యూపీపీ

2026లో 9.7% వృద్ధి



ముంబయి: దేశీయ ప్రకటనల రంగం సరికొత్త మైలురాయిని చేరనుంది. 2026లో ప్రకటనల వ్యయాల వృద్ధి 9.7 శాతానికి చేరొచ్చని అంతర్జాతీయ మీడియా దిగ్గజం డబ్ల్యూపీపీ అంచనా వేసింది. గత ఏడాదిలో ప్రకటనల వ్యయాల వృద్ధి 9.2 శాతంగా ఉంది. 2025లో రూ.1.84 లక్షల కోట్లుగా ఉన్న ప్రకటనల వ్యయాలు, 2026లో రూ.2.01 లక్షల కోట్లకు చేరొచ్చని పేర్కొంది.

✦ అంతర్జాతీయంగా ప్రకటనల వ్యయాల వృద్ధి 7.1 శాతంగా ఉండగా, భారత్ 9.7 శాతంతో అగ్రగామిగా నిలవనుంది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్, ప్రకటనల వ్యయాల్లో 9వ అతిపెద్ద మార్కెట్‌గా నిలుస్తోంది.


✦ మొత్తం ప్రకటనల వ్యయాల్లో డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వాటా అధికంగా ఉంది. భారత్‌లో డిజిటల్ మీడియా వాటా 68.1 శాతంగా ఉంది. అయితే ప్రపంచ సగటు 83.7 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. 'ప్రకటలనేవి కచ్చితమైన ఫలితాలను ఇచ్చే వ్యవస్థగా మారుతోంది' అని డబ్ల్యూపీపీ మీడియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ (దక్షిణాసియా) ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు.

దృష్టి లోపం చికిత్సకు జైడస్ బయోసిమిలర్

దిల్లీ: దృష్టి లోపం ఉన్న వారి చికిత్సలో ఉపయోగించేందుకు దేశీయంగా తొలి బయోసిమిలర్‌ను అభివృద్ధి చేసినట్లు జైడస్ లైఫ్‌సైన్సెస్ పేర్కొంది. అఫ్లిబర్సెప్ట్ 2 ఎమ్‌జీకి బయోసిమిలర్ అయిన అన్యారాను మధుమేహం సహా వివిధ కారణాల వల్ల దృష్టి లోపం వచ్చిన వారి చికిత్సకు వినియోగించుకోవచ్చు. అధునాతన బయోలాజిక్స్ తయారీకి తాము కట్టుబడి ఉన్నామని, భారత్‌లో అందుబాటు ధరలో రెటీనా సంరక్షణ దిశగా అన్యారా ఒక పెనుమార్పు తీసుకొస్తుందని కంపెనీ ఎండీ శర్విల్ పి.పటేల్ పేర్కొన్నారు.

వైద్య, విద్య, పరిశోధన రంగాలు రాణిస్తాయ్

భారతీ గ్రూప్ ఛైర్మన్ సునీల్ మిత్తల్



కృత్రిమ మేధ శక్తితో ఆరోగ్య సంరక్షణ, విద్య, పరిశోధన, వైద్య శాస్త్రాలతో సహా పలు రంగాలు దూసుకెళ్తాయని భారతీ గ్రూప్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ వెల్లడించారు. కంపెనీ కార్యకలాపాల్లో ఏఐ ఒక అంతర్భాగంగా మారుతోందన్నారు. వినియోగదారులకు సేవలు అందించడంలో, నెట్‌వర్క్‌లను నిర్మించడం, వాటిని నిర్వహించడంలో ఏఐ భాగంగా మారిందని తెలిపారు.

మానవ చరిత్రలోనే ఏఐ అద్భుత శకం

గూగుల్ డీప్‌మైండ్ సీఈఓ



శాస్త్రీయ ఆవిష్కరణల వేగం పెంచే అద్భుత సాధనం ఏఐ అని గూగుల్ డీప్‌మైండ్ సీఈఓ డెమిస్ హసాబిస్ అభిప్రాయపడ్డారు. 'మానవ చరిత్రలోనే పెను మార్పులను తీసుకొచ్చే సాంకేతికతల్లో ఒకటిగా ఏఐ నిలిచిపోతుంది. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్(ఏజీఐ) ఆగమనం నేపథ్యంలో ఆలోచించి, జాగ్రత్తగా ముందడుగు వేయాల'ని ఆయన అన్నారు.

ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం అవసరం: అలెగ్జాండర్ వాంగ్



కృత్రిమ మేధ సామర్థ్యాలను ఆవిష్కరించేందుకు, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం అవసరమని మెటా చీఫ్ ఏఐ (కృత్రిమమేధ) ఆఫీసర్ అలెగ్జాండర్ వాంగ్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో సాహసోపేత నిర్ణయాలు అవసరమని తెలిపారు. ఏఐ ప్రయోజనాలను పొందడం అనేది పెట్టుబడులతో పాటు సరైన విధానాలను రూపొందించుకోవడంపై ఆధారపడి ఉంటుందని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ నాలుగు మూల స్తంభాలైన- ప్రతిభ, శక్తి, డేటా, కంప్యూట్‌ను సాధించడానికి.. పౌరులు, ఆర్థిక వ్యవస్థలకు ఉపయోగపడే విధంగా ఏఐను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం, పరిశ్రమ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి సరైన విధానాలు అవసరమని వాంగ్ స్పష్టం చేశారు.

విద్యలో ఏఐను జోడించడంలో భారత్ భేష్: యాక్సెంచర్ సీఈఓ



ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యా వ్యవస్థలో ఏఐని అంతర్భాగం చేయడంలో భారత్ అద్భుత కృషి చేస్తోందని, ప్రపంచ దేశాలన్నీ భారత్‌ను అనుసరించాలని యాక్సెంచర్ సీఈఓ జూలీ స్వీట్ పేర్కొన్నారు. ఏఐ ఆధారిత భవిష్యత్తులో భారత్ చాలా కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. భారత్‌లో యాక్సెంచర్‌కు 3.5 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారని, అంతర్జాతీయంగా ఏఐ ఉద్యోగులు అధికంగా ఉన్న దేశాల్లో ఇది ఒకటని ఆమె వెల్లడించారు. అమెరికా, ఐరోపా, పశ్చిమాసియా, జపాన్‌ల్లోని హబ్‌లతో అనుసంధానించామన్నారు. కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకునే దేశాలు, కంపెనీలు మాత్రమే అభివృద్ధి చెందుతాయని స్వీట్ స్పష్టం చేశారు.

మైక్రోసాఫ్ట్ పెట్టుబడుల్లో భారత్‌కే అధికం

ఈ దశాబ్దం చివరకు వెచ్చించబోయే 50 బి.డాలర్ల (రూ.4.50 లక్షల కోట్ల) పెట్టుబడుల్లో అధికంగా పొందే దేశాల్లో భారత్ కూడా ఉంటుందని మైక్రోసాఫ్ట్ వైస్ ఛైర్మన్, ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్ పేర్కొన్నారు. వర్థమాన, వెనకబడిన దేశాల్లో (గ్లోబల్ సౌత్) ఏఐ వినియోగాన్ని పెంచేందుకు టెక్ కంపెనీలతో పాటు, ప్రభుత్వమూ నిధులు వెచ్చించాలని పిలుపునిచ్చారు.

సీ-390 మిలీనియం విమానాల కోసం ఎంఆర్ఓ కేంద్రం

ఏర్పాటు చేయనున్న ఎంబ్రాయెర్, మహీంద్రా గ్రూప్



మహీంద్రా గ్రూప్‌తో కలిసి భారత్‌లో విమానాల నిర్వహణ, మరమ్మతు, ఓవరహాల్ (ఎంఆర్ఓ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయెర్ గురువారం ప్రకటించింది. భారత వాయుసేన (ఐఏఎఫ్) మీడియం ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంటీఏ) ప్రోగ్రామ్ కోసం ఎంబ్రాయెర్ సీ-390 మిలీనియం విమానాలు ఎంపికైన నేపథ్యంలో, ఈ ప్రకటన వెలువడింది. స్థానికీకరణ వ్యూహంలో భాగంగా ఎంఆర్ఓ కేంద్రాన్ని ఎంబ్రాయెర్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రతిపాదిత కేంద్రం సీ-390 విమానాలకు పూర్తి తోడ్పాటు అందిస్తుందని, తద్వారా విమానాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయని ఎంబ్రాయెర్ తెలిపింది. బేస్, హెవీ మెయింటెనెన్స్, నిర్మాణాత్మక తనిఖీలు, పరీక్షలు, విడిభాగాల మరమ్మతు, ఓవరహాల్, ఏవియానిక్స్ సపోర్ట్, శిక్షణ వంటి పూర్తి స్థాయి సేవలను ఈ కేంద్రం అందిస్తుందని పేర్కొంది. భారత భవిష్యత్ రవాణా విమాన అవసరాలకు సీ-390 మిలీనియంను అద్భుత పరిష్కారంగా మలచడానికి రెండు సంస్థలు కట్టుబడి ఉన్నాయని వివరించింది.

✦ భారత్‌లో సీ-390 మిలీనియం మల్టీ-మిషన్ మిలిటరీ రవాణా విమానాలను ఉత్పత్తి చేయడానికి గత ఏడాది అక్టోబరులో ఎంబ్రాయెర్, మహీంద్రా గ్రూప్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి.

ఫ్రాన్స్‌తో టి-హబ్ భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: అంకుర సంస్థల ఇంక్యుబేటర్ టి-హబ్, ఫ్రాన్స్‌లోని హాట్స్-డి-ఫ్రాన్స్‌తో ఒక వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా రెండు దేశాల స్టార్టప్‌లు పరస్పర మార్కెట్లలోకి సులభంగా ప్రవేశించేందుకు అవసరమైన సహకారాలు, కంపెనీ రిజిస్ట్రేషన్‌కు మద్దతు, స్థానిక మార్కెట్లకు అనుగుణంగా మార్చుకునేందుకు అవసరమైన శిక్షణ తదితరాలను అందిస్తాయి. కనీసం 10 ఫ్రాన్స్ స్టార్టప్‌లను మనదేశంలోకి, 10 భారతీయ అంకురాలను ఫ్రాన్స్‌లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా 'ఇండో-ఫ్రెంచ్ కన్సార్షియం'ను ఏర్పాటు చేస్తున్నాయి. టి-హబ్ సీఈఓ కవికృత్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ దృష్టితో పనిచేసే అంకుర వ్యవస్థాపకులకు కొత్త మార్కెట్లు, మూలధనం, నెట్‌వర్కింగ్ అవకాశాలను అందించడమే ఈ ఒప్పంద లక్ష్యమని తెలిపారు. ఇరు దేశాల స్టార్టప్ వ్యవస్థలను బలోపేతం చేసి, దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి సాధించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

తగ్గిన అమెరికా వాణిజ్య లోటు

వాషింగ్టన్: అమెరికా వాణిజ్య లోటు 2025లో స్వల్పంగా తగ్గింది. అత్యధిక దేశాల నుంచి వచ్చే వస్తువులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధిక టారిఫ్ విధించడమే ఇందుకు కారణం. అమెరికా ఇతర దేశాలకు విక్రయించే వస్తువులు- సేవలు, ఇతర దేశాల నుంచి కొనుగోలు చేసే వాటి మధ్య ఉన్న వ్యత్యాసం (వాణిజ్య లోటు) 2024లో 904 బి.డాలర్లుగా నమోదైంది. ఇది 2025లో 901 బి.డాలర్ల (దాదాపు రూ.81.10 లక్షల కోట్ల)కు తగ్గిందని ఆ దేశ వాణిజ్య శాఖ గురువారం వెల్లడించింది.

బంగ్లాదేశ్ గగనతలం.. స్పైస్‌జెట్‌కు నిషిద్ధం

బకాయిలు చెల్లించనందునే

దిల్లీ: తమ గగనతలాన్ని వాడుకోకుండా భారత విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌పై బంగ్లాదేశ్ నిషేధం విధించింది. నావిగేషన్‌కు సంబంధించిన బకాయిలను సంస్థ చెల్లించకపోవడమే ఇందుకు కారణం. ఫలితంగా కోల్‌కతా నుంచి గువాహటి, ఇంఫాల్ వెళ్లే స్పైస్‌జెట్ విమానాలు అధిక దూరాలు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది.

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.880.49 కోట్లు
డీఐఐ విక్రయాలు: రూ.596.28 కోట్లు

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు పడేశాయ్

సెన్సెక్స్ ▼1236 82498

నిఫ్టీ ▼365 25454

అమెరికా-ఇరాన్ మధ్య పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి పెద్ద షేర్లలో భారీ విక్రయాలు చోటు చేసుకోవడం వల్ల గురువారం మన స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. వరుసగా మూడు రోజులు లాభపడిన సూచీలు, ఒక్కరోజులోనే 1.4 శాతానికి పైగా క్షీణించాయి. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.02% పెరిగి 71.07 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం మన కరెన్సీ మార్కెట్లు పని చేయలేదు. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సూచీలు లాభపడ్డాయి. లూనార్ కొత్త ఏడాది సెలవుల నేపథ్యంలో హాంకాంగ్, చైనా మార్కెట్లు పని చేయలేదు. ఐరోపా మార్కెట్లు ప్రతికూల ధోరణిలో ట్రేడయ్యాయి.


✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.6.79 లక్షల కోట్లు తగ్గి, రూ.465.22 లక్షల కోట్ల (5.13 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 83,969.82 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,734.25) సానుకూలంగా ప్రారంభమైంది. 83,979.36 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, తర్వాత విక్రయాల ఒత్తిడితో ఒక దశలో 82,264.20 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 1236.11 పాయింట్ల నష్టంతో 82,498.14 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 365 పాయింట్లు కోల్పోయి 25,454.35 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,885.30-25,388.75 పాయింట్ల మధ్య కదలాడింది.

రూ.7 లక్షల కోట్లు తగ్గిన సంపద విలువ

✦ సెన్సెక్స్ 30 షేర్లలో అన్నీ నష్టాల్లోనే ముగిశాయి. ఇండిగో 3.23%, ట్రెంట్ 2.86%, అల్ట్రాటెక్ సిమెంట్ 2.85%, ఎం అండ్ ఎం 2.81%, బీఈఎల్ 2.70%, అదానీ పోర్ట్స్ 2.5%, కోటక్ బ్యాంక్ 2.29%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.11%, ఐటీసీ 2.03%, ఎటర్నల్ 1.93%, హెచ్‌యూఎల్ 1.9%, మారుతీ 1.73%, టాటా స్టీల్ 1.7%, భారతీ ఎయిర్‌టెల్ 1.54%, యాక్సిస్ బ్యాంక్ 1.53%, టెక్ మహీంద్రా 1.52%, ఎన్‌టీపీసీ 1.38% చొప్పున తగ్గాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే స్థిరాస్తి 2.54%, విద్యుత్ 2.22%, భారీ యంత్ర పరికరాలు 2.18%, సేవలు 2.11%, వాహన 2.09%, యుటిలిటీస్ 1.9%, పారిశ్రామిక సూచీ 1.81% డీలాపడ్డాయి. బీఎస్ఈలో 3,011 షేర్లు ప్రతికూలంగా, 1,209 షేర్లు సానుకూలంగా ముగిశాయి. 147 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.



నేటి నుంచి గౌడియం ఐవీఎఫ్ ఐపీఓ

గౌడియం ఐవీఎఫ్ అండ్ వుమెన్ హెల్త్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు ముందు యాంకర్ మదుపర్ల నుంచి రూ.49.5 కోట్ల నిధులు సమీకరించింది. వీరికి 62,65,860 షేర్లను ఒక్కోటి రూ.79 చొప్పున సంస్థ కేటాయించింది. రూ.165 కోట్ల ఐపీఓ ఈ నెల 20-24 తేదీల్లో ఉండనుంది. ధరల శ్రేణి రూ.75-79. మదుపర్లు కనీసం 189 షేర్లకు (లాట్ రూ.14,931) దరఖాస్తు చేసుకోవాలి.

ఐపీఓ యోచనలో ఎంఎస్ఈడీసీఎల్

మహారాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎంఎస్ఈడీసీఎల్) తన వ్యవసాయ వ్యాపార విభాగాన్ని ఏప్రిల్ నాటికి విభజించాలని యోచిస్తోంది. డిసెంబరులో ఐపీఓకు రావడానికి ముందు ఇది కీలకమైన అడుగుగా భావించాల్సి ఉంటుందని ఛైర్మన్, ఎండీ లోకేశ్ చంద్ర వెల్లడించారు.. ఎంఎస్ఈడీసీఎల్‌కు మొత్తం రూ.96,000 కోట్ల బకాయిలు ఉండగా, ఇందులో సుమారు రూ.76,000 కోట్లు వ్యవసాయ వినియోగ బకాయిలే ఉన్నాయని తెలిపారు.

వోల్వో కార్ అల్ట్రా ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్

స్వీడన్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ వోల్వో కార్, గురువారం ముంబయి-నాసిక్ జాతీయ రహదారిలో అల్ట్రా-ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. తన సొంత వినియోగదార్లతో పాటు ఇతర బ్రాండ్ల విద్యుత్ వాహనాల వినియోగదార్లూ దీన్ని వినియోగించుకోవచ్చని తెలిపింది. ఈవీ ఛార్జింగ్ నెట్‌వర్క్ ఆపరేటర్ ఛార్జ్‌జోన్‌తో కలిసి ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.



ఏఐ ఇంపాక్ట్ సదస్సులో బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, నెదర్లాండ్స్ ప్రధాని డిక్ స్కూఫ్, అబుధాబీ యువరాజు షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని మోదీ

భాజపా బడ్జెట్‌ను మగపిల్లాడితో పోల్చిన ఎమ్మెల్యేపై ఫిర్యాదు




బహదూర్ సింగ్ కోలీ

జైపుర్: "భాజపా బడ్జెటు మగపిల్లాడి పుట్టుక లాంటిది. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ప్రవేశపెట్టిన తుది బడ్జెటు ఆడపిల్ల పుట్టుకతో సమానం" అంటూ రాజస్థాన్ అసెంబ్లీలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కమలం పార్టీ ఎమ్మెల్యే బహదూర్ సింగ్ కోలీ తీరుపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. లింగ వివక్షతో కూడిన వ్యాఖ్యలు చేసిన శాసనసభ్యుడిపై చర్య తీసుకోవాలని కోరుతూ పలు సామాజిక సంస్థలు రాష్ట్ర అసెంబ్లీ స్పీకరు వాసుదేవ్ దేవ్‌నానీకి బుధవారం వినతిపత్రం సమర్పించాయి.

భారత్-ఇజ్రాయెల్ మధ్య అవగాహన ఒప్పందం

టెల్ అవీవ్: ప్రధాని మోదీ ఈ నెలాఖరున ఇజ్రాయెల్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అవగాహన ఒప్పందం (ఎంఓయూ)కుదిరింది. రక్షణరంగంలో సంయుక్త కార్యకలాపాలు, సాంకేతిక సహకారాన్ని పెంపొందించుకునేలా ఒప్పందం చేసుకున్నాయి. ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన అంతర్జాతీయ రక్షణ సహకార విభాగం (ఎస్ఐబీఏటీ), భారత ఆయుధ ఉత్పత్తిదారుల సంఘం (ఎస్ఐడీఎమ్) ఆధ్వర్యంలో నిర్వహించిన భేటీల్లో ఇరు దేశాలకు చెందిన సుమారు 56 రక్షణ రంగ సంస్థలు పాల్గొన్నాయి. ఈ నెల 25న ప్రధాని మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్ వెళ్లనున్నారు.

ప్రముఖ జర్నలిస్ట్ గోవిందన్ కుట్టి కన్నుమూత



తిరువనంతపురం: ప్రముఖ జర్నలిస్టు, రచయిత కె.గోవిందన్ కుట్టి(81) కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం ఇక్కడి స్వగృహంలో తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కేరళ, జాతీయ రాజకీయాలపై పట్టున్న ఆయన రిపోర్టర్‌గా, సంపాదకుడిగా సేవలు అందించారు. 1977లో అస్సాంలోని జోర్హాట్‌లో అప్పటి ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ ప్రయాణిస్తున్న విమానం ప్రమాదానికి గురైన వార్తలను తొలుత అందించింది ఆయనే. ఇండియా టుడే, ఇండియా ఎక్స్‌ప్రెస్ వంటి వార్తా సంస్థల్లో విశేష సేవలందించారు. మలయాళం, ఆంగ్ల భాషల్లో 10 పుస్తకాలను రచించారు.

మణిపుర్‌లో వార్తాపత్రిక సంపాదకుడిపై కాల్పులు

ఇంఫాల్: మణిపుర్‌లోని ఈస్ట్ ఇంఫాల్ జిల్లాలో ఓ స్థానిక వార్తాపత్రిక సంపాదకుడిపై దుండగులు కాల్పులకు తెగబడ్డారు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో 'నహరోల్గి థోడాంగ్' వార్తాపత్రిక సంపాదకుడు ఖోయిరోమ్ లోయలక్పా ప్రయాణిస్తున్న కారుపై సాయుధమూకలు రెండురౌండ్ల కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఫలితంగా కారు వెనక భాగంలోని అద్దం పగిలిపోయింది. అనంతరం లోయలక్పాపై దుండగులు భౌతిక దాడికి దిగారు. ప్రాథమిక చికిత్స అనంతరం లోయలక్పా ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు పోలీసులు వెల్లడించారు.

రాహుల్‌ని కాల్చివేస్తామంటూ బెదిరించిన నిందితుడి అరెస్టు

జైపుర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీకి చెందిన 25 మంది ఎంపీలను కాల్చివేస్తామంటూ బెదిరింపులకు దిగిన వ్యక్తిని రాజస్థాన్ పోలీసులు గురువారం కోటాలో అదుపులోకి తీసుకున్నారు. మితవాద సంస్థ కర్ణి సేన ప్రతినిధిగా చెప్పుకుంటూ రాజ్‌సింగ్ అనే వ్యక్తి సామాజిక మాధ్యమంలో ఒక వీడియోను పోస్ట్ చేశాడు. అందులో, ఇటీవల ముగిసిన బడ్జెట్ తొలి విడత సమావేశాల్లో 25 మంది కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ సభాపతి ఓం బిర్లాను దూషించడం భాజపా, కర్ణిసేన కార్యకర్తలను ఆగ్రహానికి గురిచేసిందని రాజ్‌సింగ్ పేర్కొన్నాడు. మరోసారి ఇలాంటి ఘటన జరిగితే ఆ ఎంపీలందరినీ ఒక్కొక్కరిగా వారి ఇళ్లలోకి ప్రవేశించి మరీ చంపివేస్తామని బెదిరించాడు.

రాష్ట్రపతి, ప్రధానితో దేశాధినేతల భేటీ

- పలు అంశాలపై చర్చలు
- మోదీతో సీఈవోల సమావేశం

దిల్లీ: ఏఐ సమిట్‌లో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన పలువురు దేశాధినేతలతో గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ✦ స్లోవేకియా, సెర్బియా, ఎస్తోనియా అధ్యక్షులు పీటర్ పెలగ్రిని, అలెగ్జాండర్ ఉసిక్, అలార్ కరిస్‌తో రాష్ట్రపతి సమావేశమయ్యారు. ✦ ప్రధాని మోదీ.. స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గయ్ పర్మెలిన్, నెదర్లాండ్స్ ప్రధాని డిక్ స్కూఫ్‌లతో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ✦ అబుధాబీ యువరాజు షేక్ ఖలీద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని భేటీ అయ్యారు. భారత్, యూఏఈల మధ్య పెట్టుబడులపై వారి మధ్య చర్చలు జరిగాయి. అంతరిక్షం, అణు ఇంధనం, టెక్నాలజీ వంటి రంగాల్లో సహకారంపై మాట్లాడుకున్నారు. ✦ వాణిజ్యం, పెట్టుబడుల రంగంలో సహకరించుకోవాలని ప్రధాని మోదీ, గ్రీస్ ప్రధాని కిరియాంకో మిట్సోటకిస్.. భేటీ సందర్భంగా నిర్ణయించారు. ✦ పలువురు అంతర్జాతీయ కంపెనీల సీఈవోలతో ప్రధాని భేటీ అయ్యారు. సీఈవో రౌండ్ టేబుల్ పేరుతో జరిగిన సమావేశంలో వారంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వారితో ఏఐ, పెట్టుబడులపై చర్చలు జరిపారు.

చైనా బజార్‌లా సమిట్ : కాంగ్రెస్

ఈటీవీ భారత్: దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను భాజపా చైనా బజార్‌లా మార్చిందని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేడా ఆరోపించారు. 'ఆవిష్కరణలు, ఆలోచనల మార్పిడికి వేదిక కావాల్సిన సమిట్‌ను భాజపా చైనా బజార్‌లా మార్చింది. భారత్‌లో ఏఐ అంటే అశ్విని అసమర్థులుగా మారింది. ఈ విషయాన్ని ఆయన నిరూపించారు. ప్రధాన్ (తమాషా) మంత్రి విషయానికొస్తే ప్రతి కార్యక్రమాన్ని జప్పి-పప్పీ ఫెస్ట్‌లా చేస్తారు. ఏఐ సమ్మిట్ ఇలానే కావాలని భావించారు' అని విమర్శించారు.

రఫేల్‌తో భారత్ శక్తిమంతం: మెక్రాన్

భారత్ రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు అంశాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ స్వాగతించారు. ఈ యుద్ధ విమానాలు భారత్‌ను బలీయమైన సైనిక శక్తిగా మారుస్తాయని తెలిపారు. 'భారత ప్రభుత్వానికి, దసో ఏవియేషన్‌కు మధ్య జరుగుతున్న చర్చల్లో రఫేల్ కొనుగోళ్లు ఓ భాగం. దీనిపై ఎందుకు విమర్శలు వస్తున్నాయో అర్థం కావడం లేదు. ఎందుకంటే ఈ డీల్ భారత్‌ను సైనికపరంగా మరింత శక్తిమంతం చేస్తుంది. స్థానికంగా మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఇటీవల భారత్- ఫ్రాన్స్‌ల మధ్య సంబంధాలను 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచాలని నిర్ణయించాం. ఇందులో రఫేల్ ఒప్పందం కీలకపాత్ర పోషిస్తుంది' అని మెక్రాన్ వ్యాఖ్యానించారు.

బిల్ గేట్స్ దూరం

అనుకున్నట్లుగానే ఏఐ సమిట్‌కు మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ దూరంగా ఉన్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఆయన గురువారం సమిట్‌లో ప్రసంగించాల్సి ఉంది. అయితే ఎప్‌స్టీన్ ఫైళ్ల వ్యవహారంలో ఆయనపై విమర్శలు రావడంతో ప్రభుత్వం ఆయనను దూరం పెట్టింది.

ఏఐ క్రికెట్ కోచ్

ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పోలోని గూగుల్ స్టాల్‌లో ప్రదర్శిస్తున్న ఏఐ క్రికెట్ కోచ్ ఆకట్టుకుంటోంది. బ్యాటింగ్‌లోని లోపాలను అది గుర్తిస్తోంది. రియల్ టైమ్‌లో బ్యాటింగ్ మెళకువలను నేర్పిస్తోంది. 'టెక్నాలజీ పర్‌ఫెక్ట్ షాట్' పేరుతో దీనిని గూగుల్ ఏర్పాటు చేసింది. గూగుల్ ఏఐ రెండు నిమిషాల్లోపే టిప్స్ ఇస్తోంది. ఈ పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన పిచ్‌పై బ్యాటింగ్ చేసే అవకాశాన్ని యువతకు గూగుల్ కల్పిస్తోంది. అది చూసిన వెంటనే ఏఐ తప్పులు చెబుతోంది.

స్విట్జర్లాండ్‌లో 2027 ఏఐ సమిట్

తదుపరి ఏఐ సమిట్ స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరగనుంది. ఈ విషయాన్ని గురువారం ఆ దేశ అధ్యక్షుడు గయ్ పర్మెలిన్ వెల్లడించారు. 2028 సమిట్ యూఏఈలో జరగనుంది.

అంబాజీ మాత ఆలయానికి అనంత్ అంబానీ రూ.27.50 కోట్ల విరాళం

ఈటీవీ భారత్: పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ గుజరాత్‌లోని అంబాజీ పట్టణంలో ఉన్న శ్రీ అరాసురి అంబాజీ మాతాజీ ఆలయానికి రూ.27.50 కోట్ల భారీ విరాళాన్ని ఇచ్చారు. దేశంలోని 51 శక్తిపీఠాల్లో ఇదొకటి. భక్తులకు సౌకర్యాలను పెంచే లక్ష్యంతో దేవస్థాన్ ట్రస్ట్ ఫిబ్రవరి 18న జై అంబే తిథి భోజన్ అనే కొత్త సేవా పథకాన్ని ప్రకటించింది. అనంతరం కొన్ని గంటల్లోనే రూ.27.50 కోట్ల భారీ విరాళాన్ని అనంత్ అంబానీ తరఫున రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆలయ ట్రస్టుకు అందజేశారు. విరాళాలను అంబాజీ మాత ఆలయం ప్రాంగణంలోని అంబికా అన్నక్షేత్రంలో భక్తులకు రాబోయే ఐదేళ్లపాటు అన్నదానం చేయడానికి వినియోగించనున్నారు.

50 రాకెట్ లాంచర్లను ప్రారంభించిన కిమ్



సియోల్: అణ్వాయుధ సామర్థ్యం గల స్వల్ప శ్రేణి క్షిపణులను ప్రయోగించే 50 రాకెట్ లాంచర్లను అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ప్రారంభించినట్లు ఉత్తర కొరియా గురువారం ప్రకటించింది. కృత్రిమ మేధ, అధునాతన సాంకేతికతతో వీటిని రూపొందించినట్లు తెలిపింది. ప్రత్యర్థి దేశం దక్షిణ కొరియాకు హెచ్చరికలు జారీ చేసేలా సరిహద్దు భద్రతను మరింత పటిష్ఠం చేస్తున్నట్లు కిమ్ సోదరి కిమ్ యో జోంగ్ ఓ ప్రకటన విడుదల చేశారు.



ఉత్తరకొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌లో అధికార వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా సదస్సులో భారీస్థాయిలో ప్రదర్శనకు ఉంచిన రాకెట్ లాంఛర్లు

'ఘోస్ట్ ఉద్యోగి'కి..రూ.10 కోట్ల జీతం
అమెరికా సంస్థను మోసగించిన భారతీయుడు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలోని ప్రముఖ సంస్థలో పనిచేస్తున్న ఒక భారత సంతతి వ్యక్తి తన మిత్రునికి తప్పుడు పత్రాల ఆధారంగా అదే కంపెనీలో ఉద్యోగం ఇప్పించి ఏ పనీ చేయకున్నా అతనికి నెలనెలా జీతం అందేలా చేసి చివరికి పట్టుబడ్డాడు. ఈ నేరానికి పాల్పడిన కరణ్ గుప్తాపై మోసం, మనీలాండరింగ్ కుట్రలకు సంబంధించిన చట్టాల కింద అభియోగాలు నమోదయ్యాయని అమెరికా న్యాయశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నిందితుడు కరణ్ గుప్తా అమెరికాలోని ఆప్టమ్ అనే సంస్థలో డేటా ఎనలటిక్స్ సీనియర్ డైరెక్టర్‌గా పనిచేసేవాడు. తన మిత్రునికి తప్పుడు వివరాలతో కూడుకున్న 'రెజ్యూమే' అందించి దాని ఆధారంగా అతనికి ఉద్యోగం ఇప్పించాడు. తన మిత్రునిపై పర్యవేక్షక అధికారిగా తానే ఉంటూ, అతడు ఏ పనీ చేయకున్నా నెలనెలా జీతం అందేలా చేశాడని అధికారిక ప్రకటన తెలిపింది. లక్ష డాలర్లతో మొదలైన ఆ "ఘోస్ట్ ఉద్యోగి" జీతం ఏటేటా పెరుగుతూ పోయింది. తనకు అందిన జీతంలోంచి ఘోస్ట్ ఉద్యోగి కరణ్ గుప్తాకు సగం ముడుపుగా అందించేవాడు అని న్యాయ శాఖ పేర్కొంది. ఇలా చేయడం ద్వారా నిందితుడు తాను పనిచేస్తున్న సంస్థకు 12 లక్షల డాలర్ల నష్టం కలిగించాడని వివరించింది. వృత్తిపరంగా అత్యున్నత స్థాయికి చేరిన దశలో కరణ్ తాను పనిచేసిన సంస్థ నుంచి 2.6 లక్షల డాలర్ల వేతనంగా పొందేవాడని తెలిపింది. సంస్థ నుంచి అప్పనంగా వేతనం పొందిన కరణ్ స్నేహితుడు ఆ సంస్థలో ఒక్క సహోద్యోగినీ కలవలేదు. అతని నుంచి ఒక్క మెయిల్ కూడా రాలేదు. అసలు అతనికి కేటాయించిన కంప్యూటర్‌లో లాగిన్ కూడా కాలేదు. అయితే, 2019 నవంబరులో ఓ మోసం కేసులో గుప్తాను ఆ సంస్థ ఉద్యోగం నుంచి తొలగించింది. అదే సమయంలో ఈ వ్యవహారం బయటపడింది. సంస్థ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన దర్యాప్తు సంస్థలు.. మొత్తంగా దాదాపు 1.2 లక్షల డాలర్ల (సుమారు రూ.10 కోట్లు) మోసం చేయడంతోపాటు, మనీలాండరింగ్ కుట్రకు కూడా పాల్పడినట్లు పేర్కొన్నాయి.

సాఫ్ట్‌వేర్ సమస్యతో విమాన సర్వీసులకు అంతరాయం

దిల్లీ: దేశంలోని పలు విమానాశ్రయాల్లో సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా గురువారం విమాన సర్వీసుల్లో కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. దిల్లీ, ముంబయితోపాటు మరికొన్ని విమానాశ్రయాల్లో ప్రయాణికులను తనిఖీ చేసే సాఫ్ట్‌వేర్‌లో సమస్య తలెత్తడంతో దాదాపు 40 నిమిషాలు విమాన సేవలు నిలిచిపోయాయి. ఉదయం 6.45 గంటల నుంచి 7.28 గంటల వరకు ఈ పరిస్థితి కొనసాగడంతో వందల మంది ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యారు. సాఫ్ట్‌వేర్ సమస్య పరిష్కారం కావడంతో విమానాలు యథావిధిగా నడిచాయి.

దేశంలో నక్సల్ ప్రభావిత జిల్లాలు ఏడే

దిల్లీ: దేశంలో నక్సల్ ముప్పును ఈ ఏడాది మార్చిలోపు అంతం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వం.. వామపక్ష తీవ్రవాద ప్రభావం (ఎల్‌డబ్ల్యూఈ) ఉన్న జిల్లాల వర్గీకరణను తాజాగా వెల్లడించింది. ఈ జిల్లాలు ఎనిమిది నుంచి ఏడుకు తగ్గినట్లు తెలిపింది. ఝార్ఖండ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ, పశ్చిమబెంగాల్‌లలోని 38 జిల్లాలపై 'ఎల్‌డబ్ల్యూఈని ఎదుర్కొనేందుకు జాతీయ విధానం, కార్యచరణ చర్య' పేరుతో గత ఏడాది డిసెంబరులో సమీక్షను చేపట్టింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, నారాయణ్‌పూర్, సుక్మా, కాంకేర్, దంతెవాడ; ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింహ్‌భూమ్, ఒడిశాలోని కొంధమాల్ జిల్లాలను నక్సలిజం ప్రభావిత ప్రాంతాలుగా తాజా సమీక్ష తేల్చింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు గురువారం సంబంధిత అధికారులు పీటీఐకి తెలిపారు.

2 నెలల బాబుకు అస్వస్థత..
కుటుంబాన్ని వెనక్కు పంపిన అమెరికా

వాషింగ్టన్: రొమ్ము పడిశం (బ్రాంకైటిస్)తో బాధపడుతున్న రెండు నెలల చిన్నారితోపాటు అతడి కుటుంబాన్ని అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు మెక్సికోకు వెనక్కు పంపినట్లు టెక్సాస్‌కు చెందిన డెమోక్రటిక్ పార్టీ నేత జాక్విన్ కాస్ట్రో తెలిపారు. అనారోగ్యంతో ఉన్న ఆ చిన్నారి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు ఆయన 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. 16 నెలల వయసున్న ఆ పిల్లాడి సోదరితోపాటు తల్లిదండ్రులను సైతం ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు (ఐసీఈ) వెనక్కు పంపిందన్నారు. బాధిత కుటుంబానికి చెందిన న్యాయవాది ద్వారా తాను ఈ విషయాన్ని ధ్రువీకరించుకొన్నట్లు తెలిపారు. ఈ బహిష్కరణ హేయమైన చర్య అని, క్రూరమైన ఈ చర్యకు ఐసీఈ బాధ్యత వహించేలా చూస్తానన్నారు. కాగా, వైద్యుల సూచన మేరకే తాము నిర్ణయం తీసుకొన్నట్లు ఇమిగ్రేషన్ అధికారులు స్పష్టం చేశారు.

పతంజలి యోగా శిబిరాలపై సేవాపన్ను సబబే: సుప్రీంకోర్టు

దిల్లీ: బాబా రామ్‌దేవ్ నేతృత్వంలోని పతంజలి యోగపీఠం ట్రస్టు నిర్వహించే యోగాభ్యాస శిబిరాల్లో ప్రవేశానికి రుసుము వసూలు చేస్తున్నందువల్ల దానిపై సేవా పన్ను చెల్లించాలంటూ 'కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రైబ్యునల్' (సెస్టాట్) వెలువరించిన నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ట్రస్టు దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ జె.కె.మహేశ్వరీల ధర్మాసనం క్యూరేటివ్ పిటిషన్‌పై విచారణ జరిపి కేసులో పసలేదని తేల్చింది.

సినీ నిర్మాత విక్రమ్ భట్‌కు బెయిల్ మంజూరు

కోట్ల రూపాయల మేర మోసాలకు పాల్పడ్డారంటూ రాజస్థాన్‌లో నమోదైన కేసులో సినీ నిర్మాత విక్రమ్ భట్‌కు సుప్రీంకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. విక్రమ్ భట్ భార్య శ్వేతాంబరి భట్‌కు ఈ నెల 13న ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీ ధర్మాసనం రెగ్యులర్ బెయిల్‌గా మార్చింది.

అస్సాంలో 'సర్' నిర్వహించాలన్న పిటిషన్ తిరస్కరణ

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న అస్సాంలోనూ ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తును చేపట్టేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం తోసిపుచ్చింది.

దేశ ప్రతిష్ఠకు ఎంత మచ్చో తెలుసా?

కల్తీ దగ్గుమందు వల్ల పలువురు ప్రాణాలు కోల్పోవడం మన దేశ ప్రతిష్ఠకు ఎంత మచ్చో తెలుసా అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం ప్రశ్నించింది. ఉజ్బెకిస్థాన్‌లో 18 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన ఔషధ తయారీ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం గురువారం విచారించింది. తమ ఔషధాల్లో నాణ్యత ప్రమాణాలు లేవని, వాటి అమ్మకాన్ని నిషేధించాలని ఇచ్చిన ఉత్తర్వును కొట్టివేయాలని ఆ సంస్థ చేసిన వినతిని తిరస్కరించింది. తమ ఔషధం తీసుకోవడం వల్లనే మరణాలు సంభవించినట్లు ఎలాంటి రికార్డు లేదని ఫార్మాసంస్థ చేసిన వాదనను తోసిపుచ్చింది. "కేవలం ధనాపేక్షతో మీరు దీనికి పాల్పడ్డారా? దేశ ప్రతిష్ఠకు ఇది ఎంత భంగమో కదా" అని వ్యాఖ్యానించింది. ఇదివరకే దీనిపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది.

వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ అరాచకాల్ని ఖండించిన 100 దేశాల్లో భారత్

ఐక్యరాజ్యసమితి, దిల్లీ: ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంపై ఇజ్రాయెల్ ఉక్కుపిడికిలి బిగించి స్థానికుల్ని తరిమేస్తూ యూదు ఆవాసాల విస్తరణకు ప్రోద్బలం అందించడాన్ని భారత్‌తో సహా 100 దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇజ్రాయెల్ ఏకపక్షంగా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడుతోందని పేర్కొన్నాయి. ఈ దేశాల ప్రతినిధుల సంతకాలతో ఐరాసకు చెందిన పాలస్తీనా శాశ్వత పరిశీలక మిషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. మరోవైపు ఇజ్రాయెల్ దురాగతాలపై భారత ప్రభుత్వం ఆలస్యంగా స్పందించిందని కాంగ్రెస్ గురువారం విమర్శించింది.

ఇరాక్ జాతీయునికి అరుదైన కంటి చికిత్స

దిల్లీ: అరుదైన కంటి క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒక ఇరాక్ జాతీయునికి ఇక్కడి ఆస్పత్రిలో నిర్వహించిన చికిత్స విజయవంతమైంది. కొరాయిడల్ మెలనోమా అనే క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి సాకేత్‌లోని మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్లాక్ బ్రాకీథెరపీ అనే ప్రత్యేక చికిత్స నిర్వహించి కంటిలోని కణితిని కరిగించినట్లు గురువారం ఒక అధికారిక ప్రకటన తెలిపింది. కంటిలోని రెటీనాకు, కొరాయిడ్ భాగానికి మధ్యనున్న కణజాలానికి ఈ క్యాన్సర్ సోకుతుంది. "ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న 41 ఏళ్ల రోగి గడచిన ఆరు నెలల్లో తన కుడి కంట్లో దృష్టిని పూర్తిగా కోల్పోయాడు. పరీక్షలు నిర్వహించగా అతని కంట్లో కణితి ఉన్నట్టు గుర్తించాం" అని ఆస్పత్రి వెలువరించిన ప్రకటన తెలిపింది. ఇంకా కంటికే పరిమితమైవున్న దశలో క్యాన్సర్‌ను గుర్తించి చికిత్స చేశామని డాక్టర్లు తెలిపారు. ఈ చికిత్సలో భాగంగా ఒక చిన్నపాటి అణుధార్మిక పరికరాన్ని కంటి బాహ్యకుడ్యంపై ఉంచి ట్యూమర్‌కు రేడియేషన్ అందిస్తారు. చికిత్స కోసం బాబా అటామిక్ పరిశోధన కేంద్రం రూపొందించిన రుథీనియం 106 ఫలకాన్ని ఉపయోగించారు. ఆస్పత్రిలోని ఆప్తాల్మాలజీ విభాగానికి చెందిన డాక్టర్ అనితా సేథీ ఈ ప్రక్రియకు నేతృత్వం వహించారు.

సమస్యల పరిష్కారానికి 'పోరుబాట': ఏపీటీఎఫ్

ఈనాడు, అమరావతి: విద్య, ఉపాధ్యాయ సమస్యలు, ఆర్థిక డిమాండ్ల పరిష్కారం కోసం పోరుబాట పేరుతో దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్టు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి తెలిపారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ప్రత్యక్ష చర్య నోటీసు అందించామని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతిపత్రాలు అందిస్తామని, మార్చి 3న జిల్లా కేంద్రాల్లో మహాధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు.

పంచాయతీల్లో పూర్తయిన పనులకు ఆర్థిక సంఘం నిధుల చెల్లింపు!

ఈనాడు, అమరావతి: పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు పూర్తి చేసి ఎం.బుక్‌లో నమోదైన వాటికి చెల్లింపులు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఆదేశాలిచ్చారని రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో చెత్త కుప్పలు తొలగించేందుకు ఉద్దేశించిన శానిటేషన్ డ్రైవ్ పనులతోపాటు ఇప్పటికే పూర్తి చేసిన ఇతర పనులకూ బిల్లులు చెల్లించాలని ముఖ్య కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లుగా వారు వివరించారు.

సుందర్ పిచాయ్ మాటలకు గర్వంతో ఉప్పొంగిపోయా
మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో వెయ్యి మెగావాట్ల ఏఐ హబ్ ఏర్పాటు గురించి... దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ చేసిన ప్రకటనపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. విశాఖలో ఏర్పాటయ్యే హబ్‌ను గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్‌గా సుందర్ పిచాయ్ పేర్కొనడంతో గర్వంతో ఉప్పొంగిపోయానని లోకేశ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

దిల్లీ హైకోర్టు ఆదేశాలతో సత్యం గెలిచింది
విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: హెరిటేజ్ సంస్థపై నిరాధార, అసత్య ఆరోపణల వార్తల్ని తొలగించాలంటూ సాక్షి మీడియాను దిల్లీ హైకోర్టు ఆదేశించడంపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. సత్యం గెలిచిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "అబద్ధాలు ఒకరోజు ట్రెండ్ అవ్వవచ్చు. కానీ సత్యమే విజయాన్ని సాధిస్తుంది" అని అన్నారు.

టెక్సాస్ హనుమాన్ విగ్రహంపై 'మాగా' మద్దతుదారు అక్కసు





ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలోని టెక్సాస్‌లో ఉన్న హనుమంతుని విగ్రహంపై 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ అగైన్) ఉద్యమ మద్దతుదారు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. టెక్సాస్‌లోని షుగర్ ల్యాండ్‌లో గల శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో 90 అడుగుల హనుమంతుడి కాంస్య విగ్రహం ఉంది. 'స్టాచ్యూ ఆఫ్ యూనియన్'గా పిలిచే ఈ విగ్రహం ఉత్తర అమెరికాలో అత్యంత ఎత్తయినది. ఈ విగ్రహం వీడియోను మాగా మద్దతుదారు కార్లోస్ టుర్సియోస్ 'ఎక్స్'లో పోస్టు చేశాడు. వలసదారులు టెక్సాస్‌ను, అమెరికాను ఆక్రమించుకుంటున్నారని.. అమెరికాలో హిందూ విగ్రహం ఎందుకని ప్రశ్నించాడు. భారతీయ వలసదారులు ఈ దండయాత్రను ఆపాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. ఈ పోస్టుపై తీవ్ర దుమారం రేగుతోంది. కార్లోస్ వ్యాఖ్యలను ఆలయ కమ్యూనిటీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఇది విరాళాలు సేకరించి ఏర్పాటు చేసిన ప్రైవేటు ప్రాపర్టీగా పేర్కొన్నారు. నెటిజన్లు సైతం కార్లోస్ వ్యాఖ్యలను ఖండిస్తూ పోస్టులు పెడుతున్నారు. ఇదే విగ్రహంపై గతంలో రిపబ్లికన్ పార్టీ నేత అలెగ్జాండర్ డంకన్ సైతం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి హిందూ విగ్రహాన్ని ఇక్కడ తామెందుకు అనుమతించాలన్నారు. డంకన్ వ్యాఖ్యలను అమెరికన్ హిందూ ఫౌండేషను తీవ్రంగా ఖండించింది.

నుదుటిపై 'అమ్మ' ముద్దుతో.. వైద్య కళాశాలకు శిశువు మృతదేహం



ఈటీవీ భారత్: మహారాష్ట్రకు చెందిన సోనాలి, ఉదయ్ దంపతులిద్దరూ వైద్యులే. పిల్లల కోసం ఎంతో ఆరాటపడ్డారు. ఆమె గర్భం దాల్చాక.. స్వతహాగా వైద్యులు కావడంతో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. అయినా.. ఫిబ్రవరి 10న వీరికి నెలలు నిండని శిశువు పుట్టడంతో తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. ఆ పసికందును కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. అయిదు రోజులపాటు ఎన్ఐసీయూలో చికిత్స పొందిన నవజాత శిశువుకు అప్పుడే నూరేళ్లు నిండాయి. ఎంతోమందికి ప్రాణం పోసిన వైద్య దంపతులకు కడుపుకోత మిగిలింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న చిన్నారి మరణించినా ఆ బాధను దిగమింగుకొని సామాజిక కోణంలో ఆలోచించారు. నవజాత శిశువు మృతదేహాన్ని జాల్నా ప్రభుత్వ వైద్య కళాశాల పరిశోధనల కోసం దానం చేశారు. శిశువును అప్పగించే ముందు మృతదేహంపై తల్లి సోనాలి చివరిసారిగా ముద్దు పెట్టుకొని ఇచ్చిన హృదయ విదారక ఘటనను చూసి అక్కడున్న వారంతా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎంతో విషాదంలోనూ సమాజానికి ఉపయోగపడాలని చూసిన సోనాలి, ఉదయ్ దంపతులను వైద్యులందరూ అభినందించారు.

ప్రతిస్పందనలను నియంత్రించే.. సంచలన సమాచారాల మధ్యవర్తి!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

మానవ నాడీ వ్యవస్థ

మానవ నాడీ వ్యవస్థ శరీరంలోని అన్ని క్రియలను నియంత్రించి, సమన్వయపరిచే అత్యంత ముఖ్యమైన వ్యవస్థ. ఇది బాహ్య, అంతర్గత ప్రేరణలను గ్రహించి, వాటికి తగిన ప్రతిస్పందనలను ఇస్తుంది. మానవుల్లో ఈ నాడీ వ్యవస్థ ద్వారానే ఆలోచించడం, కదలడం, ఇంద్రియాల ద్వారా సమాచారాన్ని గ్రహించడం, హోమియోస్టాసిస్ (శరీర సమతౌల్యత) నిర్వహించడం లాంటి విధులు జరుగుతాయి. మానవ నాడీ వ్యవస్థ ప్రధానంగా కేంద్ర నాడీ వ్యవస్థ, పరిధీయ నాడీ వ్యవస్థ అని విభజితమై ఉంటుంది.

పరిధీయ నాడీ వ్యవస్థ

పరిధీయ నాడీ వ్యవస్థ అనేది కేంద్ర నాడీ వ్యవస్థ (మెదడు, వెన్నుపాము) నుంచి శరీరంలోని మిగతా అన్ని భాగాలకు సంకేతాలను తీసుకువెళ్లే, స్వీకరించే నాడులు, నాడీ గాంగ్లియాల సమూహం.

❐ శరీరంలోని బాహ్య ఇంద్రియాల నుంచి సమాచారాన్ని కేంద్ర నాడీ వ్యవస్థకు చేర్చడం, కేంద్ర నాడీ వ్యవస్థ నుంచి కండరాలు, గ్రంథులకు ఆదేశాలను అందించడం లాంటివి దీని ముఖ్య విధులు.

❐ పరిధీయ నాడీ వ్యవస్థను రెండు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు. అవి:

- స్వచ్ఛంద నాడీ వ్యవస్థ (సోమాటిక్ నెర్వస్ సిస్టమ్)
- స్వయంచాలక నాడీ వ్యవస్థ (అటానమిక్ నెర్వస్ సిస్టమ్)

❐ స్వచ్ఛంద నాడీ వ్యవస్థ ఇచ్ఛాపూర్వక కదలికలను (చేతులు, కాళ్లు కదపడం), బాహ్య సంచలనాలను (స్పర్శ, నొప్పి, ఉష్ణోగ్రత) నియంత్రిస్తుంది.

❐ స్వయంచాలక నాడీ వ్యవస్థ శరీరంలోని అనిచ్ఛాపూర్వక విధులను (హృదయ స్పందన, శ్వాస, జీర్ణం) నియంత్రిస్తుంది. ఇందులో తిరిగి రెండు విభాగాలు ఉంటాయి. అవి:

- సహానుభూత (సింపథెటిక్) నాడీ వ్యవస్థ
- పరసహానుభూత (పారాసింపథెటిక్) నాడీ వ్యవస్థ

❐ సింపథెటిక్ వ్యవస్థ ఆపద సమయంలో శరీరాన్ని సిద్ధం (హృదయ స్పందన పెరగడం, శ్వాస వేగం పెరగడం, రక్తపోటు పెరగడం) చేస్తుంది. పారాసింపథెటిక్ వ్యవస్థ సాధారణ స్థితిలో శరీరాన్ని సడలించి, జీర్ణం, విశ్రాంతిని ప్రోత్సహిస్తుంది.

❐ పరిధీయ నాడీ వ్యవస్థలో 12 జతల కపాల నాడులు (క్రేనియల్ నాడులు) ఉంటాయి.

❐ వీటిలో కొన్ని స్పందనలు (వాసన, దృష్టి, వినికిడి); కొన్ని కదలికలు (ముఖం, నాలుక, కళ్లు), కొన్ని మిశ్రమ విధులను నిర్వహిస్తాయి. వీటితో పాటు 31 జతల వెన్నునాడులు కూడా ఉంటాయి.

❐ ఇవి సెర్వికల్ (8), థొరాసిక్ (12), లంబర్ (5), సాక్రల్ (5), కాక్సిజియల్ (1) జతలుగా విభజితమై ఉంటాయి. ఈ నాడులు శరీరంలోని వివిధ భాగాల నుంచి సంచలన సమాచారాన్ని స్వీకరించి, కండరాలకు ఆదేశాలను అందిస్తాయి.

❐ ఈ వ్యవస్థ ద్వారా కేంద్ర నాడీ వ్యవస్థ శరీరం మొత్తం క్రియలను సమన్వయం చేసి నియంత్రిస్తుంది.


కేంద్ర నాడీ వ్యవస్థ

మానవ మెదడు శరీరంలోనే అత్యంత సంక్లిష్టమైన, ముఖ్యమైన అవయవం. దీని సగటు బరువు 1200 నుంచి 1500 గ్రాములు.

❖ మెదడు ప్రధానంగా ముందు మెదడు (ఫోర్ బ్రెయిన్), మధ్య మెదడు (మిడ్ బ్రెయిన్), వెనుక మెదడు (హిండ్ బ్రెయిన్)గా విభజితమై ఉంటుంది.

❖ వీటిలో అతిపెద్ద భాగం పెద్ద మెదడు (సెరిబ్రమ్). ఇది రెండు అర్ధగోళాలుగా (ఎడమ, కుడి) విభజితమై ఉంటుంది.

❖ ఈ రెండు అర్ధగోళాలను కలిపి కార్పస్ కాలోసమ్ అనే నరాల అనుసంధానం ఉంటుంది.



❖ పెద్ద మెదడు బయటి ఉపరితలాన్ని సెరిబ్రల్ కార్టెక్స్ అంటారు. ఇది నాలుగు భాగాలుగా (తమ్మెలుగా) విభజితమై, వివిధ విధులను నిర్వర్తిస్తుంది.

❖ ఫ్రంటల్ లోబ్ ఆలోచన, నిర్ణయం, వ్యక్తిత్వం, ఇచ్ఛాపూర్వక కదలికలను నియంత్రిస్తుంది; పరైటల్ లోబ్ స్పర్శ, ఉష్ణోగ్రత, నొప్పి లాంటి వాటిని గ్రహిస్తుంది; టెంపరల్ లోబ్ వినికిడి, జ్ఞాపకం, భాషను అర్థం చేసుకోవడం, వాసనను గ్రహించడం; ఆక్సిపిటల్ లోబ్ దృష్టి సంబంధమైన విధులను నిర్వహిస్తుంది.

❖ పెద్ద మెదడు కింద మధ్య మెదడు (డయన్సెఫాలాన్) ఉంటుంది. దీనిలో ఉండే థాలమస్ అన్ని సంచలన సమాచారాలను (వాసన మినహా) మెదడు ఇతర భాగాలకు అందించే మధ్యవర్తిగా పని చేస్తుంది.

❖ హైపోథాలమస్ ఆకలి, దాహం, శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, హార్మోన్లు, భావోద్వేగాలను నియంత్రిస్తుంది.

❖ మెదడులో మధ్య మెదడు అనేది చిన్న భాగం. ఇది దృష్టి, వినికిడి సంబంధిత స్వయంచాలిత ప్రతిస్పందనలను నియంత్రిస్తుంది.

❖ వెనుక మెదడులోని వారధి (పాన్స్) శ్వాస, నిద్రను సమన్వయం చేస్తుంది. ఈ భాగంలో ఉండే మెడుల్లా అబ్లాంగేటా అనే పొడవైన మజ్జ శ్వాస, హృదయ స్పందన, రక్తపోటు లాంటి అనిచ్ఛాపూర్వక విధులను నియంత్రిస్తుంది.

❖ చిన్న మెదడు సమతౌల్యత, కండరాల సమన్వయం, కదలిక నైపుణ్యాల అభ్యాసానికి దోహదపడుతుంది.

❖ మెదడును రక్షిస్తూ మెనింజెస్ అనే మూడు రక్షణ పొరలు ఉంటాయి. బయటి గట్టి పొరను డ్యూరా మాటర్ అని, మధ్యలో ఉండే పొరను అరాక్నాయిడ్ మాటర్ అని, లోపలి సన్నటి పొరను పియా మాటర్ అంటారు. ❖ ఈ పొరల మధ్య సెరెబ్రోస్పైనల్ అనే ద్రవం నిండి ఉంటుంది. ఇది మెదడును దెబ్బల నుంచి కాపాడమే కాకుండా పోషణను అందిస్తుంది, వ్యర్థ పదార్థాలను తొలగిస్తుంది.

❖ మెదడులో నాలుగు కుహరాలు (వెంట్రికల్స్) ఉంటాయి. ఇక్కడే సెరెబ్రోస్పైనల్ ద్రవం ఉత్పత్తి అవుతుంది.

❖ లింబిక్ వ్యవస్థలో హిప్పోకాంపస్ (జ్ఞాపకాలు), అమిగ్డాలా (భావోద్వేగాలు, భయం) ముఖ్యమైనవి.

వెన్నుపాము: ఇది వెన్నెముకలో ఉంటుంది. దీనిద్వారా గ్రే మ్యాటర్ (H - ఆకారం - సెన్సరీ/మోటార్ న్యూరాన్లు), వైట్ మ్యాటర్ (మైలినేటెడ్ ఫైబర్స్), 31 జతల స్పైనల్ నరాలు వెళ్తాయి.

నాడీ వ్యవస్థ వ్యాధులు

మెనింజైటిస్: బ్యాక్టీరియా లేదా వైరస్ వల్ల మెదడు పొరలకు వచ్చే వాపు.

మల్టిపుల్ స్క్లెరోసిస్: నాడీ కణాల మయలిన్ తొడుగు దెబ్బతినడం.

అల్జీమర్స్: ఎసిటైల్ కోలిన్ అనే న్యూరో ట్రాన్స్‌మిటర్ తగ్గడంతో జ్ఞాపకశక్తి మందగించడం.

నాడీ కణం (న్యూరాన్)



నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణమే నాడీకణం. మానవ శరీరంలోనే పొడవైన కణాలు. వీటికి విభజన చెందే శక్తి ఉండదు. నాడీకణంలో ప్రధానంగా మూడు భాగాలు ఉంటాయి. అవి:

కణదేహం: దీన్ని సైటాన్ అని కూడా అంటారు. ఇందులో కేంద్రకం, కణద్రవ్యం ఉంటాయి.

▲ కణద్రవ్యంలోని నిస్సల్ కణికలు ప్రోటీన్ సంశ్లేషణలో పాల్గొంటాయి.

డెండ్రైట్లు: ఇవి కణదేహం నుంచి బయటకు వచ్చే చిన్నచిన్న శాఖల లాంటి నిర్మాణాలు. ఇతర కణాల నుంచి ప్రేరణలను స్వీకరించి కణదేహానికి పంపుతాయి.

యాక్సాన్: కణదేహం నుంచి వెలువడే పొడవైన భాగాన్ని యాక్సాన్ లేదా తంత్రికాక్షం అంటారు. దీని చుట్టూ కొవ్వు పొర (మయలిన్ తొడుగు) ఉంటుంది. దీని మధ్యలో ఉండే ఖాళీలను రణ్‌వీర్ కణుపులు అంటారు. ఇవి వార్తలు వేగంగా ప్రయాణించడానికి సహాయపడతాయి. యాక్సాన్ చివర ఉండే బొడిపె లాంటి నిర్మాణాలను 'సినాప్టిక్ నాబ్స్' అంటారు.

సినాప్స్ (నాడీ సంధి): రెండు నాడీకణాల మధ్య లేదా ఒక నాడీకణం, కండర కణం మధ్య ఉండే ఖాళీ ప్రదేశాన్ని 'సినాప్స్' అంటారు. ఇక్కడే ఒక కణం నుంచి మరో కణానికి సమాచారం బదిలీ అవుతుంది. ఈ ప్రక్రియలో ట్రాన్స్‌మిటర్‌లు (ఉదా: ఎసిటైల్ కోలిన్) అనే రసాయనాలు కీలకపాత్ర పోషిస్తాయి.

నాడీకణం పనితీరు

నాడీకణాలు సమాచారాన్ని విద్యుత్ సంకేతాల రూపంలో ప్రయాణింపజేస్తాయి. దీన్ని నాడీ ప్రేరణ (నెర్వ్ ఇంపల్స్) అంటారు. ఈ ప్రక్రియ మూడు దశల్లో జరుగుతుంది.

స్వీకరణ: డెండ్రైట్లు ప్రేరణలను గ్రహిస్తాయి.

ప్రయాణం: ప్రేరణలు కణదేహం ద్వారా యాక్సాన్‌కు చేరతాయి.

ప్రసారం: యాక్సాన్ చివరన ఉండే సినాప్స్ ద్వారా రసాయన సంకేతాలుగా మారి నాడీకణానికి చేరతాయి.

నాడీకణాలు - రకాలు

జ్ఞాన నాడీకణాలు: ఇంద్రియాల నుంచి సమాచారాన్ని మెదడు లేదా వెన్నుపాముకు చేరవేస్తాయి.

చాలక నాడీకణాలు: మెదడు నుంచి ఆదేశాలను కండరాలకు లేదా అవయవాలకు చేరవేస్తాయి.

మధ్యస్థ నాడీకణాలు: జ్ఞాన, చాలక నాడీకణాలను కలుపుతాయి.



రచయిత
డా.కొర్లాం సాయివెంకటేష్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

927 Word of the Day

Anxious

Telugu meaning: ఆత్రుతగా, ఆరాటంగా

English meaning: The word anxious (యాంక్షస్) is an adjective that describes a feeling of worry, nervousness, or uneasiness about something with an uncertain outcome.

Synonyms: Worried, Nervous

Antonyms: Calm, Relaxed

Usage: **1.** She felt anxious about the results because she had invested months of hard work and dedication into the examination.

2. The parents were anxious to hear news about their child's health after the unexpected medical emergency.

నోటిఫికేషన్స్

అసిస్టెంట్ ఫోర్‌మెన్ (ట్రైనీ) గ్రేడ్-సి పోస్టులు

కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్) మధ్యప్రదేశ్ (సింగ్రౌలి), ఉత్తరప్రదేశ్ (సోనభద్ర) జిల్లాల్లోని గనుల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 270. దరఖాస్తు ఫీజు రూ.1,180. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 5 మార్చి 2026.

టీచింగ్ ఫ్యాకల్టీ పోస్టులు

రాంచీలోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) మెడికల్ కాలేజీ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వివిధ విభాగాల్లో టీచింగ్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 40. అర్హులైన అభ్యర్థులు 2026, ఫిబ్రవరి 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 20) చివరి తేదీ


- సీ-డ్యాక్‌లో 805 ప్రాజెక్ట్ ఇంజినీర్ అండ్ టెక్నీషియన్ ఉద్యోగాలు. బీఈ/బీటెక్, ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఫిబ్రవరి 20 ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం

చరిత్రలో ఈనాడు

ఏ దేశ సమాజంలోనైనా వ్యక్తులు, అన్ని వర్గాల మధ్య సమానత్వం కనిపించదు. పేదరికం, కులం, తెగ, లింగం, ప్రాంతీయ భేదాలు లాంటి అనేక అంశాలు దీనికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. వీటన్నింటినీ అధిగమించి సాంఘిక ప్రగతి సాధించాలంటే సామాజిక న్యాయం అవసరం. సర్వజన సమానత్వం, మానవ హక్కుల రక్షణ, పేదరిక నిర్మూలన ద్వారానే సామాజిక న్యాయం సిద్ధిస్తుంది. సామాజిక, ఆర్థిక అంతరాలతో సంబంధం లేకుండా ప్రపంచవ్యాప్తంగా పౌరులందరికీ సమాన అవకాశాలు, వనరులు అందాలనే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 20న 'ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం'గా (World Day of Social Justice) నిర్వహిస్తారు. సామాజిక న్యాయం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు సమానత్వాన్ని ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.



చారిత్రక నేపథ్యం


- ఐక్యరాజ్య సమితి (ఐరాస) 1995 మార్చి 6-12 తేదీల్లో డెన్మార్క్‌లోని కోపెన్‌హగన్‌లో సామాజిక అభివృద్ధి సదస్సును నిర్వహించింది. వివిధ దేశాలకు చెందిన వందకు పైగా నాయకులు ఇందులో పాల్గొన్నారు. పేదరిక నిర్మూలన, సంపూర్ణ ఉపాధి, స్థిరమైన - న్యాయపరమైన - సురక్షితమైన సమాజాలను సృష్టించడానికి చర్యలు తీసుకోవాలని అందులో తీర్మానించారు. ఈ సదస్సు ఫలితంగా కోపెన్‌హగన్ ప్రకటన, కార్యాచరణ కార్యక్రమం రూపుదిద్దుకున్నాయి.

❐ సమ సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 20న 'ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం'గా జరపాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2007లో అధికారికంగా ప్రకటించింది. 2009 నుంచి ఏటా దీన్ని నిర్వహించాలని తీర్మానించింది.

భారతదేశంలో సామాజిక న్యాయం, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

అయస్కాంతత్వం



అయస్కాంతం ప్రదర్శించే గుణం లేదా ధర్మాన్ని అయస్కాంతత్వం అంటారు. నిత్యం మనం వాడే అనేక వస్తువుల్లో అయస్కాంతత్వ ప్రభావాలను చూస్తుంటాం. ఇళ్లలోని మోటార్లు, విద్యుత్తును ఉత్పత్తి చేసే జనరేటర్లు, ఏటీఎం, క్రెడిట్ కార్డులు, కంప్యూటర్ హార్డ్‌డ్రైవ్‌లు, సీడీలు, ఎం.ఆర్.ఐ. స్కానింగ్, దిక్సూచి, మైకులు, సౌండ్ బాక్స్‌లు, ఇయర్‌ఫోన్లు మొదలైన వాటిలో అయస్కాంతత్వం ఇమిడి ఉంటుంది.

మాగ్నటైట్

కొన్ని రకాల సహజసిద్ధమైన రాళ్లు ఇనుము లాంటి (చిన్న పరిమాణంలోని) పదార్థాలను ఆకర్షిస్తున్నాయని క్రీ.పూ. 120లోనే గమనించారు. ఈ సహజమైన రాళ్లలో మాగ్నటైట్ అనే లోహ ఖనిజం ఉందని గుర్తించారు. మాగ్నటైట్ తరహా రాళ్లను (సహజ అయస్కాంతాలను) ఆసియా మైనర్‌లోని 'మాగ్నీసియా' ప్రాంతంలో కనుక్కోవడం ద్వారా వీటికి అయస్కాంతాలు అనే పేరు వచ్చింది.

అయస్కాంత ధర్మాలు

- ఆకర్షణ ధర్మం
- దిశా ధర్మం
- ద్విధ్రువం
- ప్రేరణ ధర్మం

అయస్కాంతాల రకాలు

1. సహజ అయస్కాంతాలు
2. కృత్రిమ అయస్కాంతాలు
3. శాశ్వత అయస్కాంతాలు
4. తాత్కాలిక అయస్కాంతాలు

విద్యుదయస్కాంతాలు - ఉపయోగాలు, కూలుమ్స్ విలోమ వర్గ నియమం, అయస్కాంత ప్రేరణ, అయస్కాంత బల (క్షేత్ర) రేఖలు, అయస్కాంత పదార్థాలు, పారా అయస్కాంతత్వం, ఫెర్రో అయస్కాంతత్వం, భూ అయస్కాంతత్వంతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Elephanta Caves were built by...

Current Affairs

1. Which of the following correctly describes the outcome of the RBI MPC February 2026 meeting?
A) The RBI reduced the repo rate to 4.75% and shifted to an accommodative stance
B) The MPC increased the repo rate to 6% to control inflation
C) The RBI kept the repo rate unchanged at 5.25% and maintained a neutral monetary policy stance during its 59th MPC meeting held from 4-6 February 2026 under Governor Sanjay Malhotra
D) The meeting was chaired by the Finance Minister and focused only on fiscal policy

2. Which of the following statements is correct regarding the FIPI Award 2025?
A) Oil India received the award for Renewable Energy Innovation
B) The award was presented by OPEC during a global summit in Vienna
C) The award recognised Oil India for excellence in banking and finance
D) Oil India received the 'Oil & Gas Production Company of the Year' award at India Energy Week 2025 for its growth and contribution to national energy security

3. Which of the following statements is correct regarding wool production in India?
A) Rajasthan is the largest wool-producing state in India, contributing about 47.5% of national output, followed by Jammu & Kashmir and Karnataka
B) Karnataka is the largest wool producer, followed by Rajasthan
C) Jammu & Kashmir contributes more than 60% of India's wool production
D) Punjab is the leading wool-producing state in India

4. Which of the following statements is correct regarding the U-19 Cricket World Cup?
A) England won its 6th U-19 title by defeating India in the final
B) India won its 6th U-19 Cricket World Cup title by defeating England, with Vaibhav Suryavanshi scoring a record 175 in the final
C) Australia defeated India in the final to claim the championship
D) The final was abandoned due to rain and the trophy was shared

SSC Exams Special

General Awareness

History

5. Which of the following correctly explains the terms 'Sijda' and 'Pabos' in medieval Indian court practices?
A) Sijda was a revenue settlement system, and Pabos was a land grant
B) Both Sijda and Pabos were military formations used in battles
C) Sijda referred to temple worship, and Pabos referred to taxation
D) Sijda referred to prostration before the ruler, and Pabos referred to kissing the monarch's feet

6. Which of the following correctly describes the Elephanta Caves?
A) They were built by the Cholas and dedicated to Lord Vishnu
B) The Elephanta Caves, dedicated mainly to Lord Shiva, were built by the Rashtrakutas on Elephanta Island (Gharapuri) in Mumbai Harbour and were declared a UNESCO World Heritage Site in 1987
C) They are located in Odisha and were declared a World Heritage Site in 1995
D) The caves were built during the Mauryan period and contain Buddhist stupas

Geography

7. Which of the following correctly describes Kawal Tiger Reserve?
A) Kawal Tiger Reserve is located in Maharashtra and was declared under Project Tiger in 2005
B) Kawal was first declared a Tiger Reserve in 1965
C) Kawal Tiger Reserve is located in Adilabad district of Telangana; it was declared a wildlife sanctuary in 1965 and became a Tiger Reserve under Project Tiger in 2012
D) Kawal is part of the Sundarbans Tiger landscape

8. Which of the following correctly explains the formation of the North Indian Plains?
A) They were formed mainly due to volcanic lava deposits
B) They originated from desert wind deposition during the medieval period
C) They were formed by tectonic uplift without river deposition
D) The North Indian Plains were formed by the combined deposition of the Indus, Ganga, and Brahmaputra river systems and their tributaries, resulting in highly fertile soil

9. Which of the following correctly describes the Siachen Glacier and the Nubra River?
A) The Siachen Glacier is located in the Western Ghats and is the world's longest glacier
B) The Siachen Glacier is located in the Eastern Karakoram range of the Himalayas, is known as the world's highest battlefield, and the Nubra River originates from it
C) The Nubra River originates from the Ganga and flows through Himachal Pradesh
D) The Siachen Glacier lies south of the Nubra Valley in Uttarakhand

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) ఛైర్మన్‌గా 2026, జనవరిలో ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ నియామక కమిటీ ఎవరిని నియమించింది?
జ: ఏకే బాలసుబ్రహ్మణ్యన్ (మూడేళ్ల పాటు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.)

◆ భారత దేశంలో మొదటి బయో హ్యాపీ జిల్లాగా ఏ రాష్ట్రంలోని కేయా పన్యేర్ జిల్లాను అభివృద్ధి చేస్తున్నారు? (జీవవైవిధ్య పరిరక్షణను మానవ శ్రేయస్సుతో అనుసంధానించడం, పర్యావరణం, జీవనోపాధి, ప్రజారోగ్యాన్ని సమతుల్యం చేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును ఎంఎస్ స్వామినాథన్ రిసెర్చ్ ఫౌండేషన్ అమలు చేస్తోంది.)
జ: అరుణాచల్ ప్రదేశ్


◆ ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ (ఏఐటీఈ)–2026ను ఏ రాష్ట్రంలోని తంథాయ్ పెరియార్ వన్యప్రాణుల అభయారణ్యంలో ఇటీవల అధికారికంగా ప్రారంభించారు? (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఆధ్వర్యంలో దేశంలో ప్రతి నాలుగేళ్లకు ఒకసారి అఖిల భారత పులుల అంచనాను నిర్వహిస్తారు.)
జ: తమిళనాడు

మరింత సమాచారం

◆ సోమనాథ్ స్వాభిమాన్ పర్వను 2026, జనవరి 8 నుంచి 11 వరకు ఏ రాష్ట్రంలో నిర్వహించారు?
జ: గుజరాత్ (1026 సంవత్సరం, జనవరిలో సోమనాథ్ ఆలయం పై మొదటి దాడి జరిగిన ఘటనకు వెయ్యేళ్లు పూర్తయిన సందర్భంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వను నిర్వహించారు. గజనీ మహమ్మద్ ఈ దాడి చేశాడు.)

ఆధునిక ప్రగతి మార్గాలు!


జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ



ముడిపదార్థాలను విలువ ఆధారిత వినియోగ వస్తువులుగా, సంప్రదాయ సమాజాలను ఆధునిక సమాజాలుగా మార్చేవే పరిశ్రమలు. ఆర్థిక ప్రగతి, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధితో దేశ నిర్మాణంలో కీలకంగా మారాయి. అందుకే ప్రభుత్వాలు ఎప్పుడూ పారిశ్రామిక వృద్ధికి ప్రాధాన్యం ఇస్తుంటాయి. భారత్‌లో పారిశ్రామిక రంగం ప్రస్థానం, వలస పాలనలో ఎదుర్కొన్న సవాళ్లు, స్వాతంత్ర్యానంతర పురోగతి గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. పంచవర్ష ప్రణాళికల్లో ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానాల నుంచి ఇటీవలి 'మేక్ ఇన్ ఇండియా' వరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిన పరిశ్రమలను, తద్వారా అందుకున్న ఫలితాలను గుర్తుంచుకోవాలి.

పరిశ్రమలు

ఆర్థిక వ్యవస్థలో పరిశ్రమలు ద్వితీయ రంగంలోకి వస్తాయి. పరిశ్రమల పెరుగుదల ఒక దేశ ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమైన సూచిక. పరిశ్రమల వృద్ధి ఆ ప్రాంత ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌లా పనిచేస్తుంది. స్థానిక ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ పేదరికాన్ని తగ్గించడంలో సహకరిస్తుంది. స్వాతంత్ర్యానంతరం దేశం ప్రాథమిక వస్తువులు, ప్రధాన వస్తువుల ఉత్పత్తిలో స్వయంప్రతిపత్తి సాధించింది. పరిశ్రమల అభివృద్ధి ద్వారా ద్వితీయ, తృతీయ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా ఉన్న వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించింది. ఆధునిక పరిశ్రమల ఆవిర్భావానికి ముందు దేశం కుటీర, గృహ, గ్రామీణ పరిశ్రమలకు ప్రసిద్ధి. భారతీయ మస్లిన్, పట్టుఉత్పత్తులు, కళాత్మక కుండలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉండేది. బ్రిటిష్ పాలనలో ఇక్కడి సంప్రదాయ వృత్తులు, ఉత్పత్తులు క్షీణించాయి. ఈస్టిండియా కంపెనీ భారత్ నుంచి బ్రిటన్‌కు ముడిపదార్థాలను ఎగుమతి చేసి, తయారైన వస్తువులను దిగుమతి చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టింది. ఫలితంగా 1854వరకు దేశంలో ఎలాంటి పరిశ్రమలు అభివృద్ధి చెందలేదు. 1854లో బొంబాయిలో మొదటి నూలు వస్త్రపరిశ్రమ, 1855లో కోల్‌కతా సమీపంలోని రిష్రాలో జనపనార పరిశ్రమ ప్రారంభమయ్యాయి. 1870లో అమెరికాలో అంతర్యుద్ధం సమయంలో భారత్‌లో వస్త్రపరిశ్రమ విస్తరించింది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందే దేశంలో నూలువస్త్ర పరిశ్రమల సంఖ్య 275కి చేరింది.


ఉక్కు కర్మాగారం (జంషెడ్‌పూర్)

దేశంలో ఇనుము-ఉక్కు పరిశ్రమ తొలిసారిగా 1870లో బెంగాల్ ఐరన్ వర్క్స్ లిమిటెడ్ పేరుతో 'కుల్టి'లో స్థాపించగా విఫలమైంది. 1908లో జంషెడ్‌పూర్‌లో ఉక్కు కర్మాగారం స్థాపనతోనే దేశంలో అసలైన ఉత్పత్తి మొదలైంది. పేపరు మిల్లు మొదటగా 1870లో కోల్‌కతాలోని బల్లీగంజ్ సర్క్యులర్ రోడ్‌లో ప్రారంభమైంది. ఆ తర్వాత లఖ్‌నవూ, బెంగళూరు, ధరివాల్ (పంజాబ్), కాన్పూర్‌లో ప్రారంభమయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో భారత దేశం నూలు, ఉన్ని, వస్త్రాలు, మద్యం లాంటి ఉత్పత్తులకు ప్రధాన సరఫరాదారుగా మారడంతో ఇక్కడి పరిశ్రమలకు మంచి ప్రోత్సాహం లభించింది. ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని పరిశ్రమలకు రక్షణ కల్పించింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పారిశ్రామిక ఉత్పత్తులకు డిమాండ్ తగ్గడంతో ఉత్పత్తి పడిపోయింది. స్వాతంత్ర్యం తర్వాత ముడిపదార్థాల కొరతతో నూలు, సిమెంట్, కాగితం, ఇనుము-ఉక్కు పరిశ్రమల ఉత్పత్తి కనిష్ఠ స్థాయి పడిపోయింది. దీంతో భారత ప్రభుత్వం పారిశ్రామిక విధానం ప్రాముఖ్యతను గుర్తించి, పంచవర్ష ప్రణాళికల్లో ప్రాముఖ్యత ఇచ్చి ప్రోత్సహించింది. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ భావనతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పరిశ్రమలు అభివృద్ధి చెందాయి.

> 1951 తర్వాత భారత పురోగతికి పారిశ్రామికీకరణ దోహదపడింది. 1948, 1956 పారిశ్రామిక విధానాల ప్రకారం భారీ కేటాయింపులతో కొత్త పరిశ్రమల నిర్మాణం జరిగింది. 1991లో తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక విధానంలోని సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ ప్రక్రియల ఫలితంగా అభివృద్ధి వేగవంతమైంది.

పంచవర్ష ప్రణాళికల కాలంలో పరిశ్రమల అభివృద్ధి

మొదటి పంచవర్ష ప్రణాళిక: వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. అప్పటికే నెలకొల్పిన పరిశ్రమలకు చేయూతనిచ్చారు. వాటిలో నూలు, ఉన్ని, సిమెంట్, కాగితం, న్యూస్‌ప్రింట్ మొదలైనవి ఉన్నాయి.

రెండో పంచవర్ష ప్రణాళిక భారీ పరిశ్రమలను స్థాపించారు. 1956లో రెండో పారిశ్రామిక విధానాన్ని ప్రకటించారు. ప్రధానంగా భారీ ఇంజినీరింగ్, లిగ్నైట్, ఎరువుల పరిశ్రమలు; బిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా ఇనుము-ఉక్కు కర్మాగారాలను స్థాపించారు.

మూడో పంచవర్ష ప్రణాళిక: రెండో పంచవర్ష ప్రణాళిక నాటి ప్రధాన పరిశ్రమలను విస్తరించడంతోపాటు రాంచి మిషన్ టూల్స్, మరో రెండు హిందుస్థాన్ మిషన్ టూల్స్ ప్రారంభించారు.

నాలుగో పంచవర్ష ప్రణాళిక: వ్యవసాయాధారిత పరిశ్రమలపై ప్రత్యేక శ్రద్ధ, అల్యూమినియం, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ట్రాక్టర్ల తయారీలో వృద్ధి, పారిశ్రామికీకరణ వేగవంతం.

అయిదో పంచవర్ష ప్రణాళిక: ఉక్కు పరిశ్రమల వృద్ధి, వినియోగ, ఎగుమతి ఆధారిత వస్తు ఉత్పత్తి, 'స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా' ఏర్పాటు.

ఆరో పంచవర్ష ప్రణాళిక: దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఎక్కువ భాగాన్ని వస్తు ఉత్పత్తితో ఆక్రమించడం; అల్యూమినియం, ఆటోమొబైల్స్, విద్యుత్తు పరికరాలు, థర్మోస్టాటిక్స్ లాంటి పరిశ్రమలకు ప్రాధాన్యం.

ఏడో పంచవర్ష ప్రణాళిక: హైటెక్, ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి. స్థానిక వనరులను పెద్ద ఎత్తున వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామిక విస్తరణ, స్థానికులకు నైపుణ్య శిక్షణ.

ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక: నూతన పారిశ్రామిక సరళీకరణ విధానాలు, ప్రాంతీయ అసమానతలు తొలగించడం, చిన్న పరిశ్రమల రంగాల్లో ఉపాధి, వృద్ధిని ప్రోత్సహించడం.

> 2014లో ప్రారంభమైన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా వచ్చే పదేళ్లలో భారతీయ పరిశ్రమలకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా. ప్రస్తుతం అనేక భారతీయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది.

తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక: సిమెంట్, బొగ్గు, శిలాజ ఇంధనం, ఎలక్ట్రికల్, మౌలిక వసతుల కల్పన, రిఫైనరీలు, నాణ్యమైన ఉక్కు పరిశ్రమలపై దృష్టి.

పదో పంచవర్ష ప్రణాళిక: ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి, దిగుమతులు తగ్గించి ఎగుమతులు పెంచడం, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధించడం. వీటి సాధనకు ప్రత్యేక ఆర్థిక మండళ్లు స్థాపించడం. పారిశ్రామికీకరణ అంతగా నోచుకోని హిమాచల్‌ప్రదేశ్, జమ్ము-కశ్మీర్, ఉత్తరాఖండ్‌లకు ప్రత్యేక ప్యాకేజీలు.

పదకొండో పంచవర్ష ప్రణాళిక: పేదరికాన్ని తగ్గించడానికి వేగవంతమైన వృద్ధి ప్రాముఖ్యత కావాలని గుర్తించారు. అందరికీ ఉపాధి కల్పన, ప్రతి ఒక్కరికి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని నిర్ణయించారు.



పన్నెండో పంచవర్ష ప్రణాళిక: మేకిన్ ఇండియా, స్టార్టప్స్, స్కిల్ ఇండియా పథకాల ద్వారా భారతీయ ఉత్పత్తుల పెంపు, అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి కోసం ఆత్మనిర్భర్ భారత్, స్కిల్ ఇండియా ఇనిషియేటివ్ ప్రారంభమయ్యాయి.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

SENIOR INTER Physics — Charges and Fields

Final Exams-2026 IMPORTANT Q & A

1. State and explain Coulomb's law in electricity? (4 Marks)

A: Statement: Force between two charges is directly proportional to the product of two charges and inversely proportional to square of the distance between them.

Explanation: If two charges q_1 and q_2 are separated at a distance "r" in air then force between them.

$F \propto q_1, q_2$ … (1)

$F \propto \frac{1}{r^2}$ … (2)



From 1, 2 equations


$$F \propto \frac{q_1 q_2}{r^2} = F = K\frac{q_1 q_2}{r^2}; K = \frac{1}{4\pi\varepsilon_0} \quad F = \frac{1}{4\pi\varepsilon_0}\frac{q_1 q_2}{r^2}$$

2. Define Intensity of electric field at a point. Derive an expression for the Intensity due to a point charge?

A: Intensity of Electric field (E): It is defined as force per unit test charge placed at a point

$$E = \frac{F}{q_0}$$

Intensity due to point charge: Let us consider "P" is a point at a distance r from a point charge q_0 at P is



$$F = \frac{1}{4\pi\varepsilon_0}\frac{qq_0}{r^2}$$

from the definition of electric field intensity

$$E = \frac{F}{q_0} = \frac{1}{4\pi\varepsilon_0}\frac{q}{r^2} \quad \therefore E = \frac{1}{4\pi\varepsilon_0}\frac{q}{r^2}$$

3. State Gauss's Law in Electrostatics and explain it's importance.

A: Gauss Law: The total Electrical flux over any closed surface is equal to $\frac{1}{E_0}$ times charge enclosed by the closed surface.

$$\phi_E = \frac{q}{E_0}$$

Importance:

1. Gauss Law is true for any closed surface.
2. Gauss Law gives the relation between the electric field and charge.
3. Gauss Law is valid for stationary charges.

More Imp Q & Ans



Writer: Allu Rambabu

అతిధ్వనులతో దోమలు పరార్!




కళ్లు మూసుకుని కాస్త ఆలకించండి. ప్రపంచమంతా శబ్దమై వినిపిస్తుంది. పక్షుల కిలకిలలు, చెట్ల ఆకుల రెపరెపలు, వాహనాల కదలికలు, ఇంకా అనేక రకాల శబ్దాలతో మరో లోకం అనుభవంలోకి వస్తుంది. అదే ధ్వని ప్రపంచం. అదో శక్తి స్వరూపం. వస్తువుల కంపనాల వల్ల ధ్వని ఉత్పత్తి అవుతుంది. అది ప్రయాణించడానికి కచ్చితంగా ఒక యానకం కావాలి. అందుకే శూన్యంలో ధ్వని వినిపించదు. తీగ మీటితే వచ్చే సంగీత శబ్దానికి, గోడ గడియారం చేసే టిక్ టిక్ ధ్వనికి మధ్య తేడా ఉంటుంది. ధ్వని పుట్టే తీరును, ప్రయాణించే విధానాన్ని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ఆ అద్భుతశక్తి సృష్టించే తరంగాల రహస్యాలను అర్థం చేసుకోవాలి. ధ్వని తరంగాల రకాలు, వాటి ముఖ్య లక్షణాలు, తీవ్రతను ప్రభావితం చేసే అంశాలు, పౌనఃపున్యం ఆధారంగా శ్రవ్య, అల్ప, అతి ధ్వనులుగా చేసిన వర్గీకరణ, మనుషులతో పాటు వివిధ జీవులు వినగలిగే, ఉత్పత్తి చేసే ధ్వని అవధుల గురించి తగిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. ధ్వని ధర్మాల ఆధారితంగా పని చేసే వివిధ రకాల పరికరాలు, వాటి ఉపయోగాలపై అవగాహన ఉండాలి.

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం

ధ్వని

1. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) మానవుడిలో శబ్ద ఉత్పత్తికి తోడ్పడే ప్రధాన అవయవం - స్వరపేటిక.
బి) స్వరతంత్రులు మూసి, తెరుచుకున్నప్పుడు ధ్వని బిగ్గరగా వినిపిస్తుంది.
సి) స్వరతంత్రుల పొడవు మనుషుల్లో వేర్వేరుగా ఉంటుంది. చిన్నపిల్లల్లో వీటి పొడవు చాలా తక్కువ. దాదాపు 7 నుంచి 8 మి.మీ. ఉంటుంది.
డి) వెంట్రిలాక్విస్టులకు స్వరపేటిక మీద నియంత్రణ ఉంటుంది.
1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి

2. మానవుడి చెవిలో శబ్దం స్వీకరించే చెవి వెలుపల భాగం?



1) పిన్నా 2) స్టేప్స్
3) మధ్య చెవి 4) ఓవెల్‌విండో

3. మనిషి రెండు ధ్వనులను విడివిడిగా వినాలంటే, ఒక శబ్దం తర్వాత వేరొక శబ్దం చెవిలో చేరి వినికిడి జ్ఞానం కలగాలంటే ఆ రెండు శబ్దాల మధ్య కాలవ్యవధి (సెకన్లలో)?
1) 0.1 2) 0.5 3) 0.2 4) 0.02


4. శబ్ద తరంగాల ఆవర్తనకాల విలోమాన్ని సూచించే రాశి?
1) కంపన పరిమితి 2) ధ్వని వేగం
3) తరంగదైర్ఘ్యం 4) పౌనఃపున్యం

5. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) ధ్వని తీవ్రతను డెసిబెల్ మీటర్‌తో కొలుస్తారు.
బి) ధ్వని తీవ్రతకు సూత్రం $N_{dB} = 10\, log_{10}\left(\frac{I}{I_0}\right)$
సి) I_0 ఆరంభ ధ్వని తీవ్రత విలువ = 10^{-12} $Watt/m^2$
డి) ధ్వని కంపన పరిమితి పెరిగితే అది పెద్ద శబ్దం.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
3) ఎ, బి 4) ఎ, బి, డి

6. కింది వాటిలో ధ్వని తరంగం లక్షణం కానిది?
1) తరంగదైర్ఘ్యం 2) పౌనఃపున్యం
3) కంపన పరిమితి 4) ధ్వని పిచ్

7. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) ఒక సెకను కాలంలో వస్తువు చేసే కంపనాల సంఖ్యను పౌనఃపున్యం అంటారు.
బి) వస్తువు సెకనుకు 12 కంపనాలు చేస్తే, దాని పౌనఃపున్యం 12 హెర్ట్జ్‌లు.
సి) ఒక హెర్ట్జ్ = $\frac{\text{ఒక కంపనం}}{\text{ఒక సెకను}}$
డి) వస్తువు పొడవుపై ఆ వస్తువు పౌనఃపున్యం ఆధారపడుతుంది.
1) ఎ, బి, సి, డి 2) ఎ, సి
3) ఎ, బి, డి 4) ఎ, సి, డి

8. మానవ హృదయం సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటే ఆ హృదయ పౌనఃపున్యం?



1) 4.25 హెర్ట్జ్
2) 1.25 హెర్ట్జ్
3) 75 హెర్ట్జ్
4) 7.5 హెర్ట్జ్

9. కింది వాటిలో వస్తువుల పౌనఃపున్యంలో సరికానిది గుర్తించండి.
1) వస్తువు పొడవు తగ్గితే పౌనఃపున్యం పెరుగుతుంది.
2) వస్తువు డోలనావర్తన కాలం తగ్గితే పౌనఃపున్యం పెరుగుతుంది.
3) వస్తువు కంపన పరిమితి పెరిగితే పౌనఃపున్యం తగ్గుతుంది.
4) వస్తువు పొడవు పెరిగితే అది చేసే కంపనాలు ఎక్కువ.

10. కింది వాటిలో పదార్థాల్లో అణువుల కంపన పరిమితికి ప్రమాణం కానిది?
1) పాస్కల్ 2) కిలోగ్రామ్/మీటర్^{3}
3) మీటర్ 4) మీటర్/సెకన్^{2}

11. కింది వాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి.
1) గాలి వీచే దిశలో ధ్వని వేగం తక్కువ.
2) తరంగంలో రెండు వరుస కణాల మధ్య దూరం - తరంగ దూరం.
3) తరంగదైర్ఘ్యానికి ప్రమాణం SI పద్ధతిలో - మీటర్/సెకన్.
4) ధ్వని తరంగాల్లో రెండు వరుస సంపీడన, విరళీకరణాల మధ్య దూరం తరంగదైర్ఘ్యం.

12. మానవుడు వినగలిగే శబ్ద అవధి?
1) 0 - 180 dB 2) 0 - 120 dB
3) 5 - 120 dB 4) 9 - 180 dB

13. ఒక వస్తువు పౌనఃపున్యం 500 హెర్ట్జ్‌లు. అయితే ఆ వస్తువు డోలనావర్తన కాలం (సెకన్లలో)?
1) 0.05 2) 0.02
3) 0.005 4) 0.002

14. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) మానవుడు 0.02 కిలోహెర్ట్జ్ నుంచి 20 కిలోహెర్ట్జ్ మధ్య ఉన్న శబ్దాలు వినగలడు.
బి) శ్రవ్య అవధిని గుర్తించడానికి మానవుడు ఉదాహరణ.
సి) ఖడ్గమృగాలు 100 హెర్ట్జ్‌ల శబ్దంతో తోటి జీవులతో భావ వ్యక్తీకరణ చేసుకుంటాయి.
డి) గబ్బిలాలు పరశ్రవ్య ధ్వనులను వింటాయి.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
3) ఎ, బి, సి 4) బి, సి, డి

15. గాలిలో ధ్వనివేగం 340 మీ./సె. మానవుడి చెవి వినగలిగే ధ్వని గరిష్ఠ తరంగదైర్ఘ్యం (అంటే కనిష్ఠ పౌనఃపున్యం)?
1) 34 మీ. 2) 340 2 మీ.
3) 170 మీ. 4) 17 మీ.

16. కింది వాటిలో అతి ధ్వనులు వినగలిగే జీవులు కానివి?
1) గబ్బిలాలు 2) డాల్ఫిన్‌లు
3) పాములు 4) తోడేళ్లు

17. కింది వాటిలో అతి ధ్వనులను వినగలుగుతూ, ఆ శబ్దాన్ని ఉత్పత్తి చేసే జీవులు?



1) డాల్ఫిన్‌లు, పాములు 2) తాబేళ్లు, గబ్బిలాలు
3) తాబేళ్లు, కుందేళ్లు 4) డాల్ఫిన్‌లు, ఎలుకలు

18. కింది వాటిలో అతిధ్వనుల ఉపయోగం కానిది?
1) సముద్రాల లోతును కనుక్కునే 'ఈకో రేంజింగ్' పద్ధతుల్లో
2) గుండె పనితీరును గుర్తించే ఈకో కార్డియోగ్రఫీలో
3) దోమలు పారదోలడానికి
4) పదార్థాలు వేడి చేసే ఒవెన్‌లలో

19. కింది వాటిని అవి వినగలిగే అతి ధ్వనులతో జతపరచండి.
1) గబ్బిలాలు ఎ) 70,000 హెర్ట్జ్
2) కుక్కలు బి) 30,000 హెర్ట్జ్
3) ఎలుకలు సి) 50,000 హెర్ట్జ్
4) చిన్నపిల్లలు డి) 1,00,000 హెర్ట్జ్
1) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
2) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి
3) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
4) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి

20. అతి ధ్వనులను పీజో విద్యుత్తు పద్ధతిలో ప్రయోగశాలల్లో ఉత్పత్తి చేసినవారు?
1) న్యూటన్ 2) గాల్టన్
3) డాల్టన్ 4) నిక్సన్

21. మూత్రపిండాల్లో రాళ్లను, కంటిలో శుక్లాలను, శరీరంలో కణతులను తొలగించడానికి అతిధ్వనుల సహాయంతో చేసే పద్ధతి?
1) పీజో విద్యుత్తు పద్ధతి 2) ఈకో రేంజింగ్
3) అల్ట్రాసోనోగ్రఫీ 4) ఎమల్సీకరణం


22. సోనార్ పరికరానికి సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.



ఎ) దీన్ని కనుక్కున్నవారు - నిక్సన్
బి) సోనార్ - సౌండ్ నావిగేషన్, రేంజింగ్
సి) దీనిలో అతిధ్వనిని పంపించి సముద్రాల లోతును కనుక్కుంటారు.
డి) దీనిలో ధ్వని పరావర్తన ధర్మం ఉపయోగపడుతుంది.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
3) ఎ, బి, సి 4) బి, సి, డి

23. కింది వాటిని జతపరచండి.
1) హైడ్రోఫోన్ ఎ) ధ్వని తరంగాలను విద్యుత్తు తరంగాలుగా మార్చేది
2) స్టెతస్కోప్ బి) నీటిలో ధ్వని తరంగాలను కొలిచేది
3) ఆడియో మీటర్ సి) గుండె కొట్టుకోవడం, ధ్వని పరావర్తన ధర్మం
4) మైక్రోఫోన్ డి) వినికిడి శక్తిని కొలిచేది
1) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
2) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
3) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
4) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ

24. కింది వారిలో మొదట ధ్వని వేగాన్ని కనుక్కుని అధ్యయనం చేసిన శాస్త్రవేత్త?



1) గాల్టన్ 2) డాల్టన్
3) న్యూటన్ 4) లాప్లస్

25. ఒక వస్తువును కంపింపజేసినప్పుడు అది సెకనుకు 50 కంపనాలు చేస్తే, దాని పొడవు?
1) 50 మీ. 2) 0.05 మీ.
3) 0.02 మీ. 4) 0.2 మీ.

26. గర్భస్థ శిశువు, పిండం పెరుగుదలను, శరీర భాగాల పనితీరును గుర్తించే విధానం?
1) ఈకో రేంజింగ్ 2) ఈకో కార్డియోగ్రఫీ
3) అల్ట్రాసోనోగ్రఫీ 4) హాలోగ్రఫీ

27. గాలిలో ధ్వని వేగం 340 మీ./సె., 170 హెర్ట్జ్ పౌనఃపున్యం ఉన్న ధ్వని గాలిలో ప్రయాణిస్తే వరుసగా ఏర్పడిన సంపీడన, విరళీకరణాల మధ్య దూరం?
1) 3 మీ. 2) 4 మీ. 3) 1 మీ. 4) 2 మీ.

28. పౌనఃపున్యంలో స్వల్పతేడా ఉన్న రెండు ధ్వని తరంగాలు యానకంలోని ఒకే ప్రాంతం ద్వారా ఒకే దిశలో ప్రయాణిస్తే అవి ఒకదానికొకటి అధ్యారోహణం చెంది వరస గరిష్ఠ, కనిష్ఠాలు ఏర్పడే ప్రక్రియ?
1) అనునాదం 2) విస్పందనాలు
3) ప్రతిధ్వనులు 4) అతిధ్వనులు

29. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
ఎ) మానవుడి చెవి వినగలిగే గరిష్ఠ విస్పందనాల సంఖ్య = 2
బి) వరుస గరిష్ఠ, కనిష్ఠ తీవ్రతలు కలిపి ఒక విస్పందనం
సి) విస్పందనాలతో గనుల్లో వెలువడే విషవాయువులను గుర్తించవచ్చు.
డి) సినిమాల్లో స్పెషల్ సౌండ్ ఎఫెక్ట్‌ను రూపొందించవచ్చు.
1) ఎ, సి 2) ఎ, బి 3) ఎ 4) బి

30. ధ్వని అవరోధపు చీలికలు మొనల అంచుల వద్ద వంగి ప్రయాణించే దృగ్విషయాన్ని ఏమని పిలుస్తారు?
1) అనునాదం 2) ప్రతినాదం
3) వివర్తనం 4) వ్యతికరణం

31. కింది వాటిలో సరికాని వాక్యాన్ని గుర్తించండి?
1) గబ్బిలం తక్కువ తరంగదైర్ఘ్యం ఉన్న ధ్వనులు ఉత్పత్తి చేస్తుంది.
2) గదిలో మాటలు పక్కగదికి వినపడటం- వివర్తనం.
3) గబ్బిలం ధ్వని తరంగదైర్ఘ్యం సుమారు - 7 సెం.మీ.
4) గబ్బిలం చీకటిలో కీటకాలను గుర్తించడానికి వివర్తన, పరావర్తన ధర్మాలను ఉపయోగించుకుంటుంది.

32. ఒక వస్తువు చేసే కంపనాలు సెకనుకు 2000. ఆ వస్తువులో ధ్వని వేగం. 80 మీ./సె.. అయితే ఆ ధ్వని తరంగం తరంగదైర్ఘ్యం ఎంత?
1) 0.04 మీ. 2) 0.80 మీ.
3) 250 మీ. 4) 160 మీ.



రచయిత: ఎస్.వై. నాయుడు

సమాధానాలు

1-2, 2-1, 3-1, 4-4, 5-1, 6-4, 7-1, 8-2, 9-4, 10-4, 11-2, 12-4, 13-4, 14-2, 15-4, 16-3, 17-2, 18-4, 19-1, 20-2, 21-4, 22-1, 23-3, 24-3, 25-3, 26-3, 27-3, 28-2, 29-3, 30-3, 31-3, 32-1.

పేదల భూముల కబ్జాకు వైకాపా నేతల యత్నం

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: పందెరాల పేద భూమిని వైకాపా నేతలు కబ్జా చేయాలని చూస్తున్నారని తిరుపతి జిల్లా దక్షిలి మండలం డి.ఉప్పరపల్లికి చెందిన బాస్కరనాయుడు ఫిర్యాదు చేశారు. 30 దశాబ్దాలుగా ఆ భూమిని 40 ఎస్సీ, 35 ఎస్టీ కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయని తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోయారు. న్యాయం కోరుతూ రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డి, తితిదే బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, కూరాకుల, పొందర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ దామోదర నర్సింహులకు గురువారం వినతి పత్రం సమర్పించారు. తనకు తెలియకుండా పెద్దప మార్చి 1.85 ఎకరాల భూమిని దొంగ సంతకాలతో తన పేరు మీదకు మార్చుకొందని అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలానికి చెందిన వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.

72 ఆయుష్ వైద్యుల పోస్టులకు 2,430 దరఖాస్తులు

ఈనాడు, అమరావతి: ఆయుష్ శాఖలో 72 వైద్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేస్తే.. 2,430 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,669 మంది మహిళలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక బోర్డు ఇటీవల నోటిఫికేషన్ జారీచేసింది. ఆయుర్వేదంలో 36, హోమియోలో 26, యునానిలో 10 పోస్టులు ఒప్పంద విధానంలో భర్తీ చేయనున్నారు. మెరిట్ ఆధారంగా అర్హుల జాబితా సిద్ధంచేస్తున్నారు. జిల్లా ఎంపిక రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ల ఆధ్వర్యంలో భర్తీ ప్రక్రియ త్వరలో జరగనుంది.

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

మంత్రి డోలా

ఈనాడు, అమరావతి: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి సూచించారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో గురువారం ఆయన తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన 161 మంది విద్యార్థులను మంత్రి అభినందించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నిర్దేశించారు.

టీవీలోనే క్రికెట్ చూడాలా..?

జగన్‌పై మండిపడ్డ లంకా దినకర్

ఈనాడు, అమరావతి: 'మంత్రి లోకేశ్ టీవీలో క్రికెట్ చూడకుండా.. సొంత డబ్బులతో స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ చూడటం చారిత్రక తప్పిదమే.. దయచేసి ఎవరూ స్టేడియానికి వెళ్లి క్రికెట్ మ్యాచ్ చూడొద్దు. టీవీలో మాత్రమే చూడండి అని జగన్ చెబుతున్నారు' అంటూ 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ ఎద్దేవా చేశారు. జగన్ వ్యాఖ్యలపై గురువారం 'ఎక్స్' వేదికగా స్పందించారు.

24న ఆర్టీసీ డిపోల వద్ద నిరసనలు

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలో 12 డిపోల పరిధిలో ప్రైవేటు సంస్థ ద్వారా విద్యుత్తు బస్సులు నడపాలనే ఆదేశాలను నిరసిస్తూ ఈనెల 24న రాష్ట్రంలో అన్ని డిపోల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) తెలిపింది. ఆ రోజు ఉదయం ఎర్ర బ్యాడ్జీలతో ఉద్యోగులు విధులకు హాజరవుతారని, మధ్యాహ్నం భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్‌లు, ధర్నాలు నిర్వహిస్తారని సంఘం సెంట్రల్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసినట్లు పేర్కొంది. ప్రైవేటు సంస్థ ద్వారా కాకుండా, ఆర్టీసీయే సొంతంగా విద్యుత్తు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని గురువారం సచివాలయంలో కలిసి వినతి అందజేసినట్లు ఎన్ఎంయూఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.శ్రీనివాసరావు, పీవీ రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

రంజాన్ శాంతి, ఆనందాన్ని నింపాలి

గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: ముస్లిం సోదరులందరికీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. '2026 రంజాన్ పవిత్ర మాసం ప్రారంభమైంది.. ఈ నెలంతా దేవుడి ఉపవాసం, ప్రార్థన.. మీకు, మీ కుటుంబ సభ్యులకు శాంతి, ఆనందం, భగవంతుడి ఆశీస్సులు తీసుకురావాలి. మీ అందరి ప్రార్థనలు ఫలించి దక్కాలి. ఆధ్యాత్మిక చింతన, కరుణ, బలమైన విశ్వాసంతో నెలరోజులు గడపాలి' అని తెలిపారు. **ఛత్రపతి శివాజీకి నివాళి:** ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నివాళులర్పించారు. శివాజీ ఒక దార్శనిక నాయకుడు, ధైర్యవంతమైన యోధుడని కొనియాడారు.

ట్రావెల్స్ బస్సుల త్రైమాసిక పన్ను రూ.2వేలకు తగ్గించాలి

మంత్రికి సంఘం నేతల వినతి

ఈనాడు, అమరావతి: ప్రైవేటు ట్రావెల్స్ బస్సులకు సంబంధించి రవాణాశాఖ వసూలు చేస్తున్న త్రైమాసిక పన్నును సీటుకు రూ.4 వేల నుంచి రూ.2 వేలకు తగ్గించాలని ప్రైవేట్ బస్ ఆపరేటర్ల సంఘం కోరింది. ఈ పన్నును సీటుకు రూ.2,500కు తగ్గించేలా ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీంతో ఈ సంఘం నేతలు రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆశాఖ అధికారులను కలిసి వినతి అందజేశారు. పన్ను తగ్గిస్తే.. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసిన 600కు పైగా బస్సులను ఏపీకి తీసుకొస్తామని, ఇక్కడ రీ-రిజిస్ట్రేషన్ చేయిస్తామని సంఘం అధ్యక్షుడు ఎం.సాంబిరెడ్డి తెలిపారు. పన్ను తగ్గించాలని కూటమి ప్రభుత్వం యోచించడం హర్షణీయమని, ప్రభుత్వానికి అన్నివిధాలా తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు.

బహిరంగ సభ అనుమతిపై హైకోర్టులో ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: బీసీ సింహ గర్జన పేరుతో ఈ నెల 22న ఉమ్మడి నాగార్జున వర్సిటీ ఎదురుగా భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) నిర్వహించనున్న బహిరంగ సభకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించాలంటూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తగిన ఉత్తర్వులు జారీచేస్తామని హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు పేర్కొన్నారు. బహిరంగ సభకు అనుమతివ్వాలని పోలీసులను ఆదేశించాలంటూ బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ప్రగతికి ఊతమిచ్చేలా బడ్జెట్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌లో ఖర్చులు పెంచకుండా పెట్టుబడి కేటాయింపులు పెంచి రెవెన్యూ లోటును నియంత్రించారని, రాష్ట్ర భవితకు కావాల్సింది ఇదేనని పలువురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. గురువారం శాసనసభలో బడ్జెట్‌పై ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా వారు మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే..

మూలధన వ్యయం.. దీర్ఘకాలిక పెట్టుబడి

-యార్లగడ్డ వెంకట్రావు, గన్నవరం

మూలధన వ్యయమంటే.. కేవలం నిర్మాణాలకు సంబంధించిందే కాదు. రాష్ట్ర ఆర్థిక ఉన్నతిని వేగవంతం చేసే దీర్ఘకాలిక పెట్టుబడి. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో మూలధన వ్యయానికి రూ.73 వేల కోట్లు కేటాయిస్తే.. ఈ ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.1.14 లక్షల కోట్లు కేటాయించింది. అమరావతి రాజధాని మాత్రమే కాదు, రాష్ట్రానికి భవిష్యత్తు నగరం.

పెట్టుబడి సాయాన్ని ఆక్వాకూ వర్తింపజేయాలి

-అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వా రైతులు చేపలకు మేత, తెగుళ్ల విషయంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దళారుల నుంచి దాణాను ఎక్కువ ధరకు కొని నష్టపోతున్నారు. పీఏసీఎస్‌ల ద్వారా ఆక్వా రైతులకు కూడా పెట్టుబడి సాయాన్ని వర్తింపజేయాలి. అమలాపురం, ముమ్మిడివరం పరిధిలో 40 కి.మీ పొడవునా సముద్రతీరం ఉంది. 1.50 లక్షల మత్స్యకార కుటుంబాలున్నాయి. అక్కడ ఫిషింగ్ హార్బర్ మంజూరు చేయాలి.

ప్రభుత్వ భూమికి బ్లాక్‌చైన్ విధానంతో ఆదాయం

-శ్రీరాం తాతయ్య, జగ్గయ్యపేట

పులిచింతల ప్రాజెక్టుకు దిగువన, ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువన వైకుంఠపురం బ్యారేజ్ నిర్మిస్తే అమరావతితో పాటు నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందుతుంది. ఈ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. కొన్ని దేశాలు ప్రభుత్వ భూమిని టోకెన్లగా విభజించి బ్లాక్‌చైన్ (షేర్‌మార్కెట్) విధానంలో ఆదాయంగా మార్చుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి చాలా ల్యాండ్‌బ్యాంక్ ఉన్నందున ఈ విధానాన్ని పరిశీలించాలి. తద్వారా ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంది.

నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పాలి

-యనమల దివ్య, తుని

రూ.3.32 లక్షల కోట్లతో కూటమి ప్రభుత్వం భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇది మహిళలకు వెన్నుదన్నుగా నిలిచే ప్రణాళిక. సామాజిక సంక్షేమానికి, మౌలిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపులో పెద్దపీట వేశారు. యువతకు ఉపాధి కల్పించేలా, నైపుణ్య శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రచించారు. తుని నియోజకవర్గంలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

తోటపల్లి ఎడమ కాలువను ఆధునికీకరించాలి

-నిమ్మక జయకృష్ణ, పాలకొండ

అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులున్నాయి. విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లను కీలకమైన గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించడం శుభపరిణామం. సాగునీటి రంగానికి రూ.18 వేల కోట్లు కేటాయించడం రైతులపై ఈ ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుతోంది. పాలకొండ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న తోటపల్లి ఎడమ కాలువను ఆధునికీకరించాలి.

వైఎస్సార్ కడప జిల్లాలో భూముల ఆక్రమణ జరిగినట్లు గుర్తించాం

సభ్యుల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు

ఈనాడు, అమరావతి: మండలి కార్యక్రమాలకు వైకాపా సభ్యులు పదేపదే అడ్డుపడడంతో సభ్యుల ప్రశ్నలపై చర్చ లేకుండానే.. సమాధానాలు ఇచ్చినట్లు భావించాలని ఛైర్మన్ మోషేనురాజు ప్రకటించారు. సభకు సమర్పించిన సమాధానాల వివరాలు..

◆ వైఎస్సార్ కడప జిల్లా రాజంపేట మండలం తాళ్లపాకలోని సర్వే నంబర్లు 1076, 1080, 1082లో అన్నమాచార్య విశ్వవిద్యాలయం 5.6 ఎకరాలు, రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్లు 1362/3, 1362/4, 1363/2లో 1.01 ఎకరాల ప్రభుత్వ భూమిని మిత్రా టౌన్‌షిప్ ఆక్రమించింది.

◆ గ్రామీణ ప్రాంతాల్లో సొంత భూమిలో ఇల్లు కట్టుకునేవారికి పీఎంఏవై (జి) 2.0 కింద యూనిట్ ధర పెంచే అంశం పరిశీలనలో ఉంది.

◆ వ్యవసాయ రంగానికి 2024-25 బడ్జెట్‌లో రూ.8,564.37 కోట్లు, 2025-26లో రూ.12,401.58 కోట్లు కేటాయించాం. ప్రకృతి వైపరీత్యాలు, చీడలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పంటలకు వాటిల్లే నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని అమలుచేస్తున్నాం.

◆ రెవెన్యూ శాఖకు సంబంధించి 2024 జూన్ 15 నుంచి ఈ నెల 10 వరకు 5,89,867 ఫిర్యాదులు ప్రజల నుంచి అందగా, వాటిలో 5,28,635 పరిష్కరించాం.

◆ కామెర్లు, వైరల్ జ్వరంతో మన్యంలోని గిరిజన విద్యార్థులు ఎవరూ మరణించలేదు. ఇతర ఆరోగ్య సమస్యలతో మరణించినట్లు అధికారులు నివేదికలు ఇచ్చారు.

◆ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ఉద్దేశం లేదు. నష్టాలకు కారణాలను గుర్తించి చర్యలు చేపట్టాం.

◆ రాష్ట్రంలో 6,054 కిలోమీటర్ల రహదారులను మెరుగుపరిచేందుకు వివిధ పథకాల కింద రూ.2,500 కోట్లతో పనులు మంజూరుచేశాం.

◆ గత కొన్నేళ్లుగా ఆవుల అక్రమ రవాణా జరుగుతున్న అంశాన్ని గుర్తించాం. వాటి సంరక్షణకు పోలీసు, రవాణా, పశుసంవర్ధక శాఖల చట్టాలను కఠినంగా అమలు చేయడంతో పాటు.. రవాణాపై నిఘా పెంచాం.

సైబర్ నేరాల్లో ఐఏఎస్, ఐపీఎస్‌లూ బాధితులే

హోం మంత్రి అనిత

ఈనాడు, అమరావతి: 'సైబర్ నేరగాళ్లు కంటికి కనిపించని శత్రువుల్లా తయారయ్యారు. ఐఏఎస్, ఐపీఎస్, విశ్రాంత అధికారులు సహా బాగా చదువుకున్న వారే సైబర్ నేరాల్లో బాధితులుగా ఉంటున్నారు' అని హోం మంత్రి అనిత చెప్పారు. 'పదో తరగతి, ఇంటర్ చదువుకుని ఖాళీగా ఉన్నవారికి ఎరవేసి, సైబర్ క్రిమినల్స్‌గా మారుస్తున్నారు. ఇలా ఉచ్చులో చిక్కుకున్న ఏపీకి చెందిన 110 మందిని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రానికి తీసుకొచ్చాం' అని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలో పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో ఒక మహిళను మోసం చేశారు. రోజుకు రూ.2 వేలు వస్తుందని టాస్కులు ఇచ్చి చేయించారు. తర్వాత కేవైసీ అప్‌డేట్ అంటూ లింక్ పంపారు. ఆమె ఓటీపీ చెప్పగానే ఖాతాలో ఉన్న రూ.2 లక్షలు మాయమైపోయాయి. ఇలా పేద కుటుంబం ఏళ్ల తరబడి దాచుకున్న సొమ్మును నిమిషాల్లో మాయం చేస్తున్నారు' అని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వివరించారు.

రూ.60 వేల కోట్ల అమ్మకాలకు ముసుగు

- ఒక్క సాఫ్ట్‌వేర్‌తో ఆరేళ్లలో భారీగా పన్నుల ఎగవేత
- లక్షకు పైగా రెస్టారెంట్లలో వినియోగం
- హైదరాబాద్‌లో తీగలాగితే అహ్మదాబాద్‌లో కదిలిన డొంక

ఈనాడు, హైదరాబాద్: మీరో రెస్టారెంట్‌కు వెళ్లారు.. బిర్యానీ తిన్నాక బిల్లు వచ్చింది.. అందులోని పన్నుతో సహా మీరు డబ్బు చెల్లించి వచ్చేశారు. బిల్లు ఇచ్చారు కనుక.. మీ నుంచి వసూలు చేసిన పన్ను సొమ్ము ప్రభుత్వానికి వెళ్తుంది అనుకుంటారు కదా.. కానీ దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో రెస్టారెంట్లు ఆ పన్ను మొత్తాన్ని ఎగవేస్తున్నాయి. నేరుగా లేదా డెలివరీ యాప్‌ల ద్వారా చేసిన అమ్మకాలను 20-30 శాతం తక్కువగా చూపించడం, యూపీఐ చెల్లింపులకు కూడా రోజుకో క్యూఆర్ కోడ్ వినియోగించడం వంటి వ్యవహారాల ద్వారా ఈ అక్రమాలకు పాల్పడుతున్నాయి. వీటన్నిటికీ ప్రత్యేకంగా రూపొందించిన బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించినట్లు తేలింది. దేశంలోని అత్యధిక రెస్టారెంట్లు ఇదే సాఫ్ట్‌వేర్‌ను వాడుతున్నాయి. దీనిపై హైదరాబాద్‌లో తీగలాగితే సాఫ్ట్‌వేర్ డొంక గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కదిలింది. దీని సాయంతో 2019 నుంచి రూ. 60 వేల కోట్ల విలువైన లావాదేవీలను దాచిపెట్టి.. పన్ను ఎగవేశారని అధికారుల ప్రాథమిక అంచనా.

■ ఆదాయపన్నుశాఖ అధికారులు గత ఏడాది నవంబరులో హైదరాబాద్‌లోని రెండు ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్‌ల కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ యాప్‌ల ద్వారా ఏ రోజు ఎంత విలువైన ఆహారం సరఫరా చేశారనే వివరాలు సేకరించి.. ఆయా రెస్టారెంట్లలో సోదాలు చేశారు. రెండుచోట్ల లభించిన విక్రయ గణాంకాలను పోల్చి చూడగా.. భారీ వ్యత్యాసాలు కనిపించాయి. ఉదాహరణకు ఒక రోజు.. ఒక రెస్టారెంటు నుంచి 100 బిర్యానీలు వినియోగదారులకు డెలివరీ చేసినట్లు యాప్ ద్వారా వెల్లడైతే.. రెస్టారెంట్ రికార్డుల్లో 70 బిర్యానీలు మాత్రమే నమోదయ్యాయి. అంటే 30 బిర్యానీలు నమోదు కాలేదన్నమాట. రెస్టారెంట్ల హార్డ్‌డిస్కుల్లోని డేటాను అధికారులు విశ్లేషించగా.. సాఫ్ట్‌వేర్‌నే పన్ను ఎగవేతకు అనువుగా రూపొందించినట్లు వెల్లడైంది. దేశవ్యాప్తంగా రెస్టారెంట్ల బిల్లింగ్‌కు సంబంధించి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న ఒక సంస్థదే అగ్రస్థానం. దాదాపు లక్షకు పైగా రెస్టారెంట్లకు ఈ సంస్థ సాఫ్ట్‌వేర్ అందిస్తోంది. ఆయా లావాదేవీల డేటా కూడా అక్కడే నిల్వ చేస్తున్నారు.

■ లావాదేవీలు తక్కువగా చూపించేందుకు ఆయా రెస్టారెంట్లలో వేర్వేరు క్యూఆర్‌కోడ్‌లు వినియోగిస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కోటి అందుబాటులో ఉంచుతారు. దీంతో అమ్మకాల ఆదాయంలో కొంత మాత్రమే రెస్టారెంట్‌కు చెందిన అసలైన ఖాతాలో నమోదవుతుంది. దానికి మాత్రమే పన్ను చెల్లిస్తారు. మిగిలినదంతా పక్కదారి పట్టిస్తారు. వినియోగదారులకు ఇచ్చే బిల్లుల్లోనూ 30 శాతం మేర నమోదు కాకుండా జాగ్రత్త పడ్డారు. రోజూ అమ్మకాల మొత్తంలో కొంత భాగాన్ని డిలీట్ చేయడం మరో పద్ధతి. ఉదాహరణకు.. ఒక రోజు రూ.లక్ష వ్యాపారం జరిగితే అందులో రూ.20 వేల మేర లావాదేవీలను చెరిపేయవచ్చు. సోదాలు జరిపిన అన్ని రెస్టారెంట్లు ఇలాంటి అవకతవకలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఈ అవకతవకలన్నీ సాఫ్ట్‌వేర్ ఆధారంగానే జరిగాయి.

■ గత ఆరేళ్ల కాలంలో ఈ సాఫ్ట్‌వేర్ వాడిన దాదాపు లక్ష రెస్టారెంట్లు ఏడాదికి కనీసం రూ.10 వేల కోట్లకు పైగా అమ్మకాలు నమోదు కాకుండా చూసినట్లు భావిస్తున్నారు. అంటే ఆరేళ్లలో ఈ మొత్తం రూ.60 వేల కోట్లకు పైమాటే. దీనిపై కనీసం జీఎస్టీ, ఆదాయపుపన్ను, తప్పుడు లెక్కలు చూపించినందుకు జరిమానా కూడా వసూలు చేసే దిశగా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

పారిశ్రామికవాడల్లో పరిశ్రమలకు పన్ను విధింపుపై ప్రత్యేక వ్యవస్థ

మంత్రి కొండపల్లి



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ సభ్యులు

ఈనాడు, అమరావతి: పారిశ్రామిక వాడల్లో పరిశ్రమలకు పన్ను విధింపుపై ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ సభ్యులతో సచివాలయంలో మంత్రి సమావేశమై.. ఇంజినీరింగ్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు.. ఉత్పత్తి ప్రమాణాలను పెంచే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ.. 'ఇంజినీరింగ్ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. చిన్న పరిశ్రమల రుణాలకు గ్యారంటీ ఇచ్చేందుకు సీజీటీఎంఎస్ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. పరిశ్రమలు సరఫరా చేసిన ఉత్పత్తులకు బిల్లులు వేగంగా చెల్లించేందుకు వీలుగా ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్ తీసుకొచ్చాం. ఇంజినీరింగ్ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేస్తాం. ఇతర రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈలకు అమలు చేస్తున్న విద్యుత్ టారిఫ్.. ఆస్తి పన్ను విధించే విషయంలో అమలవుతున్న విధానాలపై అధ్యయనం చేస్తాం' అని పేర్కొన్నారు. సమావేశంలో ఫెడరేషన్ ప్రతినిధులు పొట్లూరి భాస్కరరావు, రాజశేఖర్, బాయన వెంటరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం బలోపేతానికి ఐఐసీతో ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపుతున్న ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్, మధ్యాహ్న భోజన పథకం సంచాలకుడు శ్రీనివాస్, ఐఐసీ సీనియర్ మేనేజర్ రిషిక మోదీ తదితరులు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం మరింత సమర్థంగా నిర్వహించే చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో షికాగో యూనివర్సిటీ ట్రస్ట్ (ఇండియా) ఆధ్వర్యంలోని ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్ కార్ప్స్ (ఐఐసీ)తో విద్యాశాఖ గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 42,230 పాఠశాలలు/ కళాశాలల్లో రోజూ 32.3 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం, పోషకాహార ప్రమాణాల పర్యవేక్షణ, డేటా అనలిటిక్స్, ఏఐలాంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించి పథకం అమలులో పారదర్శకత పెంచనున్నారు. భోజనం చేసే విద్యార్థుల సంఖ్య కచ్చితంగా అంచనా వేయడం, పరిపాలనపరమైన భారం తగ్గించి వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఐఐసీ బృందం సహకరించేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం డిజిటల్ గవర్నెన్స్‌లో ఉన్నత దశకు చేరుకుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేశారు. విజయవాడలోని మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో జరిగిన ఒప్పందంలో ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్, మధ్యాహ్న భోజన పథకం- పాఠశాల పారిశుద్ధ్య విభాగం సంచాలకుడు, సమగ్ర శిక్షా పీడీ బి.శ్రీనివాస్, కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఐఐసీ సీనియర్ మేనేజర్ రిషిక మోదీ, ఎంగేజ్‌మెంట్ మేనేజర్ శ్రద్ధా శ్రీవాస్తవ, ప్రాజెక్టు అసోసియేట్ తుషార్ మల్హోత్ర తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగించి 8వ తరగతి బాలికపై ముగ్గురి అత్యాచారం



నిందితుడు ఇమ్రాన్‌ఖాన్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ శివారు నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. 8వ తరగతి బాలికకు ఒక పాత నేరస్థుడు, ఇద్దరు బాలురు మద్యం తాగించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. శేరిలింగంపల్లి డీసీపీ చింతమనేని శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. పుప్పాలగూడకు చెందిన బాలిక(15) 8వ తరగతి చదువుతోంది. ఈ నెల 7న చార్మినార్ వద్ద షాపింగ్‌కు వెళ్లిన సమయంలో అక్కడ ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసే బాలుడు(16) పరిచయం చేసుకొని ఫోన్ నంబర్ తీసుకున్నాడు. తరువాత రోజూ ఫోన్ చేసి మాట్లాడుతూ మళ్లీ కలుద్దామని కోరాడు. ఈ నెల 16న స్కూల్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పిన బాలిక చార్మినార్ వెళ్లింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన బాలిక తల్లి నార్సింగి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ప్రత్యేక బృందాలతో వివిధ ప్రాంతాల్లో వెతికారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో చెంగిచెర్లలో బాలిక ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థిని తన దగ్గరకు రావడాన్ని అవకాశంగా తీసుకున్న బాలుడు తన స్నేహితులైన పాతబస్తీ రెయిన్‌బజార్‌కు చెందిన ఆటోడ్రైవరు ఇమ్రాన్‌ఖాన్ అలియాస్ షిషి(24), తలాబ్‌కట్టకు చెందిన బాలుడిని పిలిపించాడు. బాలికను చార్మినార్ పరిసర ప్రాంతాల్లో తిప్పి అర్ధరాత్రి తర్వాత నగర శివారు చెంగిచెర్లలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం దగ్గరికి తీసుకెళ్లారు. ముగ్గురూ మద్యం తాగి, బాలికతోనూ బలవంతంగా తాగించారు. మత్తులో ఉండగా కత్తితో బెదిరించి ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. ఘటనాస్థలంలో బాలికతోపాటు ఉన్న ఓ బాలుడు, ఇమ్రాన్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

8 కేసుల్లో నిందితుడు: ఇమ్రాన్‌ఖాన్ దోపిడీ, దొంగతనం, భౌతికదాడులు సహా ఎనిమిది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. మరో బాలుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

అసెంబ్లీ శూన్యగంటలో ఎమ్మెల్యేలు

కర్ణాటకలో ఎస్టీలు.. ఏపీలో బీసీలుగానా?

-కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం

వాల్మీకి బోయల్ని ఎస్టీల్లో చేర్చాలి. 2014-19 మధ్య నాటి తెదేపా ప్రభుత్వం దీనిపై కేంద్రానికి సిఫార్సు చేసింది. కేంద్రం ఆరు అంశాల్లో రాష్ట్రం నుంచి వివరణ కోరింది. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ప్రత్యేకంగా ఒక కమిషన్ వేసి, రాయలసీమకే పరిమితం చేయాలని కోరగా, కేంద్రం దాన్ని కూడా తిరస్కరించింది. ఎన్ని కమిషన్లు సిఫారసు చేసినా, ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా కేంద్రంలోని నేషనల్ సెన్సస్ కమిషన్ తిరస్కరిస్తోంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటయ్యాక వాల్మీకి బోయల్లో కొందరు కర్ణాటకలోకి, మరికొందరు ఏపీలోకి వచ్చారు. మా బంధువులు బళ్లారిలో ఎస్టీల్లో ఉంటే.. ఏపీలో ఉన్న మేం బీసీ-ఏలుగా మిగిలిపోయాం.

◆ కాలువ శ్రీనివాసులు ప్రశ్నపై స్పీకర్ స్థానంలో ఉన్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు స్పందించారు. ఈ సమస్యపై తాను ఎంపీగా ఉన్నప్పుడు సామాజిక న్యాయశాఖ మంత్రిని కలిసి వివరించినట్లు గుర్తుచేశారు. ఈసారి గట్టిగా కృషి చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు.

'అవును, కాదు' జవాబులతో అయోమయం

-యార్లగడ్డ వెంకట్రావు, గన్నవరం

ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు మంత్రులు సమాధానమిస్తూ, 'అవును, కాదు, ఉత్పన్నం కాదు' అని చెబుతున్నారు. ఆ ప్రశ్న ఏంటో తెలిసిన సభ్యులకు మంత్రుల సమాధానాన్ని బట్టి విషయం అర్థమవుతుంది. లైవ్‌లో చూసేవారికి అర్థం కాదు. ప్రశ్న-జవాబు అర్థమయ్యేలా మంత్రులు సమాధానం ఉండేలా రూలింగ్ ఇవ్వాలి. జీరో అవర్‌లో అడిగిన ప్రశ్నలు నోట్ చేసుకుంటున్నామని మంత్రులు చెబుతున్నా జవాబులు రావడం లేదు. రాజధానిలో ప్రముఖులందరి విగ్రహాలు ఏర్పాటు చేయాలి. బూతులు తిట్టడం వైకాపా నేతలకు అలవాటుగా మారింది. దీన్ని నిరోధించేలా చట్టం చేయాలి.

ఆ వైద్య సిబ్బందికి మళ్లీ అవకాశమివ్వండి

-బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మిగనూరు

పీహెచ్‌సీల్లో ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు సుమారు 1,000 మందికి పైగా సేవలందించేవారు. 2021లో వీరిని తొలగించారు. వారి సేవలను గుర్తించి, వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగం చేసేలా అవకాశం కల్పించాలి.

సదరం సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు

-ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు

దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాల జారీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్లాట్ బుకింగ్‌కు నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. స్లాట్ దొరికినా కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సి వస్తోంది. రీఅసెస్‌మెంట్ ప్రహసనంగా తయారైంది. ప్రత్యేక సిబ్బందిని నియమించాలి. మొబైల్ యాప్ ద్వారా రీఅసెస్‌మెంట్ చేయాలి.

అంగన్‌వాడీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

-నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి

అంగన్‌వాడీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళించాలి. చాలా కేంద్రాల్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలే ఉంటున్నారు. జీతాలు సరిపోకపోవడంతో సిబ్బంది నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. వారికి ఇప్పుడిస్తున్న రూ.11 వేల వేతనాన్ని పెంచాలి. వేతనం నెలకు రూ.10 వేలు దాటడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి కొంత వెసులుబాటు ఇవ్వాలి. అద్దె భవనాలకు రూ.2 వేలు మాత్రమే కాకుండా, వాస్తవ అద్దె చెల్లించాలి. 1,810 కేంద్రాల్ని ఉన్నతీకరించాలి.

ఇన్‌స్పెక్టర్లకు పదోన్నతులు లేవు

-విష్ణుకుమార్‌రాజు, విశాఖ ఉత్తర

పోలీసు శాఖలో 26-30 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన ఇన్‌స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతులు రావడం లేదు. 2014లో నాటి తెదేపా ప్రభుత్వం సూపర్ న్యూమరరీ పదోన్నతులు కల్పించింది. వీఆర్‌లో ఉన్న పోలీసు అధికారులకు పది నెలలుగా జీతాల్లేవు. సీఐలు 68 మంది, డీఎస్పీలు-50, అదనపు ఎస్పీలు-10, ఐజీ ర్యాంకులో ఉన్న ఐదుగురికి జీతాలివ్వడం లేదు. వారికి సగం వేతనమైనా ఇచ్చే ఏర్పాటు చేయాలి. పోలీసు అధికారుల వాహనాలకు నెలకు 300 లీటర్ల డీజిల్ ఇవ్వాలి. హోంగార్డుల వేతనాన్ని నెలకు రూ.25 వేలకు పెంచాలి.

ప్లాస్టిక్ నిషేధం అమలేది?

-చదలవాడ అరవిందబాబు, నరసరావుపేట

రాష్ట్రంలో ప్లాస్టిక్ నిషేధం సరిగా అమలు కావడం లేదు. కాలువల్లో, పాఠశాలల్లో, రహదారుల్లో ప్లాస్టిక్ చెత్త పేరుకుపోతోంది. ప్లాస్టిక్ విక్రయించే వ్యాపారులపై కేసులు పెడుతున్నారు. గుజరాత్‌లో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ కేంద్రాలపై చర్యలు తీసుకోవడం లేదు. అక్కడే నియంత్రిస్తే ఇక్కడిదాకా రావు.

స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా 'వీబీ జీ రామ్ జీ' పనులు చేపట్టాలి

- కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి: స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా వీబీ జీ రామ్ జీ పథకం పనులు చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో కలెక్టర్లు శ్రద్ధ చూపాలన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎం ఛాంబర్‌లో గురువారం జీ రామ్ జీ పథకంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. 'వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న పథకంతో గ్రామస్థాయిలో చేపట్టాల్సిన పనులను అనుసంధానించాలి. ఉపాధి హామీ పథకం కింద మిగిలిన పనులు తక్షణమే పూర్తి చేయాలి' అని సీఎం ఆదేశించారు. 'వీబీ జీ రామ్ జీ కింద రాష్ట్రానికి అవసరమైన పనులు గుర్తించాలి. గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్తు వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, గ్రంథాలయాలు, ప్రజా భవనాల నిర్మాణం, షెడ్లు, పార్కింగ్ ప్రాంతాల పనులు, సామాజిక ఆస్తుల అభివృద్ధికి పథకంలో అవకాశాలు ఉన్నాయి. నీటి భద్రత, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన వసతుల కల్పన, ప్రకృతి విపత్తులు ఎదుర్కొనే పనులూ చేపట్టొచ్చు' అని సీఎం సూచించారు. 2025-26లో వేతన కాంపోనెంట్ కింద రూ.4,619 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్‌లో రూ.1,962 కోట్ల వ్యయం చేశామని సీఎంకు అధికారులు వివరించారు. దేశ వ్యాప్తంగా మెటీరియల్ కింద నిధులు ఖర్చు చేసిన రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందన్నారు.

వైకాపాది వంకర బుద్ధి: మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: రెండు గొడ్డళ్లు.. రెండు బరిసెలు.. దోపిడీ మైండ్‌తో ఉన్న వ్యక్తి దుస్తులు ధరిస్తే అతనే జగన్ అని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వ అద్భుత పనితీరు చూసి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. 'ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన హెరిటేజ్ సంస్థపై సాక్షి పత్రికలో అసత్య కథనాలు రాయడాన్ని తప్పుపడుతూ దిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీచేయడంతో వైకాపా వక్రబుద్ధి మరోసారి తేటతెల్లమైంది. నిత్యం అసత్య ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టడానికి జగన్, ఆయన సొంత మీడియా చేస్తున్న ప్రయత్నాలపై న్యాయస్థానం మొట్టి కాయలు వేసింది. అమరావతికి వచ్చి మరీ బిల్‌గేట్స్ లాంటి పెద్దలు చంద్రబాబు నాయకత్వాన్ని, విజన్‌ను కీర్తిస్తున్నారు. అలాంటి వ్యక్తిని ఆర్థిక నేరాల కేసుల్లో కూరుకుపోయిన జగన్ విమర్శించడం అవివేకం' అని మంత్రి విమర్శించారు.

'రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం'

ఈనాడు, అమరావతి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చారని రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ నాయకులు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి చెప్పారన్నారు. జేఏసీ ఛైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు, కార్యదర్శి జనరల్ బి.మధుబాబు, కన్వీనర్ బి.సుగుణమ్మ, కోఛైర్మన్ ఎన్.పెద్దన్న తదితరులు గురువారం సచివాలయంలో మంత్రి అనగానిని కలిసి వినతిపత్రం అందజేశారు.